# హారిదాసి

(చారిత్రాత్మక నవల)



మహాకవి, సరస్వతీపుత్ర, పద్మశ్రీ

డా॥ పుట్టపర్తి నారాయణాచార్యులు

# పీఠిక

ఔరంగజేబునకు రాజ్యకాంక్ష యెక్కువ. హిందువులపై తగని ద్వేషము. ఈ రెండు దుర్గుణములను వదలిపెట్టినచో అతడొక గొప్పరాజని చెప్పవచ్చును. నాటి ముస్లింలందరును అతనిని దైవాంశ సంభూతుడనియే యెంచిరి. అందుచేతనే అతనిని 'అలంఘీరు పాదుషా' అని వారు సంబోధించెడువారు. ఈ కథలో ఒకటి రెండు మాత్రమే కల్పితములైన పాత్రలు వున్నవి. నవలయన్నచో కొన్ని కల్పితపాత్ర లుండక తప్పదు. చారిత్రక నవలలు వ్రాయుటలో నొక కష్టమున్నది. సత్యాంశములను వదలిపెట్టుటకు వీలులేదు. 'కల్పన' వానివెంట నతుకవలసినదే. ముస్లిం కథలను గూర్చి వ్రాయుటలో నొకచిక్కున్నది. ఆ చరిత్రలు వ్రాసిన చరిత్రకారులెవ్వరును – ఆనాటి స్త్రీల పేరులు చెప్పరు. వానికై వెదకుట నిష్ప్రయోజనము. వారికి మనము కల్పితములైన నామములను సృష్టింపవలెను. అంతకుమించి మార్గము లేదు. భిజాపుర యుద్ధమందు ప్రధాన సేనాపతి 'షాఅజం'. గోల్కొండ పతనమందు ప్రధాన భాగమును వహించినవాడు 'షాఅలం' ఈ 'షాఅల'ం చక్రవర్తి కంత ప్రీతిపాత్రుడైన కుమారుడుగాడు. పలుమారులాతని దురాగ్రహమునకు యాతఁడు పాత్రుడైనాడు. 'షాఅలం'; చరిత్రకారుల దృష్టిలో విలాస పురుషుడు. వాని యంతఃపురము పెద్దది. విద్వాంసుడు. రసికుడు. ఆతని యీ చిత్త వృత్తిని – సూచించుటకు యత్నించితిని. కన్నడములోని నిట్టి నవలలు రెండు మూడు వచ్చినవి. వాని నన్నిటిని జదివితిని. వీరకేసరి – సీతారామ శాస్త్రిగారు కూడ యీ నవలను వ్రాసిరి. పై వారికందరకు నా కృతజ్ఞతలు. వారి భావములు నాలోకొన్ని దొరలియుండవచ్చును. అవి వారిపై నాకుగల గౌరవమునకు చిహ్నములు.

ఇట్లు,

మహాకవి – సరస్వతీపుత్ర

**"పుట్టపర్తి"**

# హరిదాసి

చైత్ర మారంభమైనది. ద్రుమలతాదులు క్రొత్త దుస్తులకై ప్రాకులాడుచున్నవి – ప్రాతవేమో చాలవన్నట్లు నానాద్విజములకు సంగీతమొక్క సారిగా పుట్టుకొని వచ్చినది. వనాంతములు కోకి లాకులములయ్యెను. ప్రచురమన్మథమైన యాకాలమున – దంపతులకు ప్రొద్దులే దెలియుట లేదు. ద్రుమాగ్రములు పుష్పభార సమృద్ధములుగాజొచ్చెను. పతితములు, పతమానములు, పాదపస్థములైన కుసుమములతో సమీరుడాడు కొనుచున్నాడు. భృంగ రాజములు శ్రుతి బట్టినట్లే యున్నవి. మయూరముల యొయ్యారములు రెండింతలయ్యెను. అరుణోదయములు, అరుణాస్త మానములు చూచుటకు వేయి కన్నులు జాలుటలేదు.

అది సూర్యోదయ సమయము. జగత్తు నూత్న తేజస్సులార బరచుకొన్నది; భద్రాద్రి రాముని దేవాలయ గోపురముల మీది చిరు గంటలు – బంగారువి; వానిపై నెఱ్ఱని సూర్యకాంతులు బడినవి. అవిమాంజిష్ఠ వర్ణములయ్యెను. అరుణోదయ వాయువులకు – అవియేమో సముచితములైన యుత్తరము లొసగుచున్నవి. ఆ గంటలసవ్వడి–శ్రవణ మనోహరముగా నున్నది; భక్తులనేక వేలమంది జేరినారు. “జానకీవల్లభ జయ జయ రాం – పతితపావన సీతారాం” అని వారి కంఠధ్వనులు మిన్నుదాకు చున్నవి. ఆ భక్తి గానమునకు ప్రత్యణువును పులకించు చున్నటులున్నది. రామనవరాత్రి కాలమది; నాల్గు చెఱగులనుండి భక్తులు జేరినారు. తూర్పుదెస చెంగావి చీరలార బరచినది; ఆ యరుణ చ్ఛాయలలో వనాంతములు మరింత సుందరములైనవి. గోదావరీమతల్లి గూడ మేననంతయు గుంకుమ మలదుకొన్నది. జగజ్జననికింత యాహార్య ప్రీతి యెందుకో ! జాతరకు వచ్చిన జనములు కొందరు గోదావరిలో మునిగి దర్శనమునకు బోవుచుండిరి. ఆ నదిలో నొక్కతె ‘హరిదాసి’ స్నానమొనర్చు చుండెను. ఆమె శరీరము సనాళపద్మమై యుండెను. ఆ ‘హరిదాసి’ తానమాడి గైరికవసనమును ధరించెను. నుదుటిపై తిలకము బెట్టి కొన్నది. తంబూర మెట్లపై నుండెను. అది ప్రభాతవాత పోతములకు మందముగా ధ్వనించుచున్నది. ‘దేశాక్షి’ రాగమునకు శ్రుతివోయుటా యేమి ! ఆమె యాతంబూరను దీసికొన్నది. సహజముగనే దీసికొన్నది. కాని విలాసమామె వలదన్నను వెంటాడు చున్నది. దేవాలయము వైపామె దిన్నగా బోవుచున్నది. జనులకన్ను లామెను జూడక యూరకుండుటలేదు. ఆమెసౌందర్యమూరక యుండనిచ్చినకదా ! ఆమె తలమలపి యొకసారి గోదావరికి నమస్కరించినది. నమస్కరించిపోవుచున్నది. నాలుగైదు అడుగులు వేసెను. ఆమె కంఠము మధుర గానమునకు దొడగినది. తంబూర దానికై అది ధ్వనించుచున్నటులుండెను. “రఘుపతిరాఘవ రాజారాం” ఈ గానముతోనే యామె మెల్లగా దేవాలయమును బ్రవేశించెను. ముఖ మండపము నిండ వేలాదిజనము; ఆ జన మీమెను జూచినంతనే మార్గమొసగినది. ఆమె యెదనంతటి భక్తి ప్రపత్తు లెందుకో ! ఆ

హరిదాసి, నేరుగా గర్భగృహములోనికేగెను. రాములను కన్నార జూచినది. మనసార నమస్కరించుకొన్నది. వాయార స్తుతి యొనర్చినది. పూజారి హారతి యొసగెను. ఒక తులసీ హారమును దెచ్చి 'హరిదాసి' కిచ్చినాడు. ఆమె కన్నుల కద్దుకొని మెడలో వేసికొన్నది. అతడు ప్రసాదమునిచ్చెను. పూజారి కామెవందించినది. బయటికివచ్చి పూర్వాభి ముఖముగ నెచ్చటికో నడచిపోవుచుండెను. ఆ పోవుచున్న యామెను జూచుచున్నవారే గాని – ఎచ్చటికని యడుగ గలవారు యెవ్వరునులేరు. ఆమె శరీరమందు యవ్వనము తొణకిసలాడు చుండెను. ప్రత్యంగమందును లావణ్యము చోటు దొరికిన చాలునని దూరుకొన్నది. ప్రభాత కాలమున నామె గైరికవసనము – ఎంతో యుజ్జ్వలముగ నుండెను. ముఖముపై సుశీతలమంద హాసము. నేత్ర యుగములలోని యపూర్వకాంతి – నీలవక్రములైన కేశములు. ఆమె కొప్పు విడిచికొనియేయున్నది. వక్షస్థలమునందు తూగుచున్న తులసీ హారము. ఈ యవ్వనమేమి? ఈ సౌందర్యమేమి? ఈ వైరాగ్యమేమి? ఇది యందరి మనసులలోనున్న ప్రశ్న కాని యామె నడుగు గుండెలెవ్వరికినిలేవు. ఆ గుంపులో కొందరు లఘువర్తనులున్నారు. వారామె వెంట వెంటబోవ సమకట్టిరి. ఎంత బోయిననేమి? 'హరిదాసి' వీరివైపుజూడదు. చూచిన ననాదరముగ జూచును. వారి విలాసము లామెకడ వితలైనవి. పోయినవారు దిరిగివచ్చిరి. వారి మనస్సులలో నా హరిదాసి మెదలుచునేయున్నది.

హరిదాసి చాల దూరము వోయెను. ముందొక వృక్షాచ్ఛాదితమైన వనము. ఆ కాలిబాట వెంట నామె బోవుచున్నది. ఎదుట నొకగుట్ట. దానిపై నొక పటకుటీరము. ఆ కుటీరముపై రెండు కలశములున్నవి. అవి సూర్యకాంతిలో దానమాడుచుండెను. అరుణుడింకను పూర్తిగా విజృంభింపలేదు. ఉదయము మీరినది. మధ్యాహ్నము గాలేదు. హరిదాసి పటభవనముముందు నిలిచినది. అచ్చట రాజ భటులు కావలి యుండిరి. వారికొకడు పెద్ద. వాని పేరు 'రామచరణ సింగు'. హరిదాసి వానితో

"రామ్‌చరణ్ సింగ్ ! మహారాజు లేమి చేయుచున్నారు. సన్నిధాన మబ్బునా?" యని బ్రశ్నించెను.

వాఁడు నమస్కరించినాఁడు "అమ్మా ! ఈ నడుమ మీరు గనపడుటయేలేదు. సమాచార మేమైన దీసికొని వచ్చితిరా !హరిదాసి ఫక్కుమని నవ్వెను.

"ఏ సమాచారమైన నేనెందుకు దీసికొని రావలెను? నా కుత్తికపైకి దెచ్చు కొనుటకా? ఇంతకును నా తంబూర ధ్వనించినంతనే – యేదో సమాచారమున్నట్లే గదా" యనెను.

"అవును తల్లీ ! మీ కంఠమునుండి బయలుదేరిన యమృత ఝురి రామనామము దూరము నుంచియే నా చెవులలో బడినది. మీ దర్శన మగుననియే అనుకొన్నాను. తమ రాక మహారాజులకు విన్న వింతును."రామచరణసింగు లోనికేగుటకు యత్నించెను. హరిదాసి నవ్వినది.

"ఓయీ ? నీకంతశ్రమ యెందులకు? నా రాకను నేనే దెలిపికొందును." "చిత్రకూట ప్రియ సీతారాం. సేవక జీవన సీతారాం" రామచరణసింగు లోపలికి బోయెను. మహారాజులకు హరిదాసి రాకను విన్నవించినాడు. వారి ముఖమున సంతోషము గోచరించినది. "తడవెందుకు? రమ్మనుము". హరిదాసి లోనికేగెను.

భవ్యమైన పటకుటీరము, చుట్టును – కన్నులు మిరుమిట్లు గొలుపు చీనాంబరముల కాంతి పైన ముత్తెములు వ్రేలాడుచున్న మేలుకట్టు. ఆ భవనమున కొకవైపున – రజత పీటముపైన సమర్థ రామదాసస్వామి తైల చిత్రమున్నది. అతడు మహారాష్ట్ర దేశ జీవన ప్రదాత. కలియుగమున పుడమికేతెంచిన హనుమదవతారము. మరియొకవైపు శివాజీ చిత్రమున్నది. ఆ వీరమూర్తి హయాధిష్టితుడై కత్తి వీచి యుండెను. క్షాత్రతేజ మాతని నాశ్రయించి సార్థకమైనది. రామదాసస్వామి ముందు రెండు రజత స్తంభములు. వానిలో నిరంతరము వెలుగుచున్న దీపములు. ఎదుటనొక నిలువుటద్దము. దాని చౌకట్టు సువర్ణమయము. దానికి గొంతదూరమున రజత పర్యంకము. దానిపై హంసతూలికా తల్పము. దాని కిరువైపుల రెండాసనములు. వానికి సమీపమున కత్తి, డాలు మొదలైన యాయుధములు. ఆ పట భవనమున నొక మహాతేజస్వియైన పురుషుడుండెను. పట్టువస్త్రము గట్టినాడు. కప్పినది చీనాంబరము, విశాలమైన లలాటముపై చందనపు రేఖలు. ఆ మహాతేజస్వియైన పురుషుడు సాంభాజి, శివాజీ మహారాజ సుతుడు. 'హరిదాసి' రామనామముతో సాంభాజీని ఆశీర్వదించినది. భద్రాచలరాముని ప్రసాదమును చేతికిచ్చెను. అతడు కన్నుల కద్దుకున్నాడు. ప్రక్కనున్న పుష్పకదండమున నాతడా ప్రసాదము నుంచెను.

"ఏమమ్మా ! చాల దినములకు దర్శనమిచ్చితిరి. ఇంతవరకెక్కడ సంచరించుచుంటిరి"? అన్నాడు. హరిదాసి సమర్థులపాదుకలను కండ్ల కద్దుకొనెను. తంబూర నొకప్రక్కనుంచెను. కంఠమున నుండిన తులసీ మాలనుతీసి పీఠముపై నుంచినది. ఆమె యొక యాసనముపై గూర్చున్నది. "హరిదాసి మా ప్రశ్నల కుత్తరమివ్వలేదు." మహారాజు పలికెను. "తొందర యెందుకు? ఉత్తరమిచ్చుటకే వచ్చినాను" "ఏమి యుత్తర మొసగుదమని యాలోచించుచున్నారా యేమి?"

"ఆలోచించుట కేమున్నది? ఉత్తరము సిద్ధముగనే యున్నది. మీకు దెలిసినదే. భద్రాచలము మహాక్షేత్రము. ఈసారి యుత్సవములకు మహారాజులు వచ్చినారని – నాల్గు దిక్కుల జనులాడు కొనుచున్నారు. చాలమంది రామదర్శనముతో పాటు – హిందూ చక్రవర్తి దర్శనముగూడ దొరకునని యుత్సాహముతో వచ్చినారు. ఈ సంవత్సరము జనమెంతమంది యున్నారో చూడుడు. ఇంతమంది మిమ్ముజూచుట కుత్సహించు చున్నపుడు నాకధయేమి? నేనుగూడ నందుకే వచ్చినాను, రామదర్శనమైనది. మహారాజుల సన్నిధానము దొరికినది. ఇక కొరతయేమున్నది?"

"హరిదాసీ ! ఇదంతయు నిజమే కావచ్చును. ఇన్ని దినములు మీరెచ్చట నంతర్ధానమై యుంటిరి? రావణుడు సీతనశోక వనములో దాచెనట? అట్లె మిమ్ము తురుష్కులెవరైన - యెత్తికొనిపోయి దాచియుండిరాయేమి; చాలదినముల మీరగపడకుండుటచే నేనట్లె భావించితిని.""మహారాజులంతగా భయపడుటకు కారణమేమొ!"

"ఏమి కావలెను? భగవంతుడు మిమ్ము గొప్పచూపు చూచినాడు. ఈ లావణ్యము - తారుణ్యము యీ ప్రశాంత కటాక్షములు - వీనిలో నొక్కొక్కటియు జగన్మోహకము కదా !"హరిదాసి ఫక్కుమని నవ్వెను."నాకేమున్నవో నాకు తెలియును. నా స్త్రీత్వ, రక్షణ కొరకే మహా గురువులు - నాకీ దీక్షననుగ్రహించినారు. ఇక నాకు భయమేమున్నది? లంకలోని యశోకవనమైననొక్కటే జనకుని యాస్థానమైననొక్కటే.""ఈ మాటలన్నిసరే, కాని - తురుష్కులకు మన ధర్మదీక్షలపైన వెలలుండునా? కాని మీరేమో వారితోగూడ జయించికొని వచ్చుచున్నారు.""నిజమే నేను - ఉత్తరమందున్న లంకాపురికిపోయి యుంటిని. ఆ ఢిల్లీనుండి పురందరగడమునకు తిరిగివచ్చినాను. మహారాజు అక్కడనున్నారని తెలిసెను. ఔరంగజేబునకు మీ ప్రతాపపువేడి తాకినది. ఈ దక్కనునంతయు మీరు చేతిలో బెట్టికొన్నారని యక్కడివార్త. హిందూరాజులు - పాలెగాండ్రు మిమ్ము సార్వభౌముడని పిలుచుచున్నారని - ఔరంగజేబు చెవిలో గూడబడినది. ఈ వార్తలతో వృద్ధుడైన 'అలంఘీర్' నుసినుసి యగుచున్నాడు. పాదుషా దర్బారులో గూడ మీ వార్త అప్పుడప్పుడు వచ్చుచుండెను. ఔరంగజేబు దినమున కొక్కసారైన మీ పేరు స్మరించును. మీ నామోచ్చారణము సేయును".

"ఆ తరువాత"

"తరువాతనేమున్నది? పాదుషాకు మీరన్న నిద్రపట్టుటలేదు. ఔరంగజేబు దృష్టిలో శివాజీ చక్రవర్తి పెద్ద దొంగ-మీరును గజదొంగలు. దొంగలగుంపునంతయు జత చేర్చికొన్నారు. ప్రజలపైబడి దోచుకొనుచున్నారు. కాఫరులైను హిందువులు మిమ్ము మహారాజు, చక్రవర్తియని పిలుచుచున్నారు "ఈ హిందువులకు నాపై గొప్ప విద్వేషము. ఢిల్లీ పాదుషాకు ప్రతిద్వంద్వినొకని సృష్టించినామని వారు సంతోషపడుచున్నారేమో. నోటి దురద తీర్చికొననిమ్ము. ఈ సారి యా దొంగను పట్టుకొని రావలెనని యాజ్ఞయిచ్చినాను."

"ఇవి పాదుషా ఆలంఘిరు భావములు. దక్షిణమును జయించుటకై యువరాజైన షా ఆలంను దక్షిణదిక్కునకంపినాడు. అతడాతని ప్రేమపుత్రుడు. ఔరంగజేబు దక్షిణమున కాతని పట్టము గట్టినాడు. ఈ సారి పాదుషా ప్రబల హఠము బట్టెను. షా ఆలం నిండు సభలో వీరప్రతిజ్ఞ చేసి పయనమైనాడు"."అమ్మా ! మంచి విషయములే పట్టుకొని వచ్చినావు. చాల సంతోషము. నీ కిన్ని వర్తమానము లెట్లు దెలసినవి?"

"ఇంతమాత్రము కనుగొనుటకు పెద్ద చాతుర్యము లక్కరలేదు. ఢిల్లీలోని ప్రతి శిలా స్తంభమును యీ భావములను బలుకును. నాకు చాల వర్షములనుండి యొక కోరిక

యుండెడిది. ఒక్కసారియైన ఢిల్లీ పాదుషాను చూడవలెనని నాయాశ. అది తృప్తిగా నేరవేరినది. అతడొక మహాపురుషుడనుటకు సందేహమేలేదు".

మహారాజు నేత్రములు రక్తారుణము లయ్యెను. పెదవి స్పందమాన మైనది.

"హరిదాసీ ! రామనామముచే పవిత్రమైన మీ నాల్కనపవిత్ర మొనర్చి కొనరాదు. మీరు మహానుభావులైన రామదాసుల శిష్యులు? ఇట్టి దూష్యములైన మాటలు మీనోటివెంట రారాదు.

హరిదాసి సెలవువార నవ్వినది.

"మహారాజా ! నాపై నింత కోపమెందుకు? ఢిల్లీ విషయములు నీకు వినయిచ్ఛ ఉన్నచో వినవచ్చును. లేకున్న పొమ్మనవచ్చును. ఇష్టము లేనివారికి చెప్పవలసిన యగత్యము నాకులేదు".

మరల నొకసారి యామె నవ్వినది.

"అంత కోపమెందుకమ్మా ! ఇంకేమియు విషయములున్నవో యొకసారి చెప్పుము".

"చెప్పుటకేగదా వచ్చినది !"

"కథ పెంచక తొందరగా కానిచ్చినచో... ... ...."

ఢిల్లీలో నాకొక్క పుష్పలావిక స్నేహితురాలైనది. పూమాలలు గట్టి యంతఃపురమున నొసగుట దాని కెలసము. నేను దానితోపాటు వెళ్ళినాను. ఆ యంతఃపుర వైభవమేమని చెప్పుదును? పాదుషా - అంతిపురములో నుండి దర్బారునకు బోవుచున్నారు. ఒకానొక షహజాదీ-పంజరము ముందు నిలచి చిలుకను మాటలాడించుచున్నది. మాలకరి ఆనాడు పూవులు వింతగా కట్టినది. వానిని షహజాదీ కిచ్చుటకై కాచుకొని యుండెను. ఆపరసాలలో నుండియే చక్రవర్తి నడచుచున్నాడు. పాదుషా 'షహజాదీ'ని మాటలాడించినారు. మేమిర్వురమును నేలకువంగి అలంఘీరునకు "కుర్నీసాల్" చేసితిమి.

"యీామె యెవరు?" పాదుషా ప్రశ్న.

"షహజాదీ - వయ్యారముగా నాలుగడుగులు వేసికొనుచువచ్చి - పాదుషా హస్తమును చుంబించినది.

"దాదా ! ఇది పూలమ్మునది. మాలలుకట్టి తెచ్చినది".

'షహజాదీ' మాలకరిచేతిలోనున్న బుట్టలోనుంచి పూమాలను గడ్డకు తీసినది. దానినామె - అలంఘీరు కంఠమున వేయబోయినది. కాని - యాతడు రెండుచేతులతో వారించెను.

"షహజాదా ! కోపింపకుము. నేనెప్పుడైన పూమాలలను ధరించినది నీవు చూచి యున్నావా? ఆ మాలనిటు తెమ్ము నీ యభిమానమును నేను స్వీకరించెదను. నేడు షాఆలం దక్షిణమునకు వెళ్లుచున్నాడు. ఈ మాల వానికి బెందు నేర్పాటు చేయుదును"

అలంఘీరు పూమాలను చేతికి దీసికొన్నాడు. అతడు నావైపు తిరిగి –

“నీవెవరింటి దానివి?” అని యడిగెను.

“నేను యీ పుష్పలావికకు స్నేహితురాలి బిడ్డను. క్రొత్తగా ఢిల్లీకి వచ్చితిని. ఈమె పాదుషా యంతఃపురము జూపింతునని నన్ను బిలుచుకొని వచ్చినది, మహాప్రభువుల దర్శనమైనది” నేను చేతులెత్తి నమస్కరించినాను.

“ఈ అంతఃపుర మెట్లున్నది?”

“షహన్‌షహా ! దీని వైభవమును చూచి నేను శరీరమునే మరచినాను నేనెక్కడ నున్నానో నాకు తోచుటలేదు”

నా మాటలకు పాదుషా తిన్నగానవ్వెను.

“చతురముగా బల్కినావు. ఆ పంజరములోని చిలుకవలె మాటలాడితివి. నీ విచ్చటనే యుండిపోరాదా?”

“నేను ధైర్యముగా బదులిచ్చినాను.

“పాదుషా అనుగ్రహమైనచో కొదువ యేముండును? నన్ను వివాహము చేసికొన్నచో యిక్కడ నుండుటకే యాక్షేపణము లేదు.

‘షహజాదా’ ఒక అడుగు ముందుకు వచ్చి మృదులముగ నా చెంపపై గొట్టెను.

“గడుసు దానవు పాదుషాతో హాస్యమాడుటకు నీ కెంత ధైర్యము !”

అలంఘీరు పలికెను.

“నన్ను పెండ్లాడుదువా? ఈ ముసలి వానిని పెండ్లి చేసికొన్నచో బాగుగనే యుండును. షహజాదా నీవేల దానిని బెదరింతువు ! పల్లెటూరి పిల్ల; ధైర్యముగా మాటాడుచున్నది. నాకు ఈ పూమాల కంటెను – దీనిమాట లెంతయో ముద్దుగా నున్నవి”.

పాదుషా నా వైపు తిరిగినాడు.

“అమ్మాయీ ? నీకు బహుమాన మిప్పింతును. ఈ నగరములో చాలమంది యువకులున్నారు. వారు మోసగాండ్రు. గొప్ప సరదారులమని చెప్పి నిన్ను మోసగించి కొనిపోదురు. అట్లు మోసపోకుము సుమా ! నా సమ్మతి లేనిది వివాహమున కొప్పుకొనకుము. ఎవరైనవచ్చి యడిగినచో – అలంఘీరు ఒప్పుకొనవలెననుము. వారికి శృంగ భంగ మగును. నేను నిన్నొక దొడ్డ సరదారునకిచ్చి పెండ్లి సేయుదును. నీవును మా షహజాదావలె భాగ్యవంతురాలవై బ్రతుకగలవు”.

షహజాదాకు కొంచెము కోపము వచ్చెను.

"అప్పాజీ ! ఈమె యింతలో తమకు బిడ్డయైపోయినదా?" అన్నది.

"ఎందుకు కారాదు? దానికదృష్టమున్నచో తప్పించు వారెవ్వరు? అడవిలో నుండిన యీ పువ్వులు యిప్పుడు నా చేతిలో నున్నవి. చెట్టుపైనుండిన యీ చిలుక బంగారు పంజరమునకు వచ్చినది; నీ సేవలు గొనుచున్నది. మరి – యిది గొప్ప సరదారును చేపట్టుటలో నాశ్చర్య మేమున్నది ! రూపలావణ్యములున్నవి. తారుణ్యమున్నది. దాని వెంట్రుకలు చూడు! వానిలో ఒయ్యారముగ ధరించిన పూలమాలను చూడు? నిరాభరణ సుందరి.

నేను తలవంచికొని నిలచితిని.

"అమ్మాయీ ! ఇంకెప్పుడైనవచ్చి కలసికొమ్ము. ఈ షహజాదాను గట్టిగా పట్టుకో. ఆమె నిన్ను భాగ్యవంతురాల నొనర్చును."

పాదుషా ముందుకు కదలినాడు.

ఔరంగజేబు ఆపాదమస్తకము 'మజ్లిన్' గుడ్డలు గట్టికొని యుండెను. అవి తెల్లనివి. చేతివ్రేళ్ళు దీర్ఘములు. పాదరసమువలె తళతళ మెరయుగడ్డము. మీసములు. విశాలమైన ఫాలము. కన్నులలో కాంతులు. పొడవైన ముఖము. అతని యాకారము – చూచినంతనే – యితడు మహానుభావుడను జ్ఞానమును కలిగించునదిగా నున్నది; కాని – వెంటనే అతడు క్రూరాత్ముడనియు గనుగొన్నాను. హిందూమత ద్వేషియనియు దెలిసినది; అతని సౌమ్య స్వభావము – మృదువులైన యాలాపములు లలితమైన హాస్యము, చిరునవ్వు – వీనినిజూచి యితడెంత మంచివాడని అనుకొన్నాను, ఇంతలో మేమంతఃపురమును వదలివచ్చుచుంటిమి. ఒక దాసివచ్చి 'మాకొక్కొక్కరికి పదివరహాలు చేతిలో బెట్టినది. మా కాశ్చర్యమయ్యెను;

"షహజాదా అన్నది.

"ఓసీ ! నీవు పాదుషా బిడ్డవైతివి. ఎంత యదృష్టశాలివి. అప్పుడప్పుడీ పుష్పలావికతోపాటు మా దగ్గరకువచ్చుచుండుము. ఈనాడు పదివరహాలు చిక్కినవి. రాగరాగ మరేమి చిక్కునో!".

నేను, పుష్పలావిక అంతఃపుర మహాద్వారమును దాటి గడ్డకు వచ్చితిమి. రాజమార్గమున నడచుచున్నాము. మాపై వేలాది కండ్లు బడుచుండెను. మేమింట్లకు వచ్చితిమి. నా పదివరహాలు గూడ పూలుకట్టుదానికే యిచ్చినాను. దానికెంతో సంతోషమైనది. మరునాడు ప్రాతఃకాలమున పుష్పలావికతో నొక చక్కనిమాల కట్టించుకొంటిని. ఆ మాలదీసికొని "షా ఆలం" కడకు పోయినాను. యువరాజుకు పుష్పమాల నిచ్చి చేతులు మోడ్చితిని.

"ఓహో ! నీవేనా నిన్న పాదుషాగారితో మాటలాడిన బాలిక ! ఇక్కడికెందుకు వచ్చినావు? నీ పూలమాలిక వెల పదివరహాలా?"

'షాఆలం' తిన్నగా నవ్వెను.

"యువరాజా ! మీరీమాలను గ్రహించినచో నాకు చాలును. వెల అక్కరలేదు. మీరు దక్కనుకు బోవుచున్నారట ! నాకును మీ వెంట రావలెనని యున్నది.

యువరాజీసారి ఫక్కుమని నవ్వెను.

"ఏమి? ఎంత చతురముగ మాటలాడుచున్నావు ! సేనతో వచ్చిన నిన్ను వారు బ్రతుకనిత్తురా? నల్వురును పీకికొని తిందురు".

"యువరాజా ! మీరుండగా నాకేమి భయము? నన్నొక్కతెను రక్షించుకోలేని అసమర్థులా మీరు ? నిన్న పాదుషాగారేమి చెప్పిరో తెలియునా? ఎవరైన పోకిరీలు నా జోలికి వచ్చినచో తమపేరు చెప్పమన్నారు. మొగల్ శిబిరములో నా కింతకన్న గొప్ప రక్షణ కావలెనా? పోకిరీలకు నా జోలికి వచ్చుటకెన్ని గుండెలు కావలెను? పోనీ లెండు. నేను మీ వెంట రానేరాను. వచ్చి మీ కెందుకు కష్టము కల్గింపవలెను? ఎన్నడో ఒకనాడు వచ్చి మిమ్ము దర్శించి కొందును. నా చేతనైన సేవ చేయుదును. నాకేమి కావలెను? మీ అనుగ్రహమున్నచో చాలును".

"నీ యిష్టము వచ్చినప్పుడు రావచ్చును. నీకేమి కావలసినను యిప్పింతును. ఇప్పుడు పది వరహాలు కావలెనా?"

ఒక సేవకుడు వరహాలు తెచ్చి నా చేతికిచ్చినాడు.

"యువరాజా ! తమరొసగిన బహుమానమును నేను తిరస్కరింతునా? కాని - నాపూలమాల కింతకన్నను వెల హెచ్చు. ఆ వెలను మరియొకసారి తీసికొందును".

"తరుణీ ! నీ కటాక్షము వెల యింకను దొడ్డది. మరిచితిని, నీ పేరేమి?"

"రాధ"

యువరాజులకు కలిగిన ఆశ్చర్యములకు మేరలేకపోయినది.

"ఏమీ ! హిందువుల పిల్లవా ? నీ కెంత ధైర్యము ? ఎంత సాహసము ! ఈ ఢిల్లీలో వర్షముల పర్యంతము కాచుకొన్నను - పాదుషాగారి దర్శనమగుట కష్టము. పాదుషాగారి బేటీ వనిపించుకొన్నావు. సరాసరి నాదర్శనము గూడ చేసికొన్నావు. నీకెంత సాహసము !"

"అవునవును ! యువరాజు దక్కనుకు బోవుచున్నారు. అక్కడ నావంటి పిల్లలెందరో యుందురు. మీరు వారి కటాక్షములకు - ఓడి వెనుకకు వత్తురు".

ఈ మాట లాడుచునే నేను నవ్వితిని.

"ముందేమి జరుగునో ! గెలుతునో ఓడుదునో ! ఇప్పుడు మాత్రము నీ కోడిపోయినట్లే. నేనే ఒప్పుకొనుచున్నాను".

యువరాజు నావైపు జూచెను.

"యువరాజా ! నేను పాదుషాగారి పుత్రికను. ఈమాట వారే యన్నారు. ఈ విషయము జ్ఞాపక ముంచికొనవలెను". ఢిల్లీ నుండి పురందర గడమునకు వచ్చితిని. మహారాజు భద్రాచల మందున్నారని దెలిసినది. నేరుగావచ్చినాను. మిమ్ము వెదకికొని అసంఖ్యములు మొగల్ సైన్యములు వచ్చుచున్నవి. యువరాజు వారిని నడపించుచున్నారు. "రానిమ్ము యువరాజేమి ! పాదుషా వచ్చినను భయములేదు. ఇంతకు మంచి సమాచారమే తీసికొనివచ్చినావు. నీ వెంత పిచ్చిదానివి ఢిల్లీ కేల పోయినావు? ఆ ఔరంగజేబు రాక్షసుడు. ఆ యువరాజు మహాక్రూరుడు. ఎట్లైననేమి? పులిబోనులో జిక్కి బ్రతికివచ్చినావు. నీ స్త్రీత్వమునే నీవు మరచినట్లున్నది". "మహారాజా ! పాదుషా లోక ప్రసిద్ధుడు. ఆయనను చూచి నాకెంతో యానందమైనది. నీ పైకి యుద్ధమునకు వచ్చుచున్న యువరాజుతో నా మైత్రి నిరుపయోగము కాదు. సమయము వచ్చినపుడు దాని వెల తెలియును".

"భద్రాచలములోని యుత్సవములు ముగియువరకు యిక్కడనే యుందువా?"

"అవును"

"అందుకే వచ్చినాను" నీ నుండి పది వరహాలు దీసికొనుటకు కాదు. శ్రీరాముని యుత్సవ ములు కన్నారచూచి మనసార పాడి పోవలెనని నాయాశ"హరిదాసి యాసనమునుండి లేచినది. సమర్థుల పీఠము ముందున్న పాదుకలను మరియొక సారి కంటి కద్దికొనెను. తంబూర ధ్వనింప నారంభించినది. "రఘుపతి రాఘవ రాజారాం  పతితపావన సీతారాం"

తన తులసీ మాలనెత్తి హరిదాసి మహారాజుచేత కిచ్చినది. అతడు దానిని స్వీకరించి కన్నుల కద్దికొని చెంతనున్న తట్టలో బెట్టెను. హరిదాసి పాడుకొనుచునే బయటికి పోయినది. ఆమె దేవాలయమున కేగెను.

## 2

మాదన్న ధన్నాయకుడు. సాంభాజీ దర్శన మొనర్చి కొనెను. ఆతడు తనవెంట – అనర్ఘ్యరత్న హారములను – ఉడుగరులుగా తెచ్చినాడు. చీనాంబరముల గూడ గొని తెచ్చెను. సాంభాజీ కొలువుకూటమున మాదన్నకు దర్శన మొసగినాడు. అన్యోన్య యోగక్షేమములైనవి. సాంభాజీ యన్నాడు.

"మాదన్నా ! మా రాజ్య సమాచారము లేమి? సుల్తాను మీ విషయమందెట్లున్నాడు?"

"ప్రభూ ! రాజ్యము చక్కగనే నడచుచున్నది. సుల్తానుగారును బాగుగనే యున్నారు. వారికి నా యందలి ప్రీతి విశ్వాసములు – యధా ప్రకారముగనే యున్నవి".

"సైన్య పరిస్థితి?"

"సైన్యమంతయు నా యధీనమందే యున్నది. నా విరోధులనందరిని తిన్న తిన్నగా పెరికి పారవేసినాను".

"ముసల్మాను సైనికులు?"

"తమకు తెలియని దేమున్నది? పాతాళ మందున్న రహస్యము నైనను తమరు కనుగొందురు. కాని యిందులో నొక సూక్ష్మమున్నది. ఉత్తర దేశపు ముసల్మానులకును – దక్కను ముసల్మానులకును – అంతరంగమున కొన్ని మెఱమెఱలున్నవి. దక్కను ముసల్మానులలో యెంత గొప్పవానినైనను పాదుషా దగ్గరనున్న ముసల్మానులు గౌరవముతో జూచుటలేదు. వీరికన్నను, దామెక్కువయని వారి యభిప్రాయము. నేను ముసల్మాను నొక్కని నా ఆంతరంగికునిగా నుంచి కొన్నాను. ముసల్మాను సైన్యమంతయు వాని యధీనమందున్నది. వాడు నాకెప్పుడును మోసము చేయడు".

"సుల్తానునకు హితులు మరికొంద రెవ్వరైననున్నారా?"

"ఆ జాగ్రత్తలన్నియు దీసికొన్నాను. సుల్తాను మగవారిని దగ్గరికి రానిచ్చుటయేలేదు. ఆతని కండ్లన్నియు నాడువారి పైననే. హైదరాబాదు – ఒక గోకులమై పోయినది. రాజ్యమంతయు నా యధీనమే. సుల్తానునకు సురాసుందరి గొప్ప ప్రేయసి; రాజ్యభార మందాతని చేయియేలేదు."

"ఔరంగజేబుతో సంధానము లేమైనను...?"

"వానికేమి ? నడచుచునే యున్నవి. కాని యిక్కడ సాగనిచ్చు వారెవరు? ఔరంగజేబు పరాక్రమశాలి, క్రూరుడు, సంధాన కుశలుడు. మీ భయముకూడ పాదుషాకు తక్కువగా లేదు. గోల్కొండ; బీజాపురము – తనకు లోబడుట – అశక్యమని యాతడెరుగును. రెంటిలో బీజాపురముపై నెక్కువ కోపమున్నది. అంతకోపము గోల్కొండపై లేదు. కాని నేనన్నచో పాదుషాకు మంట. కారణము నేను హిందువును. లోలోపల మిమ్ము ప్రేమించుచున్నానని గూడ యతడెరుగును. అది నిజముగూడ. గోల్కొండలో పాదుషా ప్రభ వెలుగవలెనన్నచో ముందు నన్ను గదల్పవలెను. ప్రచండయుద్ధములో తప్ప నన్ను గదల్చుటకు సాధ్యముకాదు".

"ఇవన్నియు మంచివే. కాని మనము తిన్న తిన్నగా గోల్కొండ, బీజాపురములను హిందూ రాజ్యములుగా మార్చవలెను. ఈ సుల్తానులను గిల్లివేయుట మహాకష్టము. ఈ రెండు రాజ్యములలో యెక్కువమంది ముసల్మాను సైనికులున్నారు. సేనాధిపతులున్నారు. ఇది పెద్ద బాధగనే యున్నది. భద్రాచలరాముడే మనకు మార్గము జూపవలెను. ఎప్పుడును గొంత హిందూ సైన్యమును మనము తయారుచేసికొని యుంచుకొనవలెను.

మాదన్న తలవంచి నమస్కరించెను.

"ప్రభూ ! మా సుల్తానుగారిదొక ప్రార్థనయున్నది. మీరొకసారి గోల్కొండకు దయచేయ వలెను. మాయాతిధ్యమును స్వీకరింపవలెను. మా సుల్తానుగారు శివాజీప్రభువులకు వ్రాసి

యిచ్చినట్లే – తమకును ఒక వినతిపత్రమును వ్రాసి యిత్తురు. ఇంతకుముందువలెనే సంవత్సరమునకు లక్షవరహాలు కప్పముగట్టుటకు తయారుగానున్నారు. పాతబాకీ యంతయు చెల్లింతమనుచున్నారు."

సాంభాజీ కొంతసేపు విచారించెను.

"దానికేమి అట్లే చేయవచ్చును. దానితో రెండు ప్రయోజనములు సాధించినట్లగును. దక్షిణమునందలి హిందువులకు సుల్తాను సాంభాజీకి వశుడన్న సంగతి బహిరంగపరచి నట్లున్నది. ఢిల్లీ ఔరంగజేబునకు కన్నుగుట్టును. పాదుషా కుమారుడు 'షాఅజం' ఒక వైపు నుండియు– 'షా అలం' మరియొక వైపునుండియు దక్కనుపైకి దండెత్తి వచ్చుచున్నారు. ఎట్లైననుజేసి – ఔరంగజేబును దక్షిణమునకు వచ్చునట్లుచేయవలెనని మా కోరిక. వింధ్యను దాటి యివతలకు వచ్చినచో వానిని బోనులో జిక్కించుకొందును. నుసి నుసి జేసి వేయుదును. వాడు మన 'బందీకానా'లోనే కుమిలి కుమిలి చావవలెను."

"రామునిదయ యున్నచో – ఆ కోర్కె తప్పక యీడేరును"

మాదన్న ధన్నాయకుడు మరియొకసారి నమస్కరించి సెలవుగైకొని వెడలిపోయెను. సాంభాజీ గోల్కొండ నుండి తనకువచ్చిన యుడుగరలను భద్రాద్రిరామున కర్పించినాడు. రామనవమి యుత్సవములు ముగిసినవి. సాంభాజీ గోల్కొండకు బయలుదేరెను. మాదన్న గోల్కొండలో బ్రహ్మాండముగ వైభవము లేర్పాటు చేసినాడు. సుల్తానునకును సంతోషమైనది. అతడు సాంభాజీ నెదుర్కొనుటకు సిద్దముగ నుండెను. ఆటకత్తెల నెక్కడెక్కడ నుండియో తెప్పించి గుంపు చేర్చినాడు. గాయన గాయనీమణులు సిద్ధముగా నుండిరి. అమూల్య రత్నాభరణములను తానుగా నేరి సాంభాజీ కర్పించుటకై సిద్ధపరచినాడు. సాంభాజీ పరివారమునకు – మృష్టాన్నముల కేర్పాటు చేసెను. సాంభాజీ పరివారమున కంతయు అంగరఖాలు–తలగుడ్డలు–చీనాంబరములు తయారు చేసినాడు. సాంభాజీ హిందూ సామ్రాట్టు. మహా పరాక్రమశాలి–హిందూస్థానమంతయు పేరుమోసినవాడు. అట్టివాడు తన కతిథిగా వచ్చుచున్నాడు. ఇది సుల్తానునకు ఒక మహోన్నత గౌరవమైనది.సాంభాజీ గోల్కొండ మహాద్వారమునకు వచ్చినాడు. మాదన్న బహుళ పరివారముతో నాతని నెదుర్కొనెను. చక్రవర్తి మర్యాదలు చెల్లించినాడు. సుల్తానుయొక్క సేనాపతులు సాంభాజీకి సలాములొనర్చిరి. సాంభాజీని పిడి యేనుగుపై గూర్చుండ బెట్టుకొని మహోత్సవముతో రాజభవనమునకు గొనిపోయినారు. రాజ సౌధద్వారమున సుల్తాను గాచికొని యుండెను. అతడు సాంభాజీ కెదురేగి కేలూత యొసగి దించుకొనెను. ప్రత్యేక భవనమున నాతని విడిది కేర్పాటు చేసినాడు. ఇరువురకు కుశల ప్రశ్నలైనవి. సుల్తాను సెలవు గైకొని తన భవనమునకు బయలుదేరినాడు.

తొగరు పుట్టములతో సంధ్యాదేవి నడతెంచెను. వాసనా భరితములై మందమారుతములు వీచెను. సుల్తాను మందిరమున వేయారు కాచుదీపములు. నర్తకీ గాయనీ సభ యేర్పాటు

చేయబడినది. బాణచిరుసు లెన్నియో కాల్చబడినవి. ఆకాశము వాని ప్రకాశములచే చిత్రితమై పోయెను. అర్థరాత్రి వరకు నర్తనములు సాగెను. వారిలో నొక్కొక్కరును సాంభాజీని మెప్పించుట కెంతయో బ్రయత్నించిరి. కింకిణీధ్వనులు జన్మాంతర వాసనలవలె వుండెను. ఒక్కొక్కరి విలాసములును – వర్ణనాపరిధులు దాటిపోవు చుండెను. ఈ సుల్తానునకు రాజ్యముపై కంటెను రమణులపైననే మక్కువ యెక్కువని సాంభాజీ కడుగడుగునను జ్ఞాపకమునకు వచ్చినది. సుల్తాను రసిక కళాకోవిదుడు. ఎవరిపైననో రాజ్యమును వదలివేసి తన స్వర్గమున దానుండును. రాత్రి చాలా బ్రొద్దుబోయినది. ఉత్సవములు ముగిసినవి. సాంభాజీ సుల్తాను నాలింగనము జేసికొన్నాడు.

“సుల్తానూ ! నీవు చాల గొప్పవాడవు. ఢిల్లీ పాదుషాకు ప్రతిద్వంద్విగా నుండదగిన వాడవు. నీ యైశ్వర్యము – వైభవము ఢిల్లీ పాదుషాను మరపించుచున్నవి. మనమైత్రి చిరకాలముండ వలెను. దానినుంచు కొనవలసిన భారము నీపై నున్నది.

సుల్తాను “మహారాజా ! నేనెంతో ధన్యుడనైతిని” అన్నాడు.

రాత్రి గడచిపోయినది. ప్రాతఃకాల మేతెంచెను. దిక్కులు రాగమయములైనవి. పక్షుల కలకల ధ్వానములు; సంవత్సరమునకు లక్షవరహాలు కప్పమొసగునట్లు సుల్తాను సాంభాజీకి వినతిపత్రమును వ్రాసి యిచ్చెను. శివాజీ స్వర్గస్థుడైనప్పటి నుండి పాతబాకీ సాంభాజీకి ముట్టలేదు. ఐదు లక్షల వరహాలతో సుల్తాను దానిని తీర్చివేసినాడు. రత్నాభరణములు – దుకూల పీతాంబరములు – ఉడుగరలుగా నొసగెను. సాంభాజీ పరివారమునకు బహుమానములు ముట్టినవి. మరాట చక్రవర్తి సుల్తాను నెంతయో బ్రశంసించినాడు. మాదన్న ధన్నాయకుని కొండాడెను. ఈ సమాచారములు ఢిల్లీ కంచెలపై బోయినవి. పాదుషాకు – గుప్తచారుల మూలమున సాంభాజీ గోల్కొండకు వచ్చిన సంగతి – తెలిసినది. వాని ముఖమగ్ని కుండమైనది. పండ్లు పట పట కొరికినాడు. దుర్మార్గుడు, గజదొంగ ఆ సాంభాజీ ఒక మహారాజా? ఈ సుల్తానునకు సిగ్గులేదు. వీడుపాపి. ముసల్మానుగా పుట్టి హిందూరాజులకు తలవంచవచ్చునా? వీనిని ఖుదా క్షమింపడు. ఈ యిర్వురను కఠినముగా దండింతును. బోనులలో పులులను వలె పొడిచి పొడిచి చంపింతును. ఈ గోల్కొండ నింక బ్రతుక నివ్వరాదు. ఈ సుల్తానును నాశనము చేయవలెను. మొగల్ సామ్రాజ్యము షోలాపురము వరకు వ్యాపించి యుండెను. అదియేవారి దక్షిణ రాజధాని. ‘షాఆలం’ షోలాపురమునందు బిడారు వేసినాడు. ఢిల్లీ నుండి సైన్యములు తండోపతండములు వచ్చినవి. అవి అన్నియు నంతలంతల నుండెను. చాలమంది సేనా నాయకులు వచ్చినారు. షోలాపురము సైన్యములచే కిట కిటలాడు చుండెను. ఎచ్చట జూచినను రాజ భవనములే.

షాఆలం గొప్ప విలాసప్రియుడు. ఈ వార్త దక్కనునకంతయు దెలియును. వాని రసికతను దగినట్లే షోలాపురమునకు వాని జనానా వచ్చినది. అతనికిప్పుడే నల్వురు

వివాహితలైన భార్యలున్నారు. ఇవన్నియు రాజకీయ బంధుత్వములు; ఆ కాలమున నివి సర్వసాధారణములుగా నుండెను; షాఆలంతో పాటు వారుగూడ దక్కనునకు వచ్చిరి. దక్షిణదేశమును చూడవలెనని వారికి చాలాకాలమునుండి యాశ. కాళ్ళ వ్రేళ్ళబడి అతనిని వేడుకొని వచ్చినారు. షాఆలంజనానాలో వీరికి ప్రత్యేక భవనము లుండెను. వానికి ప్రధానభార్య నూరున్నీసా. ఆమె యువరాణి. ఆమె సౌందర్యము ఢిల్లీయందే బ్రసిద్ధమై యుండినది. లలితకళలలో గూడనామె చాలగట్టిది. షాఆలం జనానాలో నిరంతరము సంగీతనర్తన ధ్వనులు వెల్లివిరియుచుండెను. షాఆలం తన సేనానాయకులను పిలిచి యుద్ధమును ముందు సాగింపవలెనని ఆజ్ఞ పెట్టినాడు. ఇలేఖత్‌ఖాన్ ఫీయూరత్‌ఖాన్ – ఈ యిర్వురు సేనాధిపతులును బయలుదేరివెళ్ళిరి. వారు సీరం, మాల్కేడ్ జిల్లాలను సులభముగా వశపరచుకొన్నారు. చాలకాలము నుండి మొగల్ రాజ్యమునకు – దక్షిణ దేశరాజ్యములకు నడుమ – యిది పెద్ద వివాదాస్పదమైన ప్రాంతము. వారిర్వురి కిక్కడ నెన్నియో యుద్ధములు జరిగినవి. ఈసారి యుద్ధమున షాఆలం – తానే సేనాగ్రమున నడచుచుండెను. ఆలంఘీరు పాదుషా ఆజ్ఞకూడనట్లే యుండినది. ఈ సమాచారము గోల్కొండకు దెలిసెను. వజీరు మాదన్న సైన్యములు నడిపి మొగలుల నెదిరించినాడు. తమ్ముడక్కన్న గూడనాతనితో నుండెను. గోల్కొండ సుల్తాను హైదరాబాదునందుండెను. అప్పటి హైదరాబాదు గంధర్వ నగరమే. మొగల్ సైన్యములు వచ్చుచున్నవనువార్త హైదరాబాదులో దెలిసినది. సుల్తానునకు యుద్ధమన్నచో బెదరు. ఆతడు తన ఆప్త సచివులను కొందరిని 'ఖిల్లత్తు'లతో షాఆలం కడకంపినాడు. వారు వర్తక వేషములు ధరించి షాఆలంను దర్శనము చేసికొనిరి. ఖిల్లత్తుల నొప్పించినారు, సుల్తాను మనవినిట్లు విన్నవించిరి.

"యువరాజా ! నిష్కారణముగా గోల్కొండపై పాదుషా గారాగ్రహపడినారు. నేను వారికేయప రాధమును జేసి యెరుగను. దయచేసి మీ సైన్యములు వెనుకకు దీసికొని పోవలెను. ఇదే మా ప్రార్థన".

షా ఆలం అన్నాడు.

"బాగు బాగు ! మీ సరకులన్నియు మా 'ఖిల్లత్తు'లన్న మాట. కాని మేమిప్పుడు వానిని గ్రహించుటకు సిద్ధముగా లేము. ఇది జహాపనా ఆజ్ఞ. మీరు రాజదూతలు, మిమ్ముల నవమానించుట మాకు న్యాయము కాదు. మా వాదము చెప్పుచున్నాము. వినుడు. గోల్కొండ సుల్తానులు ముసల్మానులు. వారిపై మాకు ద్వేషము లేదు. గోల్కొండ, బీజాపురములు పాదుషాకు ప్రత్యక్షముగా నే యపకారమును చేయలేదు. కాని యీ రెంటిపై వారికెంతయో యాగ్రహము కల్గినది. మహారాష్ట్ర రాజైన సాంభాజీ మీ రెండు రాజ్యములందును చోటు చేసికొని యున్నాడు. మీ సుల్తాను సాంభాజీకి కప్పములు, కానుకలు యిచ్చినాడు. జహాపనాకును కప్పము లంపినాడు. హిందూస్థానములో కప్పములు తీసుకొనెడు పాదుషాలు – యిరువురుండుటకు వీలులేదు. ఇది జహాపనాగారి మొదటి షరతు. సాంభాజీ మొగలు

సైన్యములతో దెబ్బ తిన్నపుడంతయు – గోల్కొండ బీజాపురము లాతనికి – ఆశ్రయ మొసగుచున్నవి. ఆ దొంగకు మీరు రక్షణ కల్పించుచున్నారు. ఇది ఉపేక్షచేయరాని మహాపరాధము. ఈ నడుమనే కదా సాంభాజీ గోల్కొండకు వచ్చినది? మీ సుల్తాను – ఆతనిని వైభవోపేతముగ నాహ్వానించెను. కప్పము అబ్బెను. మా కింత కన్నను కావలసిన అవమాన మేమున్నది? మీ సుల్తాను కథ అట్లుండనీ, గోల్కొండ పురాతనమైన రాజ్యము. అందులో ఒక హిందూ రాజునకు యింతటి సన్మానము జరిగినచో మీ పాదుషా తలనెక్కడ బెట్టుకోవలెను? ఇంతేకాదు. మీ రాజ్యములో హిందూ మంత్రినుంచి కొనియున్నారు. ఈ అనర్థముల కన్నిటికిని వాడే కారణము. దీనితో పాదుషా కోపము మితిమీరిపోయినది. ఈ గోల్కొండ బీజాపూరు రాజ్యమును సంపూర్ణ నాశన మొనర్చు వరకు వారు నిద్రపోరు. నా సహోదరుడు షాఅజం బీజాపూరము వైపు వెళ్ళినాడు. నేనిటు వచ్చినాను. సుల్తానే వచ్చి నాకు శరణాగతుడైనను – యుద్ధమును నిలుపు నధికారము నాకు లేదు. అధికారము గలవారు పాదుషా యొక్కరే.”

రాజమాతలకు మొగముపై నెత్తురు లేకపోయినది. మాదన్న ధన్నాయకుల కీ విషయమే తెలియదు. అతని సైన్యము బృహత్తరముగా నుండెను. సీరం మాల్కేడులను జయించుట కాతడు ప్రబల ప్రయత్నము లొనర్చుచుండెను. యుద్ధము మహారభసముగ సాగుచుండెను. షాఆలం సేనాధిపతులకు కట్టుదిట్టములొనర్చి షోలాపురమునకు వెనుదిరిగెను.

**3**

‘హరిదాసి’ షోలాపురమునకు పోయినది. ఆమె యువరాజు దర్శనమున కేగెను. అంతకుముందే నూరున్నీసాతో హరిదాసికి స్నేహముకద్దు. నూరున్నీసా యేకాంతమున యువరాజుతో నన్నది.

“యువరాజా ! దక్కనునుండి సన్యాసిని యొకతె వచ్చినది ఆమె మిమ్ము జూడగోరి యున్నది. నా అంతఃపురమందే యున్నది. ఆజ్ఞ యైనచో....”

షా ఆలం ఆసనమున గూర్చున్న వాడాశ్చర్యముతో లేచినాడు.

“నూరున్నీసా ! ఇదొక ఆశ్చర్యకరమైకరమైన సంగతి. మొగల్ అంతఃపురములో హిందూ సన్యాసినియా? మన యంతఃపురములోనికి వచ్చుటకు ఆమెకు రాతిగుండెలుండి యుండవలెను.”

“యువరాజులు దక్షిణమునకు ప్రయాణము వచ్చినారు. ఈ దేశమున నిట్టి యాశ్చర్యము లింకెన్ని చూడవలెనో!”

హరిదాసిని దోడ్కొని రమ్మని నూరున్నీసా దాసినంపెను, అది పోయి పిలుచుకొని వచ్చినది. తంబూర ధ్వనితో బాటు హరిదాసి వచ్చెను. ఆమె షాఆలంనకభివాదనము చేసెను. యువరాజామెను తదేకదృష్టితో జూచినాడు. గైరికవసనము. నుదుటిపై కస్తూరితిలకము.

మెడలో భగవన్నివేదితమైన వనమాల, చేతిలో తంబూర.

"సన్యాసినీ ! నీ వెవ్వరవు? నీ కేమి కావలెను?"

"యువరాజా ! నాకేమి కావలెను. మీరు నన్ను సరిగా గుర్తు పట్టినట్లు లేదు."

"లేదు. నీవంటి సన్యాసినిని నేనెక్కడను చూడలేదు. మమ్ము జూచినంతనే మీకంత భయము. ఇక మీరు మా దగ్గరకు వచ్చుట యెక్కడ !"

"భయమెందుకు? మేమేమి రాజులము కాదు. మాతో మీరు యుద్ధము సేయరు. మాకే ఆశయూ లేదు."

"నీ వేమో చాల గట్టిదానివలె నున్నావు. మేము ముసల్మానులము. ముసల్మానులు జాతి చెరచివేతురని హిందువులలో వదంతికద్దు."

'షా ఆలం' నవ్వెను.

"అందులో గొంత సత్యమున్నది. మొగలులు దక్షిణము పైకి వచ్చినది – యిది మొదటిసారి కాదు. ఇదివరకు ముసల్మాను లెందరో దక్షిణము పైకివచ్చినారు. పతివ్రతల మానభంగము లెన్నియో జరిగినవి. వారి నపహరించికొని పోయిన ఘట్టములుగూడ లెక్కకు మీరియున్నవి. ముసల్మానులను జూచి హిందూ స్త్రీలు భయపడుదు రనుటలో గొంత నిజమేయున్నది. కాని నేనట్టిదానినికాను. మా వైష్ణవ దీక్షలో మొదటిది అభయదీక్ష; రెండవది సర్వస్వత్యాగము."

'షా ఆలం' ఆమె మాటలకడ్డు వచ్చినాడు.

"మీ వేదాంతమంతయు మాకర్థముకాదు. నీవు సమర్థ రామదాసుల శిష్యురాలివి కాదూ ! సమర్థ రామదాసనగా ఆ శివాజీ గురువేగదూ!" "అవునవును. నేను వారి శిష్యపరంపరలోని దానినే. అదిపోనిండు. నన్ను మీరు గుర్తుపట్ట లేదా? నేనొక్కసారి ఢిల్లీ అంతఃపురమునకు వచ్చితిని. పూవులమ్ము బాలికకొక దానికి పాదుషా బహుమానమిచ్చిన సన్నివేశము జ్ఞాపకమున్నదా?" "ఓహో ! అవునవును? ఇప్పుడు జ్ఞాపకమునకు వచ్చినది. అవే విశాలోజ్జ్వల నేత్రములు– అవే తళతళమని మెరసెడి చెంపలు. ఎఱ్ఱని పెదవి. అదేకేశదామము. జ్ఞాపకమునకు వచ్చినది."

యువరాజు నూరిన్నిసా వైపు తిరిగినాడు. "ఢిల్లీలో పూలమ్ము బాలిక యొకతెవచ్చెనని నీతో నాడు చెప్పలేదూ? ఈ బాలిక యీమెయే."

"సరేకానీ హరిదాసీ! ఇప్పుడీ వేషమును ధరించితివేమి? ఇంతలో నూరున్నీసా మొగము మందహాస మయమైనది. ఆనాడాబాలికను ఊర్చి ఊర్చివర్ణించితిరి. నేడదియే సాక్షాత్తుగా వచ్చినది."

ఆమె హాస్యము చేయుట కారంభించెను.

"సన్యాసినీ ! అప్పుడు ఢిల్లీ కేలవచ్చితివి? ఇప్పుడిక్కడికి వచ్చిన దెందుకు?" యువరాజు అడిగినాడు.

"ఢిల్లీ పాదుషా మా పురాణాదులలో వర్ణించు కంసుడు, శిశుపాలుడు మొదలగు వారివంటి వాడని యిక్కడి ప్రతీతి. వారట్లె యాతనిపైన పాటలుగట్టి పాడుచుందురు. అలంఘీరు యెట్లుండునో చూడవలెనని నాకాశగల్గినది. అతడును మానవుడేగదా ! పాదుషాను చూచుటకు ఢిల్లీకి వచ్చితిని. చూచిన తర్వాత అతడిట్టి వాడనుకొన్నాను.

అతడొక మహాపురుషుడు. కొంచెము ముక్కోపి అనుకొన్నాను. అంతే. పాదుషాగారి కన్నులు జ్యోతిర్మయములు. అవియింకను నాకు జ్ఞాపకమున్నవి. అట్లే నీవు విద్వాంసుడవని స్నేహపరుడవని విన్నాను. అందుచే చూచిపోదమని వచ్చితిని. యువరాజా ! నీవు చాల సరళహృదయుడవు. నీవే యొకానొకనాడు ఢిల్లీ పాదుషా గాబోదువు. అప్పుడీ దేశమున నిన్ని హాహాకారము లుండవు. అన్యాయములుండవు. అత్యాచారములుండవు. పాదుషాకు గాని – నీకుగాని – హిందూమతము పైన ద్వేషమున్నదా ! అనుట నేనింకను పరీక్షించి తేల్సుకోవలసిన విషయము. మీ దర్బారులో నెందరో రాజపుత్ర వీరులున్నారు. వారిలో ప్రసిద్ధ సేనాపతులు గూడ గలరు. గొప్పయధికారు లున్నారు. పాదుషా హిందూమత ద్వేషియైనచో వారందరి నేలయుంచుకున్నారు? ఇప్పుడు మీరు దక్కను పైకివచ్చినారు. బీజాపుర గోల్కొండ సుల్తానులు మహమ్మదీయులు. వారితో మీకేల యుద్ధము? కనుక హిందూ మహమ్మదీయులకు యుద్ధముగాదు. రాజులకు రాజులకు యుద్ధము. ఈ విషయమును జనులు గుర్తించినచో – యింతటి చావునోవు లుండవు. సైనికుల యిన్ని యత్యాచారము లుండవు. అసలు సైనికులే యుండరు."

యువరాజు చకితుడయ్యెను.

"సన్యాసినీ ! నీవు గొప్ప బుద్ధిమంతురాలివి : విశాలమైన భావములు నీవి. మా ఖాజీలలో గూడ నీవంటి వారున్నారు. సమయము జిక్కినచో సైనికులు చాల దుర్మార్గముల నొనర్తురు; అదీ నిజమే. హిందూ సైనికులు మాత్రమేమి తక్కువ ? వారును అంతే. యుద్ధము దొరకినచో చాలును. వారి దుష్కామనలన్నియు దీర్చి కొందురు."

నూరున్నీసా నవ్వుచు నన్నది.

"హిందువులైన నేమి? ముసల్మానులైన నేమి? స్త్రీలపై దౌర్జన్యములు చేయుటలో పురుషులందరు నొక్కటే, ఆ 'దౌలత్'నకు జాతిమత భేదములులేవు. ఇది పురుషులకు స్వభావమైన గుణము".

'ఉన్నీసా ! నీవు కవయిత్రివి. నీ కవిత్వములలో స్త్రీలందరు దోషము లేనివారు; పురుషులందరు దుష్టులు. నీ విట్లు వాదించుట యేమియు క్రొత్తగాదు. మంద వాయువులు–

సుశీతల తటాకములు, పుష్పములు – వీని నన్నిటినీ స్త్రీలకు పోల్చికొందురు. పురుషులను క్రూర వస్తువులకు పోల్తురు.”

హరిదాసి యన్నది.

“యువరాజా ! నేనిక్కడికి వచ్చుటలో యేదో రాజకీయ ప్రయోజనమున్నదని యూహింపకుము. ఈ నూరున్నీసా పేరుగూడ చాల ప్రసిద్ధము. ఈమె గొప్ప విద్యావతి, కవయిత్రియని విన్నాను. చాల సౌందర్యవతియనియు ప్రశస్తియున్నది. ఈ రాణిని చూడవలెనని యిచ్చటికి వచ్చితిని. స్నేహము చేసికొందమని యాశ యుండినది. అది నెరవేరినది.”

“షా ఆలం” అన్నాడు.

“మంచిదే. ఈ గోల్కొండ యుద్ధము చాల భయంకరమైనది. నేనెప్పుడును రణరంగము నందే యుండవలసివచ్చును; రాణికి నీవంటి స్నేహితురాలు యొకతున్నచో సుఖముగా ప్రొద్దుబోవును.”

హరిదాసి నూరున్నీసా వైపు చూచెను.

“యువరాజా ! నీ బదులుగా నన్నిక్కడనుంచి పోదువేమి?” ఆమె హాస్యమాడినది.

నూరున్నీసా కపోలములు లజ్జారుణములయ్యెను.

“సన్యాసినీ ! యువరాజు నిన్నిచ్చటనుంచి పోయినను నీవు బ్రతుకలేవు సుమా! నేనొక్కతెనే కాదు. ఇంకను యిర్వురు ముర్వురు రాణులున్నారు. వారందరు నీ వెంట బడుదురు. ఈ యంతఃపురము నీ వనుకొన్నంత స్వర్గము కాదు.”“మహారాణీ ! నీవు నన్నీ కొంచెము సేపు మాత్రమే చూచితివి. నేను దేనికిని భయపడను. ఒక పిశాచమువంటి దానిని. విషమునైనను – మందస్మితముతో త్రాగగలను. కాలసర్పము కాటునకు నిర్భయముగా చేయినివ్వగలను. కామక్రోధములు నాకోడిపోయినవి. నేనువాని చేతి పరిచారికనుగాను.”

నూరున్నీసా అన్నది.

“ఓహో ! నీ వంత గట్టిదానివేమి? పోనీ దేనికి భయపడకున్నను నీ స్త్రీత్వమునకైనను భయపడుదువా లేదా?”

“దానికిగూడ భయపడను. మీ దర్బారులో గాని మీ సైనికపటాలములోగాని, యెవరికిని నన్ను కన్నెత్తి చూచు ధైర్యము లేదు. ఔరంగజేబు పాదుషా నాకొక వరమిచ్చినాడు. నేను తన బిడ్డనని చెప్పవలెనట ! ఎవరైన నన్ను చెనకినచో – ఆ మంత్రమును ప్రయోగింతును. దానితో వారు భయపడి పరుగెత్తి పోదురు. నేనొక్కమాట పాదుషాతో చెప్పినచో వారి తలలెగిరి పోవునను భయము యే దుర్మార్గుల కుండదు?”

“హరిదాసీ ! నీవు చాల ధైర్యస్థురాలవు. నీకెక్కడ బోయినను భయములేదు.”

యువరాజన్నాడు.

“నీకు సాంభాజీ తెలియునా? గోల్కొండ సుల్తానుతో పరిచయమున్నదా? మాదన్న ధన్నాయకు నెఱుగుదువా?”

“యువరాజా ! అందరు దెలియుదురు. నేను సమర్థ రామదాసుల శిష్యురాలినని ముందే చెప్పితిని. శివాజీ మహారాజు కొడుకే నాకు దెలియకుండునా? అతనితో చక్కగా పరిచయమున్నది”.

“మాకు సాంభాజీ ప్రభు విద్వేషి యను విషయము తెలియునా?”

“తెలియకేమి? స్పష్టముగా తెలియును. సాంభాజీ మహాపరాక్రమశాలి. మీరతనిని జయించుటకే దక్షిణదేశమునకు వచ్చినారు. కాని, ఆ పని అంత సులభము కాదు. బలాబలములు, పరాక్రమములు ముఖ్య కారణములు కావు. ముసల్మాను సైన్యములు అంతకుముందు దక్కనుపైకి యెన్నిసారులో వచ్చినవి. ఆ సైన్యములు హిందువులపై చేసిన అత్యాచారములకు మితిలేదు. దానితో, యీ ప్రజలు రెచ్చిపోయినారు. ఈ సామ్రాజ్యమందున్న ప్రతియొక్క హిందువు సాంభాజీ కొరకై ప్రాణములు వదలుటకు తయారుగా నున్నాడు. సాంభాజీ మీకు శత్రువు. కాని మీరు గోల్కొండ సుల్తానుపైకి యుద్ధమునకు వచ్చుట నాకాశ్చర్యముగా నున్నది. సుల్తాను రాజ్యము చేయుచున్నాడేమి? అతడు సర్వదా స్త్రీలతో కాలము గడుపుచుండును. మద్యపాత్ర యెప్పుడును చేతిలో నుండును. అతనిపై నెవ్వరికిని గౌరవము లేదు. అతనికి కూడ శక్తి సామర్థ్యములు లేవు. ఈ గోల్కొండతో యుద్ధము చేయుట వృథా; ప్రజలు నాశనమగుదురంతే”

“సన్యాసినీ ! ఈ మాటలతో ప్రయోజనమేమి? ఇది పాదుషాగారి యాజ్ఞ. నెరవేరి తీరవలెను.”

“యువరాజా ! ఇక నాకు సెలవిచ్చినచో నేనుపోయి వత్తును. మరియొకసారి వచ్చి అమ్మగారి దర్శనముచేసి కొందును. మీ దర్శనముగూడ దొరికినచో గొప్ప యదృష్టముగ భావింతును.”

నూరున్నీసా, షా ఆలంకు సలాముచేసి హరిదాసి వెనుకకు తిరిగినది.

రాణి అన్నది.

“హరిదాసీ ! నీవేమియు ప్రార్థించుట లేదా? నీకేమైన నిత్తమను ఆశనాకున్నది.”

“మహారాణీ ! నీవేమైన నివ్వగలశక్తి నీకున్నది. కాని నాకా జంజాటమంతయు నెందుకు? ఆనాడు వృద్ధ పాదుషా నాకు పదివరహాలిచ్చెను. వానిని నేనాపూలు కట్టుదానికే యిచ్చివేసినాను. కాని పాదుషా ఔదార్యము మాత్రము నా కింకను జ్ఞాపకమున్నది. తల్లీ ! ఈతంబూరయే నాకు బరువుగా నున్నది. ఇంక మీ యుడుగర లెక్కడ మోతునమ్మా?”

"ఆ తంబూర నీకు బరువుగా నున్నచో నాకిచ్చి పొమ్ము."

నూరున్నీసా నవ్వినది.

"ఈ తంబూరయా? దీని నిచ్చినచో మీరు తీసికొందురా? ఈ యువరాజు మనల నూరక విడచునా? కవయిత్రీ ! మా రామాయణములో ఒక కథ వచ్చును. రావణుడు సీతాదేవిని మాయ సన్యాసియై యెత్తికొనిపోవును. అట్లే – ఈ తంబూర నీకిచ్చి, నేను నిన్ను శిష్యురాలిగా జేసికొన్నచో – యువరాజు నా యొడలు చీల్చి వేయును. యువరాజునకు నీపైన నెంత ప్రేమయున్నదో నాకు దెలియదా? అతని ప్రాణములే నీపై బెట్టికొన్నాడు. నీ పేరే యెట్లున్నది చూడు ! 'నూరున్నీసా' ! "హరిదాసి పకపక నవ్వుచు వెడలిపోయినది.

షా ఆలం కొంతసేపు దిగ్భ్రాంతుడై చూచుచుండెను.

నూరున్నీసా అతని కపోలములను మృదువుగా దడవినది.

"ప్రభూ ! ఏమట్లున్నారు? ఆ సన్యాసినిమాటలకు దిగ్భ్రాంతులైనట్లున్నది."

షా ఆలం నూరున్నీసాను దగ్గరకీడ్చుకున్నాడు.

"ప్రియా ! అన్యధా భావింపవలదు. హరిదాసి చెప్పినట్లు నీ ప్రేమలో నా ప్రాణములున్నవి. కాని ఆ సన్యాసినియు సామాన్యురాలుగాదు. ఏమి సౌందర్యము ! ఏమి వాక్చమత్కృతి ! ఆ మాటలలో, ఎంత మాధుర్యమున్నదో అంత కాఠిన్యమున్నది. అబ్బ ! అది యేమి సన్యాసిని."

ఉన్నీసా అతనిచేతినుండి విడిపించుకున్నది.

"యువరాజా ! నిజము. ఈ సన్యాసిని ఒక అపురూపమైనస్త్రీ. కాని సంపూర్ణముగా లోకపాశములను త్రెంచికొన్నది. ఆమెపై నొక కవితనల్లుదమని యున్నది. కవిత్వము వలనే సన్యాసినియు అపూర్వసృష్టి.... "కొంచెము సేపు సితారు వాయింతునా?"

ఆ భవనమందేయున్న సితారు దీసికొని నూరున్నీసా వాయింప నారంభించినది. ఆధ్వని తరంగములుగా ఆలం మనస్సును కల్లోల మొనర్చినవి. ఆ మనస్థితి సుఖదుఃఖముల కతీతమైనది. సితారు ధ్వనులతో భవనము మారు మ్రోగినది.

'షాఆలం' గొప్ప రసికుడు. సంగీతమన్న చెవికోసికొనును. నూరున్నీసా సంగీత కవిత్వముల యందు సముద్రము.

ఆమె వానికి స్వర్గమునే సృష్టించుచున్నది. అప్పుడప్పు డాతనికి పాదుషా యాజ్ఞ జ్ఞాపకమునకు వచ్చును. ఆ వచ్చుట సింహస్వప్నముగా నుండును. ఔరంగజేబు ఆజ్ఞ సింహగర్జన వంటిది. షాఆలంనకు గోల్కొండ యుద్ధమన్ననేమో తెలియును. మాదన్న ధన్నాయకుడు సాంభాజీ కంటెను వీరుడు సాహసికూడా; అతని యుద్ధములలో కుతంత్రము లేదు. మాయలేదు. ఉన్నదంతయు విక్రమమే. సూర్యోదయ మయ్యెనా యుద్ధమారంభ మగును. సముద్ర తరంగముల వలె లేచి పైపైని బడవచ్చు శత్రువీరులు. వారి మధ్యలో అపరసవ్యసాచి మాదన్న. ఈ భావములు షా ఆలం మనస్సులో తరగ తరగలై రేగుచున్నవి.

తెల్లవారినది. సూర్యుడు రానేవచ్చెను. షా ఆలం యుద్ధమునకు సిద్ధమైనాడు.

"యువరాజా ! యుద్ధమునకు బోవుచున్నారు. పునఃదర్శనము?" హెచ్చరించినది నూరున్నీసా. ఆమె వదనముపై దైన్యరేఖ – శారదాకాశమున మేఘమువలె నున్నది.

యుద్ధమన్నంతనే భయమెందుకు? మొగలు సైన్యముల పరాక్రమము నీవెరుగవా? ఆ సైన్యములే దిక్కున కేగిన నాదిక్కున జయముగాచికొనియే యుండును. పాదుషాకీ రహస్యము తెలియును. అతని జీవితము విజయలక్ష్మికి శిశువు, అందుకే యాతడు మమ్మెల్లర తృణ ప్రాయముగా జూచును. యువరాజు 'షా–ఆజంకు' నాపై నెప్పుడు అసూయ. వాడు బీజాపురము పైకి పోయినాడు. బీజాపురమును జయించు లోపలనే నేను గోల్కొండను వశపరచు కొనవలెను. అప్పుడు పాదుషా నాపై ప్రసన్నుడగును."

"ప్రభూ ! నాకధైర్యమేమియు లేదు. కాని నిన్నటి దినము, ఆ హరిదాసి పలికిన మాటలు నా హృదయములో మెదలు చున్నవి. మాదన్న ధన్నాయకుడు, వీరాగ్రేసరుడని మీరే చెప్పినారు. వేరొకవైపునుండి సాంభాజీ వచ్చి యాతనికి తోడ్పడునేమో !" ఆమె ముఖము కల్లోలితమైనది.

'కాని యేమి చేయవచ్చును? యుద్ధమనగా యుద్ధమే. అందులో ముందుకు వేసినయడుగు వెన్కకు వేయరాదు."

''యువరాజా ! నేను మీకు భయమును నూరిపోయుటలేదు. నన్నుగూడ యుద్ధరంగమునకు దీసికొని పోగూడదా ! యని నామనవి. నేనుగూడ వత్తమనిపించు చున్నది."

"ఉన్నీసా ! నేను యుద్ధములో ముందు నిలువవలెను. శిబిరములో నిన్నొక్కతెనే వదిలిపోయిన నేమగునో? సాంభాజీకూడ యుద్ధములందారి తేరినవాడు. శిబిరమందు నీకేదైన నపాయము సంభవించినచో, అది ఢిల్లీ సింహాసనము నకు తీరని కళంకమగును. నన్ను క్షమింపుము. ఒకటే ఒక వారము. ఎనిమిది దినములు అంతే. రోజులు లెక్క పెట్టుకొను చుండుము."

అతడు మహాద్వారమునకు వచ్చినాడు. నూరున్నీసా వెనువెంటనే వచ్చినది. మహాద్వారమున రక్షకసైన్యము సిద్ధముగా నుండెను. 'షాఆలం' అతని హయమును సమీపించినాడు. దానికి 'వజీర్' అని పేరు. అతడు గుఱ్ఱము నెక్కుచునేయొక్కసారి నూరున్నీసావైపు శీతలముగ జూచినాడు. గుఱ్ఱము గదలెను. రణభేరులు మ్రోగినవి. షాఆలం హయము ముందు ముందు నడచినది. వెన్ను కావల భటులు అతని ననుసరించిరి. నూరున్నీసా ఆ గుఱ్ఱముల ధూళియగుపించువరకును అట్లే నిలచి చూచుచున్నది. గగనము ధూళిధూసరితమయ్యెను. ఉన్నీసా యొక్కసారి గట్టిగా నిట్టూర్చినది. ఆ నిట్టూర్పులో నొక

'గజల్' మ్రోగెను. "వీరులకు రణరంగమే ప్రేయసి. యుద్ధ ధూళియే రక్తచందనము. ఎగిరి పైబడుచున్న రక్తధారలే పూమాలలు. వారికింక ప్రియు రాండ్రెవరు?" యని దానియర్థము. ఆమె వెనుదిరిగివచ్చి శయనముపై బడినది. అస్తవ్యస్తముగ బడినది. ఆ హంసతూలికాతల్ప మామెకు కఠినశిలాప్రాయమేయైనది.

గోల్కొండ యందు, యిరువాగులును జేరినవి. హైదరాబాదునకది రెండు క్రోసుల దూరమందున్నది. మొగల్ సైన్యము వీరావేశముతో ముందుకుదూకుచుండెను. మాదన్న ధన్నాయకుడు ముందుకుదూకి కత్తితీసి తన సైన్యము నుద్రేకపరచినాడు. ఆలం మాదన్నను జూచినదిదే మొదట. ఆపాదమస్తకము కవచము తలపై వీర కేదారపుపాగ. అతని హయము మహోన్నతము. అది నల్లగా మృత్యుదూతవలె నున్నది. ఆ యోధనమున యెక్కడ జూచిన ధన్నాయకుడే యైనాడు. చేతికత్తి మెఱపువలెనాడుచున్నది. అదియాయతదీర్ఘమైయున్నది. షా ఆలం దూరము నుండి ధన్నాయకుని జూచెను. ఓహో ! ఏమి వీరుడు! సాహసము రూపుకట్టిన మూర్తి, షా ఆలంనకు మాదన్న ఖడ్గచాలనమే కాని వ్యక్తి గనిపించుటలేదు. వేరొకవైపు బోరుతున్నారని యాతడనుకొనెను. అతనితో బోరవలెననిపించినది. షాఆలం తన హయము నావైపునకు దరిమినాడు. ఒక్క తృటిలో నిర్వురును సంధించి కొందురు. ఇంతలో "రుస్తుం – అమీర్ ఖాన్" వారిర్వురినడుమ దూకినాడు. ఆలం హయము వెనక నిల్చినది. రుస్తుం అమీర్ –

"యువరాజా ! వెనక్కు తగ్గ"మన్నాడు.

షాఆలంనకు వాని యెచ్చరిక యర్థముగాలేదు. తానెందుకు వెన్క నిలువవలెను? కత్తుల ఝుణత్కారము విన్పించినది; ఆకాశమున రెండు మెరపు లొరసికొనినట్లున్నది. కుడి ఎడమలకు దిరుగుచున్న ఖడ్గములు, కుడి ఎడమలకు దిరుగు చున్నట్లే లేదు. యుద్ధము జరిగినది రెండు నిమిషములే. రుస్తుం తల యెగిరివచ్చి షా ఆలంపై బడినది. అతడాశ్చర్యపడి తెప్పరిల్లెను. మాదన్న, మరణించినది యువరాజేననుకొన్నాడు. అతడు ముందునకు దీక్షముగజూచెను. షాఆలం బ్రతికియున్నాడు. "ఛీ !" యని మాదన్న గుఱ్ఱము నదలించినాడు. అది ముందటి కాళ్లెత్తినది. షాఆలం హయము నదలించినాడు. అదియును దూకబోయినది. ఆరెంటి హయముల యగ్రపాదములు పరస్పర మొరసి కొన్నవి. మాదన్న కత్తి వీచెను. అతడు వీచులోపల కొంత మొగలు సైన్యమడ్డువచ్చినది. వారియనేక శిరస్సులా యూకుతో గత్తరింపబడినవి. షాఆలంనకు భూమిపై బ్రతుకున్నది. మాదన్న నల్వురైదుగురు మొగల్ దళపతులను గూల్చెను. మొగల్ సైన్యములు వెన్కకు తగ్గుచున్నవి. షా ఆలం వెన్క నిలబడి ప్రోత్సహించుచుండెను. వారికుత్సాహము గల్గుటకై బంగారు నాణెముల విసరివేయు చున్నాడు. సూర్యు డస్తాద్రికి వ్రాలెను. నక్షత్రములు భయముతో యుద్ధభూమిని తొంగి తొంగి చూచినవి. సైనికులు పరస్పరము గుర్తు చిక్కుటలేదు. చీకట్లు చాలవన్నట్లు దిక్కుల గలిసికొన్న ధూళి. ఇరువాగులును వెను దిరిగినవి; ఉభయ సైన్యములందును దళపతు లనేకులు మడిసిరి;

కాని, నాటి విజయము మాదన్న ధననాయకునిదే. గోల్కొండ శిబిరములో విజయధ్వనులు మ్రోగెను, మొగల్ శిబిరములు ప్రశాంతముగా నుండెను. మూడు దినములు యుద్ధమయ్యెను. గెల్పోటములు లుయ్యాలతూగులైనవి. ఎవ్వరును దాము గెల్చితిమని చెప్పికొన లేకుండిరి. సీరకు, మాల్కొండలు మొగలుల యధీనమందే యుండెను. నాల్గవదినము గోల్కొండ సైన్యము యుద్ధమునకు రాలేదు. షా ఆలం శిబిరములో విశ్రాంతి గైకొనుచున్నాడు. ఆ తర్వాత మూడు నాల్గు దినములు యుద్ధ కోలాహలమే లేదు. మాదన్న యే మయ్యెను? మొగల్ దళపతుల కిది యొక ప్రశ్న. మాదన్న – సోదరు డక్కన్నతో సమాలోచన మొనర్చుచుండెను.

'అన్న ! ఇది విచిత్రము యుద్ధము మహా రభసముతో మొదలైనది. మొదటి దినముననే మొగలు సైన్యములోడి పోవలసి యుండెను. మూడు దినములైనను ఢిల్లీ సైన్యములు వెనుకంజ వేసినది లేదు. మన సైన్యము లలసినట్లు గన్పడు చున్నవి. ఇందేదో రహస్య ముండి యుండునని నా సందేహము. మీ యభిప్రాయమేమో!"

అక్కన్న ధననాయకుడన్నాడు.

మాదన్న కొంతసేపు మౌనముగ నుండెను. ద్వారపాలకుని పిలిచినాడు.

"రామసింగూ ! సేనాధిపతి యిబ్రహీం ఖాను నొకసారి పిలుచుకునిరమ్ము !" మరి కొంతసేపటికి యిబ్రహీంఖాన్ శిబిరములోనికి వచ్చి, అక్కన్న మాదన్నలకు నమస్కరించెను.

"ఇబ్రహీం ! నీవు వీరుపురుషుడవు. యుద్ధము మూడు దినములనుండి జరుగుచునే యున్నది. మనమొక భాగమైనను జయించినట్లు లేదు. మనసైన్యములు గూడ అలసి నట్లున్నవి. నీవేమను కొందువు?"

మాదన్న ధన్నాయకుడన్నాడు.

"ఖావంద్ ! నాకు రాత్రి యంతయు నిద్రపట్టలేదు. అర్ధరాత్రిలేచి మన శిబిరమంతయు జుట్టుకొని వచ్చినాను. సైనికులు తప్పత్రాగినారు. నోటికివచ్చినట్లు మాట్లాడుకొనుచుండిరి. నేను, మీరు సాకిన శిశువును. జాతి యేమైననేమి? నీవునాకు తండ్రివి. నేనొక రహస్యమును గొన్నాను. తెల్లవారి నేనేవచ్చి మీతో చెప్పవలెననుకొంటిని. మీరే పిలిపించినారు. మనవైపున్న ముసల్మాను సైనికులు – వారి పద్ధతి వేరుగా నున్నది. రాత్రి వారి మాటలు విన్నాను. వారికి, మత్తులో యేమి మాట్లాడు కొనుచున్నదియు దెలియలేదు. వారి మనస్సులలోని కశ్మలమంతయు గడ్డకు వచ్చినది. అప్పుడే నాగుండె పగిలినది."

మాదన్న ముఖము వివర్ణమయ్యెను.

"ఇబ్రహీం, ఆ విషయమేమో చెప్పుము, దానికేదైన ప్రతిక్రియ సాధ్యమగునేమో చూడుము."

"హుజూర్ ! ఈ మాటలు నానోటినుండి వెడలరాదు. కాని చెప్పక విధిలేదు. మన ముసల్మాను సైనికులు కుట్ర చేయుచున్నారు. అంతే ?"

"ఇబ్రహీం ! నీవు భయపడవలసిన పనిలేదు. నాకు యేక్షణమందును చలింపనట్టి మనోధైర్యమున్నది. ఇందులో నీ యపరాధ మేమున్నది? విషయమేమో జెప్పుము?"

"హుజూర్ ! ముసల్మాను సైనికులకు గోల్కొండ నవాబుపై భక్తిలేదు. మీరన్నచో పెద్ద భయము.

"ఈ యుద్ధములో జయమైనచో నెవరికి లాభము? మాదన్న సుల్తానగును. గోల్కొండలో సాంభాజీకి గొప్ప పలుకుబడి యేర్పడును. పలుకుబడియేమి – ఆ రాజ్యమే యతనికి సంక్రమించును. మనమిప్పుడు హైదరాబాదు పోయి లూటీ చేయుదము. కావలసినంత ధనము చిక్కును. అందమైన స్త్రీలు చిక్కెదరు. తీసికొని దూరదేశములకు పారిపోదము." ఇవి వారి మాటలు. వారు గట్టిగా అరచి పరస్పరము చెప్పికొనుచుండిరి. ఇవి ఉన్మత్త ప్రలాపములని – మనముపేక్షించుటకు వీలులేదు. సారాయి త్రాగి మైమరచి – తమ మనస్సులలో నున్న కశ్మలమును వారు బైట పెట్టికొన్నారు. ఇవి పిచ్చిమాటలుకావు. తర్కబద్ధమైనవి. హైదరాబాదును లూటీచేయు సామర్థ్యము వారికిలేదు కాని – వారు మన సైన్యములను విడచి పరుగెత్తిపోవు సంభవమున్నది."

"నిజమే? మరి యిప్పుడు మనమేమి చేయవలెను? "షా ఆలం" సరళ స్వభావుడు. యుద్ధ ప్రియుడుగాడు. పెద్ద వీరుడును గాడు. సంధియను నెపముతో మనమీ యుద్ధము నిప్పుడు తప్పికొందము. సైన్యమును హైదరాబాదువైపు నడపింతము. అప్పుడు మన ముస్లిం సైనికులు – మన కొలువువిడిచి పోవచ్చును. వారైపోయినచో మనకు నష్టమేమియులేదు. కొత్త సైనికులను చేర్చికొందము. వారికి ధనములిచ్చి యుత్సాహపరుతము. అప్పుడు మనసైన్యము భద్రమగును. గోల్కొండపై హఠాత్తుగా పడుదము."

అక్కన్న ధన్నాయకుడన్నాడు.

"ఇబ్రహీం ! నీ మాటలు నిజమే యనుకొందము. సలహాకూడ తగినట్లుగనే యున్నది. కాని – మన శిబిరములను వెన్కకు గదలించినప్పుడు – మన సైనికులు కొలువు వదలిపోవు నప్పుడు – మొగలులు కన్నుమూసికొని యుందురా? వారున్నట్లుండి మనపైకి దూకవచ్చును. మరల క్రొత్త సైన్యమును తయారు చేసికొందమనుట సాధ్యముగానిపని. దీనికి నీవేమందువు?

ఇబ్రహీంఖాన్ గట్టిగా అన్నాడు.

"ఖామంద్ ! అదియు యొక్క యోచనయే – కాని మనసైన్యములు మొగలు సైన్యములకంటె హెచ్చుగా నున్నవి. ఈ విషయము వారికి దెలియును. వారికాహార సామగ్రిగూడ మనంతలేదు. ఇప్పుడిప్పుడే ఢిల్లీ నుండి ఆహారసామగ్రి వచ్చుచున్నది. త్రోవలలో సాంభాజీ సైనికులడ్డి – ఆహారపదార్థములను వీరికి చేరనిచ్చుటలేదు. ఇట్టి పరిస్థితిలో మనమై సంధికి చెప్పిపంపినపుడు – వలదను స్థితిలో వారిప్పుడులేరు. కాని – కఠినములైన సంధి

షరతులును విధింతురు. మనము రహస్యముగా యుద్ధసన్నాహము లొనర్చికొని – ఆ సంధిని తిరస్కరిపవచ్చును. ఖామంద్! నేను వాదమొనర్పను. ఉన్న విషయము తమకు మనవిచేసినాను. ఆపై మీరు చెప్పినట్లు చేసెదను. నేడే యుద్ధక్షేత్రమునకు బొమ్మని యాజ్ఞయైనచో యట్లే యరుగుదును.”

“ఇబ్రహీం ! వయస్సున చిన్నవాడవైనను గొప్ప సలహా యిచ్చినావు. కొంచెము నన్నే కాంతముగా యోచించు కొననిమ్ము. నీవు పోవచ్చును.” మాదన్న పలికెను. ఇబ్రహీం వెళ్ళిపోయినాడు.

మాదన్న యేదో యాలోచించుకొను చుండెను.

“ఏ మాలోచించుకొన్నారు?” అక్కన్న ప్రశ్నించెను. “ఆ విషయమే ! మనము సంధికి యత్నించినచో పాదుషా అంగీకరింపడు. వారికి సుల్తానుపై ద్వేషములేదు. ఉన్నదంతయు నా మీదనే. మరొకవైపు సాంభాజీయన్నచో భయమున్నది; మన సైన్యములో – ముసల్మానులకు ద్రోహబుద్ధి యున్నదనుటలో ఆశ్చర్యమేమియులేదు. కాని యుద్ధమును నిలుపుట తగనిపని. ఎవరు లేకున్నను ముందు బెట్టిన కాలు నేను వెనుకకు మరల్పను. ఇది కేవలము పౌరుషమే కాదు అక్కన్నా; ఇందులో మరియొక రహస్యమున్నది. మనము యుద్ధము సాగించినచో – సాంభాజీ మరియొక వైపునుండి వీరినడ్డగించును. అప్పుడు వీరిగతి అడకత్తెరలో పోకవంటిది. మనమా యవకాశమును గల్గించుకొనవలెను.”

“అన్నా ? మనమీ సుల్తానును బ్రతికించికొన్నదే పొరపాటు ఈ ఇబ్రహీం పౌరుషము గలవాడే. కాని వీని పైనను నాకు సందేహమున్నది.”

మాదన్న నవ్వెను.

“ఎప్పుడును నీ ప్రకృతి యింతే. ప్రతివారిని నీవు సందేహింతువు. ఒక్కొక్కసారి నీ మాట గూడ నిజమగును. మరి యిప్పుడేమందువు? ఇందులో నీ సలహాయేమి?” “మనమీ యిబ్రహీంనే సంధి కంపుదము. అప్పుడువీని వర్తనము మనకర్థమగును. మన సైనికులకు ధనము పంచుదము. ఆ పంచినప్పుడు ముసల్మానుల వాలకము మనకర్థమగును. సంధిషరతును తిరస్కరింపవలెనని ఇబ్రహీమే అన్నాడు కదా ! ఇబ్రహీం వెనుతిరిగి వచ్చినను సరే – లేక వారి కారాగారమందున్నను సరే, మనమేమో యుద్ధమును ముందు నడుపుదము. మనకు సాయపడవలెనని సాంభాజీకి కూడ వ్రాసి పంపుదము. ఇంతలో దైవసహాయముకూడ మనకు దొరుక వచ్చును.”

మాదన్న తల నాడించెను. సంధ్యయైనది. మాదన్న పిలుచుచున్నాడని యిబ్రహీంనకు వార్త వెళ్ళెను. ఇబ్రహీంను మాదన్న ఆదరపూర్వకముగా నాహ్వానించినాడు.

“ఇబ్రహీం ! ఈ సలహామంచిదే ! నిన్నే యీ సంధి కార్యమున కంపుదమనుకొన్నాను. నీవు షా ఆలం శిబిరమునకు బొమ్ము. “ఖిల్లత్తులు” తీసికొనిపొమ్ము. “పాదుషాగారు

ముసల్మానులు; గోల్కొండ సుల్తాను ముసల్మాను, మనలో మనకు వైరమెందుకు!" అని నీవే సంధి ప్రస్తావన చేయుము. వారికి కావలసినంత ధనమిచ్చి కొందుమనియు తెలుపుము. వారి యభిప్రాయమేమో తెలిసికొందము".“ఖామంద్ ! మొగలు శిబిరమునకు పోవుటకు నేను జంకుటలేదు. వారు సంధి కొప్పినచో మనమేమి చేయవలెను?"

“ఒప్పినచో నింకేమి కావలెను? మనము ఢిల్లీపై నెత్తి పోవుటలేదు. వారు మన జోలికి రాకున్నచో నంతేచాలును. ఇప్పుడు వారు సంధికొప్పుకొందురను ఊహకూడ నాకున్నది. పాదుషా దృష్టియంతయు బీజాపురముపై కేంద్రీకృతమై యున్నది. పైగా నతడు వృద్ధుడైనాడు. యవ్వనములోనుండినంత హఠము, ఇప్పుడున్నట్లు కన్పించుటలేదు. మొన్ననే రాజపుత్రులతో సంధి చేసికొన్నాడు. మనముగూడ – యే యుపాయము చేతనైనను యిప్పుడు యుద్ధమును నిల్పి కొన్నచో – యింతలో పాదుషా మరణించవచ్చును; అప్పుడు ఢిల్లీలో యెవ్వరికిని మనవైపు తేరిచూచుటకుగూడ ధైర్యముండదు. అంతమాత్రమేగాదు. పాదుషా మరణించినచో ఆ సింహాసనముకై వారిలో వారు తగవులాడి కొందురు. ఆ రగడలో ఢిల్లీ సింహాసనమే అస్తమించవచ్చును. ఇంతకు ఇప్పుడు యుద్ధము నిలిచిపోయినచో నదియే పదివేలు".

ఇబ్రహీం మాల్కొండలోనున్న షా ఆలం శిబిరమునకు ప్రయాణమైనాడు.

**4**

యువరాజు షా ఆలం మాల్కొండలో నుండెను. పటకుటీరములలో వాసము; చుట్టును సముద్రమంతటి సైన్యము. యువరాజేమో యాలోచించి కొనుచుండెను. చంద్రుడెక్కి వచ్చుచుండెను. ఆతని కిరణములు గోధుమవన్నెలో నున్నవి. నక్షత్రములు మినుకు మినుకు మనుచున్నవి. గోధుమవన్నె వెన్నెలలు – జాజిపూలగుచున్నవి. చంద్రికా స్పర్శమునకు భూమికూడ పులకించి నట్లున్నది. మందమారుతములేమో పాడుకొనుచున్నవి. వృక్షములు నిష్కాజస్తిమితములై యుండెను. ద్వారపాలకు డొకడువచ్చి సలాముచేసి గుప్తచారులు వచ్చినారని విన్నవించినాడు. యువరాజు తలనెత్తి వారిని లోనికి రమ్మన్నాడు. గుప్తచారులు వచ్చి సలాము చేసి నిలిచిరి.

“ఏమి సమాచారము? గోల్కొండ సైన్యములు యుద్ధమునకు రాలేదేమి?

“హుజూర్ ! గోల్కొండ సైన్యములలో నిన్నరాత్రి హిందూ ముస్లిముల మధ్య స్వల్పముగా ఘర్షణ రేగినది. ఇబ్రహీంఖాన్ అనెడు తరుణ సేనాధిపతికి మాదన్న ధన్నాయకునకు నడుమ యేదో కొంత వాగ్వాదము జరిగెననియు విన్నాము. సుల్తాను యుద్ధమున కిష్ట పడలేదట ! మాదన్న సుల్తాను మాటను తిరస్కరించి అవమాన మొనర్చెనట; ఈ గడబిడలో వారు యుద్ధమునకు రాలేదు."

“మంచిదే జరిగినది. ఇకపై నేమిజరుగునో చూడవలెను."

“మాదన్న ధన్నాయకుడు సాంభాజీకి – యుద్ధమున తోడ్పడవలసినదిగా వార్తలంపినాడట!"

యువరాజు బదులు పలుకలేదు.

పోయిరావచ్చునని గుప్తచారులకు సన్నచేసినాడు. కొంతసేపైన పిదప 'షా ఆలం' గడ్డకు వచ్చెను. భూమిపై వెన్నెల తెల్లని పట్టు తివాచీలు పరచినది. అది యెంత యపురూపముగ నున్నది ! తలనెత్తి యాకసమువైపు జూచినాడు. చంద్రుడు పగులబడి నవ్వుచుండెను. రాత్రిదేవి నిశ్శబ్దముగా తనపని చేసుకొనుచున్నది. వాయు కుమారుడామె కుచ్చెళ్ళుపట్టి లాగుచున్నాడు. ఆ తల్లి వానిని మందలించుటయు లేదు. పలుకుటయులేదు. ప్రకృతి స్వరూపమే రమ్యమైనది. మనోహరమైనది. మానవుని స్వభావము – యిందుకు నేరుగా విరుద్ధము. ఉద్వేగము, ద్వేషము మొదలగు పైశాచిక భావములతో మానవుడు ప్రకృతి ముఖముపై రక్తము చిలుకును. దేవుడొక్కడున్నాడట ! అతడీ సమస్త ప్రపంచమున కధికారియట ! అతని యధికార మప్రతిహతము. అయినచో నాతరి మానవులనందరినేక జాతిగా, యేకకుటుంబముగా జేసి యుండకూడదా? ఎవరో జ్ఞానులు, ఋషులు ప్రకృతిని జూచి సంతసింతురు. ఈ కోటానుకోటి మానవులు, ఆమె ముఖమును వికృతమొనర్తురు. పుష్పమునువలె నలిపి వేయుదురు. దేవుడొక్కడున్నది నిజమైనచో యీకోటికోటి మానవులు – దేవునికి విరోధులు. మహా పాపులు. షాఆలం మనస్సేదో కల్లోలిత మైనది. కొంచెము సేపు బయటనుండి మరల లోనికి వచ్చెను.

ద్వారపాలకుడు వచ్చెను.

"హుజూర్ ! అపరిచితురాలైన స్త్రీ యొక్కతె బయట చాలసేపటినుండి తమ దర్శనమునకు కాచికొని యున్నది. పేరడిగినచో బదులు చెప్పలేదు. ఎక్కడనుండి వచ్చినదో చెప్పలేదు. "అనాధను. యువరాజుతో భేటి చేయించుము. విపత్తునందున్నాను. అనుచున్నది."

"ఆమె హిందువా ? ముస్లిం స్త్రీయా ?"

"హుజూర్ ? స్పష్టముగా దెలియుటలేదు. మేలిముసుగున్నది. ముస్లిం స్త్రీయే గావచ్చును".

యువరాజాలోచింప మొదలిడెను. అర్ధరాత్రి అవకుంఠనవతి – ఆపత్తునందున్న దట ? అనాధయట ! ఆపదయేమైయుండును? గుప్తచారిణియగునా? ఏమైననేమి ? ఆమె మాటలు విందముగాక!"

"లోపలికి ప్రవేశపెట్టుము."

ఆమెలోనికి వచ్చినది. యువరాజునకు సలాముచేసెను. ఆమె కన్నీరు భూమిపై నేకధారగా పడుచుండెను.

"రమణీ ! నీ వెవ్వరవు? ఎందుకేడ్చు చున్నావు ? నీ పేరేమి ? నీకు వచ్చిన విపత్తేమి?"

"నా పేరు ముంతాజ్ ! నేనొక యనాధకన్యకను. యువరాజు నాశ్రయము వేడుటకై వచ్చినాను.

"ముంతాజ్ ! నీ శత్రులెవ్వరు?"

ఆ దుఃఖములోగూడ నామెనవ్వినది.

"నా శత్రువులా? లోకమంతయు నాకు శత్రువులే. భాగ్యహీనురాలికి శత్రువులు గాని వారెవ్వరు? నా కథ చెప్పినచో, ఉదారహృదయుడైన యువరాజుగూడ శత్రువు గావచ్చును." ఆమె గట్టిగా నేడ్వ మొదలు పెట్టెను.

"ముంతాజ్ ! ముందు నీ సమాచారమేమో చెప్పుము?

"యువరాజా ! నేను గోల్కొండ రాజవంశమునకు చెందినదానను. గడచిపోయిన కుతుబ్‌షాకు ముప్పురు బిడ్డలు. వారిలో మొదటి బిడ్డ నా తల్లి. ఆమెపేరు దిలార్. రెండవయామె ఢిల్లీపాదుషా కొడుకు....పత్ని. ఆమెను మీరు చూచియుండవచ్చును. లేక వినియుండవచ్చును. మూడవయామె కృషీదా. ఆమెకు బలాత్కారముగా దెచ్చికట్టిన మొగడే యిప్పుడు గోల్కొండ సుల్తాను. అబుల్‌హసన్‌షా మాతండ్రిగూడ యీ రాజ్యమునకు వజీర్‌గా నుండెను. సింహాసనము గూడ న్యాయముగా నాతండ్రికి రావలసియుండెను. పోయిన సుల్తానుల కోర్కెగూడనదే. కాని, స్వార్థపరులైన రాజబంధువులు పితూరికట్టి – హసన్‌షాకు పట్టము గట్టిరి. మా తండ్రిని కారాగృహములో నుంచినారు. అప్పటినుండి మాదన్నయే వజీర్. ఈ రాజ్యము హిందూ రాజ్యమైనది. సుల్తానుకిది పట్టనేపట్టదు. అతడు భోగాభిలాషి. మదిరా ప్రియుడు.

"అతనికి వేలకొలది వారాంగనలు. వారందరికి భవనములు. వారి సుఖములకై నిర్మితమైన స్వర్గమే హైదరాబాదు. ఒక్కదినమైనను సుల్తాను రాజకార్యములను బట్టించుకొన్న పాపమునకే బోలేదు. మాతల్లి యీ సుల్తానును నాశమొనర్చుటకు పట్టుబట్టెను. ఆమె ఢిల్లీ పాదుషాకు ఫిర్యాదు చేసికొన్నది. అది ఫలింపలేదు. ఆమె యెక్కడెక్కడనో తిరిగి కడకు గోదావరి మడుగులో బడి ప్రాణహత్య చేసికొన్నది. నే నప్పుడు శిశువును. కారాగృహమందున్న నా తండ్రికి ఆప్తులైనవారు దర్బారులో నెందరో యున్నారు. నన్నంతః పురమునందే యుంచినచో యెవరైన చంపవచ్చునని యనుమానించిన నా తండ్రి – నన్నచటనుండి దప్పించెను. గోప్యము నేనొక దాసి యింటిలో బెరిగితిని. దాని పేరు వహీదా. అది నన్ను ప్రేమతో సాకినది. నేనెదిగిన తరువాత అది అతి గోప్యముగా నా తండ్రి దర్శనము చేయించినది. నా తండ్రి హృదయద్రావకమైన నా జన్మకథను విన్పించి "తల్లీ ! నీ విక్కడ నుండవలదు. ఉన్నచో నిన్ను చంపుట నిజము. ఎక్కడికైనను తప్పించుకొని పొమ్మ"ని నన్ను బట్టుకొని యేడ్చెను. ఆనాడే నేను సుల్తానును – వజీరును నా చేతులార జంపెదనని ఘోర ప్రతిజ్ఞ యొనర్చి యున్నాను. మాతల్లి దండ్రులపై ఒట్టు పెట్టుకొన్నాను. ఒకటి రెండుసారులు వారిని జంపుటకు సాహస మొనర్చితిని. నా ప్రయత్నము కలిసిరాలేదు. చేయి మించిపోయినది. ఇప్పుడు మాదన్న చారులు నా వెంట బడినారు. వారి నుండి తప్పించుకొనుటకై నేను మీకడ జేరినాను.

మొన్నటి యుద్ధములో మాదన్న తలదరిగి యుందును. కాని వాడు తప్పించుకొనెను. వారి కెవ్వరికిని – యిప్పటివరకు నేను 'దిలారా బేగం' కూతురునని తెలియదు. వారి దృష్టిలో నేనొక నర్తకిని. నన్ను 'నజీరా' యని పిలుతురు. ఇప్పుడు గోల్కొండ సైన్యములో కల్లోలము రేగినది. ముసల్మాను సైనికులు – సైన్యములో నుండి తప్పించుకొని పోవుటకు యేర్పాటొనర్చికొన్నారు. కొత్త సైన్యమును జేర్చుకొనుటకు మాదన్న కవకాశము గావలెను. అందుకై వాడు మీతో సంధి చేసుకొనుటకు కోరుచున్నాడు. అది నిజమైన సంధికాదు. కాలహరణమున కొకయెత్తు. 'ఇబ్రహీం' సంధిదూతగా రాబోవుచున్నాడు. మీరు దాని కొప్పుకొనగూడదు. మాదన్నతల నేలపై బడువరకు యుద్ధము నిలుపరాదు. ఈ సుల్తాను బ్రతుకరాదు. ఈ విషయము ప్రార్థించుటకే నేను వచ్చితిని".

"ముంతాజ్ ! నేను నీ కాశ్రయ మిచ్చెదను. మీ తండ్రిని కారాగృహము నుండి విడిపింతును. పాదుషా సమ్మతించినచో – మీ తండ్రికే గోల్కొండ సింహాసనము చెందును. నిన్ను షోలాపురమందలి యంతఃపురమున కంపుదును. అక్కడ మహారాణి నూరున్నీసా దగ్గర నీవు క్షేమముగ నుండవచ్చును".

"ఖామంద్ ! నన్ను మీరు 'నజీరా' యని పిలువవలెను. ఈ శిబిరమున నేనొక నర్తకి యనియే ప్రసిద్ధి గావలెను. మాతండ్రికి చెరసాలనుండి విడుదలయగు వరకు నా నిజమైన పేరెవ్వరికిని దెలియరాదు."

యువరాజు చిరునవ్వెను.

"ముంతాజ్ ! నీ కథనింకను పూర్తిగా చెప్పలేదు. నీవు నర్తకి నెట్లైతివి? 'నజీరా' యని పేరు బెట్టిన దెవ్వరు? ఇన్ని దినము లెక్కడ నుంటివి!"

"యువరాజా ! హైదరాబాదులో నాకొక వేశ్య యాశ్రయ మొసగినది. నాకు మొదటి నుండియు నృత్యముపై ప్రీతి. ఆ వేశ్య ప్రసిద్ధయైన నర్తకి. ఆమె నాకు తన విద్య నేర్పినది. ఒకనాడు నన్ను బలాత్కరించి – ఆమె సుల్తాను దర్బారున నాట్యము చేయించినది. వారు నన్ను గుర్తింపలేదు. సుల్తాను నన్నుజూచి యెఱుగడు. వాని దర్బారులో – యిప్పుడుగూడ నా నృత్యమునకు బ్రసిద్ధి యున్నది. ఇప్పుడు వజీరు మాదన్న వెదకించు చున్నది – ఆ నర్తకి 'నజీరా'నే"

"ముంతాజ్ ! నీవే ఆ ముంతాజువనుటకు సాక్ష్యమేమి?"

"ఉన్నది. నా తండ్రి నన్ను సులభముగా గుర్తించును. నా వీపులో గులాబీ పూవంత నల్లని పుట్టుమచ్చ యున్నది. అది మాతల్లికిగూడ నుండెనట ! అప్పుడది యదృష్టపు మచ్చ. నేను మహారాణినౌదునని – యెవరో ఆ మచ్చచూచి అన్నారట. నాపాలికది దురదృష్టపు మచ్చయైనది. హైదరాబాదులోనున్న నన్ను పెంచిన వేశ్యకు కూడ ఆ మచ్చ గుఱుతు తెలియును. మాతండ్రి, ఆ వేశ్య వీరిద్దరేనన్ను గుర్తింపగలరు. నన్ను సాకిన దాదికి కూడ యీ విషయము తెలియును.

"ముంతాజ్ ! నీ వాక్యములను సందేహించుచున్నాననుకొనకుము. ఇట్టి విషయములలో ఖరారుగా నుండుట మంచిది. నీవే ఆమె వైనచో గోల్కొండ సింహాసనమున నొక అధికారిణి వయ్యెదవు."

ముంతాజ్ గంభీరు రాలైనది. ఆమె అగ్నిశిఖవలె నిలుచుండెను. కన్నులు నిప్పులు గ్రక్కుచున్నటులున్నవి.

"యువరాజా ! నేనా ఆశతో చెప్పుటలేదు. ఆ కోర్కెలు మాతల్లి మరణముతోనే బలసమాధియై పోయినవి. నాకిప్పుడు గావలసినది పగతీర్చుకొనుట. ఈ దేహముననున్నది రక్తము కాదు. ప్రతీకారాగ్ని"

"మంచిదే ముంతాజ్ ! నీవు కన్యకవు. నర్తకివి. ఈ అవగుంఠన మేల ధరించితివి?"

"నా మొఖమెవ్వరికి కనపడగూడదని. నర్తన మొనర్చునప్పుడు మాత్రమే నేనీ ముసుగును దీసివేయుదును. అప్పుడు నన్ననేకులు జూచియుందురు. కాని – వారెవ్వరును నన్ను గుర్తుపట్టి యుండలేరు. అదే నా ధైర్యము. కాని యిప్పటికిని మేలిముసుగు వీడను."

యువరాజు మందస్మిత మొనర్చినాడు.

"నర్తకీ ! ఒక్కసారి నీ యవగుంఠనమునుదీయుము. నీ యందమును గన్నులార గాంచెదను. "ముంతాజ్ ముసుగు దొలగించినది. యువరాజు దిగ్భ్రాంతుడై చూచినాడు. ఆ సౌందర్య మమోఘము. ఆమె మేలిముసుగు ధరించి యుండుటయే మంచిది. ఆ సౌందర్య మెట్టివానినైనను పిచ్చివానిని చేసివేయును.

"సుందరీ ! నీవు నిజముగా సౌందర్యవతివి. ఈయంద మపాయములలోనికి తప్పక దించును. నర్తకిగా బ్రతుకుట చాల కష్టము. పురుషుల బారినుండి తప్పించుకొనుటయు కష్టము. నూరున్నిసాగూడ నీయందమునకుదాను సిగ్గుపడును. ముంతాజ్ ! ఇప్పుడు రాత్రియైనది. ఈ చీకటిలో నెక్కడ బోయెదవు? మా శిబిరమందే యుంతుము. నీ కేయపాయమును రాదు."

షా ఆలం ద్వారపాలకుని పిలిచెను.

"ఇదిగో ! ఈ యవకుంఠనవతిని, మా ప్రక్కనున్న కుటీరములో నుంచుము. ఈమెను సకల మర్యాదలతో జూడవలెనని సేవకులతో జెప్పుము."

ఆమె ద్వారపాలకునితో వెడలిపోయినది.

మరునాటి ప్రాతఃకాలమున ఇబ్రహీం యువరాజును గలసికొనుటకు వచ్చినాడని అధికారులెరింగించిరి. షా ఆలం యిబ్రహీంను సమర్యాదముగ రప్పించుకొనెను. సేనాధిపతి ఇబ్రహీం సలాము చేసి కూర్చున్నాడు.

"జహాపనా ! నన్ను మాదన్న ధన్నాయకులంపినారు. గోల్కొండ దర్బారు సంధిని వేడుచున్నది. సుల్తాను ముసల్మానులు; గోల్కొండ గూడ చాల పురాతన ముసల్మాను రాజ్యము. మాపై ఢిల్లీ పాదుషా యెత్తి వచ్చుటకు కారణములేదు. మేము వారికేయపకారమును చేయలేదు. యుద్ధమునకు నెంతయో జననష్టమైనది. మీరు యుద్ధమును నిలపి సుల్తానుపై దయచూపవలెను"

"సేనాపతీ ! మీ మాటలన్నియునిజమే. కాని నిన్ను బంపినవాడు మాదన్న దన్నాయకుడు. ఇప్పుడాతనికి సంధి యేలకావలసి వచ్చినది?"

"యువరాజా ! మేమై సంధికి వచ్చినాము. యుద్ధంలో మాకుగాని మీకుగాని యిప్పటికి జయమైనది లేదు. వృధా ధన జన నష్టమునకు మా వారు సమ్మతించుటలేదు. సుల్తాను ఢిల్లీకి కప్పము కట్టుట కంగీకరించియే యున్నారు. మూడేండ్ల నుండి మేము మీకు కప్పము కట్టలేదు. అది మాతప్పే. కాని మాకు పన్నులే వసూలు కాలేదు. వానలు నిలిచిపోయెను. జనులు నానా యాతనలు బడుచున్నారు. అందుచే యీ మూడు వర్షములు మీ కప్పమును చెల్లింపలేక పోయినాము. మా తప్పు క్షమింపవలెను. తప్పుకానికల నిచ్చుకొందుము. ఈ యుద్ధముకైన ఖర్చులలో యెంత యివ్వమన్న నంత యిత్తుము."

"సేనాధిపతీ ! మీ షరతులు బాగుగనే యున్నవి. కాని మేమింకను హైదరాబాదును వశపరచుకొనలేదు. వశముచేసుకొనవలెను. గోల్కొండ కోట అభేద్యమైనదని విని యున్నాము. దానిని గెలిచి అక్కడ మా గుడారు వేయవలెను. అంతకుముందే మేము సంధి కొప్పుకున్నచో, పాదుషా దగ్గర మా పరువు నిలువదు. నీకు పాదుషా స్వభావము తెలిసినట్లులేదు. ఆయన కోపముతో నన్నే దండించినను ఆశ్చర్యపడవలసినది లేదు."

"యువరాజా ! మేమేవచ్చి సంధి వేడుకొనుచున్నప్పుడు మీరు యుద్ధములో గెల్చిననేమి గెలువకున్ననేమి ? ఈ 'గోల్కొండలో' నేను మిమ్ము గలసికొన్నాను. ఇంతవరకు మీరు గెలిచినట్లే కదా ! నేను షోలాపురమునకు వచ్చి సంధి మాటలాడి యున్నచో మీ యభిప్రాయములు నిజమై యుండెడివి."

"యిబ్రహీం, ఇవన్నియు ప్రయోజనములేని మాటలు మే మీ యద్ధమున మొదట గెలువవలెను. ఆ తరువాతనే సంధినిగూర్చి యాలోచింతుము. లేదా మాదన్న ధన్నాయకుడు ఢిల్లీకిపోయి పాదుషా శరణువేడవలెను. గోల్కొండ ముసల్మాను రాజ్యమనుట అసత్యము. ఇది మాదన్న రాజ్యము. సుల్తాన్ విలాసభూమి. హిందూ చక్రవర్తి యని చెప్పికొనుచున్న సాంభాజీ కథీనమైన రాజ్యము. కనుక సంధి మాటలు నిష్ప్రయోజనములు. మీకు సంధియేల కావలసి వచ్చినదో నేనెరుగుదును. ఇదిగో ! ఒక్కనెల మీకు గడువిచ్చుచున్నాను. అంతలో సైన్యములను సేకరించికొని రండు. రణరంగమున వీర పురుషులవలె బోరుదము. ఈ ముసుగులో మాటలు మంచివి కావు."

ఇబ్రహీం యింకేమియు మాటాడలేదు. అతడు పోవుటకు దయారయ్యెను. షా ఆలం అన్నాడు.

"ఇబ్రహీం ! నీవు గొప్ప వీరుడవని విన్నాము. ఏనాటికైనను నీకిచ్చట ఆశ్రయము గావలెనన్నచో తప్పక దొరకును"

"జహాపనా! అది మీ యౌదార్యము. షా ఆలం గొప్ప ఉదారుడని దక్షిణ దేశము నందంతయు ప్రసిద్ధియున్నది. మీ సేవ చేయుటకు నాకదృష్టముండవలెను. ఖామంద్ నన్ను క్షమింపవలెను. ఆ యదృష్టము నాకులేదు. ఇంతలో జరుగబోవు యుద్ధమున నేను బ్రతుకుదునన్న ఆశగూడ నాకు లేదు. వీరమరణము పురుషులకు భూషణమన్న పెద్దలమాటవిని యున్నాను. రాబోవు యుద్ధరంగములో మీరు నా సాహసమును చూచి మెచ్చినచో, అదేనాకు పదివేలు."

ఇబ్రహీం, షా ఆలం సన్నిధానమునుండి వెడలిపోయెను. అతడు తమ శిబిరముల మార్గము బట్టినాడు. హయారూఢుడై యేమో యోచించుకొనుచు పోవుచుండెను.

"యువరాజు గొప్పబుద్ధి మంతుడు. వీర పురుషుడు. వీరుడే వీరుని గుర్తించును.... ఈ సంధి ప్రస్తావన యాతనికి ముందే తెలిసియుండును. తెలిసినట్లే మాటాడినారు.... ఒకనెల గడువిచ్చినారు. అదియు మంచిదే.... నన్ను దన సైన్యములోనికి రమ్మన్నాడు. నా దౌర్బల్యమును పరీక్షించుటకట్లని యుండవచ్చును. యుద్ధమే జరుగును. నా సాహసమప్పుడతనికి జూపింతును... ఎట్లైనను షా ఆలంను చెరబట్టితిమా... మా అదృష్టమే అదృష్టము. వృద్ధపాదుషా మల మల మాడి చచ్చును." ఇబ్రహీం పోవుచుండెను.

వెనుకనుండి హయ ఖురపుట ధ్వని వినిపించినది. ఆ శబ్దము రాగ రాగ దగ్గరికి వచ్చినది.

ఎవరది ! అతడు తల మలపి చూచినాడు. షా ఆలం మరియొక యెత్తు వేయుచున్నాడా యేమి ! లేక యతని గుప్తచారులే వెంబడించు చున్నారా? వెనుక వచ్చుచున్న గుఱ్ఱము వేగముగా దన్నుదాటి పోయెను. అది మరల వెనుదిరిగి వచ్చెను. ఆ గుఱ్ఱముపై నొకస్త్రీ వ్యక్తి. ఇబ్రహీం ఆశ్చర్యచకితుడైనాడు. ఆమె కత్తి వీచుచునే పలికింది.

"సేనాపతీ ! నిలువుము, నీవు భయపడవలసినది లేదు. నేను నీ కొక రహస్య మెరింగింతును"

ఇబ్రహీంకూడ – ఒరనుండి కత్తి దీసినాడు. కాని యా స్త్రీని జూచి యాతనిచేయి వెన్కకు తగ్గినది. నీవెవ్వతెవు? ఎక్కడనుండి వచ్చుచున్నావు? నన్నెక్కడ జూచినావు?

"నేను హైదరాబాదులో నున్న నర్తకి గులాబ్ జాన్ బిడ్డను. నా పేరు వజీరా. గుఱ్ఱమునుండి దిగిరమ్ము. ఆ చెట్టు క్రింద మాటాడు కొందుము. కొన్ని రహస్యములు లున్నవి."

ఇబ్రహీం మంత్రముగ్ధునివలె హయమును దిగి చెట్టు క్రిందికి బోయెను. వజీరా పడి పడి నవ్వినది. ఆ నవ్వెందుకో యాతని కర్థముగాలేదు.

"సేనాధిపతీ ! నీ సంధి యేమైనది?"

ఇబ్రహీంకు కోపము వచ్చినది. దాని హాస్య మాతని గలచెను.

"ఆ గొడవ నీ కెందుకు? నీవు నన్ను బిలచిన దెందుకో జెప్పుము."

"ఇబ్రహీం ! నీ కింత కోపమెందుకయ్యా ! ఇంత కోపముతో సంధికెట్లు వచ్చితివి?. నీకును యువరాజునకును జరిగిన సంభాషణ మంతయు విన్నాను. యువరాజు సంధి కొప్పుకోరు. ఒక నెల గడువున కంగీకరించినారు. అది యాతని ఔదార్యము. మీకు మాత్రము సంధి గావలయునా యేమి? అవకాశము గావలసి యుండెను. అది సిద్ధించినది. ఇబ్రహీం నఖశిఖ పర్యంతము గదలుచున్నాడు. పురుషుడైనచో వానిని జంపియుండును. అతనికేమి జేయుటకును దోచుటలేదు. "సైన్యములోని ముసల్మాను బలములు యుద్ధమును విడిచిపోయినవి. ఆ భేదములను సృష్టించినది మీ సుల్తానే. ఆ విషయము మీకు దెలియదు. అతనికి రాజ్యము గాబట్టలేదు. మదిర–మదిరేక్షణలు సుల్తాను కోర్కె యంతే. పాదుషాతో సంధిచేసికొని సుల్తాను తన సుఖమును నిలిపికొనును. మిమ్మందరను రణరంగమునకు బలియిచ్చును లేక తానే మీ తలను నరికించి పాదుషాకు కాన్కగానంపును."

ఇబ్రహీం హృదయము కదలాడ నారంభించెను. అతనన్నాడు.

"రమణీ ? ఈ విషయము నెట్లైననుండనీ ! నీ వొక విచిత్రవ్యక్తివి. నీ వాడిన మాటలు తప్పక జ్ఞాపకముంచికొందును. ఇంతకును నీవు పాదుషా గుప్తచారిణివి కావా? నిజము చెప్పుము?" అతడామె కన్నులలోనికి తీక్ష్ణముగ జూచెను.

"సేనాపతీ ! నేనెవరైన నీ కేమి? నన్ను గుప్తచారిణి యనుకొనుము. లేక పిశాచి యనుకొనుము. నీకు హితము చెప్పుచున్నాను. నీవా మాదన్న ధన్నాయకుని వదలిపెట్టి యువరాజు సైన్యములో జేరుము. సుఖపడెదవు."

ఇబ్రహీం "ఛీ" అని గట్టిగా నరచెను. "సుందరీ ! నీవు పిశాచివి కావు. నీ సౌందర్యము దేవకన్యకల వంటిది. నీ హృదయము పైశాచికము. నీవు దేవకన్యవుకావు పిశాచినివిగావు విష కన్యకవు. అతడు గుఱ్ఱముపై నెక్కి యొక్క చబుకు చరచెను. ముంతాజ్ తన గుఱ్ఱము నెక్కి "ఇబ్రహీం ! నా మాటలు జ్ఞాపకముంచుకో ! మరచిపోవలదు" అని యరచుచు యువరాజు శిబిరమువైపు బయనించినది.

5

ఇబ్రహీం మాదన్న ధన్నాయకుని కడకు వచ్చెను. "యువరాజు సంధి కొప్పుకొనలేదు. కాని కొన్ని దినములు యుద్ధమును నిలుపుటకు మాత్ర మంగీకరించినాడు."

యుద్ధము నిలుపుటలోని రహస్యమేమో !

"ఏమియులేదు. ఆ నిలుపుట షా ఆలం యొక్క యౌదార్యము మాత్రమే".

మాదన్న ముఖము పరాజితుని ముఖమువలె నైనది.

"యువరాజు యుద్ధమునకు వచ్చినాడు. అతడౌదార్యమును చూపెను. కాని దానిని మనము వాడుకొనుట వీరలక్షణముకాదు."

"మీరు దొడ్డవారు. మీకిష్టమైనచో యుద్ధమును ముందుకు సాగింపవచ్చును. నేను యే విషయమును యువరాజుతో నిశ్చయముగా చెప్పలేదు. సంధి కావలసినచో పాదుషా దగ్గరకే బోవలెనని చెప్పినాడు. నేను వెనుదిరిగి వత్తమనుకొన్నాను. ఇంతలో నాతడే ఒక మాసము గడువిచ్చినాను. యుద్ధసన్నద్ధులై రండని హెచ్చరించెను".

మాదన్న యొక్క క్షణ మూరకుండెను.

"ఇబ్రహీం ! మన మిప్పుడేమి చేయవచ్చునని నీ యూహ?"

"ఖామంద్ ! నాకు మూడు దినములవకాశమిందు. ఈ మూడు దినములలో నేను సైనికులలోని కలతలను చక్కబెట్టుటకు యత్నింతును. సరిపోయెనా మన యదృష్టమే యదృష్టము. మొగలు సైన్యములో గూడ నంతయుత్సాహమున్నట్లు గన్పింపదు. వారి శిబిర విషయములు కొన్ని కనుగొని వచ్చినాను. ఇది ముసల్మానీ రాజ్యమని మొగలులకు స్పష్టముగా తెలియును. ముసల్మానులపై యుద్ధమేమియుని వారినిరుత్సాహము. యువరాజు నభిప్రాయముగూడ నంతే. కాని పాదుషాది కఠోరమైన యాజ్ఞ. దానినెదిరించుశక్తి యెవ్వరికిని లేదు."

ఇబ్రహీం మూడు దినములు సైనికులలో నుత్సాహము పురికొల్పుటకు శక్తివంచన లేక యత్నించినాడు. 'షా ఆలం' సేనాధిపతులకు జాగ్రత్తలు చెప్పి షోలాపురమునకు ప్రయాణ మయ్యెను. తన వెంటనే ముంతాజును తీసికొనిపోవు నేర్పాటు చేసినాడు. షా ఆలం ఆజ్ఞమేరకు ముంతాజునకొక మేనా సిద్ధపరుపబడెను. ప్రయాణసమయమున షా ఆలం ముంతాజును తన శిబిరమునకు బిలిపించు కొన్నాడు.

"ముంతాజ్ ! నేను షోలాపురమునకు పోవుచున్నాను. నీవుగూడ వచ్చినచో నూరున్నీసాతో బరిచయము చేయింతును."

"యువరాజా ! నీ వెంట రావలెనను కుతూహలముగూడ నాకున్నది. కాని నేను మీ వెంట గుఱ్ఱముపైననే బ్రయాణింతును. నాకు మేనా యావశ్యకము లేదు" యువరాజంగీక రించెను. ఆమెకు గూడ నొక గుఱ్ఱము సిద్ధపరుప బడినది. మార్గమధ్యమున వారు హైదరాబాదు సుల్తానును గూర్చి యెన్ని విషయములో మాటాడుకున్నారు. ముంతాజెన్నియో చిత్రములైన

కథలు చెప్పెను. "మాదన్న చాలా గట్టివాడు. వానిపై కొందరు హిందువులకు కూడ ద్వేషమున్నది. చెప్పిన మాటను నిలుపుకొను మనుష్యత్వము వానికిలేదు. వట్టి నీతిహీనుడు" అని యన్నది.

షోలాపురము సమీపించినది. షా ఆలం అంతఃపురమునకు వచ్చెను. నూరున్నీసా వేయికన్నులతో నాతని కొరకు గాచికొన్నది. షా ఆలం వెంటనే ముంతాజ్ వెళ్ళినది. ఆమె యవకుంఠనవతి.

ఈ సారి మీ వెంట మరియెవ్వరినో కొత్తవారిని దీసికొని వచ్చినారు. నూరున్నీసా మందహాస మొనర్చెను.

"అవును ! ఈమెయొక అనాధ. ఈమెను నీకు కాన్కగా తెచ్చినాను." చిరునవ్వు నవ్వుచునే యాతడనెను.

"ముంతాజ్ ! నీ మేలిముసుగు నొకసారి తొలగింపుము ఈ మహారాణి నిన్ను చూచునుగాక"

ముంతాజ్ నూరున్నీసాకు సలామొనర్చెను.

"రా చెల్లెలా ! నీ పేరేమిటి? ముంతాజా?" నూరున్నీసా యామెను దగ్గర కూర్చుండ బెట్టికొనెను.

షా ఆలం యుద్ధ సమాచారమును నూరున్నీసాకు సంగ్రహముగా విన్పించినాడు.

"ఉన్నీసా ! ఈ ముంతాజ్ యుద్ధవార్తలను నీకింకను విపులముగా వర్ణించును. గోల్కొండ విషయమై యామె కెన్నో కథలు తెలియును అవి అన్నియు నీవు వినవలెను. యుద్ధము ముగియువరకు నీ వీమెకాశ్రయ మొసగుము."

నూరున్నీసా మనస్సునందే ఈ స్త్రీ యెంత యందకత్తె యనుకొన్నది.

"యువరాజా ! ఈమెకు గోల్కొండ విషయములన్నియు యెట్లు తెలియును? ఈమె ఎవరు? మీ చెంతకెట్లు వచ్చినది? ఈమె విషయము మీ రేమియు చెప్పలేదు."

"ఈమె కుతుబ్‌షాహీ యింటికి చెందినది. ఇంక ముసుగెందుకు? గోల్కొండ సింహాసనము నకు యీమె నిజమైన అధికారిణి. ఆమె తన వృత్తాంతమును యెన్నడో యొకనాడు నీ కెరింగించును. ఇప్పుడు వద్దులెమ్ము. ఆమె జీవితమొక దురంతగాథ. మాల్కొండకు వచ్చి యామె నన్ను శరణు వేడెను. నీకు జతగా నుండునని తీసికొని వచ్చితిని. సంగీతమునందును, నృత్యమునందును ప్రవీణురాలు. కులమునందును సుల్తాను జాతికి చెందినది. నీకు చక్కనిజత. నీవాశ్రయ మిత్తువుకదా !"

"ఇందు సందేహమేమి? తప్పక యిత్తును. మీరాశ్రయ మొసగినపుడు నేనొసగుటలో సందేహ మేముండును? నేనట్లు చేయకున్నచో నీమెను మెడకు కట్టుకొనియే మీరు యుద్ధము

చేయవలసివచ్చును. అది మీకు కష్టము గదా !"

ముగ్గురును పగలబడి నవ్వినారు. నూరున్నీసా మరల నన్నది.

"ముంతాజ్ ! నీవు నాతో నుందువా ! లేక యువరాజుతోనా ?"

ఆ మాటయు చిరునవ్వునవ్వుచునే పలికినది. "మహారాణీ ! మిమ్ము గురించి నేనింతకుముందే విన్నాను. మీ విద్యావైఖరిని, రూపురేఖలు పలువురు పలురీతుల నాతో ప్రశంసించి యున్నారు. వానిని నేనిప్పుడు ప్రత్యక్షముగనే చూచుచున్నాను. మీ యాశ్రయము పొందవలెనని నేనింతకుముందే యెన్నిసారులో గోరుకొని యుంటిని. అది యీ నాటికి సిద్ధించినది. నా కోర్కెకు తగినట్లే యువరాజులుగూడ నన్ను నూరున్నీసా కడ జేర్చెదననిరి. నా కోర్కె తానే లభ్యమైనది."

యువరాజు అక్కడనుండి తన మహలుకు బయలు దేరినాడు. అతనిని సాగనంపుటకు నూరున్నీసా వాకిటివరకు వచ్చినది. ఆమె యాతని చెవిలో నేమియో చెప్పెను. ఇర్వురును ఫక్కుమని నవ్వుకొనిరి.

"ఉన్నీసా ! నీ హాస్యమునకు హద్దుపద్దు లేకపోయినది". షా ఆలం నవ్వుచూ అనెను.

అతడు తన భవనమునకు వెళ్ళిపోయినాడు.

గోల్కొండ సైన్యశిబిరము హైదరాబాదుకు సమీపముననే యుండెను. సుల్తాను హైదరాబాదులోనే ఉన్నాడు. మాదన్న సుల్తానుకు సంగతులన్నియు విన్నవించెను. సుల్తానన్నాడు.

"మాదన్నగారూ ! ఈ యుద్ధములో మనకేమి ఉన్నది. ఈ మొగలుల కెప్పుడును మనపై నెత్తివచ్చుట అలవాటైనది. వారిని జయించుటకు మనసాధ్యమా? ఏదో ఉపాయముతో సంధి చేసుకొనినచో మంచిదేమో !"

"జహాపనా ! సంధికెంతయో ప్రయత్నించినాను. వారుదాని కంగీకరింపలేదు. వారి మనస్సులో నెన్నియాశలున్నవో మనకు తెలియదు. నేను హిందువునను ఒక ద్వేషముకూడ వారికున్నది."

సుల్తాను నవ్వినాడు.

"మీరు హిందువులైననేమి? పాదుషాగారి యాస్థానములో నెందరు రాజపుత్రులున్నారు. వారిలో నెందరో గొప్ప పదవులయందును గలరు. అది ఒక పెద్దకారణమై యుండదు. బీజాపురముపైకి గూడ 'షా అజం' యెత్తి వెళ్ళినాడను వార్తలు వచ్చినవి. దక్కనునందున్న రెండు ముస్లిం రాజ్యములపైకి పాదుషా కత్తిగట్టుట చిత్రముగనే యున్నది. వారి కొలువులో నెందరో ముస్లింమౌల్వీలున్నారు. ఖాతీలున్నారు. వారందరిది యధర్మమని చెప్పిరో లేదో?"

“జహాపనా ! ఔరంగజేబు ఖాజీలను ముల్లాలను లెక్క పెట్టెడువాడుకాడు. తానుబట్టిన కుందేటికి మూడేకాళ్ళనెడివాడు. హఠమారి. ఆతనికి మనపై కంటెను సాంభాజీపై నెక్కువ ద్వేషమున్నది. ఆతనికి మనమాశ్రయ మిచ్చినామని పాదుషాకొక భ్రాంతి. ఇది ఒక క్లిష్టసమస్య. ఔరంగజేబు చాల బుద్ధిమంతుడు. అతనికి సాంభాజీ సైన్యమెంత పెద్దది. ధనసంపత్తి యెంతయున్నది అను విషయములు తెలియకపోవుట చాల చిత్రముగా నున్నది. పాదుషా సాంభాజీ మీదనున్న ద్వేషమును మనపై దీర్చికొనుచున్నాడు.

“మాదన్నా ! పాదుషాకు మనమే ఒక జాబు వ్రాయుదము. సాంభాజీతో నతడు పోరుటలో మనదేమియు నాక్షేపణలేదని తెలుపుదము. పాదుషా సాంభాజీని గెలిచినచో మనకుగూడ సంతోషమేనని వ్రాయుదము.”

“దానినుండి యెక్కువ ప్రయోజన ముండదను కొందును. అప్పుడు సాంభాజీతోడి యుద్ధములో మన సైన్యములను తనకు సహాయముగా పంపవలెనని పాదుషా కోరును. పది సంవత్సరములు యుద్ధము చేసినను పాదుషా సాంభాజీని జయింపలేడు. పట్టుకొనలేడు. సాంభాజీ చాల చిత్రమైన మనుష్యుడు. అతడెక్కడున్నాడని తెలిసికొనుటయే కష్టము. ఈ దక్కనులో పల్లెపల్లెలోను ఆతని సైన్యము లున్నవి. అతడంతఃపురమున నుండుటయే లేదు. ఎప్పుడును దేశముపై దిరుగు చుండును. అంతఃపురములో నొక్క బంగారునాణ్యము గూడ నుండదు. ఇక నతని జయించుటెట్లు? అతని సైన్యములను బట్టుకొనుటెట్లు? ఈ విషయముగూడ ఔరంగజేబునకు తెలియును. ఈ గోల్కొండను గెలిచి యిక్కడ తన సైన్యము లుంచవలెనని పాదుషాగారి యాశ. అప్పుడు సాంభాజీని సులభముగా జయింపవచ్చునని యొకయూహ.”

“మరి వారు సంధి కొప్పుకొనకున్నచో యుద్ధ మావశ్యక మగును. అప్పుడు మీ యాలోచనమేమి? ఏమున్నది ! మీరు గోల్కొండ కోటలో జేరవచ్చును. అది సుభద్రమైన కోట. దానిని సమీపించుటకుగూడ మొగలు సైన్యమునకు తాహతులేదు. నేను యువరాజు నెదిరించి పోరెదను ఆతనిని అడ్డదారులలో చిక్కించుకొని చెఱబట్టి మీ కప్పగింతును. అప్పుడు సంధి సులభమగును.” సుల్తానందుకు సమ్మతించినాడు. తాను పరివార సమేతుడై గోల్కొండ జేరెను.

మాదన్న శిబిరమునకు వచ్చినాడు. సైన్యములు సిద్ధ మొనర్చికొని ‘మాల్కొండ’వైపు దరలెను. మాదన్న వచ్చుచున్నాడన్న సంగతి మొగలు సైన్యములకు దెలిసినది. సేనాధిపతులు సైన్యముల కాజ్ఞ యిచ్చిరి. మొగల్ సైన్యములు మూడు భాగములై ముందునకు గదలినవి. షోలాపురములోని యువరాజునకు యుద్ధము సంగతి దెలిసెను. అతడు మాల్కొండకు బ్రయాణమైనాడు. నూరున్నీసాతో చెప్పి వత్తమని యంతఃపురమునకు బోయినాడు. ముంతాజ్, నూరున్నీసా అప్పటికి వీడరాని చెలికత్తెలైరి. ముంతాజ్ తన కథ నంతయు నూరున్నీసాకు

వినిపించెను. ఆనాడు యువరాజు తన యంతఃపురమునకు వచ్చునని ఉన్నీసాకు దెలియును. ఆమె తానే స్వయముగా ముంతాజు నలంకరించినది. వెలగల పీతాంబరమును గట్టించినది. వెంద్రుకలను తాను స్వయముగా ముడివేసి కేశాలంకారముగ ముత్యాలకుచ్చు గట్టినది. సీమంతముపై నొక రత్న పదకము ధగధగ మెఱయుచున్నది. చెవులలో నీలమణులు తాపిన లోలకులు. ఎదపై చక్కని ముత్యాలహారము. వ్రేళ్ళకు నవరత్న ఖచితములైన యుంగరములు వానిలో నొకటి పచ్చలు దాపిన పెద్ద యుంగరము. యువరాజు ముంతాజును జూచి స్తబ్ధుడై నిలచెను.

"ఉన్నీసా ! ఈ యువతి నింతగా నలంకార మొనరించినావెందుకు?"

"మీరు గోల్కొండకు బోవుచున్నారు. ఈమెకు గోల్కొండ గద్దెపై పట్టము గట్టించుటకు మీరు వాగ్దాన మిచ్చితిరి. గోల్కొండరాణి గాబోవు నీమెకు రాణికి తగిన యలంకారము లొనర్చి మీ వెంట బంపుచున్నాను. మీరు బిలచికొని పోవలెను".

"ఉన్నీసా ? నేను బోవుచున్నది యుద్ధభూమికి; అచ్చట నెటు చూచినను శత్రుసైన్యములు. మాదన్న సేనాని సామాన్యుడని భావింపకుము. మహావీరుడు. అట్టి సన్నివేశమున నీమెను వెంటగొని పోవుట అపాయకరమేగాదు. హాస్యాస్పదముకూడ."

"యువరాజా ! మిమ్ములను హాస్యమాడు ధైర్యమెవరికున్నది. మీకును, సుల్తానునకును యుద్ధమగునన్న విశ్వాసము నాకులేదు. అంతటి ధైర్యము వారి కెక్కడినుండి వచ్చును? మీకైనను ముసల్మాను రాజ్యముతో బోరుటకు మనసెట్లు వచ్చును? ఈ పరిస్థితిలో మీకెట్లో సంధియగునని నా విశ్వాసము. దీనికింత అట్టహాస మెందుకో తెలియుట లేదు."

"ఉన్నీసా ! గోల్కొండ సేనాధిపతి ఇబ్రహీం సంధికై వచ్చియుండెను. నేనే తిరస్కరించి పంపితిని. కనుక సంధియగుట కవకాశము లేదు."

"మీ రెందుకు సంధి నిరాకరించితిరి?"

"సంధి చేసికొననని ముంతాజుకు మాట యిచ్చినాను. అప్పుడే గోల్కొండ సింహాసనము నామె కొసగుదుననియు మాట యిచ్చితిని."

నూరున్నీసా నవ్వెను.

"యువరాజా ! ఇచ్చినమాటను నెరవేర్చుము. నా చెల్లెలు సుల్తానే యైనచో మీకు తగిన బహుమాన మొసగుదును"

"నాకు బహుమానమా ? అదేమిటి?"

"ఈ గోల్కొండకు చెందిన అపురూప సుందరిని నీకు బహుమానముగా నిత్తును"

ముంతాజ్ తలవంచుకొని సిగ్గుతో అంతఃపురములోనికి బరువెత్తెను.

"ఉన్నీసా ! నీవు ప్రపంచమునకే రత్నము. నీ చిరునగవే నాకొక పురస్కారము" షా ఆలం నూరున్నీసాను ప్రేమార్ద్రముగ జూచి ముందుకు బయలుదేరెను.

మాల్కొండ రణక్షేత్రమున ఘోరమైన యుద్ధము జరుగుచున్నది. జయాపజయములు నిర్ణయింప శక్యముగాకున్నది. యువరాజు సేనాపతిని తన శిబిరమునకు బిలిపించి కొన్నాడు.

“యుద్ధమెట్లున్నది?”

“యువరాజా ! యుద్ధమున రెండు దినములు గడిచిపోయినవి. ఇది మూడవది. ఒకవైపు మాదన్న మరియొక వైపు ఇబ్రహీం పెద్దపులులవలె బోరుచున్నారు. ఇర్వురును యుద్ధవిద్యా పారంగతులు. ఆ ఇబ్రహీం యద్ధ విద్యలో మాదన్నకు శిష్యుడని విన్నాము. వాని పరాక్రమ మసామాన్యమైనది. కాని మొగలు వీరులను మించువారు హిందూస్థానములో నింతవరకు జన్మింపలేదు. మనకు జయముసిద్ధము. నేడే రేపో మాదన్న సైన్యములు పలాయనము చిత్తగించను. హైదరాబాదు మనచేత జిక్కును”.

షా ఆలం గజారూఢుడై రణక్షేత్రమునకు వచ్చెను. ఘోరయుద్ధము సాగుచున్నది. ఉభయసేనా వీరుల పరాక్రమము మధ్యాహ్న సూర్యుని కర ప్రసారములకంటె తీక్షణముగానుండినది. రణక్షేత్రము రక్తాంబరమును ధరించెను. ఇంతలో మొగల్ సైన్యములలో భేరులు మ్రోగినవి. అవి జయ సూచకములు. యువరాజు గజము పై నుండియే రణ క్షేత్రమును దిలకించుచున్నాడు. దక్కను సైన్యములు వెనుకకు తగ్గలేదు. అవి ముందుకు త్రోసికొనివచ్చుచుండెను. కాని వారి మొగములపై నలత గన్పించుచున్నది. ఇంతలో నా రణక్షేత్రమున “రామరామ జయ సీతారాం జానకివల్లభ జయ జయ రాం” ఈ గానము షా ఆలంనకు సమీపము నుండియే వినవచ్చుచున్నది. షా ఆలం కన్ను త్రిప్పిచూచినాడు. కాషాయ వసనధారియైన హరిదాసి; గళమున తులసీమాల. చేతిలో తంబూర. ఆమె యువరాజునే వెదకికొని వచ్చుచున్నది.

షా ఆలం రెప్పవేయక యామెనట్లే చూచినాడు. ఈ భయంకర యుద్ధమేమి? ఈ హరిదాసి నిర్భయ ప్రవృత్తి యేమి? ఈమె కెంతధైర్యము ! ఎంతసాహసము ! వెంటనే షా ఆలం యేనుగును దిగివచ్చినాడు. “హరిదాసీ ! ఇదేమి ? నీ విక్కడికెందులకు వచ్చితివి? ఈ ఘోర సైన్యముల నెట్లు తప్పించుకొని తిరుగుచున్నావు. నీకు భయము లేదా? ఈ ప్రచండ యుద్ధములో నీకైమైన అపాయమైనచో నిన్ను రక్షించువారెవ్వరు?”

‘హరిదాసి’ చిరునవ్వు నవ్వినది. ఆ నవ్వులో నంద మెంతయో, పవిత్రత యంత !

“ఖామంద్ ? ఈ యుద్ధమున నెందరో వీర పురుషులు మృత్యుదేవి కౌగిటిలో బడుచున్నారు, నా యొక్క దాని ప్రాణము లేమి లెక్క ! షా ఆలం పేరు చెప్పిన చాలును యీ మహా సైన్యమున నా జోలికి వచ్చువాడ్వెడుండును?”

“అది సరే ! నీ విక్కడికెందులకు వచ్చితివో చెప్పుము”

“యువరాజా ! ఈ మొగలు సైన్యముల భేరీధ్వనులను నీవు వినుటలేదా ! ఈ యుద్ధమును నిలుపుము. విజయమందిన నీ సైనికులు మహోత్సాహముతో హైదరాబాదులోనికి

చనెదరు. స్త్రీల మానాపహారములు లక్షలకు జరుగును. చిత్రవధలు సేయుదురు. ముఖ్యముగా స్త్రీలపై నత్యాచారములు సేయుటయే వీరికుత్సాహము. నా మాట విని యుద్ధమును నిలిపి వీరికట్లు ప్రవర్తింపరాదని యాజ్ఞc లొసగుము."

"హరిదాసీ ! పిచ్చిమాట లాడుచున్నావు. మొగలు వీరులు యుద్ధమున గెలిచినారు. వారి మనస్సులు పందెపు గుఱ్ఱములవలె నున్నవి. వారిని నిలుపుట కిప్పుడేరికి సాధ్యము?"

హరిదాసి యుద్రిక్తురాలైనది. "యువరాజా ! నీ చేత గాదన్నమాట ! సరే అట్లైనచో, నేనే నిలిపెదను, నేను పాదుషా బిడ్డను. నీవు నా బిడ్డవని యాతడే చెప్పినాడు. నా యాజ్ఞ నెవ్వరు ధిక్కరింతురో చూచెదను గాక! నన్నెదిరించువారు కఠోర శిక్షలకు బాల్పడుదురని పాదుషాయే చెప్పినాడు. ఆ మాటలోని సత్యమును నేడు పరీక్షించెదను. పాదుషా యొట్టుబెట్టి యీ సైన్యమును నిలపి తీరుదును. సైన్యములు నిలువకున్నచో వారి చేతనే మరణమందెదను. నేను చచ్చితినా అటుపై చూడుము. పాదుషా యీ సైన్యములపై నిప్పులు గ్రక్కును."

పాదుషా పేరెత్తినంతనే 'షా ఆలం' యెదకూడ వణకినది. అతనికేమి చేయుటకును దిక్కుతోచలేదు. సేనాపతిని పిలిచినాడు.

"నీవు మాదన్న ధన్నాయకుని దగ్గరకుపొమ్ము. మనము యుద్ధమును నిలిపినామనియు హైదరాబాదులోని స్త్రీ బాల వృద్ధ వికలాంగులను వేరొక సురక్షితమైన చోటికి జేర్పింపవలెననియు జెప్పుము. అటు తర్వాతనే వారు మనపైకి యుద్ధమునకు రావచ్చును. అంతవరకు ఒక్క మొగలు సైనికుడుకూడ ముందునకు కదలరాదు. వారి యనాథలకు రక్షణ మొసగినానని మాదన్నతో చెప్పుము."

"అట్లేయొనర్తున"ని సేనాధిపతి వెడలిపోయెను. "ఈ హరిదాసి యొకపిశాచి దాపురించినది. ఇది యెవ్వతె? దీని నెవ్వరు పంపిరో ! హిందువులట్టి కుతంత్రముల నెన్నో జేయుచుందురు. దీని మాటలు విని యువరాజు యుద్ధము నాపవచ్చునా? అల్లా ! హిందువులెంత దుర్మార్గులు." వాడు గొణుగుకొనుచు పోయినాడు.

మాదన్న 'షా ఆలం' ఔదార్యమున కాశ్చర్యపడినాడు. ఆ యౌదార్యము తనకొక యవమానమైనది. కాని ఏమిసేయును? విధిలేదు. అతడు హైదరాబాదును ఖాళీ చేయవలసినదని పౌరులకాజ్ఞ యిచ్చినాడు. హైదరాబాదు సామాన్య పట్టణము కాదు. ఐశ్వర్యమునకది బిడారము. ఉత్తమ కులస్త్రీలు, నృత్త గీత నైపుణ్యము గల రమణులు నిండిన మహానగరము. ఆ భోగములు స్వర్గమునందుగూడ నుండలేదు. ధనికులు కోట్లకు పడగలెత్తి యుండిరి. మాదన్న యాజ్ఞను పట్టణమున దండోరా వేసినారు. స్త్రీ పురుషులు చేతనైనంత ధనమును గొని యేడ్పు మొగములతో నగరము వెడలివచ్చిరి. సాయంకాలము లోపలనే ఊరుబీడైనది. సౌధములు, నాట్యశాలలు, రంగస్థలములు దీనవదనములతో దిక్కులు చూచుచుండెను. నిర్జనములై భయంకరములై యుండెను. రాత్రి నీలవసనధారిణియై,

నీలవసనమును చేతబట్టికొని వచ్చినది. నగరములో దీపములు లేవు. మనుష్యుల యలికిడిలేదు. పోగలవారు పోయిరి, పోలేనివారెక్కడకు బోదురు? నటులు, విటులు కొందరు వారాంగనలు అందే యున్నారు. వారికి దిక్కు తోచుటలేదు. మద్యము గ్రోలి అల్లరి సేయుచుండిరి. ఏవేవో పాడుకొనుచుండిరి. బూతులాడుచుండిరి. మాదన్న నగరము ఖాళీయైనంతనే రణభేరి వేయించినారు. ఇంతలో ఇబ్రహీం సమీపించెను.

"ఖామంద్ ! మనమిప్పుడు యుద్ధమొనర్చి యేమి ప్రయోజనము? యువ రాజౌదార్యమును జూపెను. దానికి మనము యుద్ధమొనర్చుట బ్రతికాదు".

"ఇబ్రహీం ! ఇంతకన్న వేరు మార్గ మేమున్నది? యుద్ధము సేయకున్నచో యువరాజునకు బందీలమై శరణాగతులము గావలెను. లేదా పిరికిపందలై పారిపోవలెను. దాని కన్నను వీరులమై మడియుట మేలు. యుద్ధమరణమే మనకు శరణ్యము. నా నిశ్చయమింతే!"

ఇబ్రహీం పలుకలేదు.

"నీ యభిప్రాయమేమి?"

ఇబ్రహీం స్వరము క్షీణమైనది.

"నిశ్చయించుటకు నేనెవ్వడను? నేను మీ యనుచరుడను మాత్రమే."

మాదన్న యుద్ధమునకు ప్రయాణ మొనర్చెను. రాత్రి యుద్ధము, సైన్యములు తెగించిపోరు చున్నవి. షా ఆలం రాత్రి యంత యుద్ధభూమినందే గడపినాడు. రణభూమి నందెచ్చటను పీనుగుల కుప్పలు. ఎవరెవరిని చంపుచున్నారో యెవరికిని దెలియుటలేదు. ఉభయ సైన్యము లందును ఆ రాత్రి వీరులెందరో మడిసిరి. మాదన్న సైన్యముల నెచ్చరించుచుండెను. కాని ప్రయోజనమేమి? వానికి ధైర్యము చిక్కలేదు. అవి పారిపోయినవి. మాదన్నకు గత్యంతరము లేదు. అతడు గోల్కొండ జేరెను. ఇబ్రహీం చెరజిక్కినాడు. ఇంతలో దెల్లవారినది, ప్రాణముపోక వికలాంగులైనవారు గట్టిగా నరచుచున్నారు. రణభూమి మృత్యుదేవతకు క్రీడారంగమైనది. ప్రేవుల ప్రోవులు, చెదరిన మాంస ఖండములు, ఒఱ్ఱుగా బాఱురక్తములు, తునిసిన తలలు వికటాట్టహాస మొనర్చునట్లున్న పుఱ్ఱెలు, తునిగిన కత్తులు, ఖండితములైన తురంగములు, ప్రాణముపోక అటునిటు బొరలుచున్న గుఱ్ఱములు చీకుకొని తినుచున్న నక్కలు. యువరాజు దూరము నుండియే యా రణక్షేత్రమును జూచెను. తూర్పు కుంకుమను బూసికొన్నది. ఆ వైపునుండి కాంతియెక్కి వచ్చుచుండెను. 'రామరామ జయసీతారాం. జానకి జీవన సీతారాం' రామ నామము కర్ణపేయమై వినవచ్చుచున్నది. షా ఆలం ఆశ్చర్యచకితుడైనాడు. "హరిదాసి యిక్కడనే యున్నదా ! ఎంత నిర్భీకురాలీమె ! ఈ హరిదాసి దేవతయో లేక పిశాచియో కావలెను"

ఇంతలో నామె యువరాజెక్కిన గజమును సమీపించి జయకార మొనర్చెను. "హరిదాసీ ! నీవిచ్చటనే యున్నావు. రాత్రి యంతయు నుంటివా ? ఈ యుద్ధమును నీవే నడపించు చున్నావా యేమి?"

హరిదాసి తంబూర మీటినది. "దీనిని చేయించు చున్నది నేను గాదు. అల్లాయునుగాదు. ఇది సైతాను చేయించుచున్న యుద్ధము. గోల్కొండ సుల్తాను ఓడిపోయెనని నీవు సంతోషపడుచున్నావు. కాని పాదుషా ఘోరకృత్యములతో అల్లా కన్నీరు గార్చుచున్నారు. మనరక్తపిపాసను పరిహాస మొనర్చుచున్నారు.

"హరిదాసీ ! నీ వెక్కడి కేగెదవు?" "ఎక్కడ బోదును? నీతోనే వత్తును. లేక ఢిల్లీకి బోయి ఈ యుద్ధమును నిలుపుమని పాదుషాను బ్రార్థింతును."

"దేవి ! ఇప్పుడు నాతో రమ్ము. ఢిల్లీకి నీవు పోవలసినచో నిన్నాపు వారెవ్వరు? ఈ యేనుగు నెక్కెదవా?"

హరిదాసి యేనుగు చెంతకు వచ్చెను. మావటివాడు చల్ చల్ అని గజమునకు సైగ చేసినాడు. ఏనుగు ముందటి కాలువంచి హరిదాసివైపు జూచెను. ఆమె దాని చెవి బట్టికొని మోకాలిపై కాలు బెట్టి యెక్కినది. పైనుండి యువరాజు చేయినందించినాడు. దాని యూపుతో నామె పైకెక్కినది. హస్తలాఘవము నిచ్చుటతో యువరాజునకామె శరీరదార్ఢ్యమర్థమైనది.

"అబ్బ ! ఈమె యొడలిలో నెంత బలమున్నది ! ఒక్క చేతితో నల్వురి సిపాయీలను దన్నగలదు. ఈ బలమునకు దోడెంత ధైర్యమున్నది. లోకములో నింత బలముగల స్త్రీలను అల్లా సృష్టించినాడని నాకిదివరకు తెలియనే తెలియదు. ఈనాడు స్త్రీ శక్తిరూపిణియై నా యెదుట గన్పడుచున్నది" అనుకొన్నాడు.

## 6

మొగలు సైనికులు హైదరాబాదును స్వేచ్ఛగా లూటీ చేసినారు. పారిపోక నగరమున నిలచిన నటవిటు గాయకాదులను తునియలుగా ఖండించిరి. అర్ధ జ్ఞానావస్థలోనున్న స్త్రీలనెత్తికొని పోయిరి. ప్రతియింటను వారికి మద్యము దొరికెను. రెచ్చిపోయి త్రాగినారు. త్రాగనిదానని పుక్కిలించి యుమ్మివేసిరి. ప్రతిగృహము సైనికులదే యైనది. విచ్చలవిడిగా భోగించిరి. షా ఆలం షోలాపురిలోని యంతఃపురమును జేరెను. 'హరిదాసి' యాతని వెంటనే బోయినది. నూరున్నీసా, ముంతాజులు యువరాజునకు స్వాగతము బలికిరి. ఉన్నీసా హరిదాసి వైపు జూచినది. తదేక దృష్టితో జూచినది.

"ఇది యెక్క డుంటుండెను? ఈమె నెందుకు దీసుకుని వచ్చితిరి?"

"ఈ సన్యాసిని సామాన్యురాలు గాదు. కాళికాదేవి వంటిది. యుద్ధభూమిలో నిర్భయముగా సంచరించినది. మొగల్ సైన్యమును భేదించుకొని నాయెదుటికి వచ్చినది. ఉన్నీసా ! ఈమె వైపు కన్నెత్తి చూచుటకు మొగల్ సైనికులలో నొక్కనికిని ధైర్యము లేకున్నది. వీరావేశముతో జరుగుచున్న యుద్ధమును, యీ సన్యాసిని, ఒక్క దినము నిలిపినది. ఇదెంతటి సాహసము !" నూరున్నీసా కన్నులతో నవ్వెను. ఆ నవ్వుతో నామె భ్రూయుగము ముకుళించి వికసించినది.

"ఢిల్లీ యువరాజే చేతికి జిక్కినపుడు యుద్ధము నిలుపుటలో కష్టమేమున్నది. ఈ రాజ సింహాసనమునే యేలుకొనవచ్చును."

ఉన్నీసా సన్యాసినితో నన్నది. "హరిదాసీ ! నీవా పీఠముపై గూర్చొనుము. నీవు వచ్చినపుడంతయు కొన్ని కొత్త విషయములను బట్టుకొని వత్తువు. యువరాజు యుద్ధములో నలిసినాడు. అతడు విశ్రమించును. మనమే మాటాడు కొందము".

"ఈ హరిదాసి నేడు మనకు అతిథి. ఈమెను జాగ్రత్తగా జూచుకొనవలెను. నేను కొంచెము విశ్రమించివత్తును...."

"ఈమె కెన్ని దినములు మనయింటిలో నాతిథ్యము?"

"ఆమెకు బుద్ధి పుట్టినన్ని దినములు. ఆమె ప్రవర్తనము గమనించుటయే కష్టము. ఎక్కడనుండి వచ్చునో ! యెక్కడికి పోవునో ! ఇక్కడనుండి తాను పాదుషా గారి దగ్గరకు పోదునని నాతో అన్నది".

"పాదుషాగారి ముందు యీ హరిదాసి యెన్ని గుండెలతో నిలుచును?

"ఆమె పాదుషాను తండ్రిగా చేసికొన్నది. అతడు 'నీవు నా బిడ్డవు' అన్నాడట, హరిదాసి యామాట వాడుకొను చున్నది."

ఉన్నీసా హరిదాసి వైపు తిరిగినది. "ఐనచో ఢిల్లీకి బోవుచున్నావన్నమాట. పాదుషా గారితో మా యువరాజు పైనేమైన చెప్పెదవు సుమా !" "దానికంత దూరము బోవలెనా ?" హరిదాసి కిలకిల నవ్వెను.

షా ఆలం తన మహలునకు వెళ్ళిపోయినాడు. హరిదాసికి ముంతాజ్ గనిపించినది.

"నీ వెవ్వరవమ్మ? ఎక్కడినుండి వచ్చినావు?" హరిదాసి పలుకరించెను.

"ఈమె యొక యనాథ. యువరాజు తీసికొనివచ్చెను." నూరున్నీసా యన్నది.

హరిదాసి ముంతాజ్‌ను ఎన్ని ప్రశ్నలో వేసినది. ఒకదానికిని సరియైన సమాధానము రాలేదు. "ఈమె జీవితములో నేదో రహస్యమున్నది."

'హరిదాసి' యనుకొన్నది. "రాణీ ! నాకు సెలవిచ్చినచో నేను స్నాన పానములు ముగించుకొని వత్తును" హరిదాసి పలికెను.

"ఇదేమి యన్యాయము ! నీవు మాయింటి అతిథివని యువరాజు లన్నారు. మరి ఈ పోవుట యెక్కడికి?"

హరిదాసి పెదవులపై నవ్వు మొలచెను.

"మా వంటి సన్యాసినుల కాతిథ్య మేమిటమ్మా? నాల్గు మాటలు ముచ్చటగా మాటాడినచో అదే ఆతిథ్యము. ఈ విషయమున యువరాజు తప్పుగా భావింపఁడు. నాకు సెలవివ్వవలెను."

'హరిదాసి' వెళ్ళిపోయినది.

"ముంతాజ్ ! నీవా హరిదాసితో చక్కగా మాట్లాడ లేదేమి?" ఉన్నీసా ప్రశ్నించెను.

"మహారాణీ ! ఈమెను నే నెప్పుడును చూచినట్లు నాకు జ్ఞాపకము లేదు. ఈ రాజ్య మందిట్టి సన్యాసినులు, సన్యాసులు ఎంతమందియో దిరుగు చుందురు. వారెవ్వరిని లక్ష్యపెట్టరు. ఈ రాజ్యములో వారిదొక విచిత్ర జీవనము."

"ముంతాజ్ ! ఈమె సామాన్యురాలుగా గనిపించుట లేదు. ఈమెలో గొప్ప సాహసమున్నది. యువరాజులు చెప్పినది వినలేదా? ఈమె ఢిల్లీ పాదుషాగారితో పరిచయము చేసికొన్నది. ఈ యువ రాజునకు యీమెకు చాలా స్నేహము. హిందూ స్త్రీలు ముసల్మానులను చూచినచో వణకిపోవుదురు. ఈ హరిదాసి యెవ్వరిని లక్ష్యపెట్టుటయే లేదు".

"ఉండవచ్చును. ఈ హరిదాసి మంచి యౌవనములో నున్నది, సౌందర్యమునకు తక్కువగా లేదు. ఈ వేషముతో నీమె తన లావణ్యమును కప్పుకొన్నది. కాని యది దాగుటలేదు; కన్నులతో తీక్షతయున్నది. మాటలలో చలాకియున్నది. ఆ మాటలముందు యే మగవాడుగూడ ఆగుటలేదు. మహారాణీ ! నన్ను క్షమింపవలెను. ఈమెనుండి యేదైన నపాయము సంభవింపవచ్చును కూడ. యువరాజన్న మాటలు మీరు వినలేదా? ఒకనాటి యుద్ధము నీమె నిలిపివేసినదట! తర్వాత అతని వెంటనే యిచ్చటికి వచ్చినది. ఈమె సన్యాసిని గావచ్చును. ఏ వేషమైనను కట్టవచ్చును. కాని ఒక హిందూ స్త్రీ ఈమె. మాదన్న గుప్తచారిణి కావచ్చునేమో ! లేక సాంభాజీ పంపియుండవచ్చునేమో ! నా ఊహ సరియైనచో ఎంతటి అపాయము వచ్చును. మీరు గమనింపవలెను. యువరాజుల కింత మాత్రము తోచకపోవుట ఆశ్చర్యకరముగనే యున్నది."

"తోచియే యుండును. కాని యీమెనుండి యే యపాయమును జరుగదని వారు నమ్మినట్లున్నది. కాని యీమెలో నేదోయొక యభేద్యమైన రహస్యము దాగి యున్నది.

వారిర్వురు హరిదాసిని గురించి మరికొన్ని విషయములు మాటాడుకొన్నారు.

రెండు మూడు దినములలో మొగలు సైన్యములు హైదరాబాదును స్వాధీన పరచుకొనిరి. వారు సైన్యశిబిరములందే యేర్పాటు చేసికొనిరి.

"మాదన్న పరాజయముతో క్రుంగిపోయినాడు. గోల్కొండకోట బయట దక్కను సైన్యములు విశ్రాంతి తీసికొనుచున్నవి. మాదన్న యా శిబిరములలో నుండెను. హైదరాబాదు వశమైన సంగతి సుల్తానునకు దెలిసినది. అతడు బెదరిపోయెను. మాదన్న ధన్నాయకుని బిలిచి ఆపైననేమి చేయవలయునని సమాలోచనము నడిపినాడు. యువరాజుతో సంధిచేసికొనవలెనని నిశ్చయించు కొనిరి. 'ఖాజీసహద్ సాహేబ్' సంధి యొనర్చుకొనివచ్చుటకై సిద్ధమైనాడు. అతనితో మీర్ మొహమ్మద్ ఖాన్ ప్రయాణమయ్యెను. మీర్ మహమ్మద్ మంత్రులలో వృద్ధుడు. వారు షోలాపురమునకు బోయి యువరాజు దర్శనమునకై

ప్రార్థించుకొనిరి. షా ఆలం వారిర్వురను మర్యాదలతో దర్బారునకు రావించికెళ్ళారు. సవినయముగ వారు సంధి ప్రస్తావనము మొదలుపెట్టిరి.

షా ఆలం పలికినాడు.

"యుద్ధవిషయ మంతయు మీకు దెలిసినదే. సుల్తాను కేమికావలెనో వారే చెప్పిన మంచిది. ఢిల్లీకిపోయి పాదుషా గారితో సుల్తానుగారే మాట్లాడవలెను. యుద్ధ విషయము లన్నియు నేను పాదుషాగారికి లేఖమూలకముగ దెలియ పరతును. మీరు సంధికై ప్రార్థించిన విషయమును గూడ మనవి సేతును. సుల్తానుగారితో మీరుగూడ ఢిల్లీకిపోవుట మంచిది. పాదుషా సుల్తాను ననుగ్రహించవచ్చును."

మహమ్మద్ ఖాన్ పలికినాడు. "యువరాజా ! గోల్కొండ కోటలో సుల్తానున్నాడు. రాజ బంధువులున్నారు. ఈ రాజ్యమున గణుతికెక్కినవారి కుటుంబములనేకము లున్నవి. మేము ఢిల్లీకి పోయి యెంత త్వరగా తిరిగి వచ్చినను మా ప్రయాణమొక నెల పట్టవచ్చును. అంతవరకును మీ సైన్యములు కోటలో అల్లరులు చేయకుండ దయ పెట్టవలెను".

"పరిస్థితులలో మార్పులేమియు లేకున్నచో మేమొక్క అడుగు ముందుబెట్టము. గోల్కొండ సైన్యములేమైనను దౌర్జన్యములు చేసినచో ఊరకుండుటకు వీలుపడదుకదా ! యుద్ధమును నిలుపుటకు గూడ పాదుషాగారి యాజ్ఞకావలెను."

రాయబారులను షా ఆలం మర్యాదగా పంపెను. వారు ఢిల్లీవైపు బయనించిరి.

మరుదినము యువరాజు దర్బారులో గోల్కొండ సేనాపతియైన మీర్ యిబ్రహీం విచారణ ఆరంభమైనది. షా ఆలం ముందు మీర్ యిబ్రహీం బందీగా నిలిచియున్నాడు. అతనిని యువరాజెంతయో మర్యాదగ జూచెను. అతడన్నాడు.

"ఈ తరుణ సేనాధిపతి విషయము విచారణ జరుపవలసిన యావశ్యకత గన్పించలేదు. ఇతడు యుద్ధమున మహా పరాక్రమముతో బోరాడెను. సుల్తానుల కడనుండి సంధి ప్రార్థన గూడ వచ్చినది. సంధి విషయము తేలువరకును మీర్ యిబ్రహీం నట్లే యుంతుము. ఇతనిని మీరందరు గౌరవముతో జూడవలెను."

యువరాజు మీర్ యిబ్రహీం వైపు దిరిగినాడు.

"సేనాధిపతీ ! నీవు చెప్పికొనునదేమైనా యున్నదా ?

ఇబ్రహీం సలాము సేసినాడు.

"యువరాజా ! తమదగ్గర మనవి చేసికొన వలసిన విషయ మేదియును లేదు. నేను మీతో బోరాడితిని బందీయై మీకు జిక్కినాను. ఇక నేను జెప్పుకొనవలసిన దేమున్నది? నేను యువరాజుగారి బందీని. దీనిని నేనొక యవమానముగా భావించుటలేదు" రాజభటులా సేనాధిపతిని బిలచికొని పోయిరి.

గోల్కొండ రాయబారులకు ఢిల్లీలో పాదుషావారి దర్శనము దొరికినది. ఔరంగజేబు గంభీరుడై యుండెను.

"ఖాజీ మహాశయా ! వృద్ధమంత్రీ ! మీరు సంధికావలసి వచ్చినారు. యువరాజు లేఖ ప్రకారము యుద్ధము ముగిసి పోయినట్లే. మొగల్ సైన్యము గోల్కొండ కోటలో మీ సుల్తానుండుటకు కనుమతించినది. అధికారములను బెరికికొనలేదు. ఇక మీకు సంధి యేమి కావలెను? గోల్కొండ కోటలో తాము బందీగా ఉన్నామని సుల్తానుగారు భావించవచ్చును. కాని గోల్కొండ సుల్తానుగారు, మీరు ముసల్మానులను భావన మాకుండనే యున్నది. ఇంత దూరము వచ్చినారు. మిమ్ము గౌరవించి మీ సంధి కంగీకరించుచున్నాము. కాని మా షరతులివి. యుద్ధ ఖర్చులకు ఒక కోటి ముప్పది లక్షల వరహాలు చెల్లింపవలెను. ప్రతి వర్షమును మాకు సుల్తానులు రెండు లక్షల హొన్నులు కప్పము గట్టవలెను. ఇదివరకు మొగల్ ప్రాంత సరిహద్దులలో నుండిన 'సీరం' మాల్కాండులు, మాకిచ్చి వేయవలెను. అక్కన్న, మాదన్నలను పదవీచ్యుతుల నొనర్చి బహిష్కరింప వలెను. ఇవి న్యాయములైన షరతులని మేము భావించు చున్నాము. ఇప్పటికి సుల్తానుల అధికారమును మేమట్లే యుండనిత్తుము."

రాయబారులన్నారు.

"సంధి షరతులు పాదుషాగారి యౌదార్యమును దెలుపుచున్నవి. సుల్తానుగారి రాయబారులమై మేము యీ షరతుల కంగీకరించు చున్నాము. ఈ రీతిగ సంధి పత్రమును వ్రాసి యువరాజుల కొప్పించు చ్ఛున్నాము."

పాదుషాకు సలాము చేసి రాయబారులు వెనుదిరిగిరి. ఈ షరతులను ఢిల్లీ దర్బారు బక్షీలు పత్ర మూలకముగ యువరాజున కెరుకపరచినారు. ఆ సమాచారము ముంతాజునకు సనసనగా దెలసినది. ఆమె నిప్పు ద్రొక్కిన పిల్లియైనది. మనస్సు మనస్సులో లేదు. నేరుగా యువరాజు షా ఆలం మహలునకు బోయినది. షా ఆలం ముంతాజును సమర్యాదముగ నాహ్వానించినాడు.

"యువరాజా ! నాకనుజ్ఞ యిప్పింపుడు. నేనిప్పుడే వెళ్ళిపోదును. నేను మీకడకొక కార్యమునకై వచ్చితిని; అది యీనాటితో నెరవేరినట్లైనది.

"ముంతాజ్ ! ఏ మంత అశాంతితో నున్నావు. ఈ చోటువదిలి యెక్కడికి పోదువు?"

"అనంత విశ్వములోనికి; మీ కడకనాథనై వచ్చితిని, అనాధగనే మరలిపోదును. మా తల్లి పూర్వమొకసారి పాదుషాతో మొరపెట్టుకొన్నది. ఆమె కోర్కె నెరవేరలేదు. జీవములు వదలినది. ఇప్పుడు యువరాజును చేరితిని కాని యేమైనది? విధి వక్రించినది. నా తల్లి కాత్మ శాంతి లభింపలేదు. నా కోర్కె నెరవేరలేదు. తల్లివలెనే బిడ్డ."

"ముంతాజ్ ! ఇంత నిరాశ యెందుకు? నీ ఇష్టము నెరవేరుననుకొమ్ము. ఢిల్లీ పాదుషా సామాన్యుడుగాడు; అతడు సంధికి సమ్మతింపడు. ఈ సమ్మతించుటలో నేదో రహస్యమున్నది. నీ విషయమింకను ఢిల్లీ పాదుషాగారికి నేను తెలుపలేదు గదా?"

"తెలిపిన మాత్ర మెరిగి పోవునదేమున్నది? నన్ను పోనిండు. నిర్బంధింపకుండు".

"ముంతాజ్ ! ఒక్కసారి నామాట వినుము. దీని నుండి నీకు నష్టమేమున్నది?" అతడెంతో బ్రతిమాలినాడు. ఆమె చేయునదిలేక యంతఃపురమునకు బోయెను. చెరసాల యందున్న గోల్కొండ సేనాధిపతిని యువరాజు రహస్యముగా బిల్పించినాడు.

"ఇబ్రహీం ! నీతోనొక పనియున్నది. నీవది నెరవేర్చవలెను. నిన్నిప్పుడే విడుదల చేసెదను. నీవు గోల్కొండకు బోవచ్చును. ఇప్పుడు పాదుషావారు సంధి కంగీకరించినారు. సంధి షరతులను గోల్కొండ రాయబారులతో చెప్పిపంపిరి. ఆ విషయములే నాకు లేఖలు వ్రాసినారు. కాని సంధి చేసికొనుటకును నిరాకరించుటకును నాకే యధికారమిచ్చిరి. నీవిప్పటినుండి స్వతంత్రుడవు. నీకుముందే యొకమాట చెప్పినాను. మా సైన్యములోనికి నీవు వచ్చినచో నీకుదగిన యధికారమిప్పింతును. లేక గోల్కొండ సైన్యమందే యుండవచ్చును. నీ వెక్కడున్నను నీవు మావాడవన్న యభిమానము మాకు నీపై నున్నది."

"యువరాజా ! అది మీ యౌదార్యము. మీకును మాకును యుద్ధ మారంభ మైనప్పటినుండి మీ యౌదార్యమును నెన్నిమారులో రుచిచూచినాను; మీ వంటి మహా పురుషుల సేవదొరుకుట జీవితములో గొప్ప భాగ్యము కాని యువరాజా ! నాకొక్క ధర్మమున్నది, నేను సుల్తాను యుప్పుదిని బెరిగినవాడను. మాదన్న చిన్నప్పటినుండి కాపాడినాడు. విద్యాబుద్ధులు నేర్పించినవాడు. నిరంతరము తనతో నుంచికొని యుద్ధకౌశలములు గమనింప జేసినవాడు. నాతండ్రి వంటివాడు. నాకు గురువు. అతనిని వదలి మీకడకువచ్చి చేరునట్టి అధర్మము మాత్రము  నేను చేయలేను. ఎన్ని దుర్గుణములున్నను మానవునిలో నేదోయొక సుగుణముండవలెను. నాలోని యా సుగుణమును మీరు రక్షింపవలెనని నా ప్రార్థన.

ఇబ్రహీం స్వామిభక్తికి షా ఆలం చకితుడైనాడు.

"ఇబ్రహీం ! నీ స్వామిభక్తికి నా మనస్సు కరిగిపోవుచున్నది. కాని పాదుషా గారి సంధి షరతులు నీవెరుగవు. నీకువానిని దెలుపుటకు నాకు సందేహము లేదు. నీ గొప్పదనముపై నాకు విశ్వాసమున్నది. పాదుషా గారి సంధి షరతులు పైకెంత శాంతముగ గన్పించుచున్నవో – పర్యవసానములో నంతశాంతముగ లేవు. అక్కన్న మాదన్నలను పదవీచ్యుతులుగావించి బహిష్కరింపవలెనని వారియొక షరతు"

ఇబ్రహీం మొగము మ్లానమైనది. అతడు మౌనముతో తలవంచెను.

"ఇబ్రహీం ! పలుకవేమి?"

"యువరాజా ! నన్ను విడుదల సేయుటకంటెను మీరు బంధించి యుంచుట మేలని తోచుచున్నది.

"ఎందుకు ?"

షా ఆలం సంతోషాశ్చర్యములతో సేనాధిపతివైపు జూచినాడు.

"ఇబ్రహీం ! ఏదో రహస్యమును నీవు దాచుకొనుచున్నట్లున్నది. దానిని తెలుపుమని నిన్ను నిర్బంధింపను. నీకిష్టమైననే తెల్పవచ్చును."

"యువరాజా ! మీరు సర్వాధికారులు. మీయెదుట ప్రస్తావించుటకు నాకేమి సందేహ మున్నది? నేనావిషయమును దాచికొనను. అక్కన్న మాదన్నలను వదలవలెననుట అసహజమైన షరతు. జరుగగూడనట్టిది జరుగనిది."

"ఏమి ? సుల్తాను, అక్కన్న మాదన్నల కంతగా వశుడైనాడా?"

"జహాపనా ! జనులందరు అట్లే తలుతురు. అది అసత్యము. మాదన్న అధికారము వదలిపోవుటకు ఏమాత్రమును ఖేదపడెడువాడు గాడు; సుల్తానుగా రొక్కమాట చెప్పినచో అధికారమును తృణమువలె వదలిపెట్టిపోగలడు. పేదరిక మన్నచో నాతనికి భయము లేదు. మాదన్నను ద్వేషించు సర్దారు లెందరో గోల్కొండ సైన్యములో నున్నారు. జనానా యందును ద్వేషించువారు లేకపోలేదు. కాని సుల్తాను రాజ్యమును పరిపాలించుట కసమర్థుడు. మాదన్న కార్య ఖడ్గములే రాజ్యమును రక్షించుచున్నవి. ఈ విషయము సుల్తానుకు స్పష్టముగా దెలియును"

యువరాజు తల నాడించినాడు.

"ఇబ్రహీం ! నీ మాటలు నాకు స్పష్టముగా నర్థమైనవి. కాని ఢిల్లీ పాదుషా స్వభావము నీవెఱుగవు. వారి నోటనుండి యొకమాట వచ్చినచో దానిని గాదనుటకు శక్తి యెవ్వరికిని లేదు. పాదుషాగారి కన్ను మాదన్నపై బడినది."

"యువరాజా ! నన్ను క్షమింపవలెను. పాదుషాగారి కన్ను మాదన్నపైన బడిన దనుట కంటెను దక్కను వైభవమును జూచి వారి కసూయ బొడమిన దన్నచో న్యాయముగా నుండునేమో! మాదన్నగారికి తాము వజీరుగా నుండవలెనను పట్టుదల యేమియు లేదని ముందే చెప్పినాను. సుల్తానుగారి యాజ్ఞయైనచో వారు వెంటనే వదలుకొందు రనుటలో సందేహము లేదు."

"సేనాపతీ ! మాదన్న గొప్ప రాజనీతి నిపుణుడే గాదు. మహాపరాక్రమశాలి. అది యీ యుద్ధమున మాకు స్పష్టమైనది. అతడు గోల్కొండ వదలిపోయినచో సాంభాజీతో చేరుకొనునేమో!

"యువరాజా ! మీ సందేహము బాగుగనే యున్నది. కాని మాదన్నగారా పని చేయరని నా నిశ్చయము. వారికి సాంభాజీ ప్రవర్తన సరిపోదు".

"ఎందుకు? సాంభాజీ దక్షిణ దేశాలకు తాను సామ్రాట్టునని చెప్పుకొనుచున్నాడు. అతనికి తాను వజీరైనచో అది మాదన్నకు గొప్ప యధికారము కదా!"

"హుజూర్ ! ఇది చాల పెద్ద కథ. నేను చెప్పినను మీరు నమ్ముట కష్టము. నామాటకిప్పుడు వెలలేదు. నేను మీకుబందీ"

"దానికి దీనికి సంబంధమేమి? నీ మాటపై నాకు గొప్ప విశ్వాసమున్నది."

"జహాపనా ! మీరిప్పుడు గొప్ప సైన్యములను దీసికొని గోల్కొండపైకి వచ్చితిరి. మీ సైన్యముల ముందు మా సేనలు చాల యల్పములు. మొన్ననే సాంభాజీ గోల్కొండకు వచ్చి యుండెను. వైభవోపేతముగ నుత్సవములు నడచినవి. సాంభాజీకి బ్రహ్మాండముగ ధనము ముట్టెను. అతడు ధనాశా పీడితుడు. సాంభాజీకి చిక్కిన ధనమునకై ఢిల్లీ పాదుషాగారి కన్ను కుట్టినది. మీరెత్తి వచ్చితిరి. యుద్ధ మైదు మాసములనుండి జరుగుచున్నది. సాంభాజీ మాకు సహాయమేమియు జేయలేదు. దీనికి కారణమేమో యోచించిచూడుడు. మాదన్నగారిపై ఢిల్లీ పాదుషాకు కోపముండినది. ఎందుకు? మాదన్న మహా పరాక్రమవంతుడు. అతడు హిందువు, ఇంతేనా? మరి మీ సైన్యములో నెంతమంది హిందూ సేనాధిపతులున్నారు. వారందరిని ఢిల్లీ పాదుషా యేల బహిష్కరింపలేదు? సత్యము చెప్పవలెనన్నచో మాదన్నపై పాదుషాగారికున్న కోపముకంటె మాదన్నపై సాంభాజీకెక్కువ కోపమున్నది. సాంభాజీని గోల్కొండకు పిలిపించినది మాదన్నగారే. ఉడుగరలిచ్చి నదియువారే. ఇన్నియైన మీదట సాంభాజీతో మాదన్నగారు యిట్లన్నారు.

మహారాజా ! మీ ప్రవర్తన మా కపాయకరముగా నున్నది. తమ స్నేహముతో బీజాపుర, గోల్కొండ రాజ్యములకు ఆపత్తు సంభవించు సూచనలున్నవి. ఢిల్లీ పాదుషాతో మీరు చెర్లాటమాదు చున్నారు. ఇది సాగిరాదు. హిందూస్థానములో హిందువులకును, ముస్లిములకును భేదము లుండనేయున్నవి. హిందూరాజెవ్వడును పాదుషాను గౌరవించుటలేదు. వారందరు మిమ్మే హిందూ పాదుషాయని పిలుచుకొనుచున్నారు. ఇది వారికి మీపైగల అభిమానమునకు గుర్తు. మహారాష్ట్ర లజేయులనుట హిందూస్థానమున ప్రసిద్ధమైన విషయము. హిందూస్థానమున యిద్దరు పాదుషాలుండుటకు వీలులేదు. మీ సైన్యములతో మీరు పాదుషా నెదిరింపుడు. మేమందరము మీకు సహాయముగా నుందుము. మీ యిర్వురికొక మహాయుద్ధమే నడుచుగాక ! భారత సమస్య తేలిపోగలదు.

"సాంభాజీ దానిని సమ్మతింపలేదు. ఈ పరిస్థితిలో మాదన్నగారు సాంభాజీవద్ద ఉద్యోగము స్వీకరించుననుటలో నాకు నమ్మకము లేదు. మాదన్న పరాక్రమము సాంభాజీకి బాగుగా దెలియును. సాంభాజీకేమి – సర్వులకు దెలియును."

షా ఆలం ఆసనమునుండి లేచినాడు. అతడు ఇబ్రహీంను గౌగలించుకొనెను.

"సేనాపతీ ! నీ మాటలు నేను నమ్మెదను. దక్కనులోని రాజకీయ పరిస్థితులను కొంచెము గూడ దాచి పెట్టక నా కెరిగించినావు. అల్లా సాక్షిగా నీ మాటలు నమ్ముచున్నాను. ఈ సంధి విషయములో మాదన్న పరాక్రమమే గాక రాజకీయ చాతుర్యము గూడ దెలిసివచ్చును. దాని పరిణామమును ముందు చూతముగాక! ఇప్పుడు నీ వొక్క నా కోర్కె తీర్పవలెను. పోయి సంధిని సఫలమొనర్చికొని రావలెను. మాదన్న విషయము తర్వాత నాలోచింతము"

"మీకిష్టమైనచో నట్లే చేయవచ్చును. నన్ను నమ్మిన వారికి నేనెన్నడును ద్రోహము చేయను."

"ఇబ్రహీం ! ఇంతకుముందు వజీరుగా నుండిన సయ్యద్ మహమ్మద్ గోల్కొండ రాజ్యమున కధికారియని నీవు విని యుండవచ్చును. సుల్తాను, మాదన్న యిర్వురును చేరి యతనిని సప్తకారాగృహమున నుంచినారు. అతనిని విడుదల చేయించి నా కొప్పగించవలెను." ఇబ్రహీం క్షణకాలము చకితుడయ్యెను.

"యువరాజా ! అట్టివాడొకడు సప్త కారాగారమున నున్నాడని నేనును వినియున్నాను. కాని నేనెప్పుడాతనిజూచినది లేదు. మీరడుగుచున్న కాన్క చాలపెద్దది. సయ్యద్ మహమ్మద్‌ను బంధించినది సుల్తానుగారే. అతడింతకు ముందు వజీరుగానుండిన విషయమందరికి దెలియును. అతని పక్షమువారు మా దర్బారులో చాలామంది యున్నారు. అతనికి ఢిల్లీ పాదుషాగారి యాశ్రయము దొరికినచో గోల్కొండ రాజ్యమునకు ఆతనిహక్కు స్థాపితమైనట్లేకదా ! సుల్తానుగారందు కంగీకరింతురను విశ్వాసము నాకులేదు." షా ఆలం కొంతసేపు యోచించినాడు.

"ఆతనికి గోల్కొండ సింహాసనముపై హక్కులేదని మేము సమ్మతించినచో !"

"అదియసంభవము"

"మాదన్న షరతునకు బదులుగా మేమిదియడిగినచో !

"అది సిద్ధింపవచ్చును. కాని మాదన్నగారందుకంగీకరింపరు. ఇందులో మరియొక రహస్యమున్నది. సయ్యద్ మహమ్మద్ విడుదలను మీరు తీవ్రముగ గోరుచున్నారని సుల్తానునకు దెలిసినచో, అతడాతనిని గుప్తముగ సంహరింపవచ్చును. ఇంతపెద్ద భారమును నాపైవేసి నన్ను రాయబారిగా పంపవలదని నా ప్రార్థన. మీకు బందీగా నుండుటయే నాకు క్షేమము"

"ఇబ్రహీం ! ఈ విషయమును నీవు సరిగా యోజించుచున్నట్లు లేదు. ఢిల్లీ పాదుషా సయ్యద్ మహమ్మద్‌ను కానుకగా నడిగినచో గుప్తముగ నాతనిని సంహరించు ధైర్యము సుల్తానునకు లేదు. మీ సుల్తాన్ బుద్ధిమంతుడు, వివేకి. పూర్వాపరములు నాతడు యోచించుకొనును. ఢిల్లీ పాదుషా మాటగాదన్నచో ఉత్తర క్షణమే తల వేయివ్రక్కలగునని యాతనికి దెలియును. మేము కృత్రిమ సంధాన మొనర్చుట కిష్టపడుటలేదు.

"నీవే సంధికి రావలెనని మాకిష్టమైనచో మీ సుల్తానునే యిచ్చటికి రప్పించు కొనవచ్చును; వచ్చిన వానిని బంధించి సయ్యద్ అహమ్మద్ విడుదల కథ నారంభింపవచ్చును. లేక గోల్కొండపైకి హఠాత్తుగా దాడి వెడలి సుల్తానును సంహరింపవచ్చును. సయ్యదు అహమ్మద్‌నకు పట్టము గట్టవచ్చును. ఈ విషయమున మమ్మెదిరించు వారెవ్వరు? ఇబ్రహీం ! నీవు సుల్తాను కడకు బొమ్ము. అతనికి మా యిష్టమును దెలుపుము. ఆపై చూతము. ఈ రాయబారము నీ కిష్టము లేదందువా? మంచిదే. బేషరతుగా నిన్ను వదలుచున్నాము పొమ్ము"

ఇబ్రహీం యువరాజు యాజ్ఞ పడసి అంతఃపురము నుండి బయటికి వచ్చెను.

## 7

ఇబ్రహీం గోల్కొండకు బోవుచుండెను. మార్గ మధ్యమున నాతనికి ముంతాజ్ యెదురుపడినది. ఇబ్రహీమన్నాడు.

"ఇదేమి? ఇక్కడికెట్లు వచ్చితివి?"

"అవునవును; నీ కొరకే వచ్చినాను. నీతో మాటాడవలసిన విషయములు కొన్ని యున్నవి. నీ ప్రయాణ మెక్కడికి? యువరాజు బంధిఖానా నుండి యెట్లు విడిపించుకొని వచ్చితివి?"

"ఎట్లో వచ్చినాను లెమ్ము. ఇంతకుముందొక్కసారి నీవు నన్నీ దారి యందే అడ్డితివి. మరల నిప్పుడడ్డు చున్నావు. నీవు గనిపించినపు డంతయు – ఏదో ఒక అశుభము నాకు జరుగుచున్నది. ఇంతకు నీ వెవ్వరవు? నీ రహస్యమేమో నాకు చెప్పుము?"

ఆమె నవ్వినది.

"సేనాధిపతీ ! నీకు బుద్ధి సరిగాపని చేయుచున్నట్లు లేదు. యుద్ధమున పరాజయము. చెఱసాలలో వాసము. వీనితో నీ కెంతయో బాధ కల్గి యుండును. కారాగారము నుంచి తప్పించుకొని వచ్చినది గూడ ఒక పుణ్యమే. రా ! రా! నీతో మాటాడ వలసిన విషయములు కొన్ని యున్నవి. ఇది ఇప్పుడు మీ సుల్తాను రాజ్యము కాదు. మొగలు రాజ్యము. మన సంభాషణమును యే మొగలు సైనికులైన విన్నచో నిన్ను మరల ననుమానించి పట్టికొని పోవుదురు. ఆ చెట్టు క్రిందికి రమ్ము, ఏకాంతముగ మాటాడి కొందము"

ఇబ్రహీంనకు కొంచెము కోపము వచ్చినది.

"ఇది ఎవరి రాజ్యమైననేమి ? నన్నెవ్వరు పట్టుకొనరు. ముందు నీ కథ ఏమో చెప్పుము. నీవెందుల కిక్కడ దిరుగుచున్నావు? నీ రహస్యమేమి? నా మాటకు సరియైన యుత్తర మివ్వకున్నచో నిన్నే సైనికునకైన పట్టించి వెళ్ళిపోదును".

ముంతాజ్ ఆ మాటకు పడిపడి నవ్వినది.

"ఇట్టి డంబములతో నన్ను వంచించుటకు ప్రయత్నింపకుము. నన్నెవ్వరును బంధింపలేరు. పట్టుకొనలేరు. ఆ విషయ మట్లుంచుము. నా మాటలు జాగ్రత్తగా వినుము. నీవు మరల సుల్తానుకడకు పోవలదు. అతని రాజ్యమెప్పుడో యస్తమించెను. ఆ గోల్కొండ కోటలో అతడొక బందీవలె నున్నాడు. ఢిల్లీ పాదుషా నేడో రేపో మాదన్నను పట్టిదెచ్చి శూలమున కెక్కించును. ఇంక సేన యెక్కడ? సేనాధిపతి యెక్కడ?"

ఇబ్రహీంనకు పట్టరానంత కోపము వచ్చినది. కాని యేమి చేయును? కోపము నణచుకొన్నాడు. అతడనెను.

"ఓ నర్తకీ ! దక్కను రాజకీయములన్నియు నీకు దెలిసినట్లున్నది. నీవేదో ఒక శ్రీమంతుల యింటి బిడ్డవై యందువు. యవ్వనములో నున్నావు. నీ యిష్టము వచ్చినట్లు తిరుగుచున్నావు. యువరాజు శిబిరములో కూడ నీవు కనపడితివి. నీవెవ్వరివో, నీ రాజకీయములేవో నాకు స్పష్టముగా జెప్పుము."

"ఏమున్నది ? నేను దక్కనునకు చెందిన దానినని నీవే చెప్పితివి. అది నిజమే. కాని శ్రీమంతులయింట ఆడుబిడ్డను మాత్రము కాదు. నేనొక నర్తకిని. నా కులగోత్రము లజ్ఞాతములు. ఢిల్లీ యువరాజు రక్షణ నాకున్నది. అతని రాణి నూరున్నీసా పేరు విని యున్నావు గదా? ఆ మహారాణి నా కాశ్రయ మిచ్చినది. నా కెక్కడికి బోయినను భయములేదు. మీ వజీరు నన్ను వెదకించుచున్నాడు. అతనినుండి తప్పించికొని యిక్కడిక్కడనే దిరుగుచున్నాను. నేను హైదరాబాదులోని ప్రసిద్ధ నర్తకియైన 'గులాబ్‌జాన్' శిష్యురాలను."

ఇబ్రహీంనకు ఆశ్చర్యమైనది.

"ఏమి ? నీవు గులాబ్‌జాన్ శిష్యురాలవా ? వజీరు మాదన్న నిన్ను వెదకించు చున్నాడా? మాదన్నగారి కంత అవసరమేమి వచ్చినది? నీవీ అపాయకరమైన రణ రంగములో నెందుకు తిరుగుచున్నావు? నీ విషయము నా కొక్కటియు నర్థమగుటలేదు. ఒక్కటి నిజము. నీ జీవితములో నేదో సమస్య యున్నది. ఏదో ఒక రహస్యమున్నది. అది నా కెఱిగించుట కిష్టము లేకున్నచో నేను నిన్ను నిర్బంధించను. నా నుండి నీకేదైన యుపకారము కావలసినచో చెప్పుము. తప్పక చేతును. ఒక్క రహస్యము మాత్రము నీవు చెప్పి తీరవలెను. మాదన్నగారు నిన్నెందుకు వెదకించుచున్నారు? నీకు సుల్తాను దర్బారులోని రహస్యములన్నియు తెలియును. నేను మాదన్నగారికి ముఖ్యుడనుటయు తెలిసియుండవలెను. ఇదిగో నీ పేరేమంటివి ?"

"నా పేరు 'నజీరాయని' యింతకు ముందే నీకు తెలియును."

"అవునవును. నజీరా !"

అతడు కొంతసేపుతడమాడినాడు. మరల నారంభించెను.

"నజీరా ! ఆ ఒక్క విషయము చెప్పుము. మాదన్నగారు నిన్నేల వెదకించుచున్నారు? ఈ విషయము చెప్పినచో నేను వారికి నీపై నున్న యాగ్రహమును దొలగింతును. ఒక్క

క్షమాపణతో దీరిపోవును. ఇదిగో నావైపు చూడుము. నీవు సౌందర్యవతివి యవ్వనవతివి. ఇట్లు తిరుగుచున్నచో..."

"ఓరి పిచ్చివాడా ! ఆ పరిస్థితినెప్పుడో దాటినాను. ఈ నిర్మానుష్య స్థలములో నేను మాదన్నకు చిక్కినను నన్నేమియు చేయలేదు. అతని తలపై మృత్యువాడుచున్నది. పాదుషా ఉగ్రదృష్టి యాతనిపై బడినది. కాని నీవింకను భ్రాంతిలో మునిగియున్నావు. నీ యుపకారము నాకనవసరము. నేనే నీ కొక యుపకారము చేయవచ్చినాను. నేను నీతో అసత్యమాడుటలేదు. నూరున్నీసా నన్ను చెల్లెలువలె చూచుచున్నదనుకో. యువరాజుల అంతఃపురములో నన్ను చిన్నరాణియని పిలుతురు. మొగలు సేనాధిపతులలో నన్నెరుగనివారు లేరు. నీకొక్కమాట చెప్పుచున్నాను. నీవు సుల్తాను దగ్గరకు పోకుము. ఆ మాట చెప్పుటకే నేను వచ్చితిని. సుల్తాను దర్బారులో అందరికిని నీపైన సందేహము పుట్టినది. నీవు గోల్కొండకు పోయినచో బాగుపడవు."

"ఎందుకు ? వారి సందేహము నన్నేమి చేయును? నా ధర్మము నన్ను బ్రతికించుకొనును. నా ధర్మమే నన్ను చెఱసాల నుండి విడిపించినది.

ముంతాజ్ పకపక నవ్వెను.

"ఇబ్రహీం ! చెఱసాల నుండి విడివడినావనుట నీ భ్రాంతి. యువరాజు నిన్నొక షరతుపై విడిచినాడనుట నీవు మరచిపోవుచున్నావు. ఆ షరతు సామాన్యమైనదిగాదు. చాల కఠినమైనది. దానిని నీవు నెరవేర్పలేవు. నీకు మరల చెఱసాల తప్పదు."

ఈ మాటలతో ఇబ్రహీం హృదయము వడకినది. తల తిరుగ నారంభించెను. వాడు దీనముగ నజీరా చేయిపట్టుకొన్నాడు.

"నర్తకీ ! నీవు సామాన్యురాలవు కావు. నీ ఆలోచనలమోఘములు; నీవన్నట్లు యువరాజు నాకొప్పించిన పని చాల కష్టమైనది. దానిలో విజయమును సాధించుట అసంభవము. యువరాజు కంటబడకుండ తప్పించికొని తిరుగవలెనంతే. నేను గోల్కొండకును పోను. యువరాజు దగ్గరకును పోను. ఈ యుద్ధము చాల దినములు నడువదు. కొలది దినములలో ముగిసిపోవును. అంతవరకు యే కొండలలోనో తల తప్పించుకొని తిరుగుదును. ఆ తర్వాత దేవుడున్నాడు."

"సేనాధిపతి కిప్పుడు కొంత జ్ఞానోదయమైనట్లున్నది. ఇప్పుడు నా సలహా వినుము. నీవు సుల్తానువైపు పోదువో ! యువరాజుతో చేరికొందువో ! స్పష్టముగా నిర్ణయించుకొనవలెను. ఆ తర్వాత పై మాట."

"యువరాజువైపే చేరితి ననుకొమ్ము. తరువాత?"

"ఇబ్రహీం చక్కగా ఆలోచించుకొమ్ము. మాట చెప్పుట సులభము. చేయుట కష్టము"

ఆమె యెందుకో రవంత సేపాగెను.

"కాదు నీవు సుల్తాను కడకేపొమ్ము. బంధిఖానాలోనున్న ఒక మహా పురుషుని విడిపించికొని తేవలెననిగదా నీకు యువరాజు పెట్టిన షరతు. సుల్తానుతో యీ విషయమునే ప్రస్తావించకుము. సమయమునకు కాచుకొనియుండి గోప్యముగా నా పురుషుని విడిపింపుము. ఆతనిని తెచ్చి యువరాజున కొప్పింపుము. అప్పుడు నీ జీవితమున అదృష్టరేఖ తాండవించును. ఢిల్లీ దర్బారుయొక్క అనుగ్రహము నీపైవచ్చును. ఇబ్రహీం, బాగుగా యోచింపుము. ఆ సుల్తానునకు రాజ్యమేది? అధికారమేది? గోల్కొండ రాజ్యమంతయు నేడు యువరాజునకు లోబడినది. సుల్తాను యువరాజు బందీ. చక్కగా నాలోచించుకో. ఆ మహాపురుషుని రహస్యముగా విడిపించు ధైర్యము నీకు లేదా?"

ఇబ్రహీం కంఠము గద్గదమైనది.

"లేదు నాకాతని విడిపించు ధైర్యములేదు. నజీరా ! నీ మాటలు నాకేవేవో భయంకర దృశ్యములను గాన్పింపజేయుచున్నవి. ఏవో కల్లోలములను ముందు నిలుపుచున్నవి. నాకేమి చేయుటకును తోచుటలేదు."

నర్తకి సన్నగా నవ్వినది.

"లేదు లేదు నా మాటలపై నీ కింకను నమ్మకము గలుగలేదు. ఏవేవో సందేహములతో నీ మనస్సు బాధపడుచున్నది. నీవు మాదన్న శిష్యుడవు. అతనిపైనున్న గౌరవ ప్రేమలు నిన్ను పీడించుచున్నవి. ఇట్టినీకు నిజమెట్లు తెలియును? పాదుషా గారి యాగ్రహము మెఱపు వంటి వేగముతో మాదన్నపై బడనున్నది. అతనిని నీవు రక్షింపలేవు. ఆ సమయమునకు సరిగా చెరలోనున్న మహాపురుషుని విడిపించి యువరాజున కొప్పింపుము. నన్ను నీవు నమ్మినచో, నా మాట విన్నచో నేను నీకు సహాయకు రాలనయ్యెదను."

ఇబ్రహీమున కీ మాటలు ప్రాణసంకటమయినవి. ఈమె కేమి సమాధానము చెప్పవలెను? అతడన్నాడు.

"నర్తకీ ! మాదన్నగారు నిన్ను వెదకించు చున్నారంటివి. మరినీవు సుల్తాను కోటకు ధైర్యముగా వచ్చెదవా?"

నజీరా పడి పడి నవ్వినది.

"సేనాధిపతీ ! ఎక్కడికైనను వచ్చెదను" ఏ రాజసభలో నైనను యువరాజు పేరు నేను చెప్పి కొన్నచో నన్ను దాకుట కెవ్వరికినీ ధైర్యముండదు. అంతెందుకు? ఒక్క మాటడిగెదను నీవు శూరుడవు గదా ! నాకేమైన కష్టము వచ్చినచో నీవు రక్షింపవేమో చెప్పుము" ఇబ్రహీం మరుమాట పలుకలేదు. అతడు లేచి నిలిచినాడు.

"సేనాధిపతీ ! పోదము పద, నా రక్షణకై నీవేమియు బాధపడకుము. నా సంరక్షణము నాకు తెలియును" వారిర్వురును గుఱ్ఱము లెక్కి గోల్కొండ వైపు బయనించిరి. వారు

కోటద్వారమును సమీపించునప్పటి కర్ధరాత్రియైనది. ద్వారములందు కావలివారు సర్వకావలి యున్నారు. ఆ సరిహద్దులలో నెవరైన తిరిగినచో వారి తల ఖండింపుడని మాదన్నగారి యాజ్ఞయైనది. దళపతి ఇస్మాయిల్ఖాన్ స్వయముగా పహరాను విచారించుచుండెను. మహాద్వారమందు ఇబ్రహీం నిలచి సంకేతమిచ్చినాడు. ఇస్మాయిల్ ఖానే దగ్గరకు వచ్చెను. సేనాధిపతియైన ఇబ్రహీంను చూచి ఇస్మాయిల్ఖాన్ చకితుడైనాడు.

"మహా సేనాధిపతి ఇబ్రహీం ఖాన్" అని పలికియాతడు సలామొనర్చెను.

"అవును నేనే తిరిగివచ్చినాను".

ఇస్మాయిల్ఖాన్ మహాసేనాధిపతికి త్రోవ విడిచినాడు. తన వెంటవచ్చిన వ్యక్తినిగూడ వదలవలెనని ఇబ్రహీం పలికెను. వారిర్వురును కాలినడకనే రాజమార్గమున బోవుచుండిరి. కోట నిశ్శబ్దముగా ప్రసుప్తమై యున్నది. మధ్య మధ్య కావలివారి యరుపులు దప్ప వేరు శబ్దమే లేదు. నిశాదేవి యా నిశ్శబ్దతలో వెంద్రుక లార బరచుకొన్నది.

కొంత దూరమేగిన పిదప నజీరా ఇబ్రహీం చేయిపట్టి కొన్నది.

"సేనాధిపతీ ? ఇక నా దారి పట్టి నేను బోయెదను సమయము వచ్చినపుడు గలిసి కొందము గాక. నేను చెప్పిన మాటలను మరిచి పోయెదవు సుమా ! నీ మనసున మరల చాంచల్యమునకు తావొసగకుము. ఈ కోటలో నీకు గనిపించు నైశ్వర్యము లన్నియు క్షణ భంగురములు. వానికి లొంగి మాటదప్పినచో నీకు క్షేమముండదు." ఇబ్రహీమునకు 'నజీరా' యొక సమస్య యైనది. "రమణీ ! ఈ ఐశ్వర్యమునకు, అధికారమునకు నేను మోసబోవుటలేదు. కాని నీవు మాత్రము నన్నడుగడుగునను మోసగించుచున్నావు. నీ జీవితమే రహస్యముల పుట్టగా నున్నది. చిన్నరాణీ ? ఒకా నొక నాడు నీ రహస్యమును భేదించి తీరెదను"

"నా రహస్యమును భేదించినచో అది నీకు మేలొనరింపదు."

ఆమె మరల నవ్వినది.

"సుందరీ ! నీ బుద్ధి నీ మాటలు నన్ను వశీకరించుకొన్నవి. ఒక్క విషయము మాత్రము నిజము చెప్పుము. నీవు నర్తకివి కావని నాయంతరాత్మ మాటి మాటికి జెప్పుచున్నది. నిజమో కాదో చెప్పుము."

నజీరా మరల నవ్వెను.

"ఇబ్రహీం ! అది నిజము. నేను నర్తకిని కాను."

హఠాత్తుగా ఇబ్రహీం ఆమె రెండు బాహువులను బంధించివేసినాడు. ఆమె కపోలముల నొక్కసారి చుంబించెను.

"నజీరా ! నీవు నర్తకివి గాకున్నచో నా సర్వస్వము నీ పాదముల చెంత నర్పించి కొందును. ఎట్టి సమయములోనైనను నీ ఆజ్ఞను తలపై తురాయిగా ధరింతును."

నజీరా కాతనినుండి విడిపించుకొనుట కష్టమయ్యెను.

"నిజమేనా? ఈ మాటలు జ్ఞాపకముంచి కొనుము. నేనిక పోయివత్తును."

"నీ వేరు చోటికి పోవుటెందుకు? నా వెంట రమ్ము."

"కాదు. కాదు."

ఆ మాటతోనే నజీరా యానిశీథమున మాయమయ్యెను.

**8**

ఢిల్లీనుండి రాయబారులు తిరిగివచ్చినారు. వారు సుల్తానునకు పాదుషావారి మాటలు వివరించిరి. పాదుషా షరతులను గూడ చెప్పినారు. సుల్తాను మాదన్నను పిలపించి జరిగిన విషయములన్నియు తు.చ. తప్పక వివరించినారు.

మాదన్న చాలాసేపు యోచించెను.

"ఖామంద్ ! ఇప్పుడీ షరతులను మీరొప్పుకున్నచో మేలు. ఆ తరువాత మనము యోచించి కొనవచ్చును."

"మాదన్నగారూ ! ఈ రాజ్యము పోయినను లెక్క లేదు. మిమ్ము మాత్రము వదలలేము. మీ వంటి స్వామి భక్తులింకను జగత్తులో పుట్టవలసి యున్నది. మీ రక్త మాంసములను గోల్కొండకై ధార వోసినారు. మీ బుద్ధి సహాయమున్నచో గోల్కొండ యేమి? ఢిల్లీ సామ్రాజ్యమే నాకు దక్కవచ్చును. మీ సేవను గమనింప లేనంతటి కృతఘ్నుడనని నన్ను మీరు భావింపరాదు. ఈ రాజ్యమునకు నిజమైన యధికారిని నేను కాదు. మరిమీరు, మీ బుద్ధి శక్తిచేతనే యింతకాల మీ రాజ్యము నేలు చున్నాను. మిమ్ముల నెట్లు వదలగలను?"మాదన్న నవ్వుచు నన్నాడు.

"అది కొంత సత్యమే కావచ్చును. కానిప్పుడు నా హితవచనములను మీరు తప్పక వినవలెను. ఈ షరతులు మీ రంగీకరింపవలెను. బీజాపురములో భయంకరమైన యుద్ధము జరుగుచున్నది. దానిని ముగింపనిది పాదుషా మనవైపురాడు. అందుకే అతడు సంధికై త్వరపడుచున్నాడు. ఇప్పుడీ యవకాశమును మనము జాఱవిడువరాదు. దక్కనులో బ్రదికినచో నీ రెండు రాజ్యములును బ్రతుకవలెను. చచ్చినచో రెండును చావవలెనంతే, రాజ్యమే పోవు దుస్థితి వచ్చినపుడు నాయధికారము మాత్రమెక్కడుండును? మీరు మాత్ర మెక్కడ నుందురు.? నేనొక్క పథకమును వేయబోవుచున్నాను. మీరీ సంధికి తప్పక అంగీకరింపుడు."

సుల్తాను ఢిల్లీకి పోయివచ్చిన రాయబారులను పిలిచినాడు.

మంత్రియైన 'షేక్‌మిన్‌లాస్'ను గౌరవపూర్వకముగా రప్పించుకొనెను.

"ఢిల్లీలోని రాయబార విషయములు మీరు విపులముగా వివరింపవలెను. ఏమియు దాచుకొనగూడదు."

వారు జరిగిన విషయమంతయు వివరించిరి. మాదన్న యన్నాడు.

"సుల్తానుగారూ ! మనమోడినాము. ఇప్పుడీ సంధి షరతులుగూడ గౌరవయుతముగా నున్నవి. మనరాజ్యమునకే యపాయములేదు., మీరీ సంధికంగీకరింపవలెనని నా తలపు. నేనిప్పుడే నా అధికారమును వదలుకొనుచున్నాను. మీరు వృద్ధులైనారు. ఈ 'షేక్‌మిన్‌లాజ్' గారిని మంత్రులుగా నియమించుకొనవచ్చును."

'మిన్లాజ్' సుల్తాను మొగము జూచినాడు. మరల నాతడు మాదన్నవైపు దిరిగెను.

"మాదన్నగారూ ! సుల్తానుగారి స్వభావము మీరు చక్కగా నెరిగినవారు. నాకీనడుమ పరిచయము తక్కువ. యుద్ధము ముగిసిన వెంటనే పాదుషాగారెట్లైనను మిమ్ము పట్టి తెప్పించుకొనుటకు యత్నింతురు. మీరు మరణము తప్పదు. ఆ తరువాత మాగతికూడనంతే. నాకీయధికారమిష్టములేదు. పాదుషాగారిదృష్టి నాపై పడకుండుటయే నాకు క్షేమము".

'మిన్‌లాజ్ గారూ ! మొగలులిప్పుడు రాజ్యము గెలుచుకొనియేయున్నారు. వారుపెట్టిన షరతులలో ముఖ్యమైనది నా విషయమే. దానిని వదలినచో సంధియే లేదు. మీరు మంత్రి పదవికొప్పుకొనకున్నచో మనలనందరిని వారు పట్టి తెప్పింతురు. మనమందరము మరణించుట తప్పదు. నన్నొక్కనిని వదలినచో సుల్తానుగారికి రాజ్యము దక్కును. పాదుషాపెట్టిన షరతులలోని రహస్యమింతే" మాదన్న యీ మాటలని వెంటనే 'రాయసం' వారిని బిలపించినాడు. సంధిపత్రములు వ్రాయబడెను. సుల్తానును చేవ్రాలు చేయవలసినదని ప్రార్థించినాడు. సుల్తాను కండ్లనీరు గ్రుక్కుకొనెను. కన్నీటితోనే చేవ్రాలొనర్చినాడు. బక్షీనిపిలిచి మాదన్న ఆ పత్రమును రాజముద్ర వేయించినాడు. ఆ పత్రములు రాయబారుల కివ్వబడినవి.

"ఈ పత్రములు తీసికొనిపోయి షోలాపురములోని యువరాజుకిండు. సుల్తానులు, మంత్రియైన షేక్‌మిల్‌నాజ్‌గారు వారి యాజ్ఞలను సంపూర్ణముగ పాటింతురని మనవి సేయుడు".

మాదన్నగారు తమకు తామే యధికారమును వదలుకొన్నారని వివరింపుడు. సుల్తాను రాయబారులను పంపివేసెను. షేక్‌మిల్నాజ్‌గారు రాజ్యభారమును వహింపవలెననియు, సుల్తానుల యాజ్ఞమేరకు రాజ్యమును పాలింపవలెననియు, చెఱసాలనుండి విడుదలయై వచ్చిన ఇబ్రహీం సేనాధిపతిగా నియమింపబడవలెననియు మాదన్న చెప్పినాడు."ఇబ్రహీం యువరాజు బంధనమందుండెను. అతని నేలవదలినారు?" మంత్రి ప్రశ్నించెను.

"సంధి జరిగిన పిదప మిన్‌లాజ్‌గారే యువరాజును దర్శించి యీ విషయమును స్పష్టముగా మాటాడికొనవచ్చును. ఇప్పుడు మనకేమియు తెలియదు" మాదన్న పలికినాడు.

అందరును తమతమ భవనములకు బోయిరి, రాయబారులు సంధి పత్రముతో యువరాజును దర్శించినారు. వృద్ధమంత్రి "మిన్‌లాజ్" ఇబ్రహీంను తన భవనమునకు పిలిపించికొన్నాడు. ఇబ్రహీం మొగమునిండ నిరుత్సాహమైనది. మిన్‌లాజ్ ప్రశ్నించినాడు.

"ఇబ్రహీం? నీవు వీరపురుషుడివి. గోల్కొండ రాజ్యమునింతవరకు సేవించిన స్వామిభక్తుడివి. సంధిలోని రహస్యమేమో తెలిపెదవా !"

ఇబ్రహీం కంఠధ్వని నీరసమైనది.

"ఏమున్నది? మాదన్నగారి యధికారముతో యీ రాజ్యము హిందూ రాజ్యమైనదని పాదుషా నమ్మినాడు. అతనికి గోల్కొండ కంటెను సాంభాజీ పెద్దశత్రువు. సాంభాజీ హిందువు. మాదన్న హిందువు. వీరిర్వురకును రహస్యసంబంధముండునని పాదుషా యూహలల్లుకొన్నాడు. మాదన్నగారి యధికారము తప్పించినచో గోల్కొండ పూర్తిగా ముస్లిం రాజ్యమగును. అప్పుడిక్కడ పాదుషా యధికారమే చెల్లును. ఇదే పాదుషా యోచన. ఇందులో కొంత సత్యముగూడనున్నది." "నీవనికొన్నట్లేయైనచో మాదన్నునుపట్టి మా కొప్పించవలెనని పాదుషా స్పష్టముగా యెందు కడుగలేదు" కాంతి హీనమైన ముఖముతోనే ఇబ్రహీం నవ్వినాడు. "మంత్రి గారూ ! క్షమింపవలెను. మాదన్నగారిని పట్టుకొనుట అంత సులభమైనదికాదు. వారు సుమారు ముప్పది సంవత్సరముల నుండి రాజ్యమేలినాడు. సైన్యము, గూఢచారులు, రాజ్యకోశము యంతయు వారి యధానములో నుండెను. వారిచే నుపకారమంది దాసానుదాసులైనవా రెందరో యున్నారు! ఈ పరిస్థితిలో మాదన్నగారిని పట్టియిచ్చు శూరుడు దక్కనులో నెవ్వడున్నాడో చెప్పుడు ! ఢిల్లీ పాదుషా కీ విషయములన్నియు స్పష్టముగా తెలియును. వేరుపాయములతో తానే మాదన్నగారిని బట్ట నూహించునట్లున్నది"

ఈ మాటలతో మిన్‌లాజ్ నిరుత్తరుడైనాడు. అతనికి మాదన్నపై గూడ కోపముకద్దు. అతడా విషయము మార్చెను.

"అది పోనిమ్ము, హఠాత్తుగా నిన్ను యువరాజెందుకు విడుదల చేసినాడు?"

"మంత్రిగారూ ? నాకు గూడ నదియే సందేహముగా నున్నది.?"

"ఈ సంధి షరతులను తు.చ. తప్పక పరిపాలింపవలెనను నూహతో నిన్ను వదలి యుండునా !"

ఇబ్రహీం వినయముతో "కావచ్చును. కాని యువరాజు నాపై నట్టిషరతులేవియు పెట్టలేదు."

"వజీరు మాదన్నగారు అధికారము వదలుకొనుదురని నీకు తెలియునా?"

"ఇంతవరకు తెలియదు, కాని యిట్టి పరిస్థితులలో వారధికారమును వదలుకొనుటలో నాశ్చర్యములేదు".

"వారధికారమును వదలుకొన్నారు"

"అయినచో వజీరుగా నెవరుందురు !"

"ఇకమీద వజీరనెడు అధికారమేలేదు. నేను మంత్రినై రాజ్యము నేలవలెనంటే నీకు మహాసేనాధిపతి పట్టమివ్వవలెనని సుల్తానుగారి యాజ్ఞయైనది.

"నన్ను క్షమింపవలెను. కాని నాకా యధికారమక్కరలేదు!"

"ఎందుకు? సుల్తానుల యాజ్ఞలను పాలించుట కిష్టము లేదా?

"యుద్ధములో నోడిపోయి, పగవారికి బందీగా చిక్కినవాడు మహాసేనాధిపతిగా నుండుట మర్యాదగా నుండదు."

మిన్‌లాజ్ మరేమియు మాటాడలేదు.

ఇబ్రహీం సలాము చేసి తన గృహమునకు వెళ్ళినాడు.

ఇబ్రహీం సుల్తాను దర్శన మొనర్చుకొనెను. సుల్తానతనిని గౌరవముతో రావించుకొన్నాడు.

"ఇబ్రహీం ? మాకును, సుల్తానుకును సంధియైనది. ఆ విషయము తెలియునా?

"హుజూర్ ! తెలియును. నాకింతకుముందే ఢిల్లీ యువరాజుగారు తెలిపినారు."

"యువరాజును నీవు స్వయముగా నెరుగుదువన్నమాట. అతని స్వభావమెట్టిది?

"హుజూర్ ! అతడే నన్ను విశ్వాస గౌరవములతో జూచెను. నేను బందీయనుట అతడు గమనించినట్లేలేదు. మిత్రునివలె పలుకరించినాడు. అతడు చాల ఉదారుడు. రెండు సందర్భములలో నాకాతని యౌదార్యము స్పష్టమైనది. అది నేనేనాటికైనను మరువలేని యౌదార్యము. కడపటి దినమందలి యుద్ధములో మనము దాదాపు ఓడిపోయియేయుంటిమి. అతడా దినము విరామమొసగినాడు. ఆ విషయమునాతడు తన సేనాధిపతితో చెప్పి పంపెను. స్త్రీలు, వృద్ధులు, పిల్లలు మొదలగువారిని సురక్షిత స్థలములలో చేర్చి మరల యుద్ధమునకు రావలెనని యాతని యాజ్ఞ. ఈ కాలములో నిట్టిధర్మబుద్ధి యాశ్చర్యకరమైనది. మేము హైదరాబాదును ఖాళీ యొనర్చితిమి. ఆపై పెద్ద యుద్ధము జరిగినది. మొగలు సైన్యములు గెలిచినవి. వారిజయము స్పష్టమైయుండెను. అప్పుడు నన్ను వారు చెరబెట్టిరి. షోలాపురములోని యంతఃపురమందే నన్నొకచోట నుంచినారు. బంధనము నామమాత్రమై యుండెను. "పాదుషాగారి నుండి సంధి చేసికొనుటకై యాజ్ఞ వచ్చినది. నిన్ను విడిచిపుచ్చుచున్నాము. నీవు స్వతంత్రుడవు. పోయిరావచ్చు నని యొకనాడు హఠాత్తుగా పలికినారు. నాయాశ్చర్యమునకు మేఱలేకపోయినది. ఈ రెండు సందర్భములందును ఆ మహాపురుషుని యౌదార్యము వేయినోళ్ళతో పొగడదగినది." "మాదన్న ధన్నాయకులపై

వారికేల యంతయాగ్రహము?" "ఏమో ? పాదుషా మనస్సులో నేమున్నదో ! కాని యువరాజు మాత్రము మాదన్నగారిని గొప్ప వీరుడని గుర్తించినాడు. మాదన్నగారి కధికారము తొలగినచో గోల్కొండ తమ వశమైనట్లేనని వారి నమ్మకము. గోల్కొండను జయించుట కంటెను మాదన్నగారిని జయించుటయందే వారికి గొప్పపట్టుదల యున్నట్లున్నది."

సుల్తాను ముఖము ఖిన్నమైనది. అతడు పలికినాడు.

"ఇబ్రహీం ? నీకు తెలియనిదేమున్నది ? ఈ మాదన్నగారిని నేనెట్లు వదలుదును? వారిని వదలుట మిత్ర ద్రోహముగాదా!"

"హుజూర్ ! ఈ విషయమున తమరు సర్వస్వతంత్రులు. మాదన్నగారింతటితో నిరుత్సాహము పొందునట్టివారు కాదు. ఇప్పుడు వారి సలహా మేరకు మనము వర్తించుటయే మేలు. ఈ విషయమున నభిప్రాయమొసగుటకు నాకు యోగ్యత చాలదు. నేను చాలచిన్నవాడను."

"మాదన్నగారు నిన్ను మహాసేనాధిపతి నొనర్పవలెనని యిచ్ఛించుచున్నారు. నీ యభిప్రాయమేమి?"

"ప్రభూ ! నన్ను క్షమింపవలెను. మహాసేనాధిపతిగా నుండుటకంటెను, తమకు సేవకుడుగా నుండుటయే నాకు శ్రేయస్కరము. నా కోర్కెయు నదియే. నేను శత్రువులకు బందీగా చిక్కి తిరిగివచ్చినవాడను. నేను సేనాధిపతినైనచో సేనలకు గౌరవముండదు. దయచేసి వేరొకరిని నియమింపవలెనని నా ప్రార్థన" సాహసింపవలసిన సమయము వచ్చినచో నేను యుద్ధమునకు సిద్ధమే. కాని యుద్ధమున కవసరమే యుండదని నా తలపు."

"మాదన్న ధన్నాయకు లధికారమును వదలిరి. నీవు సేనాధిపతి వగుటలేదు ! ఇంక నేను నెవరిని నమ్మి నేను రాజ్యమునకు బూనుకొనవలెను?"

"హుజూర్ ! తమరా మాటనరాదని నా అభిప్రాయము. మేమందరము గూడ సమయము వచ్చినపుడు తమ పాదముల చెంత ప్రాణములు వదలుటకు సిద్ధముగా నున్నాము"

ఆ నాటి రాత్రి ఇబ్రహీమునకు తన నివాసభవనమందే నజీరాగన్పించినది. ఆమెయాతనిని హాస్యమాడినది.

"వీర సేనాధిపతీ ! అధికారము వలదన్నావటగదా !"

"నిజము నజీరా ! నే నంగీకరింపలేదు."

"కారణము"

"నీ కన్ని రహస్యములు గావలెను. ఒక్క దానిని గూడ విడువవు. నేనొకవేళ చెప్పకున్నను. యెట్లో ప్రయత్నించి కనుగొందువు. ఇప్పుడు మంత్రిగా 'షేక్‌మిన్‌లాజు'ను నియమించినారు.

అతడంత యోగ్యుడైన మనుష్యుడు కాడు. మాదన్నగారిపై నాతనికి మొదటి నుండియు నసూయకద్దు. ఇప్పుడతనికే యధికారము జేజిక్కినది. నాకు మాదన్నగారిపై నున్న గౌరవము నీ వెరిగినదే. దానిని పురస్కరించుకొని మిన్‌లాజు నన్ను చిక్కులలో బెట్టునని నా విశ్వాసము."

"ఇబ్రహీం ! నిజము చెప్పితివి. ఇంకనీకు హైదరాబాదులో నేమున్నది ? ఆశ్రయము లేదు. గౌరవము లేదు. పనిలేదు. నా వెంట యువరాజు దగ్గరకు రమ్ము నీకొక పెద్ద యుద్యోగమిప్పింతును."

"నజీరా ! నీవు నన్ను చాల తక్కువగ అంచనా వేయుచున్నావు. యువరాజుకడ నాకేమి పనియున్నది? జీవించువరకు సుల్తానుగారి సేవకే నా ప్రాణమంకితము."

"అవునవును. నాకీమాటలన్నియు తెలియునులెమ్ము. మాదన్నవలెనే నీవు నొక్కనాడు పరిగెత్తుకొని పోయెదవు". ఇబ్రహీమునకు కోపము వచ్చెను. అతడు స్వయముగా నావేశి. వాడు నజీరాపై చేతులెత్తెను. ఆమె వాని రెండు చేతులను పట్టుకొన్నది.

"సేనాధిపతీ ? నీ బలప్రదర్శనమునకు తగిన పాత్రమును చిక్కించుకొన్నావు. వీరుడవైనావులే కూర్చొమ్ము". ఆమె వానిని బలాత్కారముగా నాసనముపై కూర్చుండబెట్టెను.

ఇబ్రహీం కొంతసేపు మౌనముగ నున్నాడు. వాని మనసు కుదుటపడినది.

"నజీరా ! మాటిమాటికిని నన్ను కెలకి కోపమును తెప్పించుట నీకొక క్రీడగా నున్నది. నీ రహస్య మొక్కటియు చెప్పవు. నీవు యువరాజు భవనమునుండి యిచ్చటకు వచ్చుట కెందుకో చెప్పుము".

"నిన్ను రక్షించుటకు"

"ఏమీ ! నన్ను నేను రక్షించుకోలేనంతటి అసమర్థుడనా ? నన్నొక యాడుది రక్షించవలెనా?

నజీరా మాదకముగ నవ్వినది.

"నీవేమి, నీవంటి వీరులెందరో చరిత్రలో స్త్రీలచే రక్షింపబడినవారున్నారు? ఇబ్రహీం ! నీవు ధైర్యముగా నుండుము నేను పోయివత్తును. మరొకసారి నిన్ను గలిసి కొందును."

"ఈ చీకటిలో నెక్కడికి పోయెదవు?"

"నాకు తోచిన చోటికి ?"

"ఈ కోటలో నిన్నెరిగిన వారెవ్వరును లేరు. ఊరక యేల చుట్టెదవు – ఇక్కడనే యుండరాదా?"

"నీకేమి ఉండమందువు లోకులనోళ్ళు మూయు వారెవ్వరు?"

ఇబ్రహీమునకు నవ్వు వచ్చినది.

“ఢిల్లీ యువరాజు శిబిరములో నుండుటకు నీకు లోకాపవాదములేదు. చిన్నరాణి యనిపించుటకు సిగ్గులేదు. ఇక్కడ నీకపకీర్తి వచ్చినది”

“నేనప్పుడొక యనాథను. యువరాజు రక్షణమునాకు గావలసియుండెను. యువరాజు రాణి నూరున్నీసా నాకాశ్రయ మిచ్చినది. అక్కడ నే నుండుటలో సిగ్గుపడవలసిన దేమున్నది? ఇక్కడ నీవే యపాయములో నున్నావు. నిన్ను నమ్ముకొని నేనుండగలనా? చాల బాగున్నది.”

“నజీరా ! మాటలలో నిన్ను గెలుచుకొనుట చాల కష్టము. ఈ రాత్రిలో నెక్కడికి బోయెదవో చెప్పుము”

“నేనా?” నజీరా స్పష్టముగా నవ్వినది.

“నేనంతఃపురమునకు పోయెదను. మహారాణి మహలునకు తెలిసినదా” ఆమె మరల నవ్వెను.

ఇబ్రహీం శరీర మాశ్చర్యములో స్తంభించిపోయినది.

“ఏమీ ! మహారాణిగారి మహలునకా?

“అవును. నీవు నమ్మవా?

“నీ విషయమున నేది నమ్మను? కాని యీ విషయమును ప్రత్యక్షముగ చూచినను నమ్ముట కష్టము. నీవొక మాయావిని”.

నజీరా యాసనమునుండి లేచినది. ఆమె వాకిలి దెరచెను. ఇబ్రహీం ఆమె వెనుకపాటుననే పోయి, నజీరాను గట్టిగా పట్టుకొనెను.

“నజీరా ! నీవు నన్ను పిచ్చివానిగా జేసి యాడించుచున్నావు. నీవెవ్వరు? నిజము చెప్పవా? నన్ను నీవు నమ్మవా ?”

నజీరా కన్నులతో నవ్వినది.

“నిన్ను నమ్మకేమి? ఈ రణభూమిలో నొంటిగా నీవెంట రాలేదా? నీపై నమ్మకము లేకుండగనే వచ్చినానా? ఈ యేకాంతమున నీతో మాటాడుటకు రాలేదా? నీపై నమ్మకము లేకయే యిందుకు సాహసించితినా? నీపై నాకు సంపూర్ణ విశ్వాసము. కాని నేనొక హఠము బట్టితిని. అది నెరవేరిన వెంటనే వచ్చి నీతో చేరెదను. నాకీ విశాల ప్రపంచమున నీవొక్కడవే బంధువు. నాకైనవాడవు.”

ఇబ్రహీమునకీ మాటలేమియు నర్థముకాలేదు. కాని వానిలో నేదియో విషయము దాగినది. మహాభయంకరమైనది. అమె మాటలలో అమృతమువంటి స్నేహమున్నది. దిక్కు తెలియని ఇబ్రహీం ఆమె పాదములపై బడినాడు.

“పోవలదు నజీరా ! నన్ను వదలి పోవలదు.”

ఆమె యా మాటలు వినిపించుకోలేదు. ఆ చీకటిలో నైక్యమైపోయినది.

## 9

సంధి యేమో జరిగినది. కాని సంధి షరతులు పాలింపబడలేదు. ఢిల్లీ నుంచి షా ఆలంనకు జాబులు పైపైన వచ్చుచున్నవి. యువరాజు సైన్యసమేతుడై హైదరాబాదునకు పోవలెననియు, కప్పము వసూలు చేయవలెననియు పాదుషా వారి యాజ్ఞ. యువరాజు హైదరాబాదున సేన విడిసెను. ఆ పట్టణమున నెచ్చట జూచినను మొగలు సైన్యములైనవి. సుల్తాను బెదరిపోయినాడు. అతడు కప్పములోని యర్ధభాగమును చెల్లించెను. ఆ ధనము ఢిల్లీకి సాగిపోయినది. "మాదన్న సమాచారమేమి? వాడధికారమును వదలుకొన్నట్లు లేదు. గోల్కొండ కోటలో సురక్షితముగ నున్నాడు. మాదన్నను వదలినట్లు సుల్తాను నటించుచున్నాడు. యువరాజు లీవిషయ మందెందులకో యుపేక్ష వహించు చున్నట్లున్నది. పాదుషాగారే సైన్యసమేతులై దక్కనునకు విజయము చేయుచున్నారు. ఢిల్లీ నుండి యీ జాబువచ్చినది. యువరాజు ధైర్యము తెచ్చికొని "అర్ధభాగము కప్పము వసూలైనది. అది ఢిల్లీకి పంపబడినది. మాదన్నను బలవంతముగ బంధించి పంపవలెనని యాజ్ఞయైనచో అట్లే చేయుదు"మని ప్రత్యుత్తరము వ్రాసి పంపినాడు.

షా ఆలంనకు మాదన్న విషయమొక సమస్యయేయైనది. రెండు మూడు మారు లాతడు మాదన్న కాజ్ఞనంపించెను. అతడు యువరాజు సమ్ముఖమునకు రాలేదు. మాదన్న ధన్నాయకుని పంపవలెనని సుల్తానునకు కబురు పెట్టినాడు. అక్కడనుండి యుత్తరమే లేదు. ఇబ్రహీమునకు వార్త పంపెను. ప్రత్యుత్తరము లేదు. యువరాజు హతాశుడైనాడు.

యువరాజు హైదరాబాదులో మకాము వేసిన సంగతి ముంతాజునకు తెలిసినది. ఇబ్రహీం ఆ విషయమామెకు తెలిపినాడు. ఆమె కోటనుండి వచ్చి యువరాజును గలసికొన్నది. ఆమెను చూచి యువరాజున కెంతో యానందమయ్యెను. ముంతాజును తన యంతరంగ భవనమునకు పిలిచికొని పోయినాడు.

"ముంతాజ్ ! గోల్కొండలోని విశేషములేమి? సుల్తానెట్లున్నాడు?"

"ఎట్లున్నాడు నాట్య సంగీతములతో కాలము గడుపుచున్నాడు. తప్పత్రాగి తూగుచున్నాడు. వారాంగనల మధ్యలో దినములు గడుపుచున్న యాతనికి బయటి ప్రపంచమే గనబడుటలేదు."

"ఇబ్రహీము మా దర్శనమునకు మరల నేలరాలేదు?"

"అతడు మీ యెదుటి కే మొగము బెట్టికొని వచ్చును? అతని యాశలు నిరాశలైనవి. అనాధునివలెనైనాడు"

"మాదన్న సమాచారమేమి?"

"అతడంతఃపురమునకు వచ్చుటలేదు. సుల్తానుతో నిప్పుడే సంబంధమును లేదు."

"ఎందువలన?"

"ఎవ్వరికిని తెలియదు. అతని రహస్యమభేద్యముగా నున్నది."

"ముంతాజ్ ! నీవు సుల్తాను నెప్పుడైన చూచితివా?"

"నేనెందుకు జూడవలెను? అతనితో నాకేమిపని యున్నది?"

"నీవు కోటలో నెక్కడున్నావు?"

"నేనా ! సుల్తానుని యంతఃపురములో"

యువరాజునకు దిక్కు తోచలేదు. అతడు స్తంభితుడైనాడు.

"నీకంతఃపురమున నాశ్రయమెట్లు దొరికినది?"

ముంతాజ్ గంభీరురాలైనది.

"మీయంతఃపురమున దొరికినట్లే"

"నా యంతఃపురమున ప్రవేశమును కల్గించినది నేనే"

"కావచ్చును. ఇక్కడే నొక కారణమైనచో అక్కడ మరియొక కారణము. యువరాజా ! గోల్కొండ యంతఃపురములో నిర్వురు రాణులున్నారు. వారుగతించిన నవాబుగారి భార్యలు. వారికింకను ప్రాయము మీరలేదు. సౌందర్యమునకు తక్కువలేదు. వారిర్వురును మాదన్నపై ద్వేషముకట్టి సాధించుచున్నారు. వారికి నా జీవితము తెలియును. నేను రాజ నర్తకియైన గులాబ్‌జాన్ బిడ్డనని వారి యూహ, నాకు మీ ఆశ్రయమున్నదనియు వారెరుగుదురు. వారి గూఢ తంత్రములో నన్నుగూడ జేర్చికొన్నారు. ఆ అంతఃపురములో నా వంటి వారెందరో యున్నారు. కాని వారెవ్వరికిని యీ గూఢతంత్రములో భాగములేదు.

"ఏమి గూఢ తంత్రము?"

"మాదన్నను జంపవలెనని వారి యత్నము."

యువరాజునకీ వార్త మరికొంత యాశ్చర్యమును కలిగించినది.

"మాదన్నను జంపుటతో రాజ్యములో కల్లోలము రేగదా?"

"ఐనచో మాకేమి ? సుల్తాను ప్రాణమునకు కష్టము" ముంతాజ్ నవ్వినది.

"మాదన్నగారిని చంపునద్వెరు?"

"ఆ యిర్వురు రాణులే చంపెదరు. వారు సమయమునకై కాచికొన్నారు."

"ముంతాజ్ నీవు గోల్కొండ కెందుకు పోయెదవు. ఇచ్చటనే యుండరాదా?"

"యువరాజులు నన్ను క్షమింపవలెను. మీ దగ్గరుండుటయే నాకెక్కువ ప్రియము. కాని నా కార్యక్షేత్రము గోల్కొండ కోట. ఇకమీద జరుగు కల్లోలములలో ఇబ్రహీమును

రక్షింపవలెను. అతనికి మాదన్నపై నమితభక్తి. ఈ తంత్రములో నాతడు చిక్కికొన్నచో అతనికి చావు తప్పదు. అతని నీ తంత్రమునుండి వేరు చేయవలెను. రాణులకు మాదన్నను వధించుటకు సమయమును సమకూర్పవలెను. ఇంతకన్నను పెద్ద పనియేమి కావలెను?"

"ముంతాజ్ ! నేనొక్క విషయ మడుగుదునా?"

"తప్పక ! అందుకు సందేహ మెందుకు?"

"నీవిబ్రహీమును ప్రేమించు చున్నావా? మాకా యనుమానమున్నది. అతనిని విడిపించుట కూడ నీకు సంతోషమగు ననియే."

ముంతాజ్ చాలాసేపు నవ్వినది.

"యువరాజేమి ! వీధి బిచ్చగాడేమి? పురుషులందరికిదే గుణము. స్త్రీలను చూచిన చాలును. వారి మనస్సు పాలవలె పొంగును. ఇబ్రహీమును కూడ యిదే సందేహము పీడించు చున్నది. "నీవు యువరాజునకు చిన్న రాణివని" అతడు నన్ను హాస్యము చేయును".

"ఔనౌను, చిన్నరాణివే; నీకేమి తక్కువున్నది. కులము, శీలము, అపురూపమైన సౌందర్యము" ముంతాజును బిగ్గరగా కౌగిలించుకొన్నాడు. అతడామెను ముద్దిడెను. ముంతాజు లేచి నిలిచికొన్నది.

"యువరాజా ! ప్రేమ చాల విచిత్రమైనది. అది తలచుకొన్నపుడు తలచుకొన్నవారిపై పుట్టును. యిప్పుడో యది పుట్టి తనయాధిపత్యమును నడపికొనిపోవును. ఇప్పుడు నా హృదయమున మాత్రము ప్రేమకుచోటేలేదు. ద్వేషము, ఉద్రేకము, ప్రతిహింస యీ భావములే నా హృదయమంతయు నిండినవి. నాకు సెలవివ్వవలసినది. నేను మరి యొకసారి మిమ్మొ కలసి కొందును. ఒకటి మీరు జ్ఞాపకముంచి కొనవలెను. నేను నలుగురి కన్నులలో నర్తకి నజీరా; నా ప్రయత్నము సిద్ధింపవలెనని మీరు నన్నాశీర్వదింపుడు" ఈ మాటలనుచునే యామె నిష్క్రమించెను.

## 10

పాదుషా సైన్యముతో షోలాపురమునకు వచ్చినారు. ఆ సైన్యము సాగరమేయై యుండెను. పాదుషా గురువైన 'షేక్‌సారేహింద్' గూడ వెంటవచ్చినారు. పాదుషాకు షా ఆలంపై బ్రహ్మాండమైన కోపము వచ్చెను. షోలాపురమునకు వచ్చినదినమే షా ఆలంను పిలపించికుని రావలసినదని హైదరాబాదుకు సేవకులనంపెను. ఒక వారము గడచినది – యువరాజు పాదుషా దర్శనమునకు రాలేదు. ఔరంగజేబు కోపము రెండింతలైనది. షోలాపురము నందు మన యువరాజుయొక్క యంతఃపురమున్నది. అందు నూరున్నీసా యొక్కతెయేగాక మరినల్వురు స్త్రీలుండిరి. ఢిల్లీ నుండి షోలాపురమునకు వచ్చిన తరువాత నూరున్నీసా తప్ప, తక్కిన ముగ్గురు రాణులును కోపముతో చిడిముడి పడుచున్నారు. 'షా ఆలం' నూరున్నీసాయందే

బద్ధానురాగుడై యుండెను. ఇది వారి కోప కారణము. ఎట్లైనను జేసి పాదుషాకు నూరున్నీసాపై కోపము దెప్పింపవలెనని వారి ప్రయత్నము. ఆ సుందరులలో ఖదీరాబేగం ఒక్కతె. ఆమె వయస్సున చాల చిన్నది. రూపలావణ్యములు చక్కగా నుండును. షాఆలం ఆమెను మెచ్చి పెండ్లి యాడెను. ఆమె జయపూర్ రాజపుత్ర స్త్రీ. ఢిల్లీ యంతఃపురమందామెకు జయపూర్ 'బేగం' అనియే పేరు. ఎంత సౌందర్యముండెనో ఆమెకంత సాహసముండెను. యువరాజున కామెపై ప్రీతి. కాని ఆమెకు షాఆలంపై నంత మక్కువలేదు. అతడు పరాక్రమశాలిగాడని యామె యతృప్తి. షా అజంపై ఆమెకు కన్ను. అతని పరాక్రమమును గూర్చి యనేక సారు లామె వినియుండెను. ఒక దినము షోలాపురమందు షాఆలం ఖదీరాబేగంల మధ్య కలహమేర్పడినది.

"నేను ఢిల్లీకి వచ్చినది షా అజంను పెండ్లియాడుటకు, నీవు నన్ను మోసగించి చేపట్టితివి. ఎంతోమంది రాజపుత్రులు నన్ను ప్రేమించి యుండిరి. వారిని గాదని ఢిల్లీకి వచ్చితిని. ఏమైనది! నా కోర్కె తీరలేదు. పేడిమొగడు చిక్కినాడు."

షా ఆలంనకు పెద్ద యవమానమైనది. ఖదీరా యంతఃపురమునుండి యాతడు గడ్డకు వచ్చెను. మరలనక్కడికి పోనేలేదు. నూరున్నీసా అనుపమ సుందరి. విద్యావతి. ముసల్మాను కులమున జన్మించినది. ఖిన్నుడైన యువరాజు మనస్సునకు నూరున్నీసా సన్నిధానము అమృత సరోవరమువలె నుండెను. అచటాతడు రాజహంసయై తేలియాడుచున్నాడు. పగలు, రాత్రిళ్ళు దెలియుట లేదు.

యువరాజు సుఖసంతోష ప్రియుడు. యుద్ధములన్నచో నాతని కంత యాసక్తి లేదు. కాని యుద్ధము తన పాలబడినది. యువరాజు పరాక్రమశీలి యైనను గోల్కొండ సుల్తానుతో యుద్ధము చేయుటాతని కిష్టములేదు. ముసల్మానుపై కత్తి గట్టుట యిస్లాం ధర్మవిరుద్ధమని యాతని తలపు. కాని పాదుషా యాజ్ఞ తప్పించుకొనరానిది; దానికి తలవంచి తీరవలసినదే; పాదుషాకు షా ఆలం స్వభావము తెలియకపోలేదు. కాని ఢిల్లీ దర్బారులో షా ఆలం కున్నత స్థాన ముండెను. అతడు యువరాజు. ఆస్థాన గౌరవమున కనుగుణముగా ఔరంగజేబు షా ఆలంను దక్కనునకు సర్వాధికారిగా బంపియుండెను. ఔరంగజేబునకు షా ఆలంపై నెక్కువ ప్రీతి, కాని పాదుషాకొక చిత్రగుణమున్నది. తన ప్రేమనాతడెప్పుడును బయటికి గన్పరచెడువాడుగాడు. పుత్రమిత్ర కళత్రములపై నున్న ప్రేమకంటెను పాదుషాకు దర్బారుపైనున్న గౌరవమెచ్చు. ఢిల్లీ దర్బారున నెవ్వడైన నపకీర్తి దెచ్చినచో వానితల వెంటనే నేలబడు చుండెను. షా అజంను బీజాపురముపైకి పంపినదిందుకే; తనకుమారులు సుఖలాలసులగుటాతని కిష్టములేదు. కాని దక్కను లోని యుద్ధము తాననుకొన్నంత త్వరగా ముగియలేదు. పాదుషా కిద్దరు పుత్రులపైగూడ కోపము వచ్చినది. అతడు రోషమున నొడలు మరచెను. గోల్కొండ, బీజాపురములు రెంటిని నేలమట్ట మొనర్చువరకు తిరిగిరానని

శపథమొనర్చి పాదుషా బయలుదేరినాడు. తొట్టతొలుత నాతని కంటబడవలసిన దుస్థితి షాఆలంనకు బట్టినది. జయపురి బేగంనకు యీ విషయములన్నియు దెలిసినవి. ఆమె లంచములిచ్చి జనానాలోని పరిచారికల నందరిని వశపరచుకొన్నది. పాదుషా షోలాపురికి వచ్చిన తరువాత జనానా యధికారులందరిని ఒక్కొక్కరినిగా పిలిపించి షా ఆలం ప్రవర్తనమును గూర్చి ప్రశ్నించెను. ఇది యాతని కలవాటై యుండెను. ఒక్కొక్కరును షా ఆలంపై దూరులనే చెప్పిరి. నేరములనే యారోపించిరి.

జయపురి బేగం పాదుషా దర్శనము కావలెనని యనుమతికై చెప్పి పంపెను. పాదుషా జనానా స్త్రీలకు దర్శనమొసగు నలవాటు లేదు. అందునను రాణులనసలే చూచుటలేదు. సహజముగా ఔరంగజేబు స్త్రీ విద్వేషి. స్త్రీ జాతియే చెడ్డదని భావించెడువాడు. ఎప్పుడేగాని స్త్రీల మాటలు నమ్మరాదు, స్త్రీల చేతలు పరిష్కరింపరాదు అను నియమమున్న హఠమాతనిది. సాధారణముగా నే స్త్రీకిగాని పాదుషాముందు నిలుచు ధైర్యమే యుండెడిది గాదు. ఇక మాటాడు సాహసమెక్కడిది. ఢిల్లీ యంతఃపురములో ననేక రాజపుత్ర స్త్రీ లుండిరి. వారీ చెరకు తట్టుకొనలేక అంతఃపురమే వదలిపోయిన సన్నివేశములు గూడ నున్నవి. కాని జయపురి బేగంపై ఔరంగజేబునకు విశిష్టమైన యభిమానము కద్దు. ఆతడే నీవు "షా ఆలంను పెండ్లియాడుము. మహారాణివై సింహాసనముపై గూర్చుందు"వని యామెతో చెప్పి యొప్పించి పరిణయ మొనర్చెను. జయపురిబేగం నాతడు గౌరవాన్వితముగ రాజమహలున కాహ్వానించినాడు. ఆదరముతో పలుకరించినాడు. 'ఖదీరా' యెంతో దుఃఖమును నటించినది.

"జహాపనా ! ఈ యువరాజు ప్రవర్తనము విచిత్రముగ మారిపోయినది. కులస్త్రీలతనితో నుండుట కష్టమై పోవుచున్నది. ఇది నాయొక్కతెమాట కాదు. అంతఃపురములో మీరు విచారింప వచ్చును. యువరాజు షోలాపురంనకు వచ్చి చాల చెడిపోయినాడు. అతని ప్రవర్తన ఢిల్లీ దర్బారునకు కళంకప్రాయమైనది. నూరున్నీసా యనెడి ఒక్కరాణి యున్నది. ఆమెపేరు తమకు గూడ తెలిసియుండును. ఆమెయే యిప్పుడు నిజమైన రాణి. తక్కిన వారమందరమామె దాసీలము. యువరాజెప్పుడును నూరున్నీసా భవనమందే యుండును. సేనాధితులకును, గూఢచారులకును అతని దర్శనమ దొరుకుటయే కష్టమైనది. ఇక నూరున్నీసాను గూర్చి నేనేమి చెప్పుదును? 'షా ఆలం' రాజకీయములలో నామె సలహానే పాటించును. గోల్కొండలో జయము గల్గినదన్నచో అది మన మొగల్ సైనికుల సాహసమే కాని యువరాజు బుద్ధి విశేషము గాదు. యువరాజునకావైపు దృష్టియేలేదు. గోల్కొండ నుండి చాలమంది వచ్చి మన అంతఃపురములు చేరికొన్నారు. వారికి నూరున్నీసా యాశ్రయమిచ్చినది. గోల్కొండ సుల్తానునకు ప్రీతిపాత్రురాలైన యొక నర్తకి యున్నది. దానిపేరు నజీరా. అది నూరున్నీసా యాశ్రయ మందుండెను. దానికి మహారాణివలె నుపచారములు జరిగినవి. దానినొక్కసారి మీరుబిలిచి మాటాడినచో జాలును. దాని స్వభావము మీకే అర్థమగును. గోల్కొండ సేనాధిపతి

'ఇబ్రహీం' అనువాడు చాలదినములు యువరాజుతోనే యుండెను. యుద్ధమట యుద్ధము ! శత్రుసేనాధిపతి మనకు గౌరవనీయుడైన యతిథిగా నున్నచో యిక సమరమే మున్నది? చాలనందుకు 'హరిదాసి' యొక్కతె యున్నది. దానిపై యువరాజున కెంతో ప్రేమ. అది నిజమైన సన్యాసిని యనుటకు వీలులేదు. కపట సన్యాసిని. ఇంతకు ముందే యెన్నడో గోల్కొండ ఢిల్లీకి వశము కావలసియుండెను. 'హరిదాసి' యుద్ధమును నిలిపివేసినది. జహాపనా ! నేను స్త్రీని; ఆ మాటలు చెప్పుటకు సిగ్గగుచున్నది. 'హరిదాసి' యపురూపసౌందర్యవతి. అట్టి సౌందర్యము ఢిల్లీ యంతఃపురమునందు గూడలేదు.

"ఖదీరాబేగం ! ఇక చాలించుము. ఈ కథలు నేను వినలేను. నేను విచారణ నడిపింతును. ఇందులోయేమైన నసత్యముండెనా నీకు చాలనష్టము గలుగును. రాజదండమునకు స్త్రీ పురుష భేదము లేదు."

"ఖామంద్ ! ఈ లోకమున మీ కన్నను గొప్పవారు లేరు. మీ యెదుటనసత్యమాడు నంతటి పాపిని నేనుకాను అందులో యువరాజు నాపతి. అతనిలో నున్న దోషములను చెప్పునప్పుడైన నా హృదయము కసిపాము కాటువేసినట్లు బాధపడును. ఈ విషయమున తమ యిష్టము వచ్చినట్లు చేసికొనవచ్చును. నన్ను క్షమింపుడు. ఢిల్లీ సింహాసనపు గౌరవము నిలుపవలసిన బాధ్యత నాకుగూడ గలదు".

పాదుషా యాజ్ఞనంది 'ఖదీరా' యంతఃపురమునకు వెళ్ళెను.

ఈ విషయములన్నియు 'షేక్‌సాహెబు' చెవులలో బడినది. కోపముగొన్న పాదుషా యేమిచేయునో ! అతడు షా ఆలం తలదీయించినను ఆశ్చర్యములేదు. షేక్‌సాహెబ్ హృదయము గడగడవడకినది. అల్లాయే రక్షించవలెను. అందరికతడొక్కడే రక్షకుడు – అని మనస్సును సమాధాన పరచికొన్నాడు.

పాదుషా యాజ్ఞ మేరకు షా ఆలం షోలాపురమునకు వచ్చెను. తన భవనమునకు పోయినాడు. అతడు నూరున్నీసా కడకు బోయెను. 'ఖదీరాబేగం' చేసిన దోషారోపణలు ఆమె చెవియందును కొద్దికొద్దిగా బడినవి. ఆమె యువరాజునకా విషయములన్నియు దెలిపినది.

తెల్లవారెను. ఆలంఘీరు ప్రార్థన చేసికొన్నాడు. షా ఆలంను తన సమ్ముఖమునకు బిలిపించెను. షేక్ సాహెబు కూడ పాదుషా ప్రక్కనే యుండెను. షా ఆలం ధైర్యముగావచ్చి తండ్రికి సలామొనర్చినాడు. షేక్ సాహెబునకును సలాము చేసెను. ఆలంఘీరు కొంతసేపు కన్నులు మూసికొనియే యుండెను. చాలసేపటికి కన్నులు తెరచి షా ఆలంను తీక్ష్ణముగా జూచినాడు. ఆ కంఠధ్వనిలో పిడుగులు పడుచుండెను.

"షా ఆలం ! గోల్కొండ యుద్ధపరిస్థితి యెట్లున్నది?

జహాపనా ! యుద్ధము ముగిసినది. గోల్కొండ మన స్వాధీనమైనట్లే"

"మనకును సుల్తానునకును సంధియైనదిగదా ! ఆ షరతులు నీవు చక్కగా నాలోచించినావా? అవి యన్నియు పూరింపబడినట్లేనా?"

షా ఆలం వినయముతో పలికెను.

"జహాపనా ! మన షరతులను సుల్తానతిక్రమింపలేదు. కాని దానిని పూర్తిగా చెల్లించు సామర్థ్యము సుల్తానునకు లేదు. వానిని పూర్తిగా చెల్లింపుమని నిర్బంధించుటకే నేను హైదరాబాదులో మకాము వేసినాను".

"ఏమీ ! సుల్తానునకు షరతులు చెల్లించు సామర్థ్యము లేదా ! ఎందువలన?"

"సుల్తాను భండారమునుండి ఒకకోటి ద్రవ్యము మనకు చేరినది. యుద్ధఖర్చులు రెండు లక్షల హొన్నులు మనకు ముట్టినవి. వానినన్నిటిని సురక్షితముగా ఢిల్లీకి పంపివేసినాను. గోల్కొండ రాజ్యమున కోట దప్ప దక్కినదంతయు మన స్వాధీనమందున్నట్లే మొగలు పరిపాలనమే సాగుచున్నది".

"సుల్తాను అభిప్రాయమేమి? అతడేమనుచున్నాడు?"

"ఏమనునా ? కోటలో తాను సుల్తాను ననుకొనుచున్నాడు. గోల్కొండ చుట్టును మనసైన్యము లున్నవి. వాని మధ్య సుల్తానొకబందీ".

"మాదన్న విషయమేమి?"

"అతని కధికారము పోయినది. కాని సుల్తానున కాతనిపై నభిమానము మాత్రము పోలేదు. మాదన్నను తరిమివేయు సామర్థ్యము సుల్తానుకు లేదు".

"యుద్ధము ముగియలేదు. సంధి షరతులును జరుపబడలేదు. శత్రువు నిశ్శేషముగా లేదు. మాదన్నను అధికారచ్యుతుని చేయవలెనని మేమాడినది మాటవరుసకన్నమాట. అతనిని బందీగా జేసి ఢిల్లీ కంపవలసియున్నది. ఆ పని చేయవైతివి. సంధి షరతులను పూరింపమని సుల్తానునుగూడ బంధించి ఢిల్లీకంపవలసి యుండెను. ఆ పనియు సేయవైతివి. నీవింత మాత్రము చేసియున్నచో వేలకొలది మైళ్ళు నేను రావలసిన పని యుండెడిది గాదు. యుద్ధమారంభమై పది నెలలు గడచిపోయినది. సంధి షరతు ఏర్పాటై నాలుగు నెలలయ్యెను. ఇంతవరకు నీవేమి చేసినట్లు? యుద్ధక్షేత్రమును వదలి యంతఃపురమందు ఓలలాడు చుంటివి. ఇట్టి కామ పశువుకు జయమెట్లు సిద్ధించును? నీవజ్ఞానముతో గోల్కొండవారి వలలో చిక్కినట్లున్నది".

షా ఆలం వినయముతో నేలను దాకి సలాము చేసెను.

"జహాపనా ! మీరు కోపపడరాదు. క్షమింపవలెను. గోల్కొండలోని రాచరికము నేల సమమై పోయినది. సుల్తాను మద్యపాయి, స్త్రీలోలుడు. మాదన్న యుద్ధము నందోడింపబడిన

మనుష్యుడు. వారు ఢిల్లీయందు కారాగృహమందున్నను ఒక్కటే, గోల్కొండలో నున్నను ఒక్కటే. వారెప్పటికిని మనబందీలు. ఆజ్ఞయైనచో రేపు సూర్యోదయము లోపల వారిని తెచ్చి తమ కొప్పింతును".

"నోరు మూయుము ! పనికిరాని పరాక్రమము లేల పలికెదవు నీ వంతటి మొనగాడవైనచో ఆ పని నింతకుముందే చేసివుందువు. నీవాపని చేసియున్నచో, నేడే నిన్ను ఢిల్లీ సింహాసనముపై గూర్చుండబెట్టి షేక్ సాహెబుగారితో మక్కాకుబోయి యుందును. నా వార్ధక్యమును నీవు గమనించుట లేదా? ఈ స్థితిలో, యీ సైనికులతో, యీ యుద్ధములతో నెట్టి కష్టములు బడుచున్నామో చూడుము. షా ఆలం ! నీ ముఖము చూచుటకు నా కిష్టము లేదు. నా ముందు నిలువకుము. వెడలిపొమ్ము. నీ అంతఃపురముతో పాటు ఢిల్లీకి పోయి సుఖముగా కాలక్షేపము సేయుము. ఈ దక్కనులో నీవేమి సాధించినట్లు? ఒకరిద్దరు మంచి స్త్రీలను సంపాదించుకొన్నావు. ఇంతే ! వారినిగూడ ఢిల్లీకి బిలుచుకొని పొమ్ము. ఢిల్లీలోని యంతఃపురము నీకు చాలినంత విశాలముగా నున్నది. ఈ పది నెలలు పడిన ప్రయాసమునకు ఫలమేమి? ఒక్క కోటి ద్రవ్యము, రెండు లక్షల హొన్నులు. ఇంతేగదా ! దీనికింత కష్టమెందుకు? ఢిల్లీనుండి యొక్క సేవకుని బంపియున్నచో సుల్తాను భయపడి యింతమాత్రము ముట్టజెప్పి యుండెడువాడు. ఈ సైన్యమెందుకు? నీ ప్రవర్తనము ఢిల్లీ దర్బారునకు గౌరవము దెచ్చునదిగా లేదు. పో! నా ముందు నిలువకుము. నిన్ను నేను చూడలేను. నీ పిరికితనమును సహింపలేను. నా కుమారు డనిపించుకొనువానికి ఇట్టి ప్రవర్తనము భూషణము కాదు".

షేకుసాహెబు సంజ్ఞచేసెను. షా ఆలం తలవంచి 'ముజల్' చేసినాడు. మెల్లమెల్లగా పాదుషా సమీపమునుండి తొలగిపోయెను. పాదుషా షేక్‌సాహెబు వైపు దిరిగినాడు.

"చూచితిరా ! నేనేమి చేయుదును? ఖుదాదయ నాపైలేదు. నా కొడుకులు సింహాసనమున కనర్హులు. అందరు స్త్రీ లోలురై చెడిపోవుచున్నారు. సుఖము నాశించువారు రాజసింహాసనమును గాంక్షింపరాదు. ఒకవేళ అల్లా అనుగ్రహముతో యిక్కడే నేను మరణించినచో, నా గోరీ యిక్కడే కట్టినచో ఢిల్లీ సింహాసనము గతియేమి? చచ్చిన శవమును కుక్కలు పీకికొని తినునట్లు మహారాష్ట్రులు, రాజపుత్రులు, ఢిల్లీ సామ్రాజ్యమును ముక్కలు చేయుదురు. నేనేమి సేతును? ఈ కొడుకులు నా కడుపున చెడబుట్టినారు. వీరిని నేనే నా చేతులారాచంపివేయుద మన్నంత కోపమువచ్చును".

షేక్‌సాహెబునకు ఔరంగజేబు వాలకము జూచి భయమేయయ్యెను. కొన్ని నిమిసములు నిమ్మళముగా గడచెను. ఔరంగజేబు బయటికెంత పలుకునో లోన దానికి రెండింత లాలోచించును. అతని యాలోచనలు కేవల భౌతికములైనవి. కళాత్మకముగా భావించుటాతనికి గిట్టదు. సంగీతమన్న నాతనికి మంట. కవిత్వములన్నను యెక్కువ ప్రీతిలేదు. అతనినెట్లు అనునయించుట? చాల సేపటికి షేక్ సాహెబిట్లన్నాడు.

“ఆలంఘీరు పాదుషా ! నీవు దేవుని మనుష్యుడవు. నీ సంతానము మానవులు. నీవు కోపగించినచో ప్రపంచము నిలచునా ! భస్మమైపోవును. నీవు శాంతింపవలెను. నిమ్మళముగా స్థిరచిత్తముతో నల్లాను ప్రార్థింపుము. నీ కుమారులను క్షమింపుము. నీవంటివానికి యీ గోల్కొండ, యీ బీజాపురము లెక్కయాయేమి? కొంతకన్ను దెరిచినచో రెండును భస్మీపటలమైపోవును. ఇంతచిన్నపని కింత ఆగ్రహమెందుకు?” సాధారణముగా మనుష్యులకు పొగడ్తయన్నచో మెప్పు, పరిపాలకులకు దాని భాగమింకను కొంత యధికముగా నుండును. ఔరంగజేబు పరమ కుటిలుడు నక్కవంటివాడు. కాని యాతనికిగూడనీ చాపల్యమున్నది. తన్ను పొగడువారిపై నాతనికి గొంత పక్షపాతము కాని యా భావమును గూడ బయటికి దెలుపడు. అతని మనస్సులో నేమున్నదో యూహించుట కష్టము. ఫలకాలమున దోచవలెనంతే. పొగడువారిపై బక్షపాతే యనుటయు ఫలకాలముననే దెలియుచుండును. చాలసేపు పాదుషా మౌనమును ధరించినాడు. నిజముగా నాతని దృష్టి యల్లావైపునకే దిరిగియున్నది. అతడెంత హఠమారియో నంతటి మతోన్మాది. అల్లాకంత భక్తుడును; తన మతమును గత్తితోనైనను ప్రచారమొనర్పవలెననువాడు. ‘ఖురా’నన్నచో నాతనికి బ్రాణము. చక్రవర్తియై యుండినను సామాన్యుడుగ బ్రతికెను. ప్రజల ధనమున నొకకాసు వ్యర్థముగ ఖర్చుపెట్టెడు వాడుగాడు. కాని యెన్ని యున్ననేమి? అతనిలో నా గుణములన్నియు బూడిదలోబోసిన పన్నీరుయైనది. మతాంధ్యమాతని రోమరోమమున వ్యాపించినది. పరమత సహన మాతని కలవాటులోనే లేదు. ఈ యొక్క దుర్గుణమే లేకున్నచో ఔరంగజేబు గొప్ప చక్రవర్తియై యుండెడువాడు. పాదుషా యల్లాను ప్రార్థించెను. షేక్ సాహెబ్ పాదముల నెరగి యాశీర్వాదమునకై ప్రార్థించినాడు.

ఆ దినము గడచెను. షా ఆలం యంతఃపురమెల్లను ఢిల్లీకి వెడలిపోవలెనని పాదుషా యాజ్ఞయైనది. అతని యాజ్ఞ మహాస్త్రము; అది తప్పుటయేలేదు. హైదరాబాదులోని సైన్య శిబిరములోనికి పోయి సుల్తాను మాదన్నలను బందీలుగా గొని రావలెనని షా ఆలం కాజ్ఞలు వెళ్ళినవి. అంతఃపురము, మేనాలలో ఢిల్లీదారి పట్టినది. దానివెంట గొంతసైన్యముండెను. అది కేవలము వైభవమును జాటుటకే. పాదుషా యాజ్ఞలకు జనులు గడగడ లాడిపోవుచుండిరి. షా ఆలం నూరున్నీసా చెంతకు వచ్చినాడు. అతని వదనము వాడిపోయినది. నిట్టూర్పులతో నాతడు నూరున్నీసాను సాగనంపెను. ఉన్నీసా తన దుఃఖములోననే యదుముకొన్నది. ఆమె లేని ధైర్యమును బ్రదర్శించెను. ఆమె యువరాజుతో నన్నది.

“యువరాజా ! పాదుషా మనస్సునకెక్కు పరాక్రమము నెవ్వరు బ్రదర్శింపగలరు? అతడు మహావిక్రముడు. సాధ్యమైనంతవరకు జాగ్రత్తగా బోరితిరి. మీ లోపమెందుననూలేదు. ఇంతకును ఆ ఖదీరాబేగం మాటలాతని చెవికెక్కినవి. ఆమెపై నేను కోపగించుటలేదు. ఆమె బాధ యామెది. ఆమె యెంత జేసినను నేనామెను ప్రేమించుచునే యున్నాను. ఢిల్లీకి

దరలిపోవుటలో నాకేయసమ్మతియు లేదు”. యువరాజు నూరున్నీసాను గుండె బరువుతో నంపినాడు. అతడు నేరుగా షేక్ సాహెబు చెంతకు వచ్చెను. యువరాజు ఖిన్నుడై వచ్చినది జూబి షేక్ సాహెబు విషయమును గ్రహించెను. అతడు షా ఆలంను ప్రీతితో నాహ్వానించెను. యువరాజన్నాడు.

“జరిగిన యన్ని విషయములకు మీరే సాక్షి. నడచినదానిలో నాదోషమేదైన నున్నచో నేను వెంటనే దానికి బ్రాయశ్చిత్త మొనర్చికొందును. దైవసాక్షిగా జెప్పుచున్నాను. ఢిల్లీ సింహాసనముపై నాకాశలేదు. మరెవ్వరికైననది బ్రాప్తించినచో నా మనస్సున ఖేదములేదు. ఏదో యొక రమ్యమైన ప్రదేశమందు, బీదవాడుగా నైనను బ్రతుకవలెనని నా ఆశ. ఈ యుద్ధములు, మరణములన్నచో నాకసహ్యము. ఈ కత్తిని నేను బట్టినది పాదుషా తృప్తికొరకే. అల్లా సాక్షిగా చెప్పుదు. ఈ గోల్కొండ, బీజాపురముల సుల్తానులు ముసల్మానులు గారా? వారిపై కత్తిగట్టుట ధర్మమగునా? అందుకే నేను గోల్కొండ కోటను నాశనమొనర్పలేదు. సమయమునకై కాచికొన్నాను. మీకేమియు భయములేదు. మీరు ఫకీరులు. మనకు సేనాపతులక్కరలేదు. నేను గోల్కొండ కోటలోనికి మిమ్ము దీసికొనిపోదును. ఆ నిర్మాణ నైపుణ్యమును మీరే చూడుడు. ఎంత భద్రమైనకోట! దానిని నిర్మించినవాని కౌశలము నెంతబొగిడినను చాలదు. అట్టి సుందర నిర్మాణమును నేలమట్టము చేసినచో మనకేమి యొరగును? ఆ కోటలో పాదుషా భయపడు నంతటి పెద్ద యాపద యేమున్నది? ఇక సుల్తానందమా? వాడొక నిస్సత్త్వుడైన మనుష్యుడు. స్త్రీలే వాని ప్రపంచము. మాదన్న విషయము వేరు. అతనికి యుద్ధమందు రెండు సారులు నేనే ప్రాణదాన మొనర్చినాను. మహావీరుడు. మహా సాహసి. అట్టి వీరపురుషుని నేనింతవరకు జూచినది లేదు. కట్టకడపటి సైనికుడు మిగిలి యున్నంతవరకాతడు పోరెను. ఆ బాహువులు విక్రమమున కాటపట్టులు. కత్తి యెత్తినవాడు దించుటయే లేదు. యుద్ధములో నీతడు నా చేతికి రెండు మారులు చిక్కెను. అప్పుడే నేను చంపియున్నచో యీపాటికాతడు స్వర్గమునకేగి యుండును. కాని యాతని పరాక్రమము నాకు మెప్పువచ్చినది. నేను కత్తి దించి “వీరాగ్రేసరా? సైన్యమంతయు జచ్చినను పోరుచున్నావు. నీ పరాక్రమము వీరుల కలంకారము. నీవు భూదేవి కొక సొమ్ము, నిన్ను గన్న భూమి ధన్యమైనది. పొమ్మన్నాను. నా మెచ్చుకొనుట యాతని కవమానమే యైనది. ఎట్టుని యాతని కన్నునుంచి రెండు నీటి బొట్లు కారినవి. దుఃఖముతో నాతడు వెనుదిరిగెను. సాంభాజీ యుద్ధ మెట్టిదో నాకు తెలియును. అతడు దొంగ యుద్ధములు చేయును. కాని మాదన్న హిందువుల పురాణములలోని వీరునివంటి వీరుడు. మాదన్నను కపటోపాయముతో బంధించి ఢిల్లీకి బంపవచ్చును. కాని దానితో పాదుషా కొరగునదేమి? మీరే చెప్పుడు. నా తప్పేమున్నది? పాదుషా యేల మక్కాకు బోవలెను ? అతడింకను నూరేండ్లు సింహాసనముపై నుండుగాక ! నేనే మక్కాకు బోదును. నాపై జయపూర్ బేగం లేనిపోనివి కల్పించి చెప్పినది. నేనామెకు భర్తను. ఆమె నన్ను దూరుటములో నెంత ధర్మమున్నదో మీకేమి దెలియవలెను.

పైగా పాదుషా యెదుటనుంచి యామె పలికిన దన్నచో దర్బారు గౌరవమేమి మిగిలినది. అంతఃపురము ఢిల్లీకి బోవలెనని పాదుషా యాజ్ఞ పెట్టెను. మంచిదే యైనది. నేనాయంతః పురములో నింక కాలుపెట్టను. నూరున్నీసా యొక్కతే నా ధర్మపత్ని. షేక్ సాహెబ్ గారూ ! మీతో చెప్పవలసినది మరొక్కమాట మిగిలియున్నది. ఈ గోల్కొండకు సంబంధించి యిద్దరు స్త్రీల విషయమై పాదుషాగారి చెవులలో దురూహలు పడినవి. కాని యీ గోల్కొండ ప్రకరణములో నా యిర్వురు స్త్రీలును అత్యంత ముఖ్యపాత్రలు. ఒకామె. యభాగిని ! ఈ గోల్కొండ సింహాసనమునకు వారసురాలు. రెండవయామె ఒక్క హిందూ సన్యాసిని ! ఆమె నడ్డగించుశక్తి నాకే లేదు. అంతనిర్భీకురాలామె. జగద్విజేతయైన పాదుషా ఆజ్ఞానమయ, శక్తిమయి ముందు శిశువువలె నైపోవును. ఆ దృశ్యము మీకు చూపుదును. ఆ యిర్వురు స్త్రీలును నేడు గాకున్న రేపైనను పాదుషా ముందు నిలుచు సన్నివేశము కలుగును. న్యాయము వారి వైపువున్నది. ధర్మము వారిని రక్షించుచున్నది. వారిముందు ఆలంఘీరు పాదుషా వాతకంపితమైన తృణమువంటి వాడు. వారిర్వురి ప్రణయమునకును నేను వశుడైనను, అపవిత్రపు మాటలు పాదుషా చెవుల బడినవి. అది యసత్యము. ఆ రెండు శక్తులకును నేనోడినది నిజము. అంతే. నేనెక్కడికైననుపోవుట కాజ్ఞ యివ్వవలెను. పాదుషా ఢిల్లీ సింహాసనముపై గూర్చుండుట కెంత హక్కు గలదో, ఒక బీదవాడనై భూమిపై బ్రదుకుటకు నాకుగూడ నంతటి హక్కే గలదు".

షేక్ సాహెబు చాలసేపటివరకు మౌనము వహించెను. హఠాత్తుగాలేచి యాతడు యువరాజును కౌగలించి కొన్నాడు.

"బేటా ! నీవు చెప్పినదంతయు ఖురాను సాక్షిగా సత్యము. కాని పాదుషా నీకు పగవాడు కాదు. అతడు నీ తండ్రి. అతడు బ్రతికి యుండువరకు అతని మాటను గౌరవించుట నీ ధర్మము. ఈ ఢిల్లీ సింహాసనము నేదోయొక భూతమాక్రమించికొనినిట్లున్నది. తరతరములనుండి యీ పాదుషాలు తమలో పరస్పర విరోధములను పెంచుకొనుచు వచ్చుచున్నారు. ఆలంఘీరు దేవుని మనుష్యుడు. అతని కాలమందైనను తండ్రి కొడుకులకు పరస్పర స్నేహ సౌహార్ద్రములు నెలకొనుగాక యని నేను భగవంతుని ప్రార్థించుచున్నాను. షా ఆలం నీవు గోల్కొండకు పొమ్ము. భయపడవలదు. పాదుషాకు సత్యము నిదానముగా తెలియునులెమ్ము" షేక్ సాహెబు యువరాజు శిరస్సుపై చేతులుంచి యాశీర్వదించినాడు.

షా ఆలం అశ్వారోహియై కావలి బలముతో హైదరాబాదునకు ప్రయాణమయ్యెను.

## 11

ఔరంగజేబు దక్కనుకు వచ్చిన సమాచారము గోల్కొండలో దెలిసినది. వారిమనస్సు లస్తవ్యస్తము లయ్యెను. యువరాజు షా ఆలంను పాదుషా పిలిపించుట, అతనిని దండించుట మొదలగు విషయములన్నియు సుల్తానునకు దెలిసెను. అతడు మాదన్నను బిలిపించినాడు.

"మహామంత్రీ ? మనమిప్పుడేమి సేయవలెను?"

"ఏమున్నది? నా నుండియే మీకిన్ని కష్టములు ప్రాప్తించెనను, విషయము మాటిమాటికిని నా మనస్సు చెప్పుచున్నది. రహస్యముగా నేనెక్కడికైనను వెళ్ళిపోవలెనని తలచుచున్నాను. ఏ చిన్న పల్లెలోనో ఊరు, పేరు లేక జీవింతును".

"మాదన్నా ! నీకిటీవల విషయములు సమగ్రముగ దెలసినట్లులేదు. పాదుషా షోలాపురమునకు వచ్చి బిడారు వేసిన వార్త నీ చెవులకంది యుండును. పాదుషా యువరాజును తనకడకు పిలిపించికొనెను. గోల్కొండ నింకను యేల వశపరచికొనలేదని కొడుకుపై చిడుముడి పడినాడు. 'షాఅలం' మనస్సులో మనపై నభిమానముంచి కొన్నాడని యెత్తిపొడిచినాడు. షా అజం బీజాపురమును చుట్టిముట్టినాడు. అతడు షాఅలంపై ననేక దోషారోపణలు చేసినాడు. పాదుషా యువరాజును పూర్తిగా బహిష్కరించినట్లే. యువరాజున కధికారము లన్నియు పూర్తిగా పోయినట్లున్నవి. పేరునకు మాత్రమాతడు హైదరాబాదు శిబిరమందున్నాడు. ఇకపై తన కర్తవ్యమేమని షా ఆలం ఆలోచించు కొనుచున్నట్లున్నది. పాదుషా సంధి ఎగిరి పోయినదని కొలువులో జెప్పినారట ! నేడో రేపో గోల్కొండ కోట నాక్రమించుమని మొగలు సైన్యముల కాజ్ఞ రావచ్చును. మాదన్న మరల మహామంత్రియై సైన్యములను నడుపవలెను. మీరు ముందు నిలిచినచో మన సైన్యములు కొక నూత్న తేజస్సు వచ్చును. చచ్చుటెట్లును తప్పదు. వీరులవలెనే మరణింతముగాక !".

"ఖామంద్ ! మీ యెదుట నేను సంకోచపడవలసినది లేదు. విషయములన్నియు మీరెరిగినవే. నేనధికారమును వదలి నాల్గు మాసములైనది. ఈ నాల్గు మాసములలో మన దర్బారులో నెన్ని మార్పులో జరిగినవి. సైన్యములకు నాల్గు నెలల జీతములు ముట్టలేదు. ఈ స్థితిలో సైన్యములకుత్సాహ మెక్కడినుండి వచ్చును? ఒకదారి యాలోచించుచున్నాను. మీకు నమ్మకమైనచో నేనెపోయి యువరాజుతో మాటలాడి రావలెననియున్నది".

సుల్తానున కీమాటలతో భయమైనది.

"మాదన్నగారూ ! మీరాతని చెంతకేల పోవలెను? అతడు మిమ్మచ్చటనే బంధింప వచ్చును".

"షా ఆలం గొప్ప యుదారుడు. అతడట్టి పనిచేయడు. ఇందులో నొక రాజతంత్రము గూడ నున్నది. పాదుషా సైన్యములు హైదరాబాదునుండి కొంచెము వెనుకకు పోయినచో మనకు స్థాన బలము హెచ్చును. యువరాజు శిబిరము మాల్కొండకు పోవునట్లు చేయవలెను. హైదరాబాదు మన సైన్యములకు గొప్ప యాయకట్టైనచోటు. అది మన చేతిలో నున్నచో గోల్కొండకు భయము లేనట్లే. యుద్ధము గోల్కొండ కోటకడనే జరిగినచో మనము చాలనష్ట పడెదము".

"మాదన్నా ! మీ యుక్తి బాగుగనే యున్నది. కాని వాని సైన్యములు హైదరాబాదు వదలిపోవుటెట్లు?".

"పాదుషా సంధి వీగిపోయినదని దర్బారులో నన్నట్లు మీరే చెప్పుచున్నారు. వారికి మనమింకను ఒక కోటి ద్రవ్యము బాకీయున్నాము. అది చెల్లించినచో సంధి షరతు పూరింపబడినట్లే, న్యాయముగా వారు వెనుకకు బోవలెను. యువరాజు గొప్ప ప్రామాణికుడు. మాట నిలుకడ గలవాడు. ఉదారుడు. ధనమును చెల్లించి నేను భద్రాచలమునకు బోవుచున్నానని చెప్పినచో నీతడు నా మాట నమ్మును. యుద్ధము తప్పును. కొన్ని దినములైన పిదప పాదుషా ఢిల్లీకి మరలిపోవచ్చును. ఆ తర్వాత నేను వచ్చి మీతో జేరుకొన్నను అంత ప్రమాద ముండదు".

సుల్తానునకీ యాలోచన సమ్మతము గాలేదు.

"మాదన్నా ! రాజ్యమంతయు మొగలుల వశమందున్నది. జనులు దారిద్ర్యముతో బాధపడుచున్నారు. మొగలు సైన్యములు పంటలను నాశమొనర్చు చున్నది. ఇట్టి స్థితిలో కోటివరహా లెచ్చటినుంచి తేవలెను; ఎట్లో చెల్లింత మనుకొమ్ము. ఆపై నీవు భద్రాచలమునకు బోయినచో, యీ రాజ్య నిర్వహణము నాచేత నగునా? ఇవన్నియు జరుగని యాలోచనలు"

"ఇప్పటికి నాకు తోచినదిది. మరియొక్క దారి నిమ్మళముగా నాలోచింతము. నాకాజ్ఞ యివ్వవలెను" మాదన్న గృహమునకు వెడలిపోయెను.

సుల్తానునకు మాదన్నతో జరిగిన సంభాషణ మంతఃపుర మంతయు దెలిసిపోయినది. షేక్మిర్లాజునకు దెలిసినది. అతని హృదయము భగ్గున మండెను. వారు సుల్తానునకు తెలియకుండ రాణివాసములో 'సరుమా', 'జానీసాహెబా' యను నిర్వురు రాణులను గలిసికొన్నాడు. వారిర్వురును గతించిన సుల్తాను రాణులు వారి మాటలకు యిప్పటి సుల్తాను కడ కొంత వెలయుండెను. వారిర్వురకును మాదన్న యన్నచో ప్రబలద్వేషము. ఎట్లయినను మాదన్నను నాశనమొనర్పవలెను. లేదా సుల్తానునకు మాదన్నకును ద్వేషము దెచ్చి పెట్టవలెను. ఇదే వారి హఠము. వారి యదృష్టము పండినది. నాల్గునెలల క్రిందట మాదన్న యధికారమును బరిత్యజించెను. మరల పదవిని స్వీకరించుననుట వారిచెవులకు శూలమైనది. వారి హృదయములు భగ భగ మండుచున్నవి. షేక్మిర్లాజొక విధముగా ఆ రాణులకు బంధువు. వారు ముష్వురును రహస్యాలోచనము సాగించినారు. దీనికి తగిన యుపాయమాలోచింతుననియు, మాదన్నను మరల నధికారములోనికి రాకుండ జేయుదుననియు 'సరుమా' 'మిర్లాల్'నకు భరోసా యిచ్చినది.

యువరాజు పాదుషా కడనుండి తన శిబిరమునకు వచ్చెను. తనకు పాదుషాతో జరిగిన సంభాషణమును సుల్తానునకు దెలుపవలెనని యాతని కోరిక. సంధి చెడిపోయినది కనుక

గోల్కొండపై బడుమని హఠాత్తుగా మొగలు సైన్యమున కాజ్ఞలు రావచ్చును. సుల్తాను సంధి కుదిరినదిగదా యని ప్రమత్తుడై యుండవచ్చును. ప్రమత్తుడైన సుల్తానుపైబడి పోరుట షాఆలంన కధర్మముగా దోచినది. అతడొక లేఖ వ్రాసి పంపుదమనుకొన్నాడు. కాని యిట్టి విషయములు లేఖలో వ్రాయుట ప్రమాదము. అతడు చాల సేపాలోచించినాడు. కడకొక యుపాయము దట్టినది. తన దూతలను గోల్కొండ కంపి ఇబ్రహీంను పిలుచుకొని రావలసినదని చెప్పి పంపెను. యువరాజు సందేశము ఇబ్రహీం తలపై పిడుగైనది. వాని శిరస్సు భూమికి గ్రుంకిపోయెను. యువరాజు తన్ను విడిచిపుచ్చునపుడు తనపై నొక కార్యముంచినాడు. చెఱలోనున్న 'సయ్యద్ మొహమ్మద్'ను విడిపించికొని రావలెనని యాతనియాజ్ఞ. ఆ పని నొనర్చుట ఇబ్రహీమునకు సాధ్యము కాలేదు. సాధ్యముకాలేదని యువరాజున కాతడు దెలుపనులేదు. దొంగవలె మొగము దప్పించుకొనెను. తానొనర్చినది సముచితమైన పద్ధతి కాదు. కానియేమి సేయును? యువరాజు సైనికులు తనను బలవంతముగనైనను గొనిపోవచ్చును. ఇబ్రహీం సుల్తానును దర్శించికొన్నాడు. యువరాజునుండి తనకు పిలుపువచ్చిన సంగతి నాతడు ప్రస్తావించెను.

"నీవు యువరాజుకడ కెందుకు బోవలెను? అతడు నిన్నక్కడనే బంధింపవచ్చును".

"హుజూర్ ! నేనొక విధముగా నిప్పటికిని యువరాజు బందీనే. బందీని బంధించుటలో వారి దోష మేమున్నది?" సుల్తాను మొగమున చింతారేఖలలుము కొన్నవి. ఇబ్రహీం సలాము చేసి వెడలిపోయినాడు. అతడు యువరాజు చెంతకేగెను. షా ఆలం ఇబ్రహీంను సగౌరవముగ నాహ్వానించినాడు.

"ఇబ్రహీం, ఒక ముఖ్యమైన రాజకార్యమునకై నిన్ను బిలువ నంపితిని. ఆ విషయమును లేఖలో వ్రాయవలసినదిగాదు. నీవేపోయి సుల్తానునకు సగౌరవముగా దెలుపవలసినది; మనసంధి చెడిపోయినదని పాదుషా యాజ్ఞయొసగినారు, సుల్తాను ద్రవ్యమునంతయు 'సావఅతి' చేయలేదు. మాదన్న గోల్కొండలోనే యున్నాడు. వారిర్వురేదో కుట్రపన్నుచున్నారని, పాదుషాగారి యభిప్రాయమై యున్నది. ఎప్పుడైనను హఠాత్తుగా మొగల్ సైన్యములు గోల్కొండపై బడవచ్చును. ఈ విషయమును సుల్తానున కెరిగింపవలెను."

ఇబ్రహీం వినయముతో చేతులు జోడించినాడు.

"జహాపనా ! మీరు నన్ను క్షమింపవలెను. మీ కార్యమొనర్చుటకునే నర్హుడను గాను. అంతమాత్రమే కాదు గోల్కొండకు చాల నప్రియమైనకార్యమది. అప్రియమైన యీ సందేశమును నేను గొనిపోవుట యుక్తము గాదనుకొందును. సుల్తానిప్పుడునన్ను నమ్ముటగూడలేదు. నేను మీ సన్నిధిలో గూడనపరాధినే. నన్ను చెఱవిడిపించునపుడు మీరొక దొడ్డ జవాబుదారీ నాపై నుంచితిరి. దానిని నెరవేర్చుటకు నేనసమర్థుడనే. ఈ కార్యమునకు నన్నొప్పించినచో నేను చేయలేకపోయినచో అది నా రెండవ యపరాధమగును. నేనెందునకును

పనికిరానివాడను. నాకు ధైర్యముసున్న. మహా ప్రభువులుదారులు, ఔదార్యముతో నన్ను క్షమింపవలెను.

“సేనాపతీ ! నిజముగా నీవపరాధివికావు. నీవు స్వామి భక్తుడవు. వయస్సున చిన్నవాడవు ఇట్టి క్లిష్టములైన కార్యములొనర్చే అనుభవములేదు. పరవాలేదులెమ్ము. నీస్వామి భక్తియే నిన్ను రక్షించును. కొన్ని దినములు మా శిబిరమందే యుండుము”.

ఇబ్రహీం సుల్తాను మాటలను లక్ష్యపెట్టక యువరాజు శిబిరములో జేరిపోయినాడన్న వార్తలు గోల్కొండకు బ్రాకినవి. ఊరంతయు గడబిడయైపోయెను. ‘షేక్‌మిర్‌లాల్’ పక్షము వారే యీ గల్లంతును లేవదీసినది. ఇబ్రహీం పోయిన సంగతి మాదన్నకు దెలిసినది. అతడు ఖిన్నుడైనాడు. ఇబ్రహీంవంటివాడు గూడ నిట్లయినాడా? యని మనస్సున చీకాకు జెందెను. ఇదే సమయమని సరుమాబేగం సుల్తానును గలిసికొని మాటాడినది. సరుమా గొప్ప చాతుర్యవతి. ఆమె మాటల కెవ్వడైనను లోబడిపోవును. కావలసినంత సౌందర్యమున్నది. ఆమె సుల్తానునొద్ద తన వలనల్ల నారంభించినది. సరుమాబేగం వచ్చిన సంగతి సుల్తానునకు దెలిపెను. అతడామెను ప్రేమతో నాహ్వానించినాడు. సరుమా యారంభించెను.

“అబుల్ హసన్ ! నీవు వట్టి యమాయకుడవు. ఎవ్వరి మనస్సు లెంతలోతుగలవో యూహించుకొనలేవు. నీపై మా సుఖములన్నియు నాధారపడియున్నవి. కాని ఏమి చేయుదము? మనకు చెడ్డకాలము ప్రాప్తించినట్లున్నది. మొగల్ సైన్యములను గెలుచుట మనశక్తికి మీరినపని. ఇప్పుడు మనకు మిగిలిన యుపాయమొక్కటే. పాదుషాగారి సంధి షరతులను పాలించుట. నీ కెందరో హిత శత్రువులున్నారు. వారు నిన్ను తప్పుత్రోవల కీడ్చుచున్నారు. కడసారిగా నిన్నెచ్చరించి పోవుదమని వచ్చినాను. నీ భార్య యభిప్రాయము గూడ నా యభిప్రాయమే”.

“ఆ యభిప్రాయమేమో చెప్పుడు. నా దోషమున్నచో సవరించికొందును”.

“ఏమున్నది ! నీవు నూటికి నూరుపాళ్ళు మాదన్న యెట్లు చెప్పిన నట్లు చేయుదువు. సంధి షరతులలో నాతని వెళ్ళ గొట్టుటయు నొక్కటిగదా? మనమాపని చేయలేకపోతిమి. యువరాజీ కార్యమును సాధించుటకు వేరొకమార్గము వెదకినాడు. అతని యుపాయము ఫలించినట్లే యున్నది. ఇబ్రహీం యువరాజులో చేరికొన్నాడు. ఈ తార్కాణ మొక్కటి చాలదా? యువరాజు మాదన్నను తమవైపు ద్రిప్పుకొను ప్రయత్నములు గూడ చేయుచున్నాడను వార్తలు మా చెవులలో బడినవి. ఇంకేమున్నది? వారిర్వురును యువరాజుతో చేరికొన్నచో మన కాయువు మూడినట్లే”.

“ఏమీ ? మాదన్న యువరాజుతో చేరుకొనునా? కల్ల, నేను నమ్మలేను”.

“నీవు నమ్మినను, నమ్మకున్నను జరగునదేమో అంతే”. సుల్తాను ‘సరుమాబేగం’వైపు తీక్షణముగా జూచినాడు.

"సరుమా ! నీవు చెప్పునది నిజమేనా ?"

"ఇబ్రహీం యువరాజు శిబిరములో నున్నది నిజమేనా ! అది నిజమైనచో యిది నిజమెందుకు గాదు".

"నీ తర్కము బాగుగనే యున్నది. ఇంతకు ముందే మాదన్నవచ్చి తాను యువరాజుతో భేటీ చేయగోరుచున్నానని నాతో పలికెను'.

"పిచ్చిరాజా ! నా మాటలు సత్యమనుట కింతకన్న ప్రమాణ మేమి కావలెను".

"గోల్కొండకు చాల చెడ్డ దినములు వచ్చినవి. ఎవరిని నమ్ముటకును వీలు లేకున్నది".

సరుమా కింకేమి కావలెను? ఆమె వేసిన విత్తు ఫలించినది. లోలోన నామె సంతోషముతో పొంగిపోవు చుండెను. ఆమె సెలవు గైకొని యంతఃపురమునకు బోయెను.

మొగలు సైన్యములు త్వరలో గోల్కొండను ముట్టడించుచున్నవన్న వార్తలు ప్రాకినవి. కోటలోని యున్నతాధికారులు కాలు గాలిన పిల్లులవలె దిరుగు చున్నారు. మాదన్నకు మనస్సులో మనస్సులేదు. అతడు సుల్తానును జూడగోరి వచ్చెను. అబుల్ హసన్ గోల్కొండ భవితవ్యమంతయు దేవునిపై వదలినాడు. వాని సుఖ సంతోషములే వానివి. సాయంకాలమైనది. గాయకులు కంఠములు సవరించుకొనుచుండిరి. నర్తకీ జనుల గజ్జెలు ఘల్లుమను చుండెను. సుల్తాను గారి మందిరములో వెయ్యారు కాచ దీపములు వెలుగుచున్నవి. వాద్యములు సరిజేసికొనెడి ధ్వనులు నీరవతను భేదించు చుండెను. మాదన్న యంతః పురమునకు వచ్చి సుల్తాను దర్శనమునకై కాచికొన్నాడన్న వార్త చెప్పి పుచ్చెను. సుల్తానునకు మనస్సులో మనస్సులేదు. ఆతడస్వస్థ చిత్తుడుగనే మాదన్నకు దివాన్‌ఖానాలో భేటీయొసగెను.

"హుజూర్ ! మొగలు సైన్యములు గోల్కొండ కోటను త్వరలో ముట్టడించుచున్నవను వార్తలు వచ్చినవి. పట్టణమంతయు నీ కథలే మాటాడికొనుచున్నారు".

"రానిమ్ము. ఏమిచేయగలము? శక్తిసామర్థ్యములున్నంతవరకు బోరాడి చత్తుము".

"యుద్ధము వచ్చినచో చేతులు గట్టుకొని కూర్చుందుమా ! మన విక్రమములు చూపనే చూపెదము. నేననునదా మాటగాదు".

సుల్తాను ప్రశ్నార్థకముగా మాదన్నవైపు జూచినాడు.

"మీరు క్షేమముగానున్నచో మాకందరకును సుఖము కద్దు. గోల్కొండకోట నేడపాయములో నున్నది. మీరిచ్చట నుండుట నా యభిమతముకాదు. రాణివాసముతో మీరోరుగల్లునకు పోవుట యుక్తమైన కార్యమని నాకుతోచుచున్నది. రేపే మీరు బయలుదేరవలెను".

"గోల్కొండ గతిని?"

"దాని విషయము నేను చూచికొందును".

సుల్తాను మరి బదులొసగలేదు. అతడు త్వరగా నాట్యశాలకు వెడలిపోయెను.

మాదన్నకు నిరాశయైనది. తనమాటకు ప్రభువు బదులే యొసగలేదు.

అర్ధరాత్రి గావచ్చినది. పట్టణమందంతయు నిశ్శబ్దము. అంతఃపురమందు గాన వాద్యములు సవ్వడు లణగినవి. సుల్తాను మద్యపానమునకు దొడగెను. అతడు స్వభావముగనే త్రాగుబోతు. పైగా మనసులో తీరనిబాధ. నూరు సమస్యలు ఈ గొడవనుండి తప్పించుకొనుట కాతడు తప్పత్రాగినాడు. శరీరము స్వాధీనము దప్పినది. అస్తవ్యస్తుడై యంతఃపురమున బడినాడు. ఆ కైపులో నాతనికి మాదన్న మాటలు జ్ఞాపకము వచ్చినవి. అతడు వెఱ్ఱిగా నవ్వనారంభించెను. అది మైమరచిన నవ్వు.

"నే నోరుగల్లునకు బోవలెనట? గోల్కొండ కోట తనకు వదలిపెట్టవలెనట ! ఏమి గొప్ప సలహానిచ్చినాడు? మాదన్నగూడ ద్రోహమునే తలపోయుచున్నాడు. ఆ సమయమునకు సురుమా సుల్తాను చెంతకు వచ్చినది. మాదన్నకు సుల్తానుకు జరిగిన సంభాషణమమంతయు నామె యెఱుగును. ఆమెదానిని రహస్యముగ విన్నది. సుల్తాను తప్పద్రాగి మాదన్నను దలచుకొని యేచ్చుచున్నాడు. అతడుకృతఘ్నుడైనాడని విశ్వసించినాడు 'సురుమా' సుల్తాను తలదడివినది. కపోలములు దుడిచినది. అతనినామె హెచ్చరించెను.

"సురుమా ! ఇప్పుడేలవచ్చితివి ? ఏ క్రొత్తవిషయమును దెచ్చినావు. నీవు దేవతవంటిదానివి. నీవన్నమాట నిజమేయైనది. మాదన్న యువరాజుతో 'షరీకై'నాడు. నన్నోరుగల్లునకు బొమ్మను చున్నాడు. సుఖసంపదలతో నుండిన గోల్కొండను తానువశపరచికొని యువరాజు దయతో తనదిగా జేసుకొనుటకై వలపన్నినాడు; వానికి రాజ్యముపై పిచ్చియెత్తినది. సరుమా ఇప్పుడు మనకు దిక్కెవ్వరు?".

"మనకు 'ఖుదా' ఉన్నాడు. మాదన్నకు దగిన ప్రాయశ్చిత్తము 'అల్లా' చేసితీరును. నీవు భయపడవలసినది లేదు. అబుల్ హసన్ ! నీవుకూడ ముసల్మానుడవు, పాదుషాగూడ ముసల్మానే. మీ ఇద్దరన్నదమ్ములవంటివారు మీ యిర్వురకు వైరమేమున్నది? ఈ మాదన్న నుండియే మీకు వైరము, ఈ యాపదలు; ఇకపై నంతయు సుఖమయమగును లెమ్ము?".

"నిజము నిజము సురుమా ! నీవు దేవకన్యవు. బంగారు రాణివి. నా ప్రాణములను రక్షించుటకు భూమిపై జన్మమెత్తిన దానివి" సుల్తానామెను గట్టిగా కౌగిలించికొని యేడ్వదొడగెను.

తెల్లవారినది. సూర్యకిరణములంతఃపురములో తొంగి చూడనారంభించెను. ఎఱ్ఱని కిరణములు పసుపుపచ్చగా మారనారంభించెను. అబుల్‌హసన్ మత్తువదలి లేచినాడు. అతని కేదో జ్ఞాపకము వచ్చినట్లున్నది. వాని ముఖవైఖరియే మారిపోవుచున్నది. మాటిమాటికి తలనాడించుచున్నాడు.

"సరుమా ! నేను తప్పుచేసినాను; నాదిపొరపాటైనది"

"కాదు కాదు నీది యొప్పే" సరుమా సుల్తాను కపోలములను చుంబించినది. సరుమా తన యంతఃపురమునకు పోదునన్నది. సుల్తానంగీకరింపలేదు. తానొంటిగా నున్నప్పుడెవ్వడైన తనపైబడి చంపుదురేమోయని యాతనిభయము.

సరుమా యాతని కనేక విధముల ధైర్యము జెప్పినది. ఆమెకు వేరుపని కాచికొని యున్నది. ఆమె సుల్తాను నొప్పించి తన యంతఃపురమునకు బోయెను. సరుమా జానీ సాహెబుతో జరిగిన వృత్తాంత మంతయు దెలిపినది. ఆ దినమంతయు వారేవేవో రహస్యముగ నేర్పాట్లోనరించికొను చుండిరి. సూర్యు డస్తాద్రిపై నిలిచినాడు. పక్షు లెలుగించెను. దినమస్తమించు చున్నదని వాని విషాద గానములా యేమి! చుక్క లెక్కి రాజొచ్చినవి. సమర్థుడగు రాజస్త మించినప్పుడు అల్పులెల్ల రధికారులైనట్లు, చీకటి గలిసికొనజొచ్చెను. వస్తువులన్నియు తమ స్వప్రకాశమును వదలి దానియందు లీనముగా జొచ్చెను. సుల్తానస్వస్థుడుగా నున్నాడనియు, మాదన్నను జూడ నాకాంక్షించు చున్నాడనియు వార్తలు వెళ్ళినవి. మాదన్న తొందరగా నంతఃపురము వైపు నడచినాడు. అదంతయు చీకటి ఆవరించి యున్నది. అతడు మహాద్వారమును దాటి వచ్చెను. వెంటనే యాతనిని సరుమా బేగం, జానీ సాహెబు యెదుర్కొన్నారు. పరిచారిక యొక్కతె కాగడా వెలిగించుకొని ముందు నడచుచున్నది. ఆ యిర్వురు రాణులను మాదన్న చక్కగా నెరుగును? అతడు తొందరగా నడచినాడు.

"రాణీసాహెబ్ ! సుల్తాను గారి కెట్లున్నది? అంతఃపురములో చీకటి యేమి? జనసమ్మర్దము లేదేమి?"

"వజీర్ ! నిన్నరాత్రి నుండియు సుల్తానుగారికి స్వస్థతలేదు. భయముతో నేమేమో యఱచు చున్నారు. పిచ్చి పిచ్చిగా మాటాడు చున్నారు. అంతఃపురమంతయు బర్వెత్తుచున్నారు. శత్రువులు వచ్చిరి వచ్చిరని ఒక్కటే అఱపు. దీపము లార్పివేయుడని గల్లంతు; ఇప్పుడే వారు లోపలికి వెళ్ళిరి".

సుల్తానొక గదిలో పండుకొని యుండెను. ఆమె యాగది వాకిలి దెరిచి ముందు కడుగు వేసినది. మాదన్న సరుమా వెనుకవచ్చు చున్నారు. సుల్తానప్పటికే మద్యమును కడుపార సేవించి యుండెను. మైకము గ్రమ్మినది. సరుమా నాతడు జూచి "రారా సుందరీ !" యని బిలచినాడు.

సరుమా మెల్ల మెల్లగా నాతని సమీపించినది. అతని జెవిలో రహస్యముగా మాదన్న మీలోవాడని పలికెను.

'జానీసాహెబా' మాదన్నను లోనికి దెచ్చినది.

మాదన్నను జూచినదే సుల్తాను ఛీత్కార మొనరింప నారంభించెను.

"మాదన్నా ! నీవు పాపివి. ఘాతకుడవు. గోల్కొండ కోటను వశపరచుకొన్నట్లేనా? నన్ను బట్టి శత్రువుల కప్పగించుటకై వచ్చుచున్నావుగాబోలు. ఛీ.... ఛీ... నీ మొగము చూడరాదు పొమ్ము".

మాదన్న దిగ్భ్రాంతుడయ్యెను.

అతడు కొంతసేపట్లే నిలిచియున్నాడు.

సుల్తాను పలికెను.

"సరుమా ? నీవే నా భాగ్యరేఖవు. నా ప్రాణములు రక్షించుటకు దేవతాస్వరూపిణివై వచ్చినావు. రా ! రా!" సరుమా రెండు చేతులు పట్టుకొని దగ్గరకు లాగికొన్నాడు.

మాదన్నకు పాదములక్రింద పాతాళమైనది. ఎవరో బలవంతముగా గోతులు త్రవ్వు చున్నట్లనిపించెను. ఇంద్రియములు వశముదప్పునంత పనియైనది. ఆతడు కొంతసేపట్లే సుల్తాను వైపు జూచెను. సుల్తాను మదిరామత్తుడు. అతడీ మాటలు స్పృహతో నాడుచున్నాడో లేదో మాదన్నకు దెలియుట లేదు. అతడు దీక్షణముగా నొక్కసారి 'సరుమా' వైపు జూచినాడు. విషయమవగతమైనది.

"రామ రామ ఇది యెంతటి యవస్థ ! ఇక్కడ నేను నిలువలేను. సరుమా ! ఈ దృశ్యమును నేను చూడలేను". మాదన్న యటనుండి వెనుదిరిగినాడు. పరిచారిక కాగడా బట్టుకొని ముందు నడచుచున్నది. 'సరుమా', 'జానీ సాహెబా' మాదన్నకు వెనుకవైపుగా వచ్చుచున్నారు. వారి ఎదుట కొంత దూరమున నల్వురైదుగురు స్త్రీలు భయంకరముగ నడచుచువచ్చు చుండిరి. "శత్రువులు వచ్చిరి వచ్చిరి" యని వారి కేకలు.

వెనుకనున్న జానీ సాహెబా "మాదన్నగారు వచ్చుచున్నారు. దారితొలగుడ"ని వారి నెచ్చరించినది. వారా మాటలు లెక్కింపలేదు. కేకలు పెట్టుచుముందుకు వచ్చినారు. ఇంతలో పరిచారిక దివిటీ నార్పివేసెను. వారిలో నొక్కతె ముందుకు దూకి పిడిచాకుతో మాదన్న యెదపై బలముగా గ్రుద్దినది. ఈ చీకటిలో దానిమొగముపై నతని రక్తము జిమ్మినది. మాదన్న చీత్కార మొనర్చి నేలగూలెను. నేలపై బడిన వానియెదపై నామె గూర్చున్నది. మరి నాల్గు పోటులు పొడిచినది. ఆ యొక్కొక్కపోటునను ఆమె జీవితములోని దుఃఖము నంతయు గ్రుమ్మరించినది. వజ్రకఠినమైన యాతని వక్షము ఆ బాకు పోటులతో జల్లెడ యయ్యెను. పరిచారిక లాతనిని దెచ్చి మహాద్వారాము కడ వేసినారు. జనులగుంపు చేరినది. అప్పటికే 'సరుమా' మొదలైన వారు మాదన్న మొగలులతో షరీకైనాడన్న పుకారు జనులలో బ్రచార మొనర్చి యుండిరి. వారందరికి మాదన్న రాజద్రోహి యన్న భావము గూడుగట్టు కొన్నది. జను లా శవము నెత్తికొనిరి. "రాజద్రోహికి దగిన శిక్షయైనది. గోల్కొండను శత్రువుల కొప్పించదలచిన కృతఘ్నుడు మరణించినాడు". అని అరచుచు పోవుచుండిరి. నడుమ

నడుమ నాశవమును క్రిందవేసి త్రొక్కుచున్నారు. ఆ కోలాహలము సుల్తాను చెవుల యందును బడినది. 'సరుమా' యాతని చెంగటనే యున్నది.

"సరుమా ! ఆ గద్దలమేమి ? శత్రువులు కోటవైపునకు వచ్చుచున్నారా?"

"ఏమున్నది ? అబుల్ హసన్ ! ఎవరో మాదన్నను చంపినారు; జనులాతని శరీరము నెత్తుకొని వీధులలో బోవుచున్నారు".

సుల్తాను తొందరగా లేచి కిటికీనుండి తొంగి చూచినాడు. జనులలో రాక్షసావేశము.

"అబ్బ ! ఈ ప్రజలకు మాదన్నపై నింత ద్వేషమున్నదా ! అంతఃపుర మహాద్వారమందే వజీరును హత్య చేసినారు".

'సరుమా' సుల్తానును సమాధాన పరచెను. ఆమె యాతనిని మరల శయ్యపై బదుకొన బెట్టినది.

"సరుమా ! కొంచెము మద్యము పాత్రలో పోసియిమ్ము వర్తమాన మంతయు నొక్క గుటకలో మరిచి పోదును".

సరుమా మద్యమును నించి యంది యిచ్చినది. అతడు గుటగుట గ్రోలెను. శరీరము మత్తెక్కినది. సరుమా కరస్పర్శ యాతనికి మరింత మత్తెక్కించినది. దేహమునందంతయు విద్యుత్సంచారమైనది ! సుల్తాను జగత్తునే మరిచెనట ! మాదన్న కేమి జ్ఞాపకముండును ? జనుల కోలాహలమేమి జ్ఞాపకముండును? వానికిప్పుడు జ్ఞాపకమున్నది రెండే – మదిరా సుందరి, 'సరుమా బేగం'.

## 12

మాదన్న మరణించిన విషయము దేశమున వ్యాపించినది. ఆకథకనేక కొమ్మలు రెమ్మలు బుట్టినవి. మాదన్నను హత్య యొనర్చిన దెవ్వరను విషయమున ప్రజలు వారి వారి తర్కము నుపయోగించిరి. ముంతాజునకు మాదన్న హత్య యొక పండుగ. ఆమె యా హత్యను కన్నార జూచినది. జనులు కోలాహలమును జెవులార విన్నది. ఆమె వెంటనే యొక గుఱ్ఱము నెక్కి యువరాజు శిబిరమునకు వచ్చెను. 'షా ఆలం' యేదో యోచించు కొనుచుండెను. హఠాత్తుగా వచ్చిన ముంతాజును జూచి యాతడాశ్చర్య పడెను.

"ముంతాజ్ ! చుక్కయూడిపడినట్లు వచ్చినావేమి ! యెక్కడినుండి వచ్చితివి. కొత్త విషయము లేమైనసున్నవా? నీ కన్నులేల యెఱ్ఱగానున్నవి? యేదో యస్వస్థత, నీ మనస్సు నాక్రమించు కొన్నట్లున్నది. వెంద్రుకలు ముడివీడినవి. విషయమేమి?".

"యువరాజా ! మాదన్నను హత్యయొనర్చినారు".

"అయ్యో పాపము !"

"అంతఃపురముయొక్క మహాద్వారమందే హత్య జరిగినది".

"మహాపరాక్రమి యాతడు. అతనికట్టిచావు రారాదు"

"జనులాతని శవము నెత్తికొని రాజద్రోహికి తగిన ప్రాయశ్చిత్తమైనదని యఱచుచు బోవుచున్నారు. గోల్కొండ కోటలో గద్దలము చెలరేగినది. ఉద్రిక్తులైన జనులు దిక్కు తెలియక యటునిటు పరువులిడుచున్నారు. ఈ దృశ్యము నంతయు నేను గన్నార జూచితిని".

"ముంతాజ్ ! ఎంత యుత్సాహముగా వర్ణించెదవు?. మాదన్న నికరమైన స్వామి భక్తుడు. జనులాతని నపార్థము చేసికొన్నారు. ఎవరో పనిగట్టికొని దుష్ప్రచార మొనర్చినట్లున్నది. ఇంతకును విధిబలీయము; నీవింతవరకును నిలువబడియే యున్నావేమి? కూర్చొనుము".

మరల యువరాజడిగినాడు.

"ముంతాజ్ ఈ హత్య యొనర్చిన దెవ్వరు?"

"రాణివాసములోని స్త్రీలే యీ హత్య నొనర్చిరి. ఆడువారితోనే వానికి చావుమూడినది. చాలదినముల నుండి లోలోపల యీ ప్రయత్నములు సాగుచునే యుండెను. వారు సమయమునకై గాచికొని యుండిరి. నేడది యెదిగివచ్చినది. రెండు దినములనుండి సుల్తానునకు మాదన్నకును మధ్య రవరవలేర్పడినవి. అది మనుష్యులు జేసినదికాదు. దైవమే దెచ్చిపెట్టిన విరోధము. రాణివాస స్త్రీలు ఉపాయముతో మాదన్నను రాణివాసమునకు రప్పించికొన్నారు; సుల్తాను మంత్రిని ధిక్కరించి మాటాడెను. మాదన్న ఖిన్నుడై మరలి పోవుచుండెను. దారిలో స్త్రీ లడ్డగించి చంపిరి. ఈ యేర్పాటు లన్నియు ముందే జరిగినవి. శవమును దెచ్చి మహాద్వారమున పడవేసిరి. జనులలో నాతడు రాజద్రోహియను ప్రచారమింతకు ముందే ఉవ్వెత్తుగా జరిగినది. ప్రజలు యాతని శవమునెత్తి కొని యఱచుచు బోయిరి. నడుమ నడుమ బూతులు తిట్టిరి".

"ముంతాజ్ ! నీ యందు నాకెంత ప్రేమయున్నను మాదన్నగారి హత్యను మాత్రము హర్షింపలేను. అతని జీవితముపై విధి వికటాట్టహాసము చేసినది. ఈ హత్యలో సుల్తానునకును భాగమున్నదాయేమి?".

"లేదు, ఈ విషయమాతనికి దెలియదు. సరుమా, జానీసాహెబ్ యీ కుట్రలో జేరినవారే. వారికి చాల రోజులనుండి మాదన్నపై విద్వేషముండెను. అది యిట్లు ఫలించెను"

"ఆ రాణుల కాతనిపై యంతద్వేషమెందుకు? అతని రక్తముపై నంత క్షక్ష ఎందుకు? ఆ విషయము నీకైమైన దెలియునా?"

ముంతాజ్ పకపక మని నవ్వినది.

"యువరాజా ! ఒకటా రెండా ! ఎన్నో కథలున్నవి. నాకన్నియు దెలియును. ఆ దినములు గడిచిపోయి మూడు దశాబ్దములైనవి. ఇంతకుముందు ఆ రాణులు మాదన్న సాగించిన దుష్కృత్యములలో భాగస్వాములే. వారితో మాదన్నకు సంబంధ ముండెననియు యంతః

పురములో గుసగుసలుండెను. సుల్తాను రాజ్యపాలన మందును ఆ యిర్వురు రాణులకును చేతులుండెను. కొంతకాలము క్రిందట మాదన్నతో నా రాణులకు ద్వేషమేర్పడినది. అది యిట్లు ఫలించినది".

"నీ కీ విషయము లెట్లు తెలిసినవి?"

"నేనా రాణులతో పరిచయ మేర్పరుచుకొంటిని. మాదన్న నర్తకి 'నజీరా'ను పట్టుకొనుటకై వెదకించుచున్నాడని వారే నాకు చెప్పిరి. ఆ నజీరా నేనేనని వారికి విన్నవించినాను; వారు నాకు రహస్యముగా నాశ్రయమిచ్చిరి. క్రమ క్రమముగా వారి యాదరాభిమానములు సంపాదించు కొన్నాను. నేనే మాదన్నను హత్యచేతునని వారితో ననుచుంటిని. కాని ఆ కార్యము నా చేయివరకు రాలేదు. సరుమా, జానీ బేగంలే ఆ పనిని నెరవేర్చినారు. స్త్రీ హృదయమందు ద్వేషాసూయ లంకురించినచో నవి యెంతటి ఘోరరూపము దాల్చునో యూహించుట కష్టము".

"ముంతాజ్ ! నీవు స్త్రీవి కానట్లు మాటాడుచున్నావు".

"యువరాజా ! నేను స్త్రీని గానని చెప్పుటలేదు. కాని అందరి మనస్తత్వము లొక్కటిగా నుండవు. నా ప్రకృతి వేరు. వారి ప్రకృతి వేరు. నూరున్నీసా విషయ మాలోచింపుడు. అందరు స్త్రీలును ఆమెవలె దేవతలేమి?"

ముంతాజాసనమునుండి లేచినది.

"ముంతాజ్ ! ఎక్కడికి నీ పోక?"

ఆమె మరల నవ్వెను.

"యువరాజా ! మాదన్న మరణముతో, లోకమే మునిగిపోవునని నమ్ము మనుష్యుడొక డున్నాడు. అతడిబ్రహీం. ఈ శిబిరమందే యున్నాడు. అతనిని జూచి యెట్లున్నాడో విచారింతును".

"ముంతాజ్ ! ఈ ఇబ్రహీమునకు మాదన్నపై నంతటి భక్తి యెందులకు?"

ముంతాజు గంభీరురాలైనది. క్షణములో నామె భావము మారినది.

"ఈ యిబ్రహీం మాదన్నకు పెంపుడు కొడుకు ! ఈ లోకమున నతనికి మాదన్న దప్ప వేరు బంధువులు లేరు".

"లేకేమి ? నీ వొక్కతె వున్నావు గదా?"

"యువరాజా ! నన్నేల మీరు హాస్యమాడుచుందురు. నాకు ఇబ్రహీంపై ప్రేమ లేకపోలేదు. కావలసి నంతయున్నది ! కాని దానిలో కళంకము లేదు. పరిశుద్ధమైన ప్రేమ".

"ముంతాజ్ ! నీవు చింత పడకుము. నాకు నీ విషయమున తుచ్ఛ భావము లెన్నడును లేవు. కాని నీ వొక విచిత్రమైన వ్యక్తివి". ముంతాజ్ ఇబ్రహీం గుడారమునకు బోయినది.

అతనికి మాదన్న హత్యా విషయమంతకు ముందే దెలియును. ఇబ్రహీం పాలికి ప్రపంచమే క్రుంగిపోయినట్లున్నది. వాని కరణశక్తియే శూన్యమైపోయెను. ముంతాజును జూచిన వెంటనే....

"నజీరా ! మాదన్న గారస్తమించినా"రని గట్టిగా నరచి యేడ్వడొడంగెను.

"అవునవును ! నేనును జాచినాను. నే నప్పుడు గోల్కొండ కోటయందే యుంటిని. అంతఃపుర మహాద్వారమందే నిలచి యున్నాను. ఆ దృశ్యమును నేను కన్నులార జూచితిని. అదొక కరాళ దృశ్యము. విద్వేష సాధన యొక్క భయంకర నృత్యము.

"నజీరా ! ఇందులోని సత్యము నీ వెరిగియున్నచో చెప్పుడు. ఆ మహామహుని హత్య యొనర్చిన పాపాత్ము డెవడు?".

"అంతఃపురము నందే జరిగిన 'పితూరీ' యిది. సరుమా, జానీసాహెబా రాణులే దీనిని నడిపించినారు. స్త్రీల చేతులతోనే యీ వీరుడు చచ్చెను. బయటి జనమునకును, దీనికిని సంబంధమే లేదు".

ఇబ్రహీం కన్నులు నీటితో మూసికొని పోజొచ్చినవి. ముంతాజన్నది. "సేనాధిపతీ ! నీవాసమయ మందక్కడ లేకుండుట అదృష్టము. లేకున్న నీ హత్యను నీ తలకు వేసి చుట్టి యుందురు".

"నేనక్కడున్నను మాదన్నగారిని రక్షించియుండలేను. అంతఃపురములో నాకు ప్రవేశము లేదు. కాని ఆ వీర పురుషుని శరీరము జనులు వీధులలో వేసి తొక్కిరట. ఆ మహావీరుని కిట్టి యవమానము జరుగదగునా ! నేనక్కడ నున్నచో దీనినైన నాపి యుందును". "నజీరా నవ్వినది. "నీవలె వీరుల మనుకొనువారి కంతయు నిదొక భ్రాంతి. ఉద్రిక్తులైన జనులను వారి యా వేశములనుండి మరల్చుట కెవ్వరికి సాధ్యమగును? ఇబ్రహీం ! గడచినది గడచినది. నీ వింక నా విషయమునే తలచికొనుచు దానిచుట్ట సాలీనిగూడులల్లకుము; ఎంతచేసిన వారి కంత జరిగితీరును".

**13**

బీజాపురపుకోట పాదుషా స్వాధీనమైనది. బీజాపురపు నవాబు సికందర్ షా. ఆతని నౌరంగ జేబెంతయో గౌరవముతో జూచెను. పరివారసమేతముగా నాతనిని రాజమర్యాదలతో అహమదాబాదున కంపినాడు. బీజాపురము నందొక మొగల్ సైన్యశిబిర మేర్పాటు చేయబడినది. పాదుషా యా సైన్యమును సయ్యద్ఖాన్ అను సేనాధిపతి యధీనమున నుంచినాడు. తాను గోల్కొండ వైపునకు దరలెను; గోల్కొండ కోట కుత్తరమున మొగల్

సైన్య శిబిరములున్నవి. మనోహరములైన పట కుటీరములు గాయన గాయనీ మణుల కంఠనినాదములు; సమ్మోద నృత్యములు; అదియొక పెద్ద పట్టణమంత యున్నది. గోల్కొండ కోటపైకెత్తి పోవుటకు సన్నాహములు జరుగుచున్నవి. పాదుషా గూఢచారుల మూలమున యువరాజు ప్రవర్తన మంతయు విచారించి కొన్నాడు. యువరాజు సైన్యము లొక్కయడుగు ముందుకు వేయలేదు. గోల్కొండలో మాదన్న నెవరు వధించిరి? ఈ రహస్యమును ఛేదించుటకు పాదుషా యత్నించెను. కాని సరియైన వివరములు దొరకలేదు. జనులలో ప్రచారము నానా విధములుగా వుండెను. సుల్తానునకును మాదన్నకును తీవ్రమైన వాగ్యుద్ధము జరిగినది. హఠాత్తుగా సుల్తానే మాదన్నపై బడి యాతనిని జంపెను. ఇదియొక కథ. మాదన్న మరల నధికారమును స్వీకరించినాడు 'మిర్‌లాజు'న కసూయ యేర్పడినది. అతడే అంతఃపుర మహాద్వారమున, వజీరును ఖూనీ చేయించెను. ఇది మరొక ప్రచారము. సుల్తాను సైన్యములోని ముసల్మాను సైనికులు మాదన్న నెదిరించి చంపిరని యొక్క వాదము. ఒక్క దానికిని పోలు పొందులేదు. ఒకడు చెప్పినది మరియొకడు జెప్పుటలేదు. పాదుషా చెవులలో నిట్టివి వేలు కథలు పడెను. గోల్కొండకోట శత్రువుకు లోబడు సమయ మాసన్నమైదను సంగతిని గ్రహించిన మాదన్న ఆత్మహత్య నొనర్చి నాడను వారును లేకపోలేదు. పాదుషా, యే కథయు నమ్మలేకున్నాడు. అతని స్వభావమే సందేహము. ఏ విషయమునకు గాని, రంగు చూసి యావేశపడుటాత డెఱుగడు. ఈ సమాచారములు విన్నపుడంతయు నాతని మనస్సులో భాసించిన విషయమొక్కటే. యువరాజునకిది చక్కని సన్నివేశము. ఈ సమయము నాతడు వ్యర్థపరచుకొనక కోటలో బ్రవేశించ వలసియుండును. ఆతడట్లు చేయలేదు. ఇది షా ఆలం యొక్క పెద్ద తప్పు. ఇంతకుముందే యువరాజుపై నాతనికి కోపమున్నది. దీనితోనది రెండింతలయ్యెను. యువరాజును బట్టి తెప్పించి చెఱలో నుంచవలెనని భావించినాడు.

'షా ఆలం' విలాస ప్రియుడనుట దర్బారుకంతయు దెలిసిన విషయము. కాని కొలువులో నాతని నెక్కువమంది ప్రేమించుచుండిరి. ఆతని యౌదార్యము వారిని వశులుగా జేసికొన్నది. ఈ విషయముగూడ సుల్తానునకు దెలియును. షోలాపురమునుండి షాఆలం అంతః పురమంతయు ఢిల్లీకి సాగిపోయినది. 'మరి వీడొక్కడు మాత్రమిక్కడేమి చేయుచున్నాడు?' ఈ ప్రశ్నగూడ పాదుషాను పీడించుచున్నది. ఔరంగజేబు దగ్గర నెందరో గూఢచారులుండిరి. వారు చాల నమ్మకమైనవారు. ఏ విషయమందును వారసత్యము బలుకరు. వారు మారువేషములలో యువరాజు శిబిరమందచ్చట టచ్చట సంచరించుచుండిరి. తాము సేకరించిన విషయములను పాదుషా జెవిలో వేసినారు.

"జహాపనా ? మేమిప్పుడు చెప్పబోవునది చాలముఖ్యమైన విషయము. దానిని విన్నచో మీకుగూడ మాపై కోపము రావచ్చును. కాని విధిలేదు. ఉన్న సత్యమును దాచుటకు వీలులేదు".

ఔరంగజేబు గంభీరుడై కనుబొమ్మ లెగురవేసినాడు.

ఆ కనుబొమ్మలు కాలయముని వికటాట్టహాసమువలె నున్నవి. వానికి దయలేదు. ప్రపంచమున నెదురు లేదు.

"జహాపనా ! గోల్కొండ దర్బారులో నొక నర్తకి యున్నది. అది యువరాజు ప్రేమను సంపాదించి కొన్నది. దానిని మేము కన్నార చూచితిమి. చాల యందకత్తె, అట్టి రూపము దక్కను నందే లేదని చెప్పవచ్చును. గోల్కొండ యంతఃపురమునకు యువరాజు శిబిరమునకు నడుమ నా నర్తకి ఆసువలె దిరుగు చున్నది".

ఔరంగజేబు క్రోధము మరియొకసారి గనుబొమ్మలలో మెరసినది. "ఏమీ !" యని గట్టిగా గర్జించెను. ఆ గర్జనకు సైనిక శిబిరములు గజగజ లాడినవి. గూడచారుల ప్రాణములు లేచిపోవునంత పనియైనది.

పాదుషా రోషావేశముతో నవుడు గరచెను. క్రింది పెదవి కాటులు పడినది.

"రూహుల్లా"యని గట్టిగా నరచినాడు. ఒకనికి పదుగురు వాని యతనిని దోడ్తెచ్చిరి. 'రూహుల్లాఖాన్' యొక సేనాధిపతి.

"రూహుల్లా !" నీ విప్పుడే బయలు దేరవలెను. మెఱపువలె బొమ్ము. యువరాజు శిబిరమునకు బోయి యా ద్రోహిని బట్టుకొని రావలెను. ఆ శిబిరములో నొక నర్తకి యున్నదట? దాని పేరు...."

గూఢచారులు 'నజీరా' యనిరి.

"ఆ నజీరాను గూడ వెంటనే యీడ్చుకొని రమ్ము !"

రూహుల్లాకు పాదుషా మనస్థితి దెలియలేదు. ఔరంగజేబు చాల చికాకులో నున్నాడు. గోల్కొండ కోట యాతని పాలికి పెద్ద సమస్య యైనది. యువరాజు విలాస ప్రియత్వమే యింత జాగునకు కారణమని యాతని విశ్వాసము. షా ఆలంపై రూహుల్లాకు మెప్పుకద్దు. యువరాజు ఉదారి మాత్రమే గాదు, పరాక్రమశాలి గూడ. ఇప్పటి స్థితిలో షా ఆలం పాదుషా కంటబడినచో నాతని తల భూమికొరగ వచ్చునని గూడ రూహుల్లాకు సందేహము. కాని ఏమిచేయును? పాదుషా యాజ్ఞను దాటుటకు వీలులేదు. ఆ సేనాధిపతి యనుత్సాహముతోనే బయలు దేరినాడు.

ముంతాజు, సంధ్యాకాలమగు లోపలనే శిబిరము వదలినది. గోల్కొండ యంతి పురమునకు బోయి 'సరుమా' బేగమును గలసికొనినది. ఆనాడు సరుమాకు బట్టపగ్గములు లేకుండెను. ఆమె కొడలంతయు సంతోషమే. ముంతాజును జూచిన వెంటనే సరుమా మొగమంతయు చిఱునవ్వులైనవి."నజీరా ! నీవు రెండు దినములనుండి గనుపించుటయే లేదు ఎక్కడకి మాయమై యుంటివి?".

"నా కొక చోటని ఏమిటమ్మా ! దిక్కులేనిదానికి ప్రతియొక్కటియు గృహమే. నీ యొద్ద దాపఱిక మెందుకు? నీకేదైనను వినుట కింపైన విషయమును సంపాదించుకొని వత్తమని పోయియుంటిని.

"క్రొత్త సమాచారమేదైనను బట్టుకొని వచ్చినావా? ఇప్పుడెక్కడ నుండి నీ రాక?"

"యువరాజు శిబిరము నుండి".

"నీ వెంత గడుసుదానివి ? నీ వాలక మంతయు నాకు దెలియవచ్చినది. నేను చెవులు మూసికొని కూర్చున్నాననుకొన్నావా? నీవా యువరాజును బుట్టలో వేసికొన్నావు. ఇంకేమున్నది! నీకేకార్యమైనను సులభమే. నీవు షా ఆలం ప్రేయసివి".

"రాణీ సాహెబా ! ఈ లోకములో నపకీర్తి లేని స్త్రీ లెవ్వరున్నారు? ప్రతియొక్కరి కేదొకటి ప్రపంచమంట కట్టనేకట్టును. పోనిమ్ము, నా దృష్టిలో యువరాజు ప్రేయసిననుట సిగ్గుపడవలసిన మాటేమియును గాదు".

"అక్కడ విషయము లేమైనను చెవిలో బడినవా? పాదుషా బీజాపురమువైపు బోయినాడు. షా ఆలం గోల్కొండపైకి వచ్చినాడు. ఈ రెండు సైన్యముల నడుమ గోల్కొండ కోట ధూళీ పటలము గావలసినదే ! ఈ యపాయమునుండి దప్పించుకొనుటకేదైన మార్గమున్నదా ! యని యాలోచించుచున్నాను"."లేకేమి ! మీరు తలచినచో తప్పక యున్నది. సరుమాబేగం బుద్ధికి మించిన కార్యములేదు. దీనికి మాదన్న హత్యయేసాక్షి"."ఇప్పుడు దానికన్నను గొప్ప కార్యమేర్పడినది. ఇందులో నాదేమియు నడవదు. నీ చాకచక్యమే పనిచేయవలెను".

"సరుమా ! నే నింకను వయస్సున చిన్నదానను. కొన్ని దినములు నేను బట్టగట్టవలెనను తలపు నీకు లేదాయేమి? ఈ చిక్కులలో దగుల్కొన్నచో నా జీవితము పూర్తియైనట్లే ! యువరాజుతో నాకు చక్కని పరిచయమున్నది. అంతమాత్రము నిజము. అతడు సరళ హృదయుడు. ఉదారుడు. శత్రువులపైని దయతో నాతడు యుద్ధమును ముందుకు సాగించుటలేదు. ఊరక కాలమును గడుపుచున్నాడు. నిజముగా మొగలు సైన్యము లెత్తివచ్చినచో పోరగలమేమో మీరే చెప్పుడు. షాఆలంనకు సుల్తానుతో బోరుయిష్టము లేదు. మొగలులకు సుల్తానుతో విరోధము లేదు. వారి శత్రువు మాదన్న. వాని పని మీరే ముగించితిరి. మీరు మీ చాకచక్యముతో యువరాజును మెప్పించ గల్గినచో, పాదుషా శాంతించును. ఇక కాబోవు పాదుషా యువరాజేగదా !"

"యువరాజును మెప్పించుటెట్లు? దీని కుపాయము నీవే వెదుకవలెను".

"సరుమా? నీవు కోపింపకున్నచో చెప్పెదను. నీవు నా వెంటరమ్ము. యువరాణితో సులభముగా భేటీ చేయించెదను. ఆ యువరాజుతో మీ విషయము మనవి చేసికొనవచ్చును". సరుమా నాలుక కరచి కొన్నది.

నజీరా ! ఎంతమాటన్నావు ! గోల్కొండరాణి యట్లు బయటికి రావచ్చునా? ఒకవేళ నేను మనవిచేసితినిపో, షా ఆలం నా ప్రార్థనను మన్నించునని నిశ్చయమేమి? అతని యుపకారమునకు మన పురస్కృతి యేమున్నది?.

'నజీరా' పెదవులపై పారిజాతములు పూచినవి. ఆమె పలికినది.

"మీ వంటి సౌందర్యవతు లేమి చేయలేరు. లోకమంతయునైనను జయింపగలరు. అమృతము గురిసెడు మీ వాక్కులు, అమృతమున కన్నదమ్ములైన మీ కటాక్షములు".

'సరుమా' చెంపలపై గులాబులు నిలిచినవి. కన్నులలోని కోపరేఖ చిఱుఎఱ్ఱదనమును జిందినది.

'దుర్మార్గురాలా ! నన్ను యువరాజునకు మార్తువేమే?

లేదమ్మా మిమ్ములను మార్చుశక్తి నాకులేదు. కొనుశక్తి ఆ యువరాజునకున్నదా? సర్వైశ్వర్య సంపూర్ణమైన యీ గోల్కొండ ఒక యెత్తు. మీ మందస్మిత మొకయెత్తు. యువరాజు కోర్కె యొకటున్నది. దానినెట్లో నేను గ్రహించినాను. దానిని సాధించుటకు మీకుగూడ కష్టమే ! కాని సాధించగల్గితిరా, అది యువరాజునకు గొప్ప పురస్కారము".

"ఏమది ? చెప్పుము చూతము".

నజీరా తడవడెను.

"అయినను, ఈ సన్నివేశమున నన్నిరికింపరాదు".

"లేదులే ! అదేమో చెప్పుము".

"ఈ యంతఃపురమున నొక్క సుల్తాను చెరలో నున్నాడట".

సరుమా కన్నులు భయముతో చకితములయ్యెను.

"అవునవును అతని పేరు సయ్యద్ మహమ్మద్ ఇది చాలా రహస్యమైన విషయము". "నీ కెట్లు తెలిసినది?"

"యువరాజులే చెప్పిరి. నాల్గు నెలలనుండి యువరాజు హైదరాబాదులో నా బందీ కొరకే వేచియున్నారు. మాదన్నకు రహస్యముగ నాతడా షరతునే చెప్పి పంపెను. అతడు దాని కంగీకరించెను. సుల్తాను నుపాయముతో నోరుగల్లున కంపి 'సయ్యద్ మహమ్మదు' యువరాజున కొప్పింపవలెనని మాదన్న యుపేక్షయై యుండెను. దాని నాతడు సాధింప నేరడయ్యెను. ఆ షరతు నేడు నీ పాలబడినది".

"యువరాజు ఈ షరతునకై నిన్నే దూతగా బంపినాడాయేమి? కాని యా బందీని విడిపించుట సాధ్యము గాదు. అతడు గద్దకు వచ్చినచో పాదుషా అతనినే గోల్కొండ సుల్తానుగా నియమింపవచ్చును. ఆ బందీని విడుచుటకు సుల్తానంగీకరింపడు. గోల్కొండ సుల్తానును నే నీ విషయమున వంచింపలేను".

'నజీరా' మౌనమును వహించినది. ఆమె శూన్యములో నేదియో యాలోచించు కొను చుండును.

"నజీరా ! ఈ విషయమున నీ వేమందువు ?"

"బాగున్నది ఇందుకే ఈ విషయమున నన్నిరికింప వద్దని ముందుగా మిమ్ము వేడుకొన్నది". "ఇందులో నిరుకించు టేమున్నది? సలహా అడుగుచున్నాను. నీకును నాకును మైత్రిగదా !"

"మీరు యువరాజును భేటీ సేయువరకు దీని ఫలము తేలదు. షా ఆలం యిచ్చినమాట తప్పువాడుగాదు. సయ్యదు మహమ్మదు విముక్తుడైనను, ఆతని గోల్కొండకు పట్టము గట్ట రాదనియు, యీ సుల్తానే యుండవలెననియు మీరు ప్రార్థింపవచ్చును. ఇందులో దోషమే మున్నది?"

"ఈ యుక్తి బాగుగనే యున్నది కాని, నన్ను యువరాజు కడకు బొమ్మను చున్నావు. దాని విషయమే తీవ్రముగ నాలోచించవలసియున్నది. నే నక్కడికి బోయివచ్చుట యెవరైన జూచినచో గోల్కొండ పరువు దక్కదు. సుల్తాను ప్రాణము లెగిరిపోవును".

కొంతసేపు సంభాషణ మాగినది. ఇంతకు సారాంశమేదియు దేలలేదు. సంధ్యయైనది. రాత్రి చంద్రుడను దీపమును ముట్టించికొని తిన్నగా బ్రవేశించెను. బాహ్య ప్రపంచము తిన్నగా కన్ను మూసికొనుచున్నది. సరుమా కాదినమంతయు చిత్తశాంతిలేదు. నజీరా మాటల నామె తీవ్రముగా నాలోచించి కొనుచున్నది. రాత్రియంతయు నామెకు నిద్ర బట్టినదిగాదు. మరు దినమును గడచినది. ఎప్పటివలెనే సంధ్య ముగిసెను. రాత్రి మంద గమనముతో వచ్చెను. ఇంతకుముందు సుల్తాను గారి యంతఃపురము నృత్యగానములతో మారు మ్రోగినది; నేడవి నిలిచిపోయినవి. సరుమా సుల్తాను చెంతకేగెను. అతడప్పుడే మద్యపాన మారంభించినాడు. సుల్తాను సరుమాను చూచి వెంటనే "రాణీ ! రమ్ము రమ్ము నీ కోసమే కాచికొని యున్నాను. మన మిరువురమును నేటి రాత్రి స్వర్గమును బండించుకొందము. ఈ దినమిక రాబోదు" సుల్తాను గట్టిగా నరచినాడు.

సరుమా రాణి చల్లగా నవ్వినది. ఆమె వానిని సమీపించినది.

"అబుల్ హసన్ ! అధైర్య పడకుము. ఈ సుల్తాను దీర్ఘాయుష్యముతో నుండు నేర్పాటు లొనర్తును. అల్లా నన్నను గ్రహింపవలెను" అన్నది. ఆమె మద్యము మధుపాత్రలో బోసినది. వాని పెదవి కందించినది. నల్లని యామె కన్నులందు ప్రతిఫలించినవి. సరుమారాణి మాటలు మద్యములోని రుచి నామ్రేడించు చుండెను. ఒక గుటక కన్నను మరియొక గుటక వానికి సుఖకరమై యుండెను. సుల్తానునకు బాహ్యజ్ఞానము దప్పినది. తూగుచున్నాడు.

"సరుమా ! సంధానమును నడుపు వారెవ్వరు? అన్నాడు.

"నేను జానీ సాహెబా !"

సుల్తానునకు లోకమే తెలియుట లేదు. వాడామత్తులో తన రాజముద్రికను సరుమాకిచ్చినాడు.

"రాణీ ! నీవే నా పాలికి దేవత. నేను నీ దాసాను దాసుడను. నీ యిష్టము వచ్చినట్లొనర్పుము".

సరుమా ! మరియొకసారి వానికి మద్య పాత్ర మందించినది. వాడు దానిని డ్రాగి వేసెను. వాడామెను గట్టిగా కౌగలించుకొని చుంబించినాడు.

“సరుమా ! నీవే నా సర్వస్వము”.

వాడు ప్రజ్ఞాశూన్యుడై శయ్యపై బడినాడు.

సరుమా తిన్నగా యాగదినుండి వెలికి వచ్చినది. ద్వారమును మూసినది. జానీ సాహెబాను పిలచి యక్కడ కావలి పెట్టెను.

“జానీ సాహెబా ! నేనొక మహాకార్యమునకై దొడరుచున్నాను. అది యగ్ని ప్రవేశము వంటిదే ! నీ కీ మధ్యాహ్నమే కొంత వివరించినానుగదా ! నీవిక్కడే జాగ్రత్తగా నుండుము. సుల్తానును చక్కగా గమనించుచుండుము. నడుమ లేచినచో మరియొకసారి మద్యమిమ్ము. ఇంతలో నాతడు లేచు సంభవము లేదు. నేడు మద్యమున మత్తు గలపినాను. నేనీ కార్యమున గెలిచినచో వెనుకకు వత్తును. లేకున్ననింతే. ఈ మొగల్ సైన్యముల చూచిన నాకేమియు భయము లేదు”. జానీసాహెబా సరుమాను గౌగిలించి ముద్దిడినది.

‘సరుమా ! నీవు లోకములే జయింతువు. అల్లా నీకు తోడ్పడుగాక’

సరుమా మెల్లగా నడుగులు వేసికొనుచు సయ్యద్ మహమ్మదునుంచిన చెరసాలకడకు వచ్చినది. అది యంతఃపురమందే యొక భాగము. ఆమె ద్వారమును సమీపించెను. పహరావాడు జాగ్రత్తగా గావలిగాయుచున్నాడు. ఎవరో వచ్చుచున్నారని కొత్వాలు త్వరపడుచు ద్వారము చెంతకు వచ్చెను. అతడు రాణిని పరీక్షించి చూచెను.

“నేను సరుమారాణీని; నీకు దెలియదా?”

తెలియదనివాడు తలనాడించినాడు; ఆమె రాజముద్రికను జూపినది.

“ఈ వాకిలి దెరచుము. ఈ ఖైదీని దీసుకొని పోవలెను. చాల ముఖ్యమైన పనియున్నది”.

ఆమె మాటలలో నధికారమున్నది. కొత్వాలు రాజముద్రికను బరీక్షించినాడు. అది సుల్తానుగారిదే ! ఆమెలోన జొచ్చినది. బందీ నేలపై బడియుండెను. వాని జీవితము శూన్యము. దృక్కులు శూన్యము. ఆమె వానిని తట్టిలేపినది.

‘‘సయ్యద్ మహమ్మద్ ! లెమ్ము నీకు విడుదలయ్యెను’’. వాడీసత్యమును నమ్మలేకపోయినాడు. ఏదో స్త్రీ కంఠము తన్నెచ్చెరించు చున్నట్లున్నది. ఆ కంఠమున మాతృకంఠ కోమలత ధ్వనించినది. కాని వాని పాలికి జీవితమే స్వప్నమట ! ఇట్టి సన్నివేశములు స్వప్నములుకాక మరేమి? మహమ్మదు కదలలేదు. “మహమ్మద్ ! నిన్నే బిలుచుచున్నాను, నీకు విడుదలయైనది”. ఈ మాటయన్న దొకటే కంఠము. వానికి పంచభూతములు నీ మాటయన్నటులైనది. మెల్లగా తలపై కెత్తినాడు.

"ఎవరు తల్లీ ! నీవు ? నాకు విడుదలయని పలవరించుచున్నావు? నీవు స్వప్నకాంతవా యేమి? జీవితమునుండి విడుదలకై కాచికొనియున్న నన్ను పేరాశలలో నేల కలచెదవమ్మా?"

"ఆశలుకావు. నా మాట సత్యము. నీకు నిదానముగా సంగతులన్నియు దెలియును. నామాట నమ్ముము". ఆమె యాతని చేయిపట్టి యీడ్చినది. ఏదో బలవత్తరమైనశక్తి తన్నీడ్చికొని పోవుచున్నట్లు మహమ్మదామెవెంట నడచెను. అంతఃపురముయొక్క పశ్చాత్ప్రదేశమున నొక మేనా సిద్ధపరుపబడియున్నది. "ఈ మేనా నెక్కు"మని సరుమా పల్కెను. మహమ్మద్ తలనెత్తి చూచినాడు. తలపై వినీలాకాశము మెరయుచున్న నక్షత్రములు. ఎక్కివచ్చుచున్న చంద్రుడు. చల్లగా వీచుచున్న గాలి. ఎదుట సౌందర్యము రూపుగట్టిన మూర్తి". విడుదలయైనది మాత్రము నిజము. కారణమేమో?" మహమ్మదనుకొన్నాడు.

"మహారాణీ ! నన్నెక్కడికి దీసికొని పోవుచున్నావు?

"మాటాడకుము. నీవింకను నా బందీవి" ఆమె గద్దించినది. మహమమ్మద్ మేనాలో గూర్చున్నాడు. సరుమా దాని వాకిండ్లు భద్రపరచెను. బోయీలు నిశ్శబ్దముగ ప్రయాణము సాగించినారు. రాణి అశ్వమునెక్కి వారివెంట బోయినది. తూర్పుదిక్కు తెలివొందినది. యువరాజు శిబిరము సమీపించినది. ఆమె శిబిరమున ప్రవేశించి, ద్వారపాలకునితో యువరాజునకు కబురు పంపినది. సేవకుడు యువరాజును సమీపించినాడు.

"హుజూర్ ! ఎవరో ఒక స్త్రీ; అశ్వమునెక్కి వచ్చినది. పెద్దయింటి యామెగా గన్పడుదచున్నది. మీ దర్శనమును గోరుచున్నది. ఆమెవెంట నొకమేనా యున్నది. అందులో యెవరో యున్నట్లున్నారు".

షా ఆలం కొంతసేపు యోచించినాడు.

"ఏదో యాశ్చర్యముగ నున్నది. ఆమెను మర్యాదతో దోడ్కొనిరమ్ము"

సరుమా లోనప్రవేశించి చిరపరిచితయైన దానివలె గంభీరముగ నాతని కభివందించెను.

"నీ వెవ్వరమ్మా ! ఒంటిగా వచ్చినావు? యుద్ధకాలము. ఈ సాహసమునకు కారణమేమి? నీ కోర్కెయేమి?

'సరుమా' మాటాడ మొదలుపెట్టెను.

"తల్లీ ! ఆ యాసనముపై గూర్చుండుము".

'సరుమా' యాసనముపై కూర్చున్నది.

"యువరాజా ! నేను గోల్కొండ యంతఃపురమందలి యొకరాణిని. మీతో సంధి విషయమై మాటాడుటకు వచ్చినాను. సుల్తానుల యాజ్ఞ దీసికొనియే వచ్చితిని. ఇదిగో చూడుడు". ఆమె రాజముద్రికను యువరాజునకిచ్చినది.

"ఇది గోల్కొండ సుల్తానుల వంశపారంపర్యముగ వచ్చిన కుతుబ్‌షాహి రాజముద్రిక. దీనిని మీ కొప్పించినాను. సుల్తానును మర్యాదతో రక్షింపవలసిన బాధ్యత మీది. ఈ సంధికై యెంత ధనమునైనను యిచ్చుటకై సిద్ధముగా నున్నాను".

యువరాజు స్తంభీభూతుడైనాడు. ఆ రాజముద్రిక నాతడు మాటిమాటికి త్రిప్పిచూచి ఆమె ముఖమువైపు జూచెను.

"బేగం సాహెబా ! ధనము, ధనము, ప్రపంచమంతయు ధనములో నున్నది. ఎంత ధనము మీరివ్వగలరు? ఆ వైపు పాదుషా మహాసైన్యముతో నడచివచ్చినాడు; ఏది యెట్లున్నను సుల్తానును రక్షించు నధికారము నాకెక్కడనున్నది ! పాదుషాగారి యాజ్ఞ ముందు మేమెల్లరము తృణప్రాయులము".

'సరుమా' ధైర్యము సడలలేదు. ముఖభంగిమలును మారలేదు. అదే యొయ్యారము, అదే సంభ్రమము ఆమె మందస్మితముతో నిట్లన్నది.

"యువరాజా ! నా కంతయు దెలియును. మీరు మా వారైనచో పాదుషా లేమియు నొనర్పలేరు" అన్నది.

"బేగం సాహెబా ! మీ మాట చిత్రముగా నున్నది మా తండ్రి కొడుకుల మధ్య నభిప్రాయ భేదములను సృష్టించుటకు యత్నించుచున్నారాయేమి? అది పొసగదు". షా ఆలం నవ్వినాడు. ఆ నవ్వులో సరుమాకు నిరాశ ధ్వనించెను.

సరమా యా వేశముతో నన్నది.

"యువరాజా ! పాదుషా మూర్ఖుడాయేమి? గోల్కొండ కుతుబ్‌షాహి రాజముద్ర మీ చేతియందే యున్నది. ఇంక యుద్ధమెందుకు; ఈ రాజ్యము సమస్తమును మీకు లోబడినట్లేగదా ! మీరు పాదుషా ముందీ విషయము చెప్పినచో దీర్ఘ విజయమును సాధించిన మీ మాటను ఆలంఘీర్ త్రోసి వేయడని తలంతును. యువరాజా ! ఇప్పుడు చెప్పుడు మీకెంత ధనముగావలెను !"

అతడామె నెగాదిగ చూచినాడు.

రాణీ సాహెబా ! మీ మనస్సు నందేదో గంభీరమైన యాలోచన యున్నది. దానిని త్వరగా చెప్పక దాచికొనుచున్నారు; నా నుండి మీకేమియు భయము సంఘటిల్లదని భరోసానిచ్చుచున్నాను. మీ రాడుమాట నాపకారమైనను, మీకొక్క బాధయు రాదు. మీ మర్యాదకు కొఱతలేదు. రాణివాసము శత్రుశిబిరమునకు వచ్చుటయే యొక మహాసాహసము. ఆపదలో జిక్కి యిక్కడివరకు వచ్చినారు. మిమ్ము మరల గోల్కొండకు జేర్చు బాధ్యతనాది. మీ మనస్సులో దాగియున్న మాట యేమిటో వివరింపవలెను".

సరుమా చకితయయ్యెను. ఆ భావము రెప్పపాటులో మాయమయ్యెను. ఆమె యన్నది. "ఓ రాజా ! మీకు నర్తకి యొకతె విశ్వాసపాత్రురాలని విన్నాను. ఆమె పేరు నజీరా. ఆమె యెప్పుడబద్ధమాడి యెరుగదు. మా కారాగృహమందున్న సయ్యద్ మహమ్మదును మీ కొప్పగించినచో మీకు మాపై నభిమానము గలుగు నన్నయామె మాటలు నమ్మినేనా సాహసకార్య మొనర్చినాను. సయ్యదు మహమ్మదును మీ చెంతకు గొనివచ్చినాను".

"సయ్యద్ మహమ్మదును మీరు దీసికొని వచ్చినది మాకు గొప్ప యుపకారమే !" షా ఆలం శిబిరమునుండి గద్దకు వచ్చినాడు. అతడు మేనా చెంతకేగి తానే వాకిండ్లు దెరచెను.

"హజరత్ సయ్యద్ మహమ్మదులు మీ రేనా యేమి?" ఆ బందీ కండ్లు నులిమికొని తలనెత్తి చూచెను. ఎన్నో యేండ్ల కాతడు నవ్వెను. యువరాజాతనికి హస్తలాఘవమిచ్చి తన శిబిరముకు దోడ్కొని వచ్చినాడు.

సయ్యద్ మహమ్మదు సరుమావైపు దిరిగిచూచెను.

"మహాతల్లీ ! నీ వెవ్వరవు ? ఈ యర్ధరాత్రమున నన్ను విడిపించి పుణ్యము గట్టుకొన్న త్యాగమయివి నీవేగదా !"

"అవును సయ్యద్ ! ఇప్పుడు నీకు విడుదలయైనది. నీ యెదుటనున్న యాతడు ఢిల్లీ యువరాజు షాఆలం. నేను గోల్కొండ సుల్తాను రాయబారిని".

"తల్లీ ! మీరెవరైన గావచ్చును. చచ్చువరకు నాకు విడుదలలేదని నేను భావించియుంటిని. నా జీవితమున వెలుగు జూపిన జగద్ధాత్రివి నీవు. ఈ మహానుభావుని దర్శనమైనది. గోల్కొండ సమాచారమేమైనది?".

"అవన్నియు నిదానముగా మీకే తెలియును. గోల్కొండ ఢిల్లీ యువరాజుల వశమైనది. అదిగో వారి చేతిలో కుతుబ్‌షాహి రాజముద్ర. ఇకవారు మీకే పట్టాభిషేక మొనర్చినను మాకు సంతోషమే".

యువరాజు రాజముద్ర సయ్యదునకిచ్చినాడు. అతడు దానిని కన్నారజూచి చుంబించెను. మరల యువరాజున కిచ్చినాడు. సరుమాతో నన్నాడు.

"తల్లీ ! నాకు మరల సుల్తానుగావలెనను పేరాశలేదు. యువరాజుల యాజ్ఞయైనచో, నేను సంతోషముగ మక్కాకు బోయెదను. నేనీరాజ్యమందే యుండను; గోల్కొండలో నాకు శత్రువులుండవచ్చును, మిత్రులుండవచ్చును. మక్కాలో నా గొడవలేదు. ఐశ్వర్య దారిద్ర్యముల పోరాటము లేదు; ఒకటే నిత్యశాంతి".

సరుమా యామాటకు మనస్సు సంతోషించినది. షా ఆలం అన్నాడు.

"హజరత్ ! మక్కాకు బోవుచున్నారా ? మక్కాలో శత్రుమిత్రుల పోరాటము లేదని యెవరు చెప్పిరి? ప్రతి చోటను మంచి చెడ్డలుండనే యున్నవి".

"ఏమో ఈ రాజ్యమందుండుటకు మాత్రము నా కిష్టములేదు. మక్కాకే పోదమనుకొన్నాను".

షా ఆలం వారిర్వురను తమ శిబిరమున విశ్రమించికొనుటకై ప్రార్థించినాడు.

"బేగం సాహెబా ! మీ యుపకారము మహత్తరమైనది. సాయంకాలము లోపల మిమ్ము గోల్కొండ కోటకంపుచున్నాను".

సరుమా సలామొనర్చెను. ఆమె నవ్వుచునన్నది.

"యువరాజా ! మీ కార్యము ముగియువరకు నేను మీ కతిథినే. మిమ్ముగాదని నేనెక్కడ బోగలను? ఇంతటితో సయ్యద్ మహమ్మదు బంధన ముగిసెను. ఇకమీద నేను మీ బందీని నన్ను మీరు వెన్కకంపకుడు. నా విషయము నజీరా నడుగుడు".

యువరాజు వారికిర్వురకు ప్రత్యేక శిబిరము లేర్పాటు చేసినాడు. మధ్యాహ్నమయ్యెను. పాదుషా సేనాధిపతియైన రూహుల్లాఖాను వచ్చినాడు. అతడు యువరాజును దర్శించెను. పాదుషాగారి దర్శనమున కనుజ్ఞయైనదని విన్నవించినాడు. షా ఆలం సరుమా రాణిని బిలిపించెను.

"రాణీ సాహెబా ! నేను పాదుషాగారి దర్శనమునకు బోవుచున్నాను. నాకే విషయము నందును స్వాతంత్ర్యము లేదని నిన్ననే దెల్పినాను గదా! పాదుషా చెంత మీ ప్రార్థనమును విన్పింతును. నేను తిరిగివచ్చువరకు మీరిచ్చటనే యుండవచ్చును. గోల్కొండకైనను బోవచ్చును. నేను మీకు జరిగిన విషయములు దెల్పెదను. నేనింతవరకు మిమ్మడుగుటయే మరచినాను. మీ కాక్షేపణ లేకున్నచో మీ పేరేదియో దెల్పవచ్చును".

"నా పేరు 'సరుమా' !"

యువరాజునకే విషయమో జ్ఞాపకము వచ్చినట్లైనది. ఆతడు క్షణకాలమూరకుండెను.

"చాల సంతోషము" అని బయలుదేరినాడు.

"యువరాజా ! నేను మీపై నెంతో నమ్మకము పెట్టుకొని యున్నాను. నా విశ్వాసము వమ్ము సేయరాదు".

సరుమా దీన వదనయై బ్రార్థించినది.

"మంచిది. అల్లా కేదియిష్టమో అదియే జరుగును".

యువరాజు 'సయ్యద్ సాహెబు'ను బిలిపించినాడు.

"హజరత్ ! నేను పాదుషాగారి దర్శనమునకు బోవుచున్నాను. మీరు నా వెంట వచ్చినచో మీకును పాదుషాగారి దర్శనము చేయింతును".

సయ్యద్ సాహెబ్ వినయమున తలనూచినాడు. వారిర్వురును పాదుషా దర్శనమునకు బయలుదేరిరి. యువరాజు నివాసమున కొక శిబిరము సిద్ధపరుపబడినది. రూహుల్లాఖాను యువరాజునందు విడిదిచేయించెను. సయ్యద్ మహమ్మద్గూడ నందే యున్నాడు. మరునాటి

ప్రాతఃకాలమున పాదుషాగారి దైవ ప్రార్థనలు ముగిసినవి. యువరాజును దోడ్కొని రండని పాదుషా యాజ్ఞయిచ్చినాడు. పాదుషా సమీపముననే షేక్‌సారేహింద్ సాహేబునకుగూడ నొక యాసనముండెను. యువరాజువచ్చి వారిర్వురుకును సలామొనర్చినాడు. పాదుషా సంభాషణ మారంభించెను.

"షాఆలం ! గోల్కొండ విషయమే మాకు తెలియలేదు. గోల్కొండ కోనను మేమే ఖుద్దుగా జయింపవలెనని వచ్చినాము. ఇప్పుడు నీవేమి చెప్పెదవు?"

యువరాజు తలదించినాడు.

"నేనేమి చెప్పగలను? అంతయు పాదుషాగారి యిష్టము".

"ఇన్ని దినములు హైద్రాబాదులో నుండి నీవేమి చేసినట్లు? గోల్కొండ కోటనెందుకు వశపరచికొనలేదు. ! నీపై మాకడకనేకము లారోపణలు వచ్చినవి. నిన్ను విచారించుటకై పిలువ నంపితిమి".

"నాపై ఫిర్యాదులొనర్చినదెవరు; అట్టి దోషము నేనేమి చేసితిని? నేను నిర్దోషిని. ఈ విషయము నేను ఋజువు పరచికొనుటకు సిద్ధముగ నున్నాను.

"నీవు గోల్కొండ కోటను జయించి – సుల్తానును మాకడకంపినచో మేమింతదూరము రావలసిన పని యేముండినది ?"

"గోల్కొండ మనస్వాధీనమైనది. సుల్తానును ఖైదీగా పట్టుకొనుటకాతడు యొనర్చిన యపరాధ మేమి? అతడు పూర్తిగా మనకు శరణాగతుడైనాడు. కుతుబ్‌షాహి రాజముద్రను మన కొప్పించినాడు. ఇదిగో అది మీ పాదముల కొప్పించుచున్నాను".

షా ఆలం కుతుబ్‌షాహి రాజముద్రను పాదుషాకు సమర్పించినాడు. దాని నాతడు గైకొనెను. అటునిటు త్రిప్పి చూచినాడు.

"ఇది కుతుబ్‌షాహి రాజముద్ర యనుటకు ప్రమాణమేమి?

"జహాపనా ! ఇది నిజముగా వారి రాజముద్రయే".

"మాదన్న హత్య జరిగినదని విన్నాను. ఆ హత్య చేసినవారెవ్వరనుట నీకేమైనా దెలియునా?

"తెలియదు కాని దర్బారులోని వారే హత్యచేసి నారనుట మాత్రము నిజము. మాదన్న మరణించిన తరువాత సుల్తాను మనకు శరణాగతుడైనది. ఈ రాజముద్రికను పంపినదాతడే ! దీనినిపంపి తన ప్రాణభిక్ష వేడెను. ఆపై తమ చిత్తము".

"ఆలం ! యేమైనను యీ విషయమున నాకు సమాధానములేదు. నీపై నాకనేక సందేహములున్నవి. నేను నిన్ను చెఱసాలకంపవలెననుకొన్నాను".

"మీ చిత్తము వచ్చినట్లు చేయవచ్చును. మీ యాజ్ఞ ధిక్కరింపగల వారెవరు? నాకేమి రాజ్యమా కోశమా? బయటనున్న నొక్కటే, చెరసాల యందున్న నొక్కటే !

'షేక్ సాహెబ్' కల్పించి కొన్నాడు.

"జహాపనా ! షా ఆలంపై నిష్కారణముగ మీరు కోపించి కొనుచున్నారు. అతని దోషమేమున్నది ! గోల్కొండ వజీరు చచ్చినాడు. సుల్తాను శరణాగతుడైనాడు. ఇక మిగిలినదే మున్నది? షా ఆలంకు కారాగారవాసమెందుకు? ఇట్టి పనులు అల్లా మెచ్చడు. గోల్కొండ సుల్తానెక్కడికి బోగలడు ! మీరు పిలిపించినచో దర్బారునకు వచ్చును. ఆతనిని మీ ఇష్టము వచ్చినట్లు జేయవచ్చును. గోల్కొండ మీ పాదతలమందే యున్నది. ఈ జయము యువరాజునకే చెందవలసినది".

"షేక్ సాహెబ్ గారూ ! నా మనస్సేమో సరిగా పనిచేయుటలేదు. సుల్తానును మీరే దర్బారునకు బిలిపించి మీ యిష్టము వచ్చినట్లు పరిష్కార మొనర్పవచ్చును".

షేక్ సాహెబ్ అన్నాడు.

"ఆలంఘీర్ పాదుషా ! నీవు దేవుని మనుష్యుడవు. నీ నుండి వెడలిన మాట దేవుని యాజ్ఞ వంటిదే. సుల్తానును దర్బారునకు బిలిపించి నీ యిష్టము వచ్చినట్లాజ్ఞాపించ వచ్చును".

పాదుషా యువరాజువైపు దిరిగిను.

"యువరాజా ! మనకిర్వురకును షేక్ సాహేబుగారు తీర్పు చెప్పినారు. నా మనస్సు శాంతముగా లేదు. నీ యిష్టము వచ్చినట్లు చేయవచ్చును".

"షహన్‌షహా నేనిప్పుడు మీ బందీని మీ నోటినుండి మాటయట్లు వచ్చినది. ఇక నాకు స్వాతంత్ర్యమేమున్నది. మీ చిత్తము వచ్చినట్లు చేయవచ్చును".

"షా ఆలం ! ఏ విషయమైనను దాచికొనుట నా స్వభావముగాదు. నా మనస్సులో మరియొక మాటయున్నది. దానికి సమాధానము దొరకువరకును నీపై నా సందేహము నివృత్తిగాదు".

"జహాపనా ! దాని కనుమానమెందుకు? మీరు నన్ను బ్రశ్నింపవచ్చును. కాని నా యుత్తరముతో మీ సందేహము తీరునో, తీరదో, చెప్పలేను. నన్నేమైన విచారింపవలసి యున్నచో నిశ్శంకముగ విచారింపవచ్చును".

పాదుషా కొంచెముగ్రుడైనాడు.

"నీ శిబిరమందున్న 'నజీరా' యనునర్తకి యెవ్వతె? ఆమె నీ ప్రేమను చూరగొన్నదని విన్నాము. మాదన్నను జంపిన దామెయే ననియు మాకు వార్తలు వచ్చినవి. ఢిల్లీ యువరాజు బ్రహ్మాండ సైన్యములతో వచ్చి చేతగాక, కడకొక నర్తకితో మాదన్నను జంపించినాడు. ఈ మాట ప్రచారమైనచో అది ఢిల్లీ దర్బారునకు గౌరవమేనా? యోచింపుము. యుద్ధమున

నీవు వానినెదిరించి శిరచ్ఛేదమొనరించి యుండినచో దక్కనులో మన గౌరవము నూరింతలై యుండెడిది. నీవొనర్చినది శత్రునాశమైనను దాని మార్గము మాత్ర మసహ్యము".

యువరాజుద్వేగి యయ్యెను.

"జహాపనా ? ఆ నర్తకి నజీరా ఎవరనునది, మీరు దెలిసికొనవలెను. నా కింకను ఆమె విషయమర్థమేగాలేదు. అదియొక యభేద్యమైన రహస్యముగా నున్నది. కొన్ని దినముల నుండి యామెనాకు గన్పింపలేదు. వెదకిపట్టి తెప్పించి మీ సన్నిధానమున జేర్తును. మీరేయామెను బ్రశ్నింపవచ్చును. ఆమెకు మాదన్నపై ద్వేషమున్నదనుట నిజము. కాని యాతనిని వధించినది యామెగాదు. నేను మాదన్నను హత్యసేయింపలేదు. ఏనాటికైనను పాదుషాకుమారుడట్టియప ఖ్యాతికంగీకరింపడు. పాదుషా ! నేను జెప్పవలసిన మాట మరియొక్కటి బాకీ యున్నది. అక్కడికి నావాద మంతయు బూర్తియగును. నేనీపాటికే తమకు ముఖము జూపింపక యెచ్చటికైననుపోయి తలదాచికొనియుందును. కాని యీ గోల్కొండ ప్రకరణమున నేను జేయవలసినపను లొకటి రెండు యున్నవి. అవి దీరువరకును మీ కప్రియుడైన యీ కుమారుని మీరు క్షమింపవలెను. నేను నా వెంట నొక గోల్కొండ బందీని దీసికొని వచ్చినాను. ఆతనిని  మీ సన్నిధానమున హాజరు పెట్టెదను".

"ఆ బందీ యెవ్వరు?"

"ఈ గోల్కొండ సింహాసనమునకు నిజమైన యధికారి సయ్యద్ మహమ్మద్".

పాదుషా చకితుడయ్యెను.

"యువరాజా ! నా కిన్ని దినము లీ విషయము నేల తెలుపలేదు? అతడింకను జీవించియున్నాడా?"

"అవును. నిన్నటి దినమాతడే నాకడకు వచ్చెను. ఇప్పుడు నా శిబిరమందున్నాడు.

పాదుషా షేక్ సాహేబుతో ననెను.

"షేక్ సాహేబుగారూ ! అతడొక వీరపురుషుడు. అతడే సింహాసనముపై నున్నచో మనకింత శ్రమ గల్గియుండెడిదిగాదు. మాదన్న మోసముతో నాతనిని ఖైదునందుంచెను. ఈ అబుల్ హసనునకు పట్టము గట్టినాడు. సయ్యద్ మహమ్మద్ భార్య దిలారా? ఆమె ఢిల్లీకి వచ్చి మనతో ఫిర్యాదు చేసికొనెను. ఇంతలో సయ్యద్ మహమ్మదును గోప్యముగ జంపించిరని మనకు వార్తలు వచ్చినవి. దిలారా నిరాశతో, నందరను శపించుచు వెన్కకు వచ్చినది. ఈ విషయము జరిగి చాల రోజులైనది".

"యువరాజా ! ఆ సయ్యద్ మహమ్మదును దెచ్చి కాన్పింపుము".

షా ఆలం ఆజ్ఞ మేరకు రాజ భటులు సయ్యద్ మహమ్మదును దీసికొని వచ్చిరి. అతనిని జూచిన వెంటనే పాదుషా ఆశ్చర్యముతో నొడలు మరచెను. సయ్యద్ మహమ్మద్ ఆజానుబాహుడు. మహా తేజస్వి కాని యాతనిలో నిప్పుడు విరక్త పురుషుని చిహ్నాములున్నవి.

ఒక దొడ్డ ఫకీరువలె గాన్పించు చుండెను. ఆ వీరునిలో నింత మార్పునకు కారణమేమో? పాదుషా యాతనితో–

"సయ్యద్ మహమ్మద్ మీరేనా ? ఈ గోల్కొండ సింహాసనమునకు మొదటి హక్కుదారులు మీరే గదా". సయ్యద్ మహమ్మద్ వంగి సలామొనర్చెను.

"ఖామంద్ ! ఆ సయ్యద్ మహమ్మద్ నేనే ! నేనే గోల్కొండ సింహాసనమునకు హక్కుదారును. కాని యీ విషయము చాలక్రిందటిమాట. అల్లా సింహాసనముపై నాకుగల హక్కును దిరస్కరించి నాడు. ఆ కథ ముగిసిపోయినది. ఇప్పుడు నేను సింహాసనమునకు హక్కుదారును గాను". తడి కన్నులతో నాతడు పాదములను చుంబించెను. షేక్ సాహేబు పాదుషా పాదముల ముద్దిడుకొన్నాడు. ఔరంగజేబు కన్నులలో నీరు నిలిచినది. వెంటనే వానినతడు దుడిచికొనెను. సయ్యద్ మహమ్మదునకు గూర్చుండుట కాజ్ఞయైనది. ఒక యాసనముపై నాత డుపవిష్టుడయ్యెను.

"సయ్యద్ మహమ్మద్ ! గోల్కొండలో నీ నడుమ జరిగిన విషయములు మీకు దెలియునా?" పాదుషా ప్రశ్నించెను.

సయ్యద్ మహమ్మద్ లేచెను.

"ఖామంద్ ? మొన్నటి ప్రాతఃకాలమే నాకు విడుదలయైనది. అది జరిగినదియు యువరాజు సమ్ముఖముననే. ఈ రెండు దినములనుండి గోల్కొండ విషయము కొంత నా చెవిలో పడినది. కథయంతయు నడ్డము దిరిగినది. సుల్తాను పాపము పండినది. గోల్కొండ పతనమైనది. సుల్తాను శరణాగతుడైనాడు. కుతుబ్‌షాహీ రాజముద్రికను యువరాజునకొప్పించినాడు".

"ఇది కుతుబ్‌షాహి రాజముద్రికయేనా?" పాదుషా యా ముద్రికను సయ్యద్ మహమ్మద్‌న కిచ్చెను.

"అవును దీనినింతకు ముందే యువరాజు నాకు జూపెను. ఇది నిజమైన రాజముద్రికయే. సందేహము లేదు. సుల్తాను ఒకే కాలమునందు నన్నును, రాజముద్రికను యువరాజున కొప్పించినాడు".

"బాగుగనే యున్నది. ఈ రాజముద్రికకును నీకును సంబంధమున్నది. మేము నిన్నే సింహాసనమున గూర్చుండ బెట్టవలెనని నిశ్చయించికొన్నాము".

"అది పాదుషాగారి యనుగ్రహము. కాని నా జీవితమొక చీకటిగదివలె గడచినది. అందులోనే వెలుగును గనుపింపలేదు. ఏ కోర్కెయు దొంగిచూడలేదు. ఇప్పుడు నాకు రాజ్యమెందుకు? మీ యాజ్ఞయైనచో మక్కాకు బోవలయునని యున్నాను".

"సయ్యద్ మహమ్మద్ ! నేనిచ్చిన వచనమెన్నటికిని వ్యర్థమగునదిలేదు. నీరాణియైన దిలారాబేగం ఢిల్లీకి వచ్చినది. ఆమెకు మేము వచనమిచ్చినాము. కాని ఘాతుకుడైన మాదన్న

నిన్ను జంపించెనని వినియుంటిమి. వానితో మాయాశలెండిపోయినవి. మేము దిలారాబేగంనకే సింహాసన మొప్పగింపవలెనని యుంటిమి. కాని స్త్రీలకు రాజ్యపరిపాలనాధికార మొసగుట యధర్మమని మా భావన. అందుచే గొంత సందేహించుచుంటిమి. ఇంతలో నామె ప్రాణత్యాగ మొనర్చికొన్నదను వార్తలు వచ్చెను. మా యాశ యాశగనే యుండిపోయినది".

"జహాపనా ! ఆ కథలన్నియు నిప్పటికి నేను సంపూర్తిగా మరచిపోయి యున్నాను. అల్లా యిచ్చ మేరకు వర్తించుటయే మానవుని కర్తవ్యమను 'ఖురా'ను వచనము నక్షరక్షరము నమ్మినాను".

పాదుషా మొగమున కొంత ఖిన్నత దోచినది.

"సయ్యద్ మహమ్మద్ ! నీవు మక్కాకు బోదలచికొన్నచో మేము నిన్నడ్డగించుటలేదు. కాని నీ కోర్కె యేదియో యొకటి తీర్చవలెనని మాకాశ. ఏదో యొక కోర్కెగోరుకొమ్ము".

"జహాపనా ? నాకొక్క కూతురున్నది. ఆమె జీవితము నిండ దురదృష్టమే. ఆమె పుట్టినది మొదలు దుర్విధి వెంటాడినదని జ్యోతిష్కుల భావన. ఆమె గోల్కొండ రాజ్యమందెక్కడో అనాథవలె జీవించుచున్నదని విన్నాను. మీరామెను పత్తాచేసి రప్పించినచో ఒక్కసారి ఆమె మొగమును జూచి ఆమె రక్షణభారమును మీ కొప్పగింప వలెనని నా కోర్కె".

"ఏమీ ! నీ కూతురభాగినిగా జీవించుచున్నదా? ఆ దుర్మార్గుడైన మాదన్న యామెనింకను బ్రతుకనిచ్చి యుండడని మా తలపు. జీవించియున్నచో తప్పక రప్పింతుము. ఆమెను గుర్తించుట కేమైనను సంకేతములున్నవా?

"ఉన్నవి. ఆమె వీపుపై కుడివైపు నొక పెద్ద మచ్చయున్నది. అట్టి మచ్చయే యామెతల్లికి గూడ నుండెను. పండితులు దానిని యదృష్టపు మచ్చయనిరి. కాని దాని గర్భమున దురదృష్టమే గూడుగట్టుకొనియున్నది".

పాదుషా యువరాజువైపు తిరిగినాడు.

"షా ఆలం ! నీ వొక్క సంవత్సరమునుండి యీ రాజ్య మందున్నావు. ఈ ప్రదేశములన్నియు నీకు బరిచితములై యుండును. ఆమె యెక్కడున్నను బట్టి తెప్పింపవలెను".

"చిత్తము"

పాదుషా సయ్యద్‌ను నివాస శిబిరమున కంపివేసెను. ఆతనికే కొఱతయు రాకుండ జూచికొమ్మని రూహుల్లాఖానున కాజ్ఞాపించినాడు.

పాదుషా దగ్గర షేక్ సాహేబును, యువరాజును యిరువురు మాత్రమే మిగలినారు. షేక్‌సాహేబు షాఆలంవైపు దిరిగినాడు.

"యువరాజా? ఆమె నెక్కడైనను పత్తా జేయగలవా !"

పాదుషాగూడ నా భావమునే సూచించుచు కుమారునివైపు జూచెను.

"పత్తా చేయుటయేమి? తెలిసియే యున్నది"

"ఎట్లు?" పాదుషా ప్రశ్నించినాడు.

"తమ యాగ్రహమునకు పాత్రురాలైన 'నజీరా' నర్తకియే యాతనిబిడ్డ. ఆమె యసలు పేరు ముంతాజ్ బేగం. ప్రచారమున నున్న పేరు నజీరా. ఆమె బాల్యము నుండియే యజ్ఞాతముగ మెలగినది. జీవనోపాధికి నాట్యము నేర్చెను. మాదన్నకీ విషయము దెలసినది. అతడు నజీరాను వెదకింపదొడగెను. ఆమె యార్తయై నా శరణుజొచ్చినది. నూరున్నీసా బేగం ముంతాజునకు రక్షణ నిచ్చెను. కొన్ని దినములనుండియు ముంతాజు నాకు గనుపింపలేదు. తన తండ్రిని విడిపించుటకు నన్ను గోరిన దామెయే. తండ్రి ముఖము జూచుటకు సిగ్గుపడి తలదాచికొన్నదేమో? కొన్ని దినములలో నామెను వెదకింతును".

పాదుషా కాశ్చర్యముపై నాశ్చర్యము. షా ఆలంపై నున్న సందేహములు క్రమముగా విచ్చిపోజొచ్చెను. కాని యాతని మొగముపై నేభావములుగాని గమనించుట కష్టము. ఆ మార్పు కొద్దిగా నిరంతర సన్నిధానముతో షేక్ సాహేబునకు మాత్రమే దెలియును. యువరాజు పాదుషాకు సలాము చేసి తన గుడారమునకు వచ్చినాడు.

షేక్ సాహేబు పాదుషాల నడుమ నీ క్రింది సంభాషణ జరిగెను.

"జహాపనా? మీరు యువరాజుపై నన్యాయముగ కోపగించుకొంటిరి. యుద్ధముతోనే శత్రువును సాధించవలెననుట మీ సిద్ధాంతము. శత్రువు సంపూర్తిగా శరణాగతుడైనచో చాలునని యువరాజు భావన. దీనిని మీ రెండుకర్థమొనర్చి కొనరు?".

"షేక్ సాహేబుగారూ ! భేదమును సరిగా వింగడించినారు. కాని శత్రువు సంపూర్తిగా నాశనమైననే రాజ్యము నిరాటంకముగా మనచేతికి జిక్కును. శత్రు నాశము యుద్ధముతోనే సాధ్యము".

ఒక్క హిందూ సన్యాసిని పాదుషాగారి దర్శనము వేడుచున్నదని ద్వారపాలకు లెరిగించినారు.

"ఏమీ ! హిందూ సన్యాసినియా ? మాతో దానికేమి పనియున్నది? మా దర్శనము నడుగుటకు దానికెంత ధైర్యముగా వలెను? ఎవరో చూతముగాక ! తోడ్కొని రమ్ము !"

షేక్ సాహేబు మెల్లగా నన్నాడు.

"షా హీం షాహా ! ఒక్క హిందూ సన్యాసిని యుద్ధ క్షేత్రములలో బారాడు చుండునని విన్నాము. రాజమందిరములందును ఆమె నిశ్శంకముగ ప్రవేశించు చుండునట! ఈ సన్యాసిని యామెయేయై యుండును. కొంత శాంతముగ బల్కరించినమేలు".

షేక్ సాహేబుగారూ ! ఈ హిందూ సన్యాసులను నమ్మ గూడదు. వీరందరు రాజుల గూఢచారులు ముఖ్యముగా సాంభాజీ యిట్టివారిని దగ్గరనుంచుకొని యుండును. ఇది యట్టివారిలో నొక్కతెగావచ్చును. యువరాజు అనుగ్రహమునకు పాత్రురాలైన యొక హిందూ సన్యాసిని యున్నదని విన్నాను. షా ఆలం గొప్ప ఉదారి పరాక్రమశాలి. ఈ మాటలన్నియు నిజమే. మీ కాతనిపై చాల ప్రేమ యున్నదనియు నే నెఱుగుదును. కాని యాతనితో పెద్ద దౌర్బల్యమున్నది. స్త్రీల కాతడు సులభముగా లొంగిపోవును. యుద్ధక్షేత్రములలో – నిట్టి స్త్రీలతో సంబంధ మాతడుంచుకొని యున్నందువలననే – యుద్ధము ముగియుట కింతయాలస్యమైనది. స్త్రీలను ప్రేమించుచు బోయినచో ఢిల్లీ సింహాసనము త్వరలో మట్టిపాలుగావలసినదే!

ఇంతలో 'హరిదాసి' వచ్చి పాదుషా ముందు నిలిచెను. ఆమెలో నిర్భీకత రూపగొన్నది.

పాదుషా తలయెత్తి చూచినాడు.

"ఓహో! నీవేనా; ఢిల్లీలో మాకు గనుపించిన సన్యాసివి. మంచి యౌవనములో నున్నావు నీకు సన్యాసమునకు గుదురుట లేదు. నీవు శత్రువుల గూఢచారిణివేలగారాదు? ఎంత ధైర్యముగా నిలిచికొన్నావు? నీవెవ్వరియెదుటనున్నావో నీకు దెలియునా?

హరిదాసి ఫక్కుమని నవ్వినది.

"జహపనా! తెలియకేమి? చక్కగా తెలియును. నాయౌవనము గట్టుకొని నీవేమి చేయుదువు? నేను ధైర్యముగా నుండుటలో లోప మేమున్నది. నేనే శత్రువుల గూఢచారిణినని మీరు నమ్మి నను విచారణ జరిపింప వలెనుగదా! విచారణ జరిపింపుడు. నేను వచ్చిన కార్యము గూడ నందులోనే దేలిపోవును. ఖామంద్! నేనిక్కడికి వచ్చినదియు విచారణ జరిపించు కొనుటకే! కాని దానికి సాక్షులు గావలెను. యువరాజొకసాక్షి. మరియొక సాక్షి యువరాజు శిబిరములో నివసించుచున్న గోల్కొండ సేనాధిపతి ఇబ్రహీం. మీ శిబిరమందున్న సయ్యద్ మహమ్మదు గారినిగూడ బిలిపింపుడు; వారిముందే నా విచారణ జరుగవలెను."

"సన్యాసినీ! నీవు చెప్పినట్లు విచారణ జరిపించుట మా దర్బారు పద్ధతిగాదు. ఫిర్యాదులేమైనా యున్నచో చెప్పికొనవచ్చును. అవి సరియని మాకు దోచినచో వానికి సంబంధించిన సాక్షులను విచారింతుము. పెద్ద భాజీసాహేబుగారే రావలెను; తర్వాత విచారణ జరుపవలసినచో నది దర్బారులో జరుగును.

"జహాపనా! ఇప్పుడు మీరు గోల్కొండ ప్రభువులు ఆ సుల్తాను ప్రభుత్వమును మీ కొప్పించినాడు. నేనేనాకథను మీకు మనవిసేయుటకు వచ్చినాను. దానికి ప్రాయశ్చిత్తమును నేనే యొనర్చుకొందును."

“నీవెవ్వరిపై దోషారోపణ నొనర్చి కొనుచున్నావు? ఆయపరాధుల పేరులు చెప్పుము?

“నా విచారణలోని యపరాధులు గతించిపోయినారు. ఈ రాజ్యమునకు సంబంధించిన యెన్నో రహస్యములు నాలో నణగియున్నవి. వానినన్నిటిని మీ సన్నిధానమున మనవిచేసి పోవలెనని వచ్చినాను. నా కార్యమింతకుముందే సాధింప బడినది. దానిని సాధింపవలసిన కష్టమిప్పుడు మీకు లేదు. ఇకపై నాదేదైన ఫిర్యాదున్నచో అది మీపైననే. దానిని నే నెవ్వరితో జెప్పికొన వలెను? షేక్ సాహేబు గారూ! మీరే చెప్పుడు ఆల్లా రాజ్యములో పాదుషాగారికిని – నాకును నేమైన తేడాయున్నదా?”

పాదుషాకు కోపము వచ్చినది.

“నోరుమూయుము; నీ విచారణ యేదో జరిగియే తీరవలెను. నీవు కట్టిన యీ సన్యాసివేషమసహ్యాము. నాముందే యిట్లు మాటాడుచున్నావు నీ కెంత ధైర్యము? నీ వొక మగవాడవైనచో నీ తలయిప్పటికే నేలబడియుండును.”

హరిదాసి మరల నవ్వెను.

“జహాపనా! అందుకే నన్నల్లా స్త్రీగాబుట్టించినాడు. మీ చేతిఖడ్గములో నెందరు వీరాగ్రేసరుల శిరస్సులోయస్తమించినవి. రాజాధిరాజుల కిరీటములెన్నియో నేలకొరిగినవి నాదేమిలెక్క. మీ ఖడ్గస్వభావమును నేను చక్కగా నెఱుగుదును. అందుకేముందువచ్చి నిలిచినాడు – ముందు నా మాటలు మీరు వినవలెను. ఆపై నేశిక్షవేసినను నాకు దుః ఖము లేదు.”

“మంచిది రేపు నీవిచారణ జరుగును. అంతవరకు నీవు ఖైదులో నుండవలెను.”

“నాకు బందీఖానా యెందుకు? నేను మిమ్ముఁవిడిచి కదలనే కదలను. మీరు పొమ్మన్ననుపోను. మీరు నన్ను పట్టితెప్పించలేదుగదా! నేనైమీచెంతకు వచ్చినాను. నన్ను ఖైదులో నుంచుట న్యాయమేమో యోచింపుడు.”

మరి నీవెక్కడుందువు?

“మీ చెంతనే యుందును లేకున్న మీ షేక్ సాహేబుగారితో నుందును. మీ దృష్టిలో నేను కాఫరును. అల్లా దృష్టిలో నేనును – షేక్ సాహేబుగారిను నొక్కటే.”

“నోరుమూయుము. పెద్దలను ధిక్కరింపరాదు మా యాజ్ఞ ననుసరించి నీవు బందిఖానాలోనే యుండవలెను. రేపు విచారణ జరుగును. నీవు నిర్దోషివని తేలినచో క్షమాపణపలికి సాగనంపుదుము.

“జహాపనా! అదియుమంచిదే ఒకదినము మీ కారాగృహమెట్లుండునో రుచి చూచెదను. రాజభటులు హరిదాసిని చుట్టుముట్టిరి. ఆమె మరల పలికినది.

"జహాపనా! కడపటిమాట యొక్కటియున్నది. యువరాజు శిబిరమునందు – గోల్కొండరాణియొక్కతె వచ్చియున్నది. ఆమె రాయబారిగ వచ్చినది. రేపటివిచారణ కామెనుగూడ మీరు బిలిపింపవలెను. అప్పుడు గోల్కొండ విషయమంతయు మీకుబూర్తిగా దెలిసివచ్చును.

హరిదాసి రాజభటుల వెంట వెడలిపోయెను. పోవుచునే యామె తంబూర మీటెను.

"రఘుపతిరాఘవ రాజారాం

పతిత పావన సీతారాం"

రాజ భటులామెను గర్జించినారు.

"ఊరకుండుము, మా ప్రాణములకు దెచ్చిపెట్టకుము. ఈ శిబిరములలో హిందూదేవుని పేరెత్తరాదు. జాగ్రత్త".

హరిదాసి యొక్కటే నవ్వినది.

"మీ శిబిరములలో రామనామస్మరణ గూడ దోషమేనా? కాఫర్ల దేవుడుగూడ బనికిరాడేమో! పాదుషాల నీతియే యిట్టిది". ఆమె మరల నవ్వినది.

**14**

ప్రాతఃకాలమైనది. ఉషోరేఖలు పొడవెను. పక్షుల కలకల నినాదములు దిక్కులు నందగించినవి. ఆ దిన నాధునకు తరతమ భావములు లేవు. కాఫరు లేదు, ముస్లిములేదు. పుణ్యుడు లేడు, పాపిలేడు, చెట్టు లేదు, పుట్టలేదు, సర్వముపై నాతని కిరణములు సమానముగా బరపును. పాదుషా ప్రార్థన ముగించినాడు. ఆతని దర్బారు చేరినది. ఒకవైపు ఖాజీలు, ఉమ్రావులు; మరొకవైపు సేనాధిపతులు. పాదుషా కుడివైపు షేక్ సాహేబు కూర్చొని యున్నాడు. ఆతని తరువాత 'షా ఆలం'నకు ఆసనమున్నది. కొంచెము దూరముగా సయ్యద్ మహమ్మద్ ఉపవిష్టుడై యుండెను. వయోవృద్ధుడైన షేక్–ఉల్–యిస్లాం ఖాజీ సాహేబులు ఉన్నతాసనముపై గూర్చుని యుండిరి. ఆతని సమీపముననే పాదుషా సింహాసనము. అది షేక్ ఉల్ ఇస్లాం ఆసనమున కంటెను చిన్నది. 'హరిదాసి' సభకు వచ్చినది. ఆమె మొగముపై నెన్నడులేని యుల్లాసము తాండవించు చుండెను. గోల్కొండ సేనాధిపతి ఇబ్రహీం రూహుల్లాఖానుని ప్రక్కన నిలుచుకొని యున్నాడు. హరిదాసికి కొంచె మెడముగా అవగుంఠనవతులిద్దరు స్త్రీలు నిలబడి యున్నారు. పాదుషా హరిదాసితో నన్నాడు.

"సన్యాసినీ ! అదిగో పెద్దఖాజి సాహేబుగారు న్యాయపీఠము నధివసించి యున్నారు. నీ ఫిర్యాదు లేమోవారికి మనవి సేయవచ్చును".

షా ఆలం హృదయము వణుక నారంభించినది. ఈ దాసి తనపై నేమైన యారోపణ సేయునేమో యని యాతని భయము. షా ఆలం నామె గమనించి యామె లోలోపలే నవ్వుకొన్నది. హరిదాసి యారంభించినది.

"ఖాజీ సాహేబులకు నమస్కారము. పాదుషాకు నమస్కారము. నా ఫిర్యాదు మీరు పూర్తిగా వినవలెను. నేను దోషారోపణము చెయ్యవలసిన వ్యక్తులు గతించినారు. నా కార్యము పూర్తియైనట్లే కాని, ఈ రాజ్యమునకు సంబంధించిన రహస్యములు కొన్ని నా హృదయమున నణగియున్నవి. వాని నెన్నడో యొకనాడు వెలుగునకు దేవలెనని నాయాశ. లేకున్ననవి యంధకారమందే యంతరించును. ఎందరి జీవిత చరిత్రలో వెలుగునకు రాక మాయమగును. నేను సన్యాసినిని. శ్రీహరి పాదములే నాకు ధ్యేయము. హిందూ సన్యాసినుల ధర్మము, మీ యిర్వురకు గూడ నర్థముగాదు. నేను చిన్ననాటినుండి సన్యాసినిగాను. ఒకనాడు నాకును గొప్ప యైశ్వర్యముండినది. కాపురముండినది. సంసార సుఖములెరిగినాను; నా భర్త యా గోల్కొండలో యొక యున్నతాధి కారియై యుండెను. నా కప్పుడు చాల చిన్నవయస్సు ఇరువది యేండ్ల ప్రాయమునకు పైబడిలేదు. నా భర్తపేరు నేను చెప్పరాదు. అది హిందూ స్త్రీ ధర్మము. కాని నేనిప్పుడు చెప్పవచ్చును. నేను సన్యాసిని. నా భర్తను హరివిఠల రాయలనుచుండిరి. ఈ సభలో నాతని నెఱిగిన వారెవ్వరును లేరు. అదుగో ! ఆ కట్ట కడపటి యాసనముపై గూర్చున్న 'సయ్యద్ మొహమ్మ' దొక్కడే యాతని నెఱుగును. ఈ గోల్కొండ రాజ్యములో నుండిన యందగత్తెలలో నేనొకతెనని నాటి జన ప్రవాదము. భగవంతుడు స్త్రీజాతికి సౌందర్య మొసగుటయే దోషము. మీరందరు పురుషులు స్త్రీ సౌందర్యము పురుషుల హృదయములలోనే కల్లోలము రేపునో మీ కందరకు దెలిసినదియే. నా యందమే నా పతిచిత్రవధకు కారణమైనది. ఎవరునన్ను జూచి మోహపడిరో, ఎవ్వడు నాపతిని వధించెనో, వానిని నే నెఱుగుదును. కాని మొట్టమొదలు యీ సయ్యద్ మొహమ్మదే నా భర్తను జంపించెనని నేను దలచితిని కాని యాభావమసత్యమని నాకు తరువాత దెలిసివచ్చెను. నా భర్త గతించిన యచిర కాలముననే సయ్యదునకు కారాగృహ ప్రాప్తియైనది. ఆతడింతవరకు వెలుగుచూడనేలేదు. పాపము, హిందూ స్త్రీలకు తురుష్కులపై గొప్ప సందేహము. అందుచే తొట్ట తొలుతనీ సయ్యదునే నేను సందేహించితిని. కాని సత్యము వేరైనది. నా భర్తను జంపించినది మాదన్న. వాడు నాపై నెంతయో దయ నభినయించెను. నన్ను మభ్యపెట్టుటకు యత్నించెను. సయ్యదే హంతకుడని పలు తెఱగుల బోధించెను. ఈ సయ్యదు బలాత్కారముగ నన్నెతికొని పోవునని నన్ను భయపెట్టెను. కాని కాలక్రమమున వానిరంగు దెలిసివచ్చినది. వాడు నన్ను జెరచుట కుచ్చులుపన్న జొచ్చినాడు. నేను గోల్కొండనుండి మాయమైతిని. ఆ తరువాత పదేండ్లకు యీ సన్యాస దీక్షను స్వీకరించితిని. అప్పటినుండి నా హృదయములో భయమేలేదు. నిజము తెలియక మొదట సయ్యదు ననుమానించి నందులకు నేనీ సభలో నాతనికి క్షమాపణ చెప్పుకొనుచున్నాను. తర్వాత కొంత కాలమునకు నేను మాదన్నకు

గనుపించినాను. వాడు నన్ను గుర్తించినంతనే కంపింప నారంభించెను. "నేను నీయధికారమును, యైశ్వర్యమును నాశనమొనర్తును. నీ ప్రాణమును బలిదీసికొందును" ఈ మాటలని నేను వెనుదిరిగి పోయితిని. నాటినుండి మాదన్న నాకు ప్రబల శత్రువు. మహారాజు సాంభాజీని నేనెఱుగుదును. అతని స్నేహమును సంపాదించుకొనుటకై మాదన్న యొనర్చిన ప్రయత్నములకు లెక్కలేదు. ధనరాసులను గ్రుమ్మరించినాడు. కనకమును గుప్పించెను. కాని వారి స్నేహమును జెడగొట్టినది నేనే. లేకున్నచో గోల్కొండ మీకు సులభముగ వశపడి యుండెడిదిగాదు. నా మాటలను గౌరవించి సాంభాజీ మీపైకి యుద్ధమునకు రాదయ్యెను". హరిదాసి సాంభాజీని పొగడుట దర్బారున కవమానముగా దోచినది. వారందరు 'హుమ్మ'ని ఘూంకరించిరి. హరిదాసి జంకలేదు. కథ చెప్పికొనుచునే పోయినది.

"ఈ దర్బారులో నేను హిందూ పాదుషా సాంభాజీ పేరెత్తుట మీకసహ్యముగా నున్నది. హుంకరించుచున్నారు. మీరేమనుకొన్నను అతడు మహావీరుడు. మొగలు సేనలన్నియుగూడ నాతని నెదిరించినను సాంభాజి యొక్కడే బదులివ్వగలడు. పాదుషా యెదిరించినను సాంభాజి తగిన యుత్తరమొసగును".

"న్యాయమూర్తులారా ! గోల్కొండ దర్బారులో మాదన్న కెంతమంది విరోధులున్నారో మీకుగూడ దెలిసియే యుండుననుకొందును. ఎడతెగక, యెప్పుడును మాదన్నపై నొకపితూరి జరుగుచునే యుండెను. దానికి కారణము అదిగో అక్కడ నిల్చున్న సరుమాబేగం. ఆమెపై గూడ మాదన్న కాముకదృష్టి బ్రసరించి యుండెను. ఇప్పటికిని గోల్కొండలో మాదన్నను జంపినది సరుమా బేగం అన్న ప్రవాదమున్నది. కాని వానిని జంపినది పాపమామెకాదు. ఆ దురాత్ముని వధించిన చేతులివిగో యివి. నా తృప్తిదీర పిడిబాకుతో వానియెదపై బొడిచినాను. నా హస్తము లెంత రక్తసిక్తములైనను నాకు తనివి దీరలేదు. నేను మాదన్నను జంపిన విషయము 'సరుమా'కు దెలియును. ఆమె వెంటనే యక్కడికి వచ్చినది. ఆమె చాల సంతోషించెను. కాని నేనా యంతఃపురములోని యొక పరిచారికనని యామె తలపు. ఆమె నా కొక్క బహుమానమిచ్చినది. అది యిదిగో" హరిదాసి తన జోలెలో నుండి ఒక ముక్తాహారమును గడ్డకు దీసినది. ఒక కఠారినిగూడ దీసెను. "ఇదిగో ఆ ముక్తాహారము. మాదన్న రక్తమును పాన మొనర్చిన కఠారి యిదియే. గోల్కొండ కథముగిసి పోయినది. నేడేమి ! మాదన్న నీచుడు చచ్చిననాడే ముగిసిపోయినది. మాదన్నను వధించిన కీర్తి నాకు దక్కినది. ఆ సుల్తానొక కామాంధుడు. విలాసములతో పగలు రాత్రులు లెఱుగనివాడు. మద్యమున మేను మరచినవాడు. అతడు సింహాసనమున కర్హుడు కాడు. అతని తల నుత్తరించి వేయుట నాకేమి పెద్దపనిగాదు. సులభముగా చేసియుండవచ్చును. కాని యాతడు నిరపరాధి. అట్టివాడు సింహాసనముపై నుండుట మాత్ర మపరాధమే. నేడు గోల్కొండ పూర్తిగా మీ స్వాధీనమైనది. మీరు మరియొక ముస్లిమునకు పట్టము గట్టవచ్చును. కులములో లేదు. అనుసరించు నీతిలోనున్నది మహత్తు. మాదన్న హిందువు. కాని వాడు హిందూ స్త్రీల నెందరినో

జెఱచినాడు. ఈ ఆలం యువరాజును నేనెన్ని సారులో కలసికొన్నాను. నా మాటలు విని యాతడు రెండు సారులు యుద్ధమును నిలిపెను. కాని దానితో నతని పరాక్రమమునకు మచ్చరాలేదు. నిష్కారణ ప్రజాహింసను వారించుటకై యాతడు యుద్ధమును నిలిపినాడు. అది యాతని ఔదార్యము. ఈ రాజ్యమంతయు నాతని బొగడుచున్నది. స్త్రీ వ్యామోహమునకు లోబడి షా ఆలం యుద్ధమును నిలిపినాడనుకొను వారికి సత్యము దెలియదు. అట్లనుకొనువారు నీచులు. నన్నొకసారియైన నాతడు కాముకదృష్టితో జూడలేదు. షా ఆలం ఒక మహాపురుషుడు.

"జహాపనా ? అక్కడ మరియొక యవగుంఠనవతి నిలిచి యున్నది. ఆ యభాగిని పేరు ముంతాజ్. ఆమెయే యీ సయ్యద్ మహమ్మద్ యొక్క యౌరస పుత్రిక. ఆమె నొక నర్తకి రక్షించినది. ముంతాజింతవరకజ్ఞాతవాస మొనర్చినది. ఆమె నన్నెఱుగదు. కాని నేనామె నెఱుగుదును. ఎన్నో సారులు ఆమెను నే నాపదలనుండి రక్షించితిని. నిగూఢముగనే రక్షించినాను. దుర్మాత్ముడైన మాదన్న ఆమెను పలుమారు వెదకించెను. ఆమెను జంపవలెనని వాని యాశ. నేను వాని ప్రయత్నములను పసికట్టు చుంటిని."పాదుషా ముంతాజునకై వెదకించు చున్నాడని నాకు దెలిసినది. నేనే యామె నిచ్చటికి రప్పించితిని. ఆమెపై నేమైన దోషారోపణములున్నచో ఆమె నిరపరాధి యనుటకు నేనొక సాక్షిని".

"ఇక నొక్కటే మాట మిగిలినది. అదిగో అక్కడ నిలుచుకొన్న ఇబ్రహీం విషయము. అతని జన్మవృత్తాంత మెవ్వరికిని దెలియదు. నాకు దెలియును. ఆతని తల్లిగూడ నా వలెనే యభాగిని. ఆమె పేరు రాధ. మాదన్న సోదరి. వెన్నుదన్ని పుట్టినది. ఆమె నెట్లో యొక ముసల్మాను సరదారపహరించెను. ఒక్కసారి మహమ్మదీయులలో గలసిపోయినచో హిందువులకిక పుట్టగతులు లేవు. ఆమెకు బుట్టిన కుమారుడే యీ ఇబ్రహీం. ఇతడు బుట్టినతోడనే యామె ప్రాణత్యాగ మొనర్చెను. మాదన్న కీ రహస్యము దెలియదు. వాడీతని బెంచి పెద్దజేసెను. ఇతని జన్మదాతయైన సర్దారీ సభయందే యున్నాడు. సత్యము నొప్పుకొను ధైర్యమాతనికున్నచో నాతడు లేచినిలబడ వచ్చును. ఇబ్రహీం రక్షణ భారమును వహింపవచ్చును. ఈ ఇబ్రహీం నెవ్వరు రక్షింపకున్నచో నేను రక్షింతునని యీతని తల్లికి మాట యొసగి యుంటిని".

యువరాజు ప్రక్కలో గూర్చున్న 'సయ్యద్ మహమ్మద్' హఠాత్తుగా లేచినాడు. ఆతడు పిచ్చివానివలె నడచెను."నేనే వీని జన్మదాతను. ఈ సన్యాసిని మాటలు ముమ్మాటికి నిజము". సయ్యద్ మహమ్మద్ ఇబ్రహీమును గట్టిగా నాలింగనము చేసికొన్నాడు. సభయంతయు గజిబిజియైనది. అందరి కన్నులును వారిర్వురిపై బడెను. నిలుచున్న హరిదాసి హఠాత్తుగా భూమిపై బడినది. రాజభటు లామెకడకు బరుగెత్తిరి. హరిదాసి పెదవులపై నవ్వు నిలచినది."నన్ను ముట్టకుడు. నేను ఘోరమైన విషయమును మ్రింగినాను. నా కార్యమును సాధించి కొన్నాను. నా జీవితమునకు తృప్తియైనది". ఆమె పాదుషావైపు దిరిగిచూచి నవ్వినది.

"రామ రామ రామ" యని మూడుసారులుగ గట్టిగా నరచినది. ఆ యరపులో నామె ప్రాణము లెగిరిపోయినవి.

సింహాసముపై గూర్చుండియున్న పాదుషా కన్నులు మూసికొన్నాడు. సభలో నొకటే గద్దలము. తన దర్బారీ రీతి విచ్ఛిన్నమైనది. ఔరంగజేబు జీవితములో నిదే మొదటిసారి. పాదుషా గంభీరముగ నడచివచ్చెను. హరిదాసిని సమీపించి వంగిచూచినాడు. ఆమె ప్రాణము లెగిరిపోయినవని రాజభటులనిరి. పాదుషా దీర్ఘముగ నిట్టూర్చి సభనుండి వెడలెను.

## 15

సరుమా దర్బారులోని దృశ్యమునంతయు జూచినది. హరిదాసి నోటినుండి వెడలిన చిచ్చువంటి మాటల నామె వినియుండెను. హరిదాసి మాటలు సరుమా మనస్సులో యెన్నియో గతించిపోయిన దృశ్యములను మేల్కొలిపినవి. ఎన్నియో సుఖములు దుఃఖములు జ్ఞాపకమునకు వచ్చెను. "హరిదాసి యెంత గట్టిది ! ఆమె తేజస్సేమి తేజస్సు ! ఆమె ఎదుట ఢిల్లీ పాదుషా యంతటివాడు గూడ దిగ్భ్రాంతుడైపోయినాడు. పెద్ద పెద్ద ఖాజీసాహెబులకు ఆమె ధర్మము తలదిరిగించినది. యువరాజు 'షా ఆలం' శిశువువలె గూర్చున్నాడు. ఏమి స్త్రీ యామె ! ఆడుజన్మ యెత్తినచో నట్లు జన్మింపవలెను. చచ్చిన నట్లు చావవలెను. అల్లా అట్టి ధైర్యమును నాకేల ప్రసాదింపలేదు ! నిజముగా నీ హరిదాసియే నా పాలికి గురువు. నా మిగిలిన జీవితమును నేనామెవలెనే గడపెదను." అని సరుమా యొకనూరు సారులు మనస్సులో ననుకొన్నది. భయము, లజ్జ, ఆశ, మోహము, వీనిని వదలి హరిదాసి యంతటిదైనది. ఆమె సాహసమున కవియే పునాదులు. సరుమా మనస్సంతయు కరగిపోయినది. ఆ దినమామె యాహారము ముట్టలేదు. అలంకరించుకొనలేదు. మేలి ముసుగును విసరి యావల బారవేసినది. ఆమె నేరుగా యువరాజు శిబిరమునకు వచ్చెను. కోపావేశముతో నామె శరీరము కంపించు చుండెను. ఆమె హఠాత్తుగా బ్రశ్నించెను.

"యువరాజా ? నా కొసగిన వాగ్దాన మేమైనది?"

"అమ్మా ! మీ ప్రార్ధనను పాదుషా కెరిగించినాను. ఆపై వారి యిష్టము".

"యువరాజా ! నేను మీ దర్బారులో నవమానింపబడినాను. నేను రాజస్త్రీని. ఒక యంతః పురమున మాన్యురాలైన రాణిని ఇట్టిదానిని నిన్నీ సామాన్యురాలైన యపరాధివలె దర్బారులో నిలువబెట్టుటకు కారణమేమి?

"రాణీబేగం ! నన్ను క్షమింపవలెను. మీరు దర్బారునకు అపరాధినిగారాలేదు. సాక్ష్యమునకు వచ్చితిరి. మీ యంతఃపురమందున్న రాజకుమారి ముంతాజుతో పాటు మీకును సమాన గౌరవమే లభించినది".

"యువరాజా ! నీకింకను దర్బారులోని మర్యాదలర్థముగాలేదా ? ఒక గొప్పయింటి స్త్రీ మర్యాదను అర్థము చేసికొను శక్తిలేదా ? నీ రాణి నూరున్నీసా బేగం యిట్లే యొక దర్బారులో నిలిపినచో నీ మనస్సున కెట్లుండునో కొంత యూహించుకొనుము".

యువరాజు మొగముపై విచారరేఖ యలముకొన్నది.

"బేగం సాహెబా ! నన్ను మీరు క్షమింపవలెను. నిన్నటి కొలువు నా చేతికి మించిన కార్యము. పాదుషాగారి యాజ్ఞ నెల్లరు బాలింపవలసినదే. మిమ్ము రాజసభకు గొనిరావలసినదని పాదుషాగారి యాజ్ఞయైనది. దానిని కాదను గుండె లెవరికున్నవి?"

సరుమా కంఠము గద్గదమైనది. కన్నులనిండ నీరు నిలచెను. చెంపలెఱుపెక్కెను.

"షా ఆలం ! నిరపరాధులైన స్త్రీలను దర్బారునకు రప్పించి నిలుపుటకు ఖురాను సమ్మతించునా?"

"యువరాజా ! నా ప్రార్థన పూర్తిగా విఫలమైపోయినది. ఇంకనేయాశయు మిగులలేదు. ఈ గోల్కొండ సింహాసనము నెక్కుటకు ముప్వురు వ్యక్తులు గాచికొని యున్నారు. ఒకడు సయ్యద్ మహమ్మద్, రెండవది యాతని కుమారి ముంతాజ్. ఆమె నీ ప్రేమైకమూర్తి, ఇన్నిదినములామె నర్తకియన్న కళంక ముండినది. నిన్నటితో నదిదొలగిపోయినది. కుతుబ్‌షాహీ వంశమునకు చెందినది. రాజకుమారి యనుట స్పష్టమైనది. దర్బారునందే మీ వివాహభేరిని మ్రోగించినట్లైనది. ఈ సింహాసనమున కామె యుత్తరాధికారి. ఇక మూడవవా డిబ్రహీం. ఈ ముప్వురును పాదుషా యభిమానమును చూఱగొన్నవారు ఈ వైభవములో ఇక అబ్దుల్‌హసన్ కథ నెవ్వరు విచారింతురు? గోల్కొండ సింహాసనముపై నాతనిహక్కు నెవరభినంతురు" ఆమె హఠాత్తుగా వెనుదిరిగి పోయినది. బిరబిరనామె పాదుషా శిబిరములోనికి జొరబారెను. పహరావారినామె లెక్కపెట్టలేదు. వచ్చుచున్నది స్త్రీ; అందుచే జవానులు ప్రక్కకు జరిగి తప్పుకొన్నారు. సరుమా నేరుగా పాదుషా యెదుట నిలచినది. ఆతడేదో యేకాగ్రతలో నున్నాడు. ఆమెను గమనింపలేదు.

"పాదుషా ! నా దొక విన్నపమున్నది".

సరుమా గట్టిగా నరచినది.

ఔరంగజేబు తలయెత్తి చూచెను.

"నువ్వెవ్వరవు?"

"నేను స్త్రీని"

"ముసల్మాను స్త్రీవలెనగు పించుచున్నావు".

"నిజమే పాదుషా చక్కగా గుర్తించినారు".

"అవగుంఠనమేల వదలితివి?"

"అన్నియు బోయిన వెనుక మేలిముసుగుతో నేమి పని యున్నది?"

"జహాపనా ! నేను గోల్కొండ సుల్తాను జనానాకు చేరిన యొక రాణిని. నా పేరు సరుమా. నేనే అబుల్‌హసన్ శరణాగతుడైనాడన్న రాయబారమును గొని తెచ్చినది".

"చాలా సంతోషము".

"అవునవును. సంతోష మెవరికి? పాదుషాకు. ఖురాను ధర్మమునకు కాదు".

"ఏమి జరిగినది !"

"ఇంకేమి జరుగవలెను? నన్ను నిష్కారణముగా దర్బారుకు బిలచి అవమాన పరచినారు. పాదుషా ! నీవు వృద్ధుడవు. ధర్మధ్వజము లెత్తికొని దిరుగుచున్నవాడవు. నీవు నన్నిట్లు అవమానించుట నీ కీర్తికి శోభాకరము గాదు. నా రాయబారము విఫలమై పోయినది. నేను దిరిగిపోవుట కనుజ్ఞ నిప్పింపవలెను".

"సరుమా బేగం ! నన్ను నీవు మన్నింపవలెను. నిన్నటి దర్బారంతయు ఒక యింద్రజాలము వలె నడచినది. అపరాధులెవరో, సాక్షులెవరో ఎవ్వరికెవ్వరు శిక్ష విధింపవలెనో యేమియు నర్థము కాలేదు. అదియొక దర్బారుగాదు. ఒక హిందూ సన్యాసినియొక్క ప్రళయతాండవము. నిన్న అందరికంటెను హెచ్చుగా నవమానింపబడిన వాడను నేను. అదియొక కరుణా జనకమైన సన్నివేశము. దానిని నీవు మరచిపోవలెను".

"నా రాయబారము మీకు స్పష్టమైనది. సుల్తాను అబుల్‌హసన్ రాజ్యపరిత్యాగ మొనర్చినారు. కుతుబ్‌షాహీ రాజముద్రను తమ కొప్పగించినారు. యువరాజు కోర్కెను మన్నించి సయ్యద్ మహమ్మద్‌ను విడుదల యొనర్చి మీ కొప్పగించినాను. నేను స్త్రీనైనను ఇంతటి మహాకార్యమును కొఱతలేక నిర్వహించినందుకు......"

"రాణీ సాహెబా? మీ కార్యము ప్రశంసనీయమైనది. మా దర్బారునందు పెద్ద ఖాజీ సాహేబులు గురువులైన షేక్ సాహేబుగారు మిమ్ముల నెక్కువగా మెచ్చికొన్నారు"

"అయినచో నా రాయబారము విషయమున మీ తీర్మానమేమి?" సరుమా నవ్వుచు నడిగినది.

"మా తీర్మాన మింకను ముగియలేదు. సుల్తాను విచారణ సాగవలెను".

"జహాపనా ! దానికి నేనంగీకరించుటలేదు. సుల్తాను సంపూర్తిగా శరణాగతుడయ్యెను. శరణాగతుడైన పిదపనిక విచారణమెందుకు. ఆతని సర్వాపరాధములును క్షమింపవలెను. అదే మీకు భూషణము. సుల్తాను నొక యపరాధినివలె మీ సభలో నిలిపి విచారించుట న్యాయము కాదు. ఆ హరిదాసివలెనే సుల్తానుగూడ ప్రాణములు వదలవలసివచ్చును. అంతకన్న మీరు గోల్కొండ యందే సుల్తాను శిరచ్ఛేద మొనరించుట మంచిది".

"బేగం సాహెబా ! మీరంత తొందర పడరాదు. సుల్తానుగారంత పెద్దదోషమేదియు చేయలేదు. మా దర్బారులో నిలిచి యాతనొక ప్రమాణమును చేయవలెను. ఆ దొంగ

సాంభాజీతో స్నేహము వదలికొందునని పలుకవలెను. ఖురాను నెత్తిపై బెట్టికొని యా ప్రమాణ మొనర్పవలెను".

"సుల్తాను మనస్సింతకుముందే యనేక విధముల నొచ్చినది. నొచ్చిన మనస్సు నింకను నొప్పించుట మీకు మంచిదిగాదు. సుల్తానును మీరు నమ్మవలెను. నమ్మనిచో దర్బారులో నిలిచి ప్రమాణ మొనర్చుపని యక్కరలేదు. సాంభాజీతోడి స్నేహమును విడిపించు జవాబుదారీ నాది. సుల్తాను నేడు నిరాధారుడై జీవచ్ఛవమైనాడు. అట్టివానిని దర్బారులో నిలిపి విచారించుట మీవంటి వారికి తగదు". సరుమా పాదుషా పాదములకు సలాము చేసినది.

"బేగం సాహెబా ! మీ మాటలు నిజమే కావచ్చును. కాని ప్రమాణమొనర్చుట మా మొగలు దర్బారుయొక్క మామూలు. నేనుగూడ నట్లే ఖురాను ముట్టి ప్రమాణమొనర్చి సింహాసనము నెక్కినాను. సుల్తానంతటి దుర్బలుడైనచో అతడు సింహాసనముపై నుండుట కర్హుడుగాడు. వేరొక్కరి నా రాచగద్దెపై నిలుపుటమేలు".

సరుమా యగ్గియై మండినది."ఔనౌను. మీ మనస్సులోని యూహను నేనెప్పుడో పసికట్టినాను. మీ నుండియే యామాట గడ్డకు రావలెనని నిరీక్షించినాను. ఈ రాయబారముతో నేను సంపాదించుకొన్నదేమి ! నా యవమాన మొక్కటే. నేను బ్రతికి యుండగా మా సుల్తానున కవమానము జరుగకూడదు. ఇది నా నిశ్చయము".

"సరుమా ! నీ షరతు సహజముగనే యున్నది. కాని నీ రాయబారము మొగలు దర్బారు యొక్క యాచారమునకు విరుద్ధముగా నున్నది. నీ కుతుబ్‌షాహీ రాజముద్రను నీవు వెనుకకు తీసికొని పోవచ్చును" పాదుషా రాజముద్రికను తెప్పించి సరుమా చేతికిప్పించినాడు.

సరుమా ఆడు సింహమువలె గర్జించినది. ఆ ముద్రిక నామె విసరికొట్టెను.

"పాదుషా ! ఈ ముద్రిక కీ రాజ్యమున నేమి వెలయున్నది? దానికాలము తీరిపోయినది. మొగలురాజుల క్రూరశాసనమే యికమీద నడుచుగాక ! సరసర నామె వెనుదిరిగి వెళ్ళిపోయెను".

"ఛీ ! పాపి ! నిన్ను అల్లా క్షమింపడు" పాదుషా తనలో తాననుకొన్నాడు.

## 16

షేక్ మిర్ లాజ్ సేనాధిపతుల నందరిని అంతఃపురమునకు బిలపించినాడు. గోల్కొండ కోట గలిబిలిగానున్నది. షేక్‌మిర్ లాజిట్లనెను.

"సేనాధిపతులారా ! గోల్కొండకు కడపటి దినములు ప్రాప్తించి నట్లున్నది. మొగల్ పాదుషా యుద్ధమునకు సిద్ధమై నిలిచినాడు. సుల్తానెన్ని రీతులనో సంధికై బ్రార్థించెను. కాని పాదుషా వినలేదు. మన మందరము తర తరములనుండి గోల్కొండ యుప్పుదిని

బ్రతికినవారము. మనము యుద్ధమున జావనైన జావవలెను. లేదా పాదుషాకు బందీలుగానైన జిక్కవలెను. మీ కేది సమ్మతమో దెలుపుడు?" సేనాధిపతి యొక్కడు లేచెను. అతని పేరు షరీఫ్ ఉల్‌ముల్క్. అతని కన్నులలో గాంభీర్యము హృదయమున నణపరాని గర్వము.

"మేమందర మెప్పుడును యుద్ధమునకు సిద్ధముగనే యున్నాము. మాలో కొన యూపిరి యున్నంత వరకు యుద్ధము నిలుపరాదు. పాదుషాలో న్యాయమెక్కడ యున్నది. ఆతడు మొదట సంధికి సమ్మతించెను. తరువాత నాతడే తిరస్కరించెను. సంధికిబోయి వచ్చిన రాయబారులందే యున్నారు గదా !".

రాయబారు లన్నారు "నిజము నిజము. సంధిని విఫలమొనర్చినది పాదుషాయే. పాదుషా శిబిరములో పెద్ద పెద్ద ఖాజీలున్నారు. ఉమ్రావులున్నారు. అందరి కంటెను గొప్పవాడైన షేక్ సారేహింద్ సాహేబుగారున్నారు. అతడే పాదుషా యన్యాయమును విప్పిచెప్పును. అతని దుష్కృత్యములను నివారింపవలెను. పాదుషా తాను ముస్లిమ్ ధర్మమును రక్షించునట్లుగా ఉద్ఘోషించుచున్నాడు. మరి ముసల్మాను రాజ్యమైన గోల్కొండపై యాతడెత్తి వచ్చినదెందుకు? మనమీ యవసరమున భయపడరాదు. యుద్ధమునకు తయారైపోవలెను. జయమైనచో జయము లేకున్న వీరమరణము".

సభయంతయు పెద్దపెట్టున "యుద్ధమేగావలె"నని యఱచినది. యుద్ధ సన్నాహములు త్వరత్వరగా జరుగుచున్నవి. సరుమా రాణి స్వయముగా నేగి సేనాధిపతులతో భేటియొనర్చినది. ఆమె వారికుత్సాహమును నూరిపోసినది. సైనికులను గలిసికొని వారిని ప్రోత్సహించినది. గోల్కొండకోట బురుజులపై ఫిరంగులు నోళ్ళు దెరచికొని నిలచియున్నవి. పాదుషాకీ విషయము లన్నియు దెలిసినవి. అతడు 'ఖాన్–ఇ–జహాన్' అను సేనాధిపతిని బిలిపించినాడు.

"గోల్కొండపైకి సేనలు నడుపుము" అని గట్టిగా నఱచెను. ఆ శిబిరమందున్న ఖాజీ సాహేబునకు పాదుషా యొసగిన యాజ్ఞ దెలిసినది. అతడు బిరబిర నౌరంగజేబు చెంతకు బోయెను.

పాదుషా యన్నాడు. "షేక్‌సాహేబుగారూ ! మీరేమి జెప్పుటకు వచ్చితిరో నాకు దెలియును. కాని యిది యుద్ధ విషయము".

"జహాపనా ! గోల్కొండ సుల్తాను ముస్లిం మీరు. ముస్లిం ధర్మమును రక్షించుటకు కంకణము గట్టికొన్నారు. గోల్కొండపైకి దాటినడుచుట మాకు రుచింపలేదు. మీ సైన్యములు బీజాపురములో గూడినప్పుడే మా మనస్సులు చాల నొచ్చినవి. ఈ గోల్కొండ యుద్ధమింకను అన్యాయముగనున్నది. మీరే స్వంతముగా సంధి షరతులను వ్రాసి యిచ్చితిరి. అవన్నియు నొకవిధముగా నెఱవేరినట్లే. మాదన్న గతించెను. గోల్కొండ రాజ్యము నిష్కంటకమైనది. సుల్తాను శరణాగతుడైనాడు. ఇంకను మీరు యుద్ధము సేయుటెందుకు? ఈ గోల్కొండ

ముసల్మానులు షేక్ జాతివారు. షేక్ జాతిని నాశమొనర్చుటకే పాదుషా కంకణము గట్టికొన్నట్లున్నది. ఇది ఖురానునకు సమ్మతమైన పనిగాదు. అల్లాకు ప్రియమైనదికాదు. ఈ విషయము మీకు స్పష్టముగ దెలుపకున్నచో యీ పాప ఫలము మేమును బంచుకొనవలసి వచ్చును. మీరు యుద్ధమును నిలిపి ఢిల్లీకి మరలుట శ్రేయస్కరము".

"షేక్ సాహెబుగారూ ! మీకు ధర్మ రహస్యములే కాని యుద్ధ రహస్యములు దెలియవు. ఈ దక్కనులో రెండు రాజ్యములుండుట మా కిష్టములేదు. ఈ రెంటిని నాశమొనర్చు ఉద్దేశ్యము తోనే మేము ఢిల్లీనుండి బయలుదేరి వచ్చితిమి. ఆ సంకల్పము నెరవేరియే కావలెను. లేకున్నచో మొగలు సామ్రాజ్యము మంటి పాలగును. మొగలు సామ్రాజ్యము బ్రతికి యుండవలెనని మీకు కోర్కె లేదా ?"

"ఎందుకు లేదు అనంత కాలము యీ రాజ్యము శాశ్వతముగా నుండవలెననియే మా కోరిక. సామ్రాజ్యమల్లా దయతో స్థాపితమైనది. మీరు ధర్మమును నెరవేర్చినచో రాజ్యము స్థిరముగా నుండును. ధర్మోద్ధారణమునకే జీవితమును త్యజించిన అలంఘీర్ పాదుషా ద్వేషాసూయలకు లోబడి స్వధర్మీయులపై కత్తిగట్టుట మంచిదిగాదు. మీరు మరియొకసారి యాలోచించి కొనవలెను".

పాదుషా కఠోరముగా నన్నాడు.

"షేక్ సాహెబుగారూ ! ఈ విషయమున నన్నడ్డగింపకుడు. మా ఆశయము నెరవేరి తీరవలెను".

"అట్లే యగుగాక ! అలంఘీరు పాదుషా ! నీకు శుభమగుగాక ! ఇక మేమీ శిబిర మందుండుటకు వీలులేదు. ఈ రాజ్యమందుగూడ నుండను. మక్కాకు వెడలిపోయెదము".

"అల్లా యిచ్ఛయదియైనచో అట్లే యగుగాక !"

ఖాజీ సాహెబు మాయమయ్యెను.

పాదుషా సలామొనర్చినాడు.

ఖాజీ సాహెబు మక్కాకు బోవుచున్నాడనువార్త సైన్యమందంతయు వ్యాపించినది.

"సయ్యద్ మహమ్మద్ పాదుషా శిబిరమునకు వచ్చెను. అతడన్నాడు. "జహాపనా! నాకీ రాజ్యమందే పనియు లేదు, ఖాజీ సాహెబుగారితో మక్కాకు బోవుట కనుజ్ఞ యీయవలెను".

ఔరంగజేబు కొంచెము సేపాలోచించినాడు.

సయ్యద్ ! నీ పని యింకను పూర్తిగా నెరవేరలేదు. నీవీ గోల్కొండ సింహాసనమునకు న్యాయమైన యధికారివి. ఈ యుద్ధము ముగిసిన వెనుక నీకు పట్టము గట్టవలెనని యున్నాము. ఇప్పుడు నీవేల మక్కాకు బోవలెను?"

"షాహంసహా ! తమదయకు చాల కృతజ్ఞుడను. సింహాసనముపై నాకాశలేదు. సంతోషముగా మక్కా కేగెదను".

"మంచిది. సయ్యద్? ఖుదానిన్ననుగ్రహించుగాక !"

సయ్యద్ మహమ్మద్ – అలంఘీరు పాదములను చుంబించెను. అతడన్నాడు.

"జహాపనా ! నేననుగ్రహింపబడినాను. నాదొక కడపటి ప్రార్థనయున్నది. నా బిడ్డ ముంతాజు కథయంతయు మీకు దెలియును. ఆమెను తమపాదముల యందర్పించు చున్నాను"

సయ్యద్ తన గుడారమునకేగి ముంతాజును బిలిచికొని వచ్చి పాదుషా యెదుట నిలిపెను. ఆమె ఔరంగజేబునకు సలామొనర్చెను. పాదుషా ఆమె తల నిమిరినాడు.

"బిడ్డా ! నీవీ సయ్యదునకు తగిన కుమార్తెవు జ్యోతిష్కులు నీవు భాగ్యశాలిని వౌవుదువని పలికినమాట నిజమగుగాక. నీవు యువరాజుతో పాటు ఢిల్లీకి బొమ్ము" ముంతాజ్ మరల సలామొనర్చినది. తండ్రిబిడ్డ లిర్వురును 'షా ఆలం' శిబిరమునకు బోయినారు.

సయ్యదన్నాడు.

"యువరాజా నీ నుండి నేనుగొప్ప యుపకార మందితిని నీవు నా జన్మజన్మముల బంధువువు. ఇది అల్లా అనుగ్రహము. నీవు నా కుమార్తెను ముంతాజ్‌ను రక్షించితివి. ఈమెను నీ కొప్పగింపుమని పాదుషా ఆజ్ఞయైనది. నేను ఖాజీసాహేబుగారితో కూడ మక్కాకు బోవుచున్నాను".

"సయ్యద్ మహమ్మద్ ! నీ తీర్మానమునకు నేనడ్డువచ్చుటలేదు. పాదుషాయే మీ కనుజ్ఞ యొసగెను. నేనెవ్వడను? మీరీ ముంతాజును పాదుషా కొప్పించినారు. ఇక నీమె క్షేమ చింతవారిది".

సయ్యద్ మహమ్మద్ ముంతాజ్ చేయిబట్టికొని చుంబించెను. వారిర్వురు గాఢాలింగన మొనర్చికొన్నారు. ఆ యాలింగనము కన్నీటిలో గరగిపోయెను. సయ్యద్ మహమ్మద్ ఖాజీసాహేబుతో పాటు మక్కాకు బయనమయ్యెను. గుడారమున యువరాజు ముంతాజ్ మాత్రమే మిగిలినారు. యువరాజు సంభాషణ మారంభించెను. "ముంతాజు ! నాకు మనస్సులో నుత్సాహము లేదు. సంతోషము లేదు. పాదుషా స్వయముగా యుద్ధమునకు వచ్చినాడు. ఇకనాకిక్కడ నేమిపనియున్నది? ఈ శిబిరములో నేనొక బందీవలెనున్నాను. నాకిచ్చట నుండుట కిష్టము లేదు. నేను ఢిల్లీకి బోయెదను. లేక మరెక్కడికైనను బోయెదను".

"యువరాజా ! యుద్ధమింకను ముగియలేదు. యుద్ధము ముగిసిన దనుట మీ భ్రాంతి. ఇంకను గోల్కొండలో ప్రచండ వీరులున్నారు. వారిశక్తి తగ్గినది. కాని చావలేదు. ఇంతకును పాదుషా యాజ్ఞ లేనిది మీరెక్కడికి బోగలరు?"

షా ఆలం దీర్ఘముగ నిట్టూర్చినాడు.

"ముంతాజ్ ! పాదుషాకును, నాకును సంబంధము చెడిపోయినది. నాకీ యుద్ధము న్యాయముగా దోచుటలేదు. ఖాజీసాహెబుగారు గూడ నట్లే యన్నారు. కాని మా తండ్రి సమ్మతింపలేదు. అందుకే తమ యధికారమును త్యజించి ఖాజీగారు మక్కాకు వెడలిపోయిరి. నాకు ఢిల్లీ సింహాసనముపై నాశలేదు. ఎక్కడోయొక చోట నజ్ఞాతముగ బ్రతుకవలెనని యున్నది. అప్పుడు నీవేమి సేతువు?" ఈ మాట యామె హృదయమున గ్రుచ్చికొన్నది.

"యువరాజా ! సుఖమునందును దుఃఖమునందును నేను సంతోషముగ నిన్నే యనుసరింతును. నాకు దానిని మించిన యదృష్టమేమున్నది?" యన్నది.

"నేటినుండి నేనొక బికారిని".

"బికారి వైనను నీవొక మహాపురుషుడవు".

ఇంతలో పాదుషానుండి పిలుపు వచ్చినది. షా ఆలం అతనికడకేగి చేతులు కట్టికొని నిలిచికొన్నాడు. "షాఆలం నీపై నన్యాయముగ కోపగించి కొన్నాను. నిన్ను ఢిల్లీ కారాగృహ మందుంచవలెనని యోచించి యుంటిని. షేక్ సాహెబుగారు నీ దోషమేమియు లేదని నిన్ను చాలా మెచ్చికొన్నారు. ఈ గోల్కొండను గెలిచినది నీవేయని వారి భావన. ఆ యభిప్రాయముతో నే నేకీభవించుచున్నాను. కాని ఆ సరుమాబేగం కోపగించికొని పోయినది. ఆమెయే యుద్ధమునకు తయారీ యొనర్చుచున్నది. మన మింకను కొంచెము కాలమిందుండి పోరు నడపవలసి యున్నది. నీవు హైదరాబాదు శిబిరమందుండుము. ఆపై నుండి శత్రుసైన్యములు వచ్చినచో వారి నడ్డగింపవలెను".

"జహాపనా ! నాదొక్క మాట యున్నది. మీరు దాని నోర్పుతో వినవలెను. మీ యాజ్ఞయైనచో యుద్ధ మొనరింతును. కాని యీ యువరాజు పదవి కంటక కిరీటమని నేనెఱుగుదును. ఎన్నడో యొకనాడు నేనును ఖాజీసాహెబుగారివలె మక్కాకు వెడలిపోయెడివాడనే. ఈ జగత్తు, యీ కుటిలోపాయములు, యీ రక్తపాతము వీనిపై నాకు వేసరిక యేర్పడినది. ఈ మాటలాడినందుకు నన్ను మీరు క్షమింపవలెను".

"షాఆలం ! మక్కాకు పోవుటన్న పిల్లాటకాదు. దానికల్లా ఆజ్ఞకావలెను. నీకు భార్యలున్నారు. సంసారమున్నది. ఇక నీవెట్లు మక్కాకు బోయెదవు? అల్లా యనుజ్ఞ నీకెట్లు వచ్చును?"

"జహాపనా ! మీ పాదముల సాక్షిగా ప్రమాణము చేసి చెప్పుచున్నాను. నాకు మీరాజ్ఞ యొసగవలెను. మక్కా గాకున్నచో వేరొక చోటికి బోయి జీవింతును. కొండ గుట్టలలో నివసింతును. నాకీ మనుష్యుల జంజాటమే గాబట్టుట లేదు".

"ఆలం ! అందరిని వదలిపోయెదవా ? జన్మదాతనైన నన్నుగూడ. ఈ వృద్ధపాదుషానుగూడ వదలిపెట్టి పోదువా? ప్రపంచమున నామాట కెదురు చెప్పుట కెవ్వరికిని ధైర్యములేదు. కుమారుడవైన నీవే యెదురు చెప్పెదవా? ఇది అల్లాకు సమ్మతమేనా?"

షా ఆలం పాదుషా పాదములను గట్టిగా బట్టికొన్నాడు.

"పాదుషా ! ఆమరణాంతము మీ ఆజ్ఞ కెదురులేదు. నేనేగాదు. మీ ఆజ్ఞ కెదురు బల్కగలవాడీ భూమిలో పుట్టలేదు".

షా ఆలం కంఠము గద్గదమైనది. ఆతడు మౌనముగ నిలుచుండెను.

"పొమ్ము ! యువరాజా ! పొమ్ము. హైదరాబాదు శిబిరమందుండుము. ఆ ఇబ్రహీంను నీకడ నుంచుకొని రక్షింపుము. వాని యాపదలింకను దొలగలేదు. వాడొక పరాక్రమశాలియైన సేనాధిపతియని విన్నాము. వానిపై మాదయయున్నది".

షాఆలం ఇబ్రహీంను బిలిపించినాడు. ఇబ్రహీం యువరాజునకు సలాము చేసెను. ముంతాజక్కడనే యున్నది.

"ఇబ్రహీం ! మీరిర్వురును ప్రేమికులని యపోహపడితిని. ఆ సందేహము నాకు చాలకాల ముండెను. భగవంతుడు చాల విచిత్రముగ అన్నచెల్లెండ్ర నొక్కచోట జేర్చినాడు".

"యువరాజా ? ఈ ముంతాజు యింత సాహసము గలదియని నేను కలలోగూడ భావింపలేదు. ఈమెశక్తి స్వరూపిణి. ప్రతిసన్నివేశమునందును నన్నీమె గెలచినది. అనేక ఘట్టములలో నేనీమె చేతి పావురమునై పోయినాను. ఈమెయన్నచో ప్రేమకంటెను గౌరవమే నా హృదయము నాక్రమించి యుండెను. ఆ మాదన్న వీరాగ్రేసరుడు. మహాపురుషుడు నా తండ్రి గురువు సర్వమతడే. ఈ ముంతాజే మాదన్నను జంపినదని నాకెవ్వరో జెప్పిరి. అప్పుడు నా హృదయము గడగడలాడినది. నిజముగా అప్పుడీమె నా చేతికి దొరకియున్న యీమె శరీరమును ముక్కలుగా నరకియుండెడివాడను. ఇప్పుడీమె నా సోదరియని తెలిసినది. తెలిసినను మాదన్న నీమె వధించినదని నిజమైయున్నచో నే నీమెను క్షమించియుండెడి వాడనుగాను. హరిదాసి విషయముతో సత్యము బయటపడిపోయినది. నే నీమెను శంకించినందుకు కెంతయో బాధపడుచున్నాను. సోదరీ ! నన్ను నీవు క్షమింపవలెను" ఇబ్రహీం ముంతాజువైపు దిరిగినాడు.

'ముంతాజు' ముందునకు వచ్చి ఇబ్రహీంను గట్టిగా కౌగలించుకున్నది.

"ఈ జగత్తున నీ వొక్కడవే నాకు మిగిలిన బంధువు. నీవైనను మిగులుట అల్లాదయ. ఒకటేమి? నీవి వేయి యపరాధములైనను క్షమింపగలను".

ముంతాజు బావురుమని యేడ్చినది. ఇబ్రహీం ఆమె కన్నీరును దుడిచి యోదార్చినాడు.

షాఆలం అన్నాడు.

"ఇబ్రహీం ? నీపై పాదుషా కమితమైన దయయున్నది. నిన్ను నా రక్షణలోనుంచి కొనవలెనని యాజ్ఞాపించినాడు".

పాదుషా 'షాఆలం'ను తన శిబిరమునకు పిలిపించికొని యిట్లాజ్ఞ యిచ్చినాడు.

"ఆలం ! నీవు హైదరాబాదు శిబిరములో నుండవలెను. నీతో చాలవరకు మొగలు సైన్యమంతయు నుండును. ఈ ఇబ్రహీం నొక సేనాధిపతిగా నియమించుచున్నాను. గోల్కొండ యుద్ధ మతిసామాన్యమైనదే. నీ పని ముఖ్యముగా గోల్కొండ నాక్రమించు కొనుటగాదు. ఆ వైపునుండి సాంభాజీ సైన్యములువచ్చి గోల్కొండ నాక్రమించికొను సంభవముండును. హైదరాబాదు షోలాపూర్ వరకును ఆ వైపు మనరాజ్యమున్నది. ఆ ప్రదేశములలో సాంభాజీ తలయెత్తకుండ చూచుకొనుట నీ పని. సాంభాజీని పట్టుకొని బందీగా ఢిల్లీ దర్బారునకు బంపించు వరకును నీవు దక్కనునకు సర్వాధికారిగా నుండవలెను".

యువరాజు హైదరాబాదు శిబిరమునకు దరలిపోయెను. ఇబ్రహీం ముంతాజు లాతని వెంటనే బోయిరి.

## 17

మొగలు సైన్యమునకు ముఖ్య సేనాధిపతి ఖాన్–ఇ–జహాన్, గోల్కొండ కోట నాక్రమించి కొనవలెనని యాతని కాజ్ఞయైయుండెను. అది పూర్తిగా స్వాధీనమగు వరకును పాదుషాకు నిద్ర బట్టుటలేదు. 'అబుల్‌హసన్'ను పాదుషా దర్బారున కీడ్చికొని రావలెనని కూడ యుత్తరువైనది. సేనాధిపతి, మొగల్ ఫిరంగులకు కోటను స్వాధీన పరచికొనవలసినదని యాజ్ఞ వెట్టెను. గోల్కొండ చుట్టును నాలుగైదు మైళ్ళవరకొక్కటే మొగల్ సైన్యము. దానికంతే గనుపించుటలేదు. ఫిరంగులు శబ్దింప దొడగినది. ఆ నినాదములు గగనమును భేదించుచుండెను. ఫిరంగుల మొగములు తెరచిన మృత్యు దేవి వక్త్రములు ఆ నినాదము లామె వికటాట్ట హాసములు. కాని యేమి ప్రయోజనము? కోటనుండి యొక్కరాయిగూడ యూడిపడలేదు. మొగల్ సైన్యములు కందుకమును దాటి కోటను సమీపించుటకు సాధ్యమగుట లేదు. గోల్కొండ బురుజుల నుండియు ఫిరంగులకు ఫిరంగులు ప్రత్యుత్తర మిచ్చుచున్నవి. ఒక్కొక్క గుండునను నూరారుమంది మొగలు సైనికులు క్రింద బడుచున్నారు. కోటపై నుండి వెచ్చని నూనె విసరుచున్నారు. అది బడిన మేరకు మొగలుల శరీరములు బొబ్బలగు చుండెను. చాల నందున పెద్ద పెద్ద శిలలను దొర్లించుచుండిరి. వారమయ్యెను. పది దినములయ్యెను. ఒక నెలయు గడచినది. మొగలులు వేలకువేలు చచ్చుచున్నారు. సేనాధిపతి మొగమున రక్తపుచుక్కలేదు. సైన్యములు వెనుక త్రొక్కులు త్రొక్కుచుండెను. పాదుషా యే గుఱ్ఱము నెక్కి యుద్ధ క్షేత్రమునకు వచ్చినాడు. ఆతడే స్వయముగా సైన్యములను బరామర్శించుచుండెను. పాదుషా పురికొల్పుకొలది సైన్యము ముందునకు దూకెడివి. దూకెడు కొలదియు గోల్కొండ ఫిరంగులకు హతమయ్యెడివి. పాదుషా 'ఇతీఖత్‌ఖాన్' అనే సేనాధిపతిని పిలచినాడు. వానినాతడు సేనాగ్రమునకు బంపెను. గుండ్లు బడుచున్నను సైన్యములు

ముందునకే సాగవలెనని పాదుషా గారియాజ్ఞ. ఇక సైన్యములకు విధియేమున్నది? అవి ముందుకు మొగ్గెను. చాలమంది గోల్కొండ ఫిరంగులకు హతులగుచున్నారు. వానిని దప్పించికొని కోటపైకి బ్రాకుచున్నవారికి పైనుండి తైలవర్షము, శిలావర్షము, చాలని దానికి వానాకాలముగూడ దాపురించినది. ప్రకృతియే పాదుషాపై పగబట్టినట్లుండెను. సేనాధిపతులందరును వానాకాలము ముగియువరకును యుద్ధమును నిలుపవలసినదని పాదుషాను బ్రార్థింత మనుకొన్నారు. వారు ముందుగా ఖాజీ అబ్దుల్లాను గలసికొన్నారు.

"ఖాజీసాహెబుగారూ ! ఈ వర్షాకాలము ముగియు వరకును యుద్ధమును నిలుపవలసిన దని పాదుషాను బ్రార్థింతమనుకొన్నాము".

"ఖాజీసాహెబుగారు ! ఈ వర్షాకాలమున మనము యుద్ధమొనర్చుట కేవలము వ్యర్థము. కోట మనచేజిక్కుట అసంభవము. ఇప్పటికీ యుద్ధమును నిలుపవలెను. లేకున్నచో వేలాది సైనికులు జచ్చుటయేతప్ప ఫలముండదు. మాకీ మాట పాదుషాతో చెప్పు ధైర్యములేదు. దయచేసి మీరీ విషయమున గల్పించి కొనవలెను".

ఖాజీ అబ్దుల్లా పాదుషా చెంతకు వచ్చెను. సేనాధిపతుల మనవి నాతడెఱుక పరచెను. ఆ మాటలకు పాదుషా యగ్నిపర్వతమైనాడు. అతని క్రోధమునకు రెండు కారణములు. ఇంత వరకును విజయము లభించలేదనుట యొకటి. యుద్ధమును నిలుపవలసినదని మొఱవెట్టుట యొకటి. ఆతడు ఖాజీవైపు దురుసుగా జూచెను. కన్నులలో రక్తము గూడుకట్టినది.

"ఖాజీసాహేబుగారూ ! దయచేసి యుద్ధవిషయమున మీరు కల్పించుకొనకుడు. వీరుడు యుద్ధములకు వచ్చుట చచ్చుటకొరకే. తిని త్రాగి హాయిగా విహరించుటకు గాదు. యుద్ధమనగా గుండ్లవర్షము, పిడుగుల వర్షము, వానికీ యెదలు ఎదురొడ్డి నడువవలెను. యుద్ధవీరులు వర్షమునకు భయపడుట అపహాస్యకరము. మనమిప్పుడు యుద్ధమును నిలిపినచో ఢిల్లీ దర్బారు ప్రతిష్ఠ పాతాళమునకు క్రుంగిపోవును. చచ్చినవారిని చావనిండు. మొగలు సైన్యము లక్షలకున్నది. మందుగుండులకు మనకేమి కొఱత ! వారికంటె పదిరెట్లుగా వదలుదము. యుద్ధము నిలుపుటకు వీలులేదు. మీకు మొదటి నుండియు గోల్కొండ యుద్ధమసమ్మతముగనే యుండినది. గోల్కొండ సుల్తాను మహమ్మదీయుడని మీ యభిప్రాయము. మీరీ శిబిరములో నుండరాదు. మీ మాటలు సైన్యమున కధైర్యము కల్గించును. మీరు వెంటనే ఢిల్లీకి దిరిగిపోవలెను"

పాదుషా సేనాధిపతుల నందరిని బిలిపించెను.

"మీరందరు పిరికిమందు త్రాగినట్లున్నది. యుద్ధమును నిలుపవలెనని ఖాజీసాహేబు ద్వారా నాకు జెప్పి పంపినారు. మీకు యుద్ధము గాబట్టకున్నచో మీరందరును ఢిల్లీకి దిరిగి పోవచ్చును. నేనొక్కడనే పోరెదను. యుద్ధమొక్క క్షణ కాలము కూడ నిలుపుటకు వీలులేదు.

మొగలు సైన్యములకు దక్కనున పరాజయము కల్గినదను అపకీర్తి వచ్చుటకు వీలులేదు. ఇది ఢిల్లీ దర్బారునకు గౌరవము కాదు".

సేనాధిపతులు క్షమాపణ వేడికొనిరి. యుద్ధమునుండి వెన్కకడుగు వేయమని శపథమొనర్చి నారు. వారందరు గోటను సమీపించిరి. సైనికులు మన్ను కుప్పబోయుట కారంభించినారు. గోల్కొండకోట యెంత యెత్తున్నదో అంత యెత్తుకుప్పలైనవి. ఆ కుప్ప లనేకములుండెను. మొగలు సైన్యములు వానివెనుక దాగికొనుచుండెను. గోల్కొండ ఫిరంగి గుండ్లు మొగలు సైన్యమునకు దాకుటలేదు. ఈ యుపాయము పాదుషా సైన్యములకు కుత్సాహము నింపినది. పాదుషా షా ఆలంనకు బీజాపూరు సైన్యము లన్నింటిని గోల్కొండ వైపునకు దరలించి తీసుకొని రావలసినదని యాజ్ఞపంపెను. 'షా ఆలం' బ్రహ్మాండ సైన్యములతో పాదుషా శిబిరమును జేరినాడు. వర్షాకాలము వెనుక పడుట నారంభించినది. ఎత్తైన మంటి కుప్పలపై మొగలు సైన్యములు ఫిరంగులు నింపెను. వారచ్చట నుండి గుండ్లను ప్రయోగింప జొచ్చిరి. కోట చీలికలు పడ నారంభించెను. బురుజులు దెబ్బతినెను. పాదుషా సైన్యము కోట వాకిండ్లు పగులగొట్టినవి. అవి లోన బ్రవేశింపజొచ్చెను. కోటవాకిలి యందు సుల్తాను గుఱ్ఱపు దళము లెదిరించినవి. ప్రాణములకు దెగించి యుద్ధమును సాగించిరి. ఆ ద్వారము చాల చిన్నది. దానినుండి వచ్చు మొగలు సైన్యములకు గోల్కొండ సైన్యములు యీటెలతో గ్రుమ్ము చుండిరి. తలలు దెగవ్రేయుచుండిరి. మొగలు సేనాధిపతి రూహుల్లా సాహసించి ముందు కురికినాడు. దక్కను సేనాధిపతి క్రిందికి దిగి వాని నెదిరించినాడు వారికి భయంకర పోరాటము జరిగినది. గోల్కొండ సైన్యములకు ధైర్యము చెడినది. ఆ గుఱ్ఱపు దండు వెనుకకు బరువెత్తుచుండెను. వారు పరుగిడు కొలదియు మొగలులు కోట నాక్రమించు కొనుచున్నారు. కోటలోని వీధి వీధిలోను భయంకర యుద్ధము సాగెను. అంతఃపుర ద్వారమున గూడ భీకర సమరము జరిగినది. దక్కను సేనాధిపతి రూహుల్లాఖానునకు ఖైదీగా జిక్కినాడు. రూహుల్లా నాతని గుఱ్ఱముపై గూర్చుండబెట్టికొని మొగలు శిబిరమునకు వచ్చెను. దక్కను సేనాధిపతి మూర్ఛలో నున్నాడు. 'రూహుల్లా' యాతనిని క్రిందికి దింపి పరుండబెట్టెను. చల్లనిగాలి విసరినారు. శీతలజలమును ద్రావించినారు. ఆ సేనాధిపతి ధరించిన శిరస్త్రాణమును రూహుల్లా దొలగించెను. దక్కనుసేనాధిపతి రూహుల్లా వైపు చూచి చిరునవ్వు నవ్వినాడు. ఆ నవ్వులలోని యొయ్యారము వింతగానుండినది. కన్నులలోని కాంతి స్త్రీదై యుండెను. రూహుల్లా కాశ్చర్యమైనది. సుల్తాను సేనాధిపతికి చెఱజిక్కినాడను విషయము సైన్యము లందంతయు వ్యాపించెను. పాదుషా యశ్వారూఢుడై కోటవాకిలి వైపు బోవుచున్నారు. ఆ విషయమాతని చెవులలో బడినది. ఔరంగజేబు వెంటనే యాస్థలమునకు వచ్చెను. పాదుషా రూహుల్లాఖాన్‌తో నన్నాడు.

"రూహుల్లాఖాన్ ! ఈ సేనాధిపతి ఎవ్వరు? నీకు పరిచయమున్నదా? ఇతని పేరేమి?"

"జహాపనా ! ఈ సేనాధిపతి యెక్కిన గుఱ్ఱముదానికున్న యాభరణములు యీ శిరస్త్రాణము, పాదరక్షలూ వీనిని చూచి యితడే సుల్తానై యుండునని భ్రమచెందితిని గోల్కొండ సుల్తాను మనచేతికి జిక్కినాడని యెత్తికొని వచ్చినాను జహాపనా ఈమె సేనాధిపతి గాదు. ఎవరో యొక స్త్రీ వలె నున్నది".

"పాదుషా గుఱ్ఱమునుండి దిగి తలవంచి ఆ స్త్రీ ముఖమువైపు జూచినాడు. ఆ సేనాధిపతి ముఖముపైనను గాయములైనవి. ఆ సేనాధిపతి దీర్ఘ నేత్రములు ప్రపుల్లములై నవ్వెను. పాదుషా యేదో జ్ఞాపకము వచ్చినవానివలె "నీ వెవ్వరవు?" అన్నాడు.

"నేనే తెలియదా ? సరుమాబేగం!"

వెంటనే యామె ప్రాణపక్షి యెగిరిపోయినది. పాదుషా కొంతసేపు దీర్ఘాలోచనాపరుడై నిలచినాడు. ఇంతకుముందు రణక్షేత్రములో రాజపుత్ర స్త్రీ లొనర్చు త్యాగమే జూచినాడు. ఈమె ముస్లిం స్త్రీ.

"రూహుల్లా ! ఈమె శరీరమును సుగంధ ద్రవ్యములతో పుష్పములతో నలంకరింపుము. ఈ శరీరమును సుల్తానున కప్పగించవలెను".

పాదుషా మనస్సేమో వికలమైనది. అతడక్కడ నిలువలేదు. వెంటనే వెడలిపోయెను.

## 18

రూహుల్లాఖాన్ ఫిరోజ్‌జంగ్‌తో గోల్కొండ యంతఃపురమున బ్రవేశించినాడు. వారిర్వురును సేనాధిపతులే. వారు సుల్తానున్న మందిరమును బ్రవేశించిరి. అతనిని జూచి వారి కాశ్చర్యమైనది. సుల్తాను మొగమున కళ తగ్గలేదు. భయగ్రస్తులైనట్లు లేదు. ఆ సేనాధిపతులు ఆ సుల్తానును జూచి ఆశ్చర్యపడినారు. వారిర్వు రాతనికి సలామొనర్చిరి.

"సుల్తానుగారూ ! మే మిర్వురము మొగలు సేనాధిపతులము. మీరిప్పుడు పాదుషాగారి బందీలు".

ఆ మాటలువిని అబుల్‌హసన్ చిఱునవ్వు నవ్వినాడు.

"అవునవును. నాకావిషయము తెలియును. నే నిప్పుడు గోల్కొండ సుల్తానునుగాను. పాదుషాగారి యాజ్ఞ యేమి".

"మీరు మా వెంట నిప్పుడు పాదుషాగారి శిబిరమునకు రావలెను".

సేనాధిపతులు వినయముతో బలికినారు.

"తప్పక వత్తును. నాకు కొంత యవకాశమివ్వవలెను". సుల్తాను వస్త్రాలంకారములను ధరించి జనానాకేగెను. అచ్చటనున్న భార్యాపుత్రుల నోదార్చినాడు. ఇదే నా కడపటి దర్శనమని వారితోనని వెనుదిరిగెను. సరుమా యంతఃపురమునకు బోయినాడు. ఆమె యెక్కడనున్నది? ఆతడెల్లకడలను వెదకెను. 'జానీ సాహేబా' గనుపించినది. ఆమెతో సుల్తానన్నాడు.

"జానీ ? నేను కడసారిగా సరుమాను జూచిపోవలెనను కొంటిని. ఆమె గనుపించుట లేదు. ఎక్కడికి వెళ్ళినది?"

"అబుల్‌హసన్ ! నీవు పాదుషా సన్నిధికి బోవుచున్నావా ఇక నీకు సరుమా కథతో నేమి ప్రయోజనము? ఆమె కొన్ని దినముల నుండి యీ యంతఃపురమున లేదు. సైన్యములతో జేరికొన్నది. ఇంతవరకు జరిగిన యుద్ధములు సరుమా ప్రదర్శించిన పరాక్రమములే. కోటనుండి ఫిరంగుల వర్షమును గురిపించినది సరుమా. సైనికుల కుత్సాహమును నూరిపోసినదా రాణి. బొక్కసములోని ధనమును సైన్యములకు బహుమానములుగా బంచినది సరుమా. ఈ కోటలోని ప్రతిమొగవానికి నామె పరాక్రమము నూరిపోసినది. ప్రతివానిని రణక్షేత్రమునకు బిలచికొని పోయినది. ఈ కోటలో నెవ్వడైన పురుషు డొక్కడు మిగిలియున్నచో వాడు పురుషుడు గాడు. మగవేషమును ధరించిన స్త్రీ. ఆమె తల నేలపై కొరిగిన పిదపయే గోల్కొండ శత్రువుల వశమైనది. ఆమె యింతపని నీ కొరకై చేసినది. నీవు పాదుషా కడ వినమ్రుడవై నిలుచుట యామె కిష్టముండినది గాదు. ఆమె నడిపిన రాయబారము విఫలమైనది. యుద్ధక్షేత్రమున నా వీరవనిత తన రక్తమును వెదజల్లినది".

సుల్తాను రెండు కన్నులును కన్నీటి యూటలైనవి. అతడు వెక్కి వెక్కి యాడ్వ నారంభించెను.

'జానీ సాహెబా' సుల్తానును దగ్గరకు తీసికొన్నది.

ఆమె యాతని తల నిమిరినది.

"అబుల్ హసన్ ! యేడ్వవలదు. ఏడ్చి సాధించున దేమియు లేదు. కన్నీరు నిండిన కండ్లతో పాదుషా యెదుట బడకుము. అది మన 'కుతుబ్ షా' కే కళంకము. నీ జీవితములో కుతుబ్ షాహీ రాచరికము యొక్క గోరీ తయారగును. వీరుడవై దానికంగీకరింపుము. నవ్వుచు నాపద నాహ్వానింపుము".

"బేగం సాహెబా ! రాజ్యము పోవుచున్నదని నాకు భయము లేదు. సంపద క్షీణించెనని దుఃఖము లేదు. ఇవన్నియు నుండవచ్చును. పోవచ్చును. సరుమా చూపిన పరాక్రమము వంటి పరాక్రమము నాకు ప్రాప్తించక పోయెనే యని నాకు బాధ. ఈ విషయమున హీనాతి హీనుడనై పోయినాను".

"అబుల్ హసన్ గడచిన దానికి దుఃఖపడకు. అల్లా నీ కనుగ్రహించినవి చాల స్వల్పము. దీనిని దుఃఖముతో కళంకిత మొనర్పకుము. నవ్వుచు నానందముగా పాదుషా చెంతకు బొమ్ము. సరుమా నీ దర్శనమునకై వేరులోకములలో గాచికొన్నది. ఆమెచెంతకు నవ్వుచుబొమ్ము".

సుల్తాను మనస్సు రాయియైనది. అతని ముఖము గాంభీర్యమైనది. ఒక్క నిట్టూర్పు మాత్రమే యాతని దుఃఖపు లోతులను దడవినది. అతడంతఃపురమునుండి గడ్డకు వచ్చెను.

మొగలు సేనాధిపతులన్నారు. "తమకొరకు పల్లకి తయారుగా నున్నది, దానిలో మీరు గూర్చొని రావచ్చును".

"లేదు లేదు నేను పల్లకి నెక్కిన దినములు గడచిపోయినవి. నేనిప్పుడల్లా రాజ్యమునకు బోవుచున్నాను".

అతడు ముందు ముందు కడుగులు వేసినాడు. సేనాధిపతులాతని ననుసరించిరి. గోల్కొండ వీధులలో స్త్రీ పురుషు లాతనిని కడసారిగా జూచినారు. వారి కన్నులు కన్నీటి మడుగులైనవి. సుల్తాను మొగలు శిబిరముయొక్క మహాద్వారమును దరిసెను. 'షా అజం' అతనిని మర్యాదగా నెదుర్కొన్నాడు. ఆ దినమంతయు నాతడు 'షా అజం' శిబిరమందే యుండెను. సేనాధిపతు లందరును వినయమున చేతులు గట్టుకొని నిలిచికొని యున్నారు. షా అజం గోల్కొండ సుల్తానును సమర్యాదముగా దీసికొనివచ్చి పాదుషా యెదుట నిలిపినాడు.

పాదుషా పలికినాడు.

"అబుల్ హసన్ ! నీకు కావలసినదేదో కోరుకొనుము. నీ కోర్కెను తప్పక చెల్లింతుము. నీకు సమస్త మర్యాదలను నడపింతును".

సుల్తాను సలామొనర్చినాడు.

"షహన్ షహా ! నా మాటలు దయచేసి తాము వినవలెను. ఇది నా జీవితపు కడపటి దినము. కట్టకడపటి దినము ఇప్పుడు నేను కోరునదేమియు లేదు. ఒక్క అల్లా దయ మాత్రము. మీ యాశీర్వాదము. జహాపనా ! నే నపరాధిని. నేనీ భవ్యమైన కుతుబ్‌షాహీ వంశమున జన్మించిన వాడనుగాను. ఆ పవిత్ర రక్తమునా శరీరమున లేదు. నేనొక దరిద్రుని కుమారుడను దరిద్రుడనై పుట్టితిని. చదువు నేర్చినవాడనుగాను. యుద్ధము నభ్యసించినవాడను గాను. ఇంతటి సమృద్ధమైన రాజ్యమును, బ్రహ్మాండమైన యైశ్వర్యమును నాకిన్ని దినములుగా ఖుదా అనుగ్రహించినాడు. ఎంతటి దయ మహావిక్రములు వీర పురుషులెక్కిన కుతుబ్‌షాహి సింహాసనమిది. ఇన్ని దినములు నాకు దక్కినది. జహాపనా ! నేనిన్ని దినములు చేసినదేమి? భగవంతుడు నా కొసగిన యైశ్వర్యము నంతయు స్త్రీలకు వెచ్చించితిని. వారి పాదముల

నారాధించితిని. మద్య సేవనమే నా బ్రతుకై పోయినది. ఈ నా యపరాధములను ఖుదా మన్నించెను. అతని దయకుపారమేమున్నది. నేనీ యుద్ధమున నోడితిని నాకు దుఃఖము లేదు. కాని వీరుడినై పోరాడి మరణించు భాగ్యము నాకబ్బక పోయెనే యని నా బాధ. ఈ అదృష్టము అల్లా నాకనుగ్రహింపలేదు. నేనింక బ్రదికినను దరిద్రుడుగా బ్రతుకగలను. నా చిన్ననాడు దరిద్రుడిగనే జీవించితిని. వైభవోపేతమైన నా యంతఃపురము నా యైశ్వర్యము అన్నిటిని వదలి యిప్పుడు మీ చెంతకు వచ్చినాను. అవేవియు నాకక్కరలేదు. నేనిప్పు డెచ్చటికి వచ్చినానో నాకు చక్కగా జ్ఞాపకమున్నది. అలంఘీర్ పాదుషా చెంతకువచ్చితిని. నా జీవితమున మిమ్ము దర్శించుట మహాపుణ్యము".

పాదుషా చాలాసేపు కన్నులు మూసికొని యున్నాడు. ఆ సుల్తానుస్థితి వీక్షించుటకాతనికి ధైర్యము చాలలేదు. చాలసేపు తర్వాత పాదుషా సింహాసనమునుండి దిగివచ్చి సుల్తాను నాలింగనమొనర్చికొని నిష్క్రమించెను. అబుల్‌హసన్ అహమ్మదాబాదు కోటలో రాజబందీగా నుండి నాడు. అతనికి సంవత్సరమునకు ముప్పది వరహాలు పాదుషా బొక్కసమునుండి ముట్టుచుండెను. సుల్తాను మరణించువరకును సంతోషముతో కాలముగడపు చుండెనట.

– సమాప్తమ్ –